నాగరికత - దాని అపశృతులు

సిగ్మండ్ ఫ్రాయిడ్

సిగ్మండ్ ఫ్రాయిడ్

నాగరికత - దాని అపశృతులు

అనువాదం

కళారత్న, భౌద్ధ రత్న సద్ధర్మ మహోపాధ్యాయ

అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

(బుద్ధ ఘోషుడు)

పల్లవి పబ్లికేషన్స్

59 -1-23/2, అశోక్ నగర్, విజయవాడ - 520010 ; సెల్ : 9866115655



సిగ్మండ్ ఫ్రాయిడ్

1856 - 1939

కృతజ్ఞతలు

నా పుస్తకాలను ముద్రించి, నన్ను ఒక
రచయితగా పాఠకులకు పరిచయం చేసిన
పల్లవి పబ్లికేషన్స్ అధినేత
స్వర్ణ వెంకటనారాయణ గారికీ -
ఈ పుస్తక ప్రచురణకు అనుమతినిచ్చిన
ప్రొ॥ ఎన్. అంజయ్య గారికీ -
సహకరించిన మిత్రుడు, సాహిత్య విమర్శకుడు
కాకుమాని శ్రీనివాసరావు కూ -
మన:పూర్వక కృతజ్ఞతాభివందనాలు”

విషయసూచిక

అనువాదకుని మాట 7

సిగ్మండ్ ఫ్రాయిడ్ - సంక్షిప్త పరిచయం 11

నాగరికత - దాని అపశ్రుతులు 21

అనుబంధం - I : మనోవిశ్లేషణలోని కొన్ని పారిభాషిక పదాలు 108

అనుబంధం - II : కొన్ని ఆంగ్లపదాలకు వాడిన తెలుగు పదాల సూచి 114

అనువాదకుని మాట

అది 21వ శతాబ్ది ఆగమించిన మొదటి వారమో, రెండవ వారమో గుర్తులేదు. ఈనాడు తెలుగు ఛానల్ "ప్రతిధ్వని" కార్యక్రమాన్ని నిర్వహించింది. విషయం "21వ శతాబ్దం ఎదుర్కొనే సవాళ్ళు – పరిష్కారాలు" ఈ కార్యక్రమానికి సామాజిక శాస్త్రవేత్తగా నన్ను, ఆర్థిక వేత్తగా విఠల్ గారిని, వైద్య శాస్త్రజ్ఞుడుగా ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి అధినేత నాగేశ్వరరావుగారిని, ఇంజనీరుగా హనుమాన్ చౌదరి గారిని, ఇంకొంతమందిని (గుర్తులేదు) ఆహ్వానించారు. ఎవరికివారు తమ విభాగాలపై 21వ శతాబ్దం ఎలా ఉండబోతోందో వివరించారు. హనుమాన్ చౌదరిగారు కంప్యూటరు గురించి మాట్లాడుతూ, మనిషి కొన్ని రోజులలో చేయలేని పని ఒక గంటలో చేస్తుంది. అది మనిషికి ఎంతో వెసులుబాటునిస్తుంది. రోబోలు గూడ అన్ని పనులు చేస్తాయి. మనిషికి అంతా విశ్రాంతే అన్నారు.

దానికి ప్రతిగా నేను, మా తాతకు అసలు చొక్కాయే లేదు, నా తండ్రికి మూడు చొక్కాలుండేవి. ఒకటి దాపుడికి, ఒకటి ఒంటిమీద, మూడోది చాకలి దగ్గర ఉండేవి. నా తరం వచ్చేసరికి నాకు ఆరు చొక్కాలున్నాయి, నా కొడుక్కు 24 చొక్కాలున్నాయి. మా తాత దారిలో ఎదురైన మనిషితో చుట్ట కాల్చుకొంటూ అరగంట సేపు బాతాఖాని వేసేవాడు. అదే మా నాన్న కొద్ది సమయంలోనే, నేనైతే ఇంకా తక్కువ సమయంలో ముగిస్తూ ఉండేవాళ్ళం. అదే నా పుత్రుడైతే వాడితో ఎప్పుడు పడితే అప్పుడు మాటాడే వీలే లేదు. వాడు పెద్ద కంప్యూటరు ఇంజనీరు అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. ఒకే ఇంటిలో ఉంటున్నా వాడి ఉద్యోగ సమయం, వాడికూతురు ఉండే సమయం వేరు కావడంతో ఆమె తన తండ్రినిచూచి వారమైందని వేదనతో ఒకతెల్లవారు ఝామున తలుపు కొట్టి, తండ్రిని నిద్రలేపి, "నాన్నా నిన్ను చూసి వారమైంది. చూడాలనిపించి నిద్రలేపాను,

నిద్రాభంగా నికి క్షమించండి", అని కంటతడి పెట్టుకొంది. అతడూ హృదయం ఉన్నవాడేకదా, బిడ్డను కౌగిలించు కొని బావురు మన్నాడు ఇది వాస్తవంగా నా మిత్రుడికి జరిగిన సంఘటన.

"ఏమండీ చౌదరిగారూ ! మీరు చెప్పండి. చొక్కాలేని నా తాత అనుభవించిన సంతృప్తి (Contentment) విశ్రాంతిని, మూడు చొక్కాలున్న నా తండ్రి, ఆరు చొక్కాలున్న నేను, 24 చొక్కాలున్న నా కొడుకు అనుభవిస్తున్నామా ? 24 గంటలు పనిని కంప్యూటరు గంటలోచేస్తే, నాకు 23 గ॥లు సమయం మిగలాలి కదా ! మరి ఆధునిక మానవునికి అలా మిగులుతోందా? వాడికి మాటాడే తీరికే దొరకడం లేదు కదా ! ఏమిటి ఈ మాయ ?" అని నేను అడిగాను. ఆయన నిరుత్తరుడయ్యాడు.

నేనే సమాధానం చెప్పాను; మనిషికి అవసరాలు (needs) కోర్కెలు (wants) ఉంటాయి. చిన్న చిన్న అవసరాలు తీరితే చాలనుకొన్నాడు అల్పేచ్ఛుడు (a few wants). నేను మధ్యముడను. నా కొడుకు మహేచ్ఛుడు (innumerable wants). కోర్కెలు తీరిన కొలదీ పెరుగుతూనే ఉంటాయి. అంతంలేదు. అందుకని అతనికి సంతృప్తి, విశ్రాంతులు లేవు.

ఒక తండ్రి నా దగ్గర వాపోయాడు. "రైట్ సోదరులను ఈ విమానాన్ని ఎవడు కనిపెట్టమన్నాడు? విమానం ఉండడానే నా కొడుకు అమెరికా పోయాడు. నెల నెల చెక్కులు పంపుతూ, నన్ను వృద్ధాశ్రమంలో చేర్చాడు. ఆ చెక్కుతోపాటు, "నాన్నా నీవు ఎలా ఉన్నావు బాగున్నావా ?" అని ఒక్క వాక్యం రాయడు అతనికి తండ్రిపై ప్రేమలేక కాదు, తీరికలేక. విమానం లేకపోతే వాడు నా దగ్గరే ఉండేవాడు. (ఇది వాస్తవ సంఘటనే)

నాగరికతా పరిణామ క్రమంలో (ఆ క్రమాన్ని అంతా ఇక్కడ వివరించడానికి ఇది స్థలమూ కాదు సమయమూ కాదు) నాగరికత మనిషిని జంతువు నుంచి దూరం చేసింది. జంతువులు ఆకలి అయినప్పుడే మేత మేస్తాయి. దప్పిక అయినప్పుడే నీరు త్రాగుతాయి. ఋతువులోనే సెక్స్ చేస్తాయి. మరి నాగరీకుడైన మనిషో ! ఆకలి లేకపోయినా తింటాడు. దప్పిక కాక పోయినా కాఫీలు వగరా త్రాగుతాడు, ఋతువు అనేది లేకుండా మనిషి, ఎప్పుడు పడితే అప్పుడు సెక్సుకు సిద్ధమవుతాడు.

నేను నాగరికతకు పూర్తిగా వ్యతిరేకిని కాదు. మానవుడు ఆదిమ దశలోనే ఉండాలని కోరుకోవడం లేదు. ఏ మానవుడైన సుఖాన్నే కోరుకుంటాడు. నేను ఆ సుఖ స్వభావాన్ని, దానిని పొందడంలో నాగరికతతో ఏర్పడే "మెరమెరలు", "అపశృతులు" ఆయాసాలు (un easiness) స్థూలంగా చూపడమే నే చేసిన పని.

అయితే, 20వ శతాబ్ది మనస్సుగతిని మార్చి, విషయాలను నూతన కోణం నుంచి దర్శింప జేసిన మహా మేధావి మనో విశ్లేషణకు ఆద్యుడు అయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ సశాస్త్రీయంగా, సమాజం (నాగరికత) – వ్యక్తి మధ్య మెరమెరలను తన (Discontents in civilisation) అనే గ్రంథంలో చర్చించాడు. ఈ గ్రంథాన్ని "DAS UNBEHGEN IN DER KULTUR" (uneasiness in civilisation)(నాగరికతలో అల్పసుఖత్వం)అనే పేరుతో 1929లోరాస్తే, అది1930లో అచ్చయింది. 2005లో దాని 75వ యేట పెంగ్విన్‌వారు Discontents in civilisation పేరుతో వేశారు.నేను దానిని "నాగరికతలో అపశృతులు" అనే పేర ఒక దశాబ్దం క్రితం అనువదించాను.

ఫ్రాయిడ్, మనిషి అంతర్గత మనో క్షేత్రాలను అర్థం చేసుకోవడానికి ఎన్నో ఉపాయాలను (Techniques) ఉపయోగించాడు. అవన్నీ అందరూ అంగీకరించినవి కావచ్చు, కాకపోవచ్చు. ఒక శాస్త్రజ్ఞుడుగా అతనిలో ఎన్నో లోపాలుండవచ్చు. అయినా అతనియొక్క చీల్చుకుపోయే ఆలోచన అతనివైపుకు మనల్ని తిప్పుకుంది. నాగరికత ఫ్రాయిడ్ ప్రకారం ఎక్కడ మొదలైందంటే – ఆదిమ మానవుడు నిప్పు చేశాక, దానిని, ఉచ్చపోసి ఆర్పరాదనే, బాగా ఆలోచించిన మీదనే ఆ నిర్ణయానికి వచ్చాడు. దానిని అలానే మందనివ్వాలనుకొన్నాడు. కాని తన లైంగికాగ్నిని చల్లార్చడం తరవాతనే, మామూలు నిప్పును ఆర్పడం మొదలు పెట్టాడు.

ఇంక ప్రతిదీ దీనిని అనుసరించే వచ్చింది. అనూహ్యంగా సాంకేతిక విజ్ఞానం పెరిగినా కూడా ఆదిమ మానవునికంటే నేటి మానవుడు సుఖంగా లేడు. నాగరికత psychosisలో పడిపోతోంది, అయితే నాగరికత మానవ పరిపూర్ణతకు దారితీస్తుందనే భ్రమలో మనం లేము.

ప్రతి వ్యక్తి తనవ్యక్తిత్వాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను, వ్యక్తిగత ప్రత్యేకతలను విశేషాలను నిలుపు కోవాలని కోరతాడు. ఈ కోర్కెలతనికి పూర్తిగా తీరదు. ఎందుకంటే సమాజం (నాగరికత) అతడి కోర్కెను కట్టడిచేస్తుంది. అంటే వ్యక్తి సహజాత స్వేచ్ఛ అణచివేసి సమాజం (నాగరికత) తనకు అనుగుణంగా నడుచుకోమంటుంది.

సుఖసూత్రం(pleasure principle)కొనసాగినప్పుడు దానిని అనుమతించినప్పుడు కొంత తృప్తికలుగుతుంది. మరిన్నిరకాల సహజాతాలకు–హింసాత్మక (హంతక to kill), లైంగిక సహజాతాలకు స్వేచ్ఛనిస్తే సమాజం మనుగడకే ముప్పు వస్తుందంటాడు ఫ్రాయిడ్. ఫలితంగా సమాజం కొన్నినియమాలను, చట్టాలను తయారుచేసి, హత్యలను,

అత్యాచారాలను కలుషిత శీలాలను అణచడానికి అనేక శిక్షలను వేస్తుంది. ఈ విధంగా మన సుఖాన్ని చట్టం నియంత్రిస్తుంది. ఇది నాగరికతా అంతర్గత లక్షణం. ఈ గుణం కారణంగా పౌరులకు నిరత అసంతుష్టి వేదనలను కలిగిస్తుంది.

ఫ్రాయిడ్ సిద్ధాంతం మానవునికి (పుట్టుకతో వచ్చే) సమజాతాల ఆధారంగా రూపొందించ బడింది. సహజాతం అంటే నేర్చుకొంటే వచ్చేది కాదు. పిచ్చుకకు గూడు కట్టడం ఎవరు నేర్పారు? గుడ్లుపెట్టే సమయంవచ్చేసరికి అదే గూడు కడుతుంది. అలాగే లైంగిక సహజాతం, హింసా ప్రవృత్తి సహజాతం, అధికార ప్రతిమకు ఎదురు తిరగడం, లైంగిక పోటీదారులను ఎదుర్కోవడం వంటి సహజాతాలను సమాజం అనుమతించదు. ఎందుకని ? అవి సమాజ శ్రేయస్సుకు భంగకరాలు.

అసలు మనిషి నాగరికతను ఎందుకు కనుక్కొన్నాడు ? సుఖంగా జీవించడానికి. కాని సమాజ సుఖం కోసం కనిపెట్టబడిన నాగరికత, మనిషిని తన నియమాల ద్వారా ఒత్తిడి చేసి సుఖ సూత్రాన్ని అడ్డుకుంటుంది. మనిషి సుఖం కోసం ఆవిర్భవించిన నాగరికత మనిషిని ఇరుకులో పెట్టి అతని సుఖానికి అంతరాయమై నిలుస్తుంది. ఇదొక విరోధాభాస (Paredox) ఈ విరోధా భాసతో మానవుడు కుంఠితుడై, నాడీ రుగ్మతల బారిన పడుతున్నాడు.

సమాజం (నాగరికత) ఎందుకుంది ? వ్యక్తి సుఖ సూత్రాన్ని సంతృప్తం చేయడానికి, ఇంక మనిషి మనిషి కలిసి సత్సంబంధాలతో ఉండడానికి, మరి జరుగుతున్న దేమిటి ? నాగరికత వ్యక్తి సుఖ సూత్రంతో రాజీపడకుండ అధికారాన్ని కేంద్రీకరించి వ్యక్తికి ఊపిరి ఆడనీయడం లేదు.

ఆ విధంగా నాగరికత వ్యక్తికి వరమూ, శాపమూ రెండూ అవుతోంది.

– కళారత్న, భౌద్ధ రత్న సద్ధర్మ మహోపాధ్యాయ
అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి
(బుద్ధఘోషుడు)

సిగ్మండ్ ఫ్రాయిడ్ - సంక్షిప్త పరిచయం

ప్రస్తావన :

ఇరవయ్యవ శతాబ్దంలోని శాస్త్రీయ ఆవిష్కరణలలో గణనీయమైన ప్రభావాన్ని నెరపిన వాటిలో మనోవిశ్లేషణ సిద్ధాంతం ఒకటి. ఈ సిద్ధాంత కర్త సిగ్మండ్ ఫ్రాయిడ్. మానసిక యంత్రాంగానికి సంబంధించిన నూతన శాస్త్రంగా మనోవిశ్లేషణను ఆయన పరిగణించాడు. లైంగికతను మానవ స్వభావానికి, ప్రవర్తనకు కేంద్ర బిందువుగా పరిగణించడం ఈ సిద్ధాంతాన్ని మానవ మేథో వికాసంలో అత్యంత వివాదాస్పదమైన వాటిలో ఒకటిగా చేసింది. భావజాలం మరుగున కప్పబడివున్న మౌలిక సత్యాలను వెలికితీసి, వాటికి మానవ జీవితంలో ఉన్న ప్రాధాన్యతను, నాటి సమాజపు నిర్హేతుక నైతిక అవగాహనకు ఒక సైద్ధాంతిక పద్ధతికి దీనిని మూలాధారం చేయడం ఫ్రాయిడ్ చేసిన ప్రధానమైన కృషి.

జీవితం – బాల్యం :

ఫ్రాయిడ్ మే6, 1856న అప్పటి ఆస్ట్రియా (ఇప్పుడు జెక్ రిపబ్లిక్)లో అంతర్భాగమైన మొరావియాలోని ఫ్రైబర్గ్‌లో జన్మించాడు. తండ్రి జాకబ్ ఫ్రాయిడ్. తల్లి అమలీ నధాన్‌సోన్. తండ్రి మొదటి వివాహానికి ఇద్దరు మగపిల్లలు. ఫ్రాయిడ్ తల్లికి జన్మించిన పిల్లల్లో ఫ్రాయిడ్ పెద్దవాడు. తరువాత ఇద్దరు తమ్ముళ్ళు, నలుగురు చెల్లెళ్లు ఉండేవారు. తండ్రి ఉన్ని వ్యాపారం చేసేవాడు. కాని పెద్దగా కలసిరాలేదు. తండ్రితో సంబంధం దూరంగా, అధికార పరమైనదిగా ఉండేది. తల్లి పిల్లలకు ఆలంబనగా ఉండేది. యూదు మతానికి చెందిన కుటుంబం కావడంతో వేధింపులకు గురికావడం జరిగేది. క్రిస్టియన్లు ఒకసారి అవమాన పర్చినప్పుడు తండ్రి ప్రతిఘటించక పోవడం ఫ్రాయిడ్ పసిమనస్సును గాయపర్చింది. ఆర్థిక ఒడిదుడుకులు, దాదాపు దారిద్ర్యాన్ని అనుభవించే పరిస్థితులు కుటుంబంలో ఉండేవి. భాగ్యవంతుల దాష్టీకాన్ని కూడా తాను చవిచూసినట్లు ఫ్రాయిడ్ తన రచనలలో ఒకచోట పేర్కొన్నాడు. బాల్యంలో ఫ్రాయిడ్‌పై పడ్డ ప్రభావాలు ఆయన తన పరిశోధనల ద్వారా చేసిన కొన్ని ఆవిష్కరణలకు భూమికగా నిలిచాయి.

విద్యాభ్యాసం :

ఫ్రాయిడ్‌కి నాలుగేళ్ల వయసప్పుడు కుటుంబం ఫ్రైబర్గ్ నుండి లీప్‌జిగ్‌కు, ఆ తదుపరి వియన్నాకు మారింది. వియన్నాలోనే ఫ్రాయిడ్ జీవితంలో అత్యధిక భాగం-1860 నుండి 1838 వరకు-గడిచింది. ఫ్రాయిడ్‌కి మొదటి నుంచి శాస్త్రవేత్త కావాలనే కోరిక ఉండేది. జర్మన్ కవి గోథె ప్రకృతిపై రాసిన వ్యాసంస్ఫూర్తితో వైద్యశాస్త్ర అధ్యయనాన్ని చేపట్టాడు. ఇక్కడ కూడా లక్ష్యం మానవ స్వభావాన్ని గురించిన శాస్త్ర పరిశోధనలకు అంకితం కావడమే కాని, వైద్యవృత్తిని చేపట్టడం కాదు. జీవ పరిణామం గురించి ఛార్లెస్ డార్విన్ చేసిన విప్లవాత్మక శాస్త్రీయ ప్రతిపాదనలు కూడా ఫ్రాయిడ్‌ని ఈ దిశగా నడిపించాయి.

ఫ్రాయిడ్ 1873లో వియన్నా విశ్వవిద్యాలయం మెడికల్ స్కూల్‌లో చేరాడు. మొదట్లో జీవశాస్త్ర అధ్యయనంపట్ల ఆసక్తి చూపాడు. గొప్ప శాస్త్రవేత్తగా పరిగణించబడిన ఎర్నెస్ట్ బ్రుకె సారథ్యం వహించిన శరీర ధర్మశాస్త్ర పరిశోధనాశాలలో ఆరేళ్ళపాటు పరిశోధనలు జరిపాడు. తరువాత న్యూరాలజీలో ప్రత్యేకమైన కృషి జరిపాడు. పరిశోధనలపై కేంద్రీకరించడంవల్ల కొంత ఆలస్యం పిమ్మట 1881లో ఎం.డి. డిగ్రీ పొందాడు. 1881లో తాను ప్రేమించిన మార్తా బెర్నేస్‌తో ఫ్రాయిడ్ వివాహం నిశ్చయమయింది. ఈ కారణంగా వియన్నా జనరల్ హాస్పటల్‌లో డాక్టర్‌గా పనిచేయ నారంభించాడు. మొదట్లో న్యూరాలజిస్ట్‌గా పని చేశాడు. కాని తన పరిశోధనా కృషిని కొనసాగించాడు. అక్కడ పని చేసిన మూడు సంవత్సరాలు అన్ని వైద్య విభాగాలలో శిక్షణ పొందినప్పటికీ తన అధ్యాపకుడైన థియోడర్ హెచ్.మేనర్ట్ వద్ద మానసిక వైద్య విభాగంలో పనిచేయడంలో ఎక్కువ ఆసక్తి కనబరిచాడు. 1886లో మార్తా బెర్నేస్‌తో ఫ్రాయిడ్ వివాహం జరిగింది. వారికి ఆరుగురు పిల్లలు-ముగ్గురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు - కలిగారు. వారిలో చివరి సంతానమైన అన్నా ఫ్రాయిడ్ తరువాత మనోవిశ్లేషణలో ప్రసిద్ధి గాంచింది.

సైద్ధాంతిక కృషి :

1885-86లో అధిక భాగం పారిస్‌లో ఫ్రెంచి న్యూరాలజిస్ట్ జాన్ షార్కో దగ్గర అధ్యయనం చేయడంలో గడిపాడు. హిస్టీరియా తదితర మానసిక సమస్యల పరిష్కారానికి హిప్నాటిజాన్ని షార్కో ఉపయోగించేవాడు. ఇది ఫ్రాయిడ్‌ని బాగా ప్రభావితం చేసింది. మానసిక సమస్యలకు, ఆందోళనలకు కారణాలు శారీరకం కాక, అంటే మెదడుకి సంబంధించినవి కాక, మనస్సుకి సంబంధించినవని గ్రహించాడు.

1886లో ఫ్రాయిడ్ ప్రైవేట్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. అనతికాలంలోనే ఐరోపాలోని ప్రముఖ న్యూరాలజిస్ట్‌లలో ఒకడిగా గణుతికెక్కాడు. దాదాపు ఇదే సమయంలో ఫ్రాయిడ్ ఆలోచనా విధానాన్ని విశేషంగా ప్రభావితం చేసిన ఇద్దరితో సన్నిహిత స్నేహ సంబంధాన్ని ఏర్పరచుకున్నాడు. వారు యోసఫ్ బ్రాయర్, విల్‌హెల్మ్ ఫ్లైస్. అప్పటికే యోసఫ్ బ్రాయర్ హిస్టీరియా రోగులకు హిప్నాటిజంతో కాక, వారిలో మరుగునపడిఉన్న జ్ఞాపకాలు, సంఘటనలు, భావాలు గురించి స్వేచ్ఛగా మాట్లాడటం ద్వారా మానసిక ఒత్తిడి నుండి బయటపడటం, తద్వారా వారి రోగ లక్షణాలు నివారించబడడం అనే నూతన పద్ధతి ద్వారా చికిత్స చేస్తున్నాడు. మొదట్లో పూర్తిగా గ్రహించినప్పటికీ, క్రమేపీ ఈ పద్ధతి ఫ్రాయిడ్‌ని అమితంగా ప్రభావితం చేసింది. ఫ్రాయిడ్ న్యూరాలజీ నుండి న్యూ సైకాలజీ వైపు తన దృష్టిని మరల్చాడు. యోసఫ్ బ్రాయర్, ఫ్రాయిడ్‌ల సంయుక్త రచనగా **'స్టడీస్ ఇన్ హిస్టీరియా'** 1895లో వెలువడింది. ఈ రచన ఈ నూతన పద్ధతిని ప్రతిపాదించింది. రోగి ఈ పద్ధతిలో వెలువరించే మరుగున పడిన జ్ఞాపకాలు, సంఘటనలు, భావాలు, అచేతనం చేతనం కావడమని ఫ్రాయిడ్ ప్రతిపాదించాడు. అచేతనం అనే భావన ఫ్రాయిడ్‌కి ముందునుంచి ఉన్నది. అచేతనం నిషిద్ధ వాంఛలు, చర్యలు, భావాలను చేతనంలో నుండి అణచివేయడం వల్ల ఏర్పడుతుందని ఫ్రాయిడ్ అభిప్రాయపడ్డాడు.

అణచివేయబడేవి ప్రధానంగా లైంగిక వాంఛలు, చర్యలు అనే తన నిర్దుష్ట పరిశీలన నుండి ఫ్రాయిడ్ లైంగికతను మానసిక జీవనాన్ని అర్థం చేసుకోవడానికి ప్రాతిపదిక చేసుకున్నాడు. అప్పటికే 'స్టడీస్ ఇన్ హిస్టీరియా' పై వచ్చిన వ్యతిరేకత, లైంగికతను అధ్యయనానికి కీలకాంశంగా ఫ్రాయిడ్ స్వీకరించడం మూలంగా ఫ్రాయిడ్‌కి బ్రాయర్ దూరమయ్యాడు. అయితే, విల్‌హెల్మ్ ఫ్లైస్‌తో ఫ్రాయిడ్ మైత్రి పదిహేను సంవత్సరాల పాటు కొనసాగింది. మానవ ద్విలైంగికత, శరీరంపై లైంగికోద్దీపన స్థానాలున్నాయనే భావన, శైశవ లైంగికత మొదలైన భావాల రూపకల్పనలో ఫ్లైస్ పాత్ర ఉందని పరిశీలకుల అభిప్రాయం.

న్యూరో సైకాలజీ నుండి ముందుకు పయనించి ఫ్రాయిడ్ తన సిద్ధాంతానికి మనోవిశ్లేషణ అని నామకరణం చేశాడు. 'స్టడీస్ ఇన్ హిస్టీరియా' ఒక విధంగా ఈ నూతన సిద్ధాంతపు మొదటి రచన. 1896లో ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ అనే పదాన్ని మొదటిసారి ఉపయోగించాడు. 1900లో ప్రచురించబడిన ది ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ డ్రీమ్స్ అనే ఫ్రాయిడ్ రచనలో మనోవిశ్లేషణ సిద్ధాంతం స్పష్టమైన రూపంలో ముందు కొచ్చింది. ఈ గ్రంథం ఫ్రాయిడ్ అతి ప్రధాన రచనగా పరిగణించబడుతోంది.

ఫ్రాయిడ్ ఇతర ప్రధాన రచనలు :

సైకో పాథాలజీ ఆఫ్ ఎవిరిడే లైఫ్ (1904); జోక్స్ అండ్ దైర్ రిలేషన్ టు ద అన్‌కాన్షస్ (1905); త్రి ఎస్సేస్ ఆన్ ద థియరి ఆఫ్ సెక్సువాలిటి (1905); టోటెమ్ అండ్ టాబూ (1913); ది హిస్టరీ ఆఫ్ సైకో ఎనలిటికల్ మూవ్‌మెంట్ (1914); బియాండ్ ద ప్లెబర్ ప్రిన్సిపుల్ (1930), ఎ జనరల్ ఇంట్రడక్షన్ టు సైకో ఎనాలసిస్ (1920); ద ఈగో అండ్ ది ఇడ్ (1923); ఆటోబయోగ్రఫి (1925); ద క్వెచ్చన్ ఆఫ్ లే ఎనాలసిస్ (1926); ఇన్‌హిబిషన్స్, సింప్టమ్స్ అండ్ యాంక్జైటీ 91926); న్యూ ఇంట్రడక్టరీ లెక్చర్స్ ఆన్ సైకోఎనాలసిస్ (1933); మోజెస్ అండ్ మోనోథీయిజం (1939); యాన్ అవుట్‌లైన్ ఆఫ్ సైకో ఎనాలిసిస్ (1940); (బ్రాకెట్లలో చూపబడినవి జర్మన్ మూలప్రతుల ప్రచురణ సంవత్సరాలు. ఇంగ్లీషు అనువాదాలు తరువాత అచ్చయ్యాయి)

సైకోఎనలిటికల్ ఉద్యమం :

ఫ్రాయిడ్ ఆలోచనలతో ఆకర్షితులైన కొందరు మేధావుల చర్చావేదికగా వెన్సడే సైకలాజికల్ గ్రూప్ 1902లో ఏర్పడింది. ఇది తరువాత వియన్నా సైకోఎనలిటిక్ సొసైటీగా రూపాంతరం చెందింది. ఈ క్రమంలో ఫ్రాయిడ్‌తో కలసి పనిచేసినవారిలో కార్ల్ అబ్రహామ్, జెండర్ ఫెరెన్‌క్జి, ఆల్‌ఫ్రెడ్ అడ్‌లెర్, విల్‌హెల్మ్ స్టెకెల్, యూజెన్ బ్లూలర్, కార్ల్ గూస్తాఫ్ యూంగ్, ఎర్నెస్ట్ జోన్స్ మొదలైనవారున్నారు. వీరందరు మనోవిశ్లేషణ శాస్త్ర అభివృద్ధిలో విశేషప్రభావం కనపరిచారు. ఏప్రిల్ 1908లో యూంగ్ సారధ్యంలో అంతర్జాతీయ సైకోఎనలిటికల్ కాంగ్రెస్ సాల్జ్‌బర్గ్‌లో జరిగింది. 1910లో అంతర్జాతీయ సైకో ఎనలిటికల్ సొసైటీ ఏర్పడింది. ఈ సంస్థ క్రమేపీ 30 అనుబంధ సంస్థలతో అనేక దేశాలలో సభ్యులు కలిగి ఉన్నదిగా వృద్ధి చెందింది. సెప్టెంబర్ 1909లో ఫ్రాయిడ్, యూంగ్ అమెరికాలోని క్లార్క్ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలు చేశారు. అయితే, సైకోఎనలిటికల్ ఉద్యమంలోని ఐక్యత అట్టేకాలం నిలవలేదు. వ్యక్తిగత, సైద్ధాంతిక విభేదాల కారణంగా 1911లో ఆడ్లర్, 1912లో స్టెకెల్, 1914లో యూంగ్ ఫ్రాయిడ్ నుండి విడిపోయి వేరుగా సైకో ఎనలిటికల్ బృందాలను ఏర్పరచుకొన్నారు. ఏర్పడిన 10 సంవత్సరాల లోపే ఈ విధమైన చీలికలు, వీటిని వెన్నంటి వచ్చిన వ్యక్తిగత కలహాలు, మతపరమైన వ్యవస్థను స్ఫురింప చేశాయనే విమర్శ ఉంది.

అప్పటివరకు ఉన్న మనోవిజ్ఞాన సిద్ధాంతాలకు భిన్నంగా తాను నూతన ఆవిష్కరణగా భావించిన మనోవిశ్లేషణ సిద్ధాంతాన్ని ఒక శాస్త్రంగా, వైద్య చికిత్సగా, ఉద్యమంగా అభివృద్ధి చేయడానికి ఫ్రాయిడ్ తన జీవితాన్ని అంకితం చేశాడు. అప్పటి సాంస్కృతిక నిశ్చితాభిప్రాయాలను ఫ్రాయిడ్ భావాలు కుదిపివేశాయి. కొంత కాలంపాటు జర్మన్ శాస్త్ర రంగంలో ఆయనను వెలివేయబడ్డ వాతా వరణముండేది. తన వాదనలను రోగుల వ్యక్తిగత చరిత్రలతో, ఇతర ఆధారాలతో బలపర్చు కోవడానికి చేసినరచనలు, ఈ అభిప్రాయాన్ని స్థూలంగా అంగీకరించిన మేధావులు వివిధ దేశాలలో ఉండడం, ఇదొక ఉద్యమంగా రూపొందడం మొదలైన కారణాలవల్ల క్రమేపి ఫ్రాయిడ్ కృషికి గుర్తింపు లభించింది. మనో విశ్లేషణ సిద్ధాంతానికి ఆద్యుడిగా నిర్ద్వంద్వమైన గుర్తింపు పొందాడు.

వ్యక్తిత్వం :

ఫ్రాయిడ్ ఉన్నతమైన అభిరుచులు కలిగి ఉండేవాడు. జర్మన్ సాహిత్యంలోనే కాక, అనేక ఇతర దేశాల గొప్ప సాహిత్యంలో కూడా ఆయనకు విశేషమైన పాండిత్యం ఉండేది. గ్రీకు పురాణాల నుండి ఉదాహరణలు సంభాషణలలోను, రచనలలోను ఫ్రాయిడ్ విస్తృతంగా ఉపయోగించేవాడు. ఆయన రచనా పటిమవల్ల జర్మన్ వచన రచనపై పట్టు ఉన్నవాడిగా పరిగణించబడేవాడు. కళల విషయానికొస్తే కవిత్వము, శిల్పకళపట్ల ఫ్రాయిడ్‌కి అమితమైన అభిమానం ఉండేది.

దుర్నిరీక్ష్యంగా కనిపించే శాస్త్రవేత్త ఫ్రాయిడ్‌లో సునిశితమైన హాస్య ప్రవృత్తి ఉండేది. తనపై వెల్లువెత్తిన విమర్శల పరంపరల గురించి కూడా ఆయన వినోదభరితమైన వ్యాఖ్యానాలు చేసేవాడు. ఫ్రాయిడ్ కుటుంబ జీవితం చివరి వరకు దాదాపు సాఫీగా సాగింది. తన పిల్లలతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. అప్పటి పద్ధతులకు భిన్నంగా పిల్లలను వారి కోర్కెలకు, అభిరుచులకు అనుగుణంగా ఎదగనిచ్చాడు.

ఫ్రాయిడ్‌లో తన అభిప్రాయాలను వ్యతిరేకించేవారిని, స్వతంత్ర భావాలు కలిగినవారిని సహించే గుణంలేదనే విమర్శ ఉండేది. ఈ తత్వం సైకోఎనలిటికల్ ఉద్యమంలోని చీలికలకు బలమైన కారణాలలో ఒకటనే వాదన కూడా ఉంది. అయితే, ఉద్యమంలో ఫ్రాయిడ్ అనుసరించిన ఈ ధోరణికి కారణం మనో విశ్లేషణ సిద్ధాంతాన్ని, ఎటువంటి సందిగ్ధతకు, వక్రీకరణలకు గురి కాకుండా చూడడమని కొందరు పేర్కొన్నారు. అయితే, ఈ లక్ష్యం నెరవేరలేదని చెప్పవచ్చు. ఈ ఉద్యమంలోని అనేక చీలికలు సందిగ్ధతకు, పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలకు దారితీసాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్య యుత వాతావరణానికి చిహ్నమని, దానికి స్ఫూర్తి ఫ్రాయిడ్ నుంచే వచ్చిందనే వివరణ కూడ ఉన్నది.

1923లో ఫ్రాయిడ్‌కి నోటి కాన్సర్ ఉన్నట్లు బయటపడింది. అప్పటి నుండి 16 సం॥ల పాటు 33 శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చింది. జీవితం నిరంతరం బాధామయమైందిగా తయారైంది. తన అనారోగ్యాన్ని మామూలుగా చూడాలని, అతిగా స్పందించవద్దని తన కుటుంబ సభ్యులకు ఫ్రాయిడ్ స్పష్టం చేశాడు. అనేక శస్త్ర చికిత్సలను, నిరంతర బాధను అరుదైన సహనంతో భరించాడు. తన పరిశోధనలను, రచనలను, రోగులతో గడపడాన్ని చివరికంటా కొనసాగించాడు. 1938లో నాజీలు ఆస్ట్రియాను ఆక్రమించుకొని ఫ్రాయిడ్ ఇంటిపై కూడా దాడిచేసిన పిమ్మట తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్రాయిడ్ లండన్ ప్రవాసం వెళ్ళాడు. అక్కడే సెప్టెంబర్ 23, 1939న ఫ్రాయిడ్ జీవనయాత్ర ముగిసింది.

మనోవిశ్లేషణ సిద్ధాంతం :

మనోవైకల్యం సంభవించినప్పుడు కనిపించే లక్షణాలలో శారీరకమైనవి కూడా ఉన్నప్పటికీ, ఇది శారీరక రుగ్మతకాదని, దాని మూలాలను, కారణాలను మానసిక నిర్మితి ఎదుర్కొన్న అసమతౌల్యం, బాహ్యప్రపంచంతో ఇమడలేకపోవడం ఇత్యాది మానసికపరమైన అంశాల్లో మాత్రమే చూడాలని మనోవిశ్లేషణా సిద్ధాంతం ప్రతిపాదించింది.

మానసిక రుగ్మతలకు శారీరక కారణాలు ఉన్నట్లుగా పరిగణించే ధోరణి 19వ శతాబ్దపు ద్వితీయార్ధ భాగంలో బలంగా ఉండేది. ఉదాహరణకు ఫ్రాయిడ్‌కు అధ్యాపకుడైన మానసిక వైద్య నిపుణుడు మేనర్ట్ కూడా మానసిక అపవ్యవస్థల్ని మెదడు ముందుభాగానికి సంబంధించిన రుగ్మతగా పరిగణించేవాడు. దానికి ప్రాతిపదిక అప్పట్లో ప్రబలంగా ఉన్న భౌతిక - రసాయనిక శాస్త్రాలపరంగా అన్ని విషయాలను వివరించ ప్రయత్నించే ధోరణిలో ఉంది.

ఆనాటి శాస్త్రీయ ఆవిష్కరణలలో రెండు ఫ్రాయిడ్ సైద్ధాంతిక కృషిని ప్రభావితం చేశాయి. డార్విన్ పరిణామవాదం ప్రభావంతో మానవ మానసిక నిర్మాణాన్ని పరాణామశీలమైనదిగా ఫ్రాయిడ్ చూశాడు. హెల్మ్‌హోల్ట్జ్ ప్రతిపాదించిన శక్తి అనశ్వరమనే సిద్ధాంతపు వెలుగులో మనస్సుని కూడా ఒక శక్తి వ్యవస్థగా, అందునా గతిశీలమైందిగా ఫ్రాయిడ్ పరిగణించాడు. ఈ అవగాహన ఫ్రాయిడ్ ప్రతిపాదించిన అచేతన అనే భావనకు పునాది. అయితే, ఈభౌతిక, జీవశాస్త్రాల ప్రభావంలో యాంత్రిక భౌతికవాదం దృక్పథంవైపు ఫ్రాయిడ్ మొగ్గుచూపాడు.

షార్కో అనుసరించిన హిప్నాటిక్ పద్ధతిలోని పరిమితులను గుర్తించిన ఫ్రాయిడ్ ముందే చెప్పినట్లుగా మానసిక రుగ్మతల మూలాలను శారీరకపరమైన కారణాలలో కాక

మానసిక వికాస క్రమంలోనే వెతకాలనే నిర్ణయానికి క్రమేపీ వచ్చాడు. ఈ క్రమంలో, చికిత్సా పద్ధతిగా బ్రాయర్ ప్రతిపాదించిన, రోగి తన ఆందోళనలు, వ్యాకులతలు, మరుగున పడిన జ్ఞాపకాల గురించి స్వేచ్ఛగా మాట్లాడడం ద్వారా మానసిక రుగ్మత లక్షణాలు స్వల్పకాలికంగా లేక దీర్ఘకాలికంగా తొలగిపోవడం అనే పద్ధతిని ఫ్రాయిడ్ కూడా అనుసరించాడు. ఈ క్రమంలో వ్యాకులతా మూలాలు ఎక్కువగా అణచుకోబడ్డ లైంగిక వాంఛలలో ఉన్నాయని, ఈ మూలాలు అనేకమందికి అయిదేళ్ళ వయస్సు లోపే ఏర్పడ్డాయని ఫ్రాయిడ్ గ్రహించాడు. దానినుండే ఫ్రాయిడ్ సూత్రీకరణలలో రెండు ప్రధానమైనవి - మానవ స్వభావ నిర్ణాయకాలలో లైంగికత కీలకపాత్ర, శైశవ లైంగికత - రూపుదిద్దు కున్నాయి. శైశవ లైంగికత గురించిన ఫ్రాయిడ్ భావనలలో అత్యంత ముఖ్యమైనది ఇడిపస్ భావగ్రంథి. దీని ప్రకారం మగపిల్లవాడు తల్లిపట్ల, ఆడపిల్ల తండ్రిపట్ల లైంగిక ఆకర్షణకు గురవు తారు. ఈదశను అధిగమించి, యుక్త వయస్సులో పురుషుడు స్త్రీపట్ల, స్త్రీ పురుషుడిపట్ల లైంగిక ఆకర్షణకు గురికావడం సాధారణ మానసిక స్థితిని సాధించడం అవుతుంది. సరిగ్గా ఈ అభిప్రాయాలే షార్కో బ్రాయర్‌లను ఫ్రాయిడ్‌కి దూరం చేశాయి. వారి మధ్య సైద్ధాంతిక సహకారం ముగిసింది.

ఫ్రాయిడ్ మానసిక నిర్మితిని మూడు భాగాలుగా విభజించాడు. ఇడ్ (అచేతన), ఈగో (అహం), సూపర్ ఈగో (అధ్యహం). అహం చేతనా సమన్వితంగా ఉంటుంది. మనిషి ఆలోచనలు, ఆశలు ఇక్కడ తేటతెల్లంగా, క్రియాశీలంగా ఉంటాయి. సమాజ జీవనం, నాగరికత ఏర్పడే క్రమంలో, మనిషి కోరుకునే సంపూర్ణ సహజాత సంతృప్తిపై నిషేధాల ఏర్పాటు అనివార్యంగా అమలుచేయబడింది. ఈ పరిమితులకు అన్నిటికన్నా ఎక్కువగా లైంగిక వాంఛ గురయింది. మనిషి బాల్యం నుండి యుక్త వయస్సుకు ఎదిగే క్రమంలో, సహజాత సంతృప్తి ఆకాంక్షకు, సమాజ నీతికి మధ్య ఘర్షణలో నలిగి పోవడం. దీనికి పరిష్కారంగా సమాజ ఆమోదంలేని వాంఛలను అణచివేయడం జరుగుతుంది. ఈవిధంగా అణచివేయబడ్డ సహజాత వాంఛ మాయమైపోదు. అది అచేతనంలో ఉంటుంది. ఈ అచేతన మనిషిని తరచు వ్యాకులతకు, ఆందోళనకు గురిచేస్తుంది. మానసిక నిర్మితిలో సమాజనీతి, తల్లిదండ్రుల ప్రతీకగా ఉండేది అధ్యహం. ఇది కావలి కుక్కలా పనిచేస్తుంది. అహం ఈ రెండింటి మధ్య - అంటే అచేతనం, అధ్యహంల మధ్య - ఒక మధ్యే మార్గాన్ని అనుసరించి విజయం సాధిస్తే మానసిక సమతౌల్యం, అంటే మానసిక ఆరోగ్యం, సాధారణత సాధ్యమౌతుంది. ఈ సంధానం సాధ్యంకాకపోతే వ్యక్తి తన ప్రవర్తనను తన నియంత్రణలో ఉంచుకోలేక, రుగ్మతకు గురవుతాడు.

సహజాతాల అణచివేత (repression) సమాజ నీతి కనుగుణంగా స్వభావాన్ని మలచుకోవడంలో జరిగే ప్రధాన ప్రక్రియ. అయితే, ఇది మానసిక సమతౌల్యతకు తరచు భంగం కలిగించే ప్రవృత్తి కలిగిందిగా ఉంటుంది. దీనికి భిన్నంగా ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మరో ప్రక్రియ ఉదాత్తీకరణ (sublimation) - అంటే సహజాత శక్తిని సాంస్కృతిక, శాస్త్రీయ, మానవీయ లక్ష్యాల వైపు మళ్లించడం - వ్యక్తికి, సమాజానికి మధ్య సమతౌల్యాన్ని సాధ్యం చేస్తుంది. ఇందుకు సంబంధించిన మరికొన్ని ప్రక్రియలను కూడా ఫ్రాయిడ్ ప్రతిపాదించాడు.

సహజాతాల అణచివేత, అచేతన ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనోవిశ్లేషణా పద్ధతికి కేంద్రక మైన అంశాలు సహజాతాల అణచివేతకు వ్యక్తి రాజీపడనప్పుడు, ఉదాత్తీకరణ లాంటి సకారాత్మక పరిష్కారం సాధించలేనప్పుడు అచేతన వ్యక్తి స్వభావాన్ని నియంత్రించడం-అంటే వ్యక్తి చేతనాయుత, హేతుబద్ధ ప్రవర్తన స్థానంలో, అహేతుకంగా, స్వయం నియంత్రణా రహితంగా ప్రవర్తించడం- జరుగుతుంది. దీనిని మానసిక రుగ్మతగా పరిగణించడం జరుగుతుంది.

ఈ రుగ్మతా స్థితి నుండి వెలికి రావడానికి, బ్రాయర్ నుండి గ్రహించిన పద్ధతిని మరింత అభివృద్ధిచేసి స్వేచ్ఛా సంసర్గం (free association) అనే పద్ధతిని ఫ్రాయిడ్ ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతిలో రోగి స్వేచ్ఛగా తన అనుభవాలను, ఆందోళనలను వ్యక్తం చేయడం ద్వారా, నేపథ్యంలో విశ్లేషకుడు అందించే ప్రేరణతో, తన మానసిక రుగ్మతకు కారణమైన అచేతనాంశాన్ని చేతనలోనికి తీసుకువచ్చి దానిని ఎదుర్కొని, పరిష్కరించడం ద్వారా తన వ్యాకులత నుండి బయటపడడానికి ఆస్కారం ఉంటుంది. ఈ అచేతనా ప్రభావాన్ని గుర్తించడానికి స్వప్న విశ్లేషణను ప్రధాన సాధనంగా ఫ్రాయిడ్ రూపొందించాడు. ఈ అవగాహనకు రావడానికి తన గ్రంథం ది ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ డ్రీమ్స్ రచనా క్రమంలో 1895 - 1900 మధ్య ఫ్రాయిడ్ చేసుకున్న స్వీయ మానసిక విశ్లేషణం తోడ్పడింది. స్వప్నాల విశ్లేషణతో పాటు మాటలు పొరపాటుగా వాడడం, పేర్లు మరచిపోవడం, జోకులు మొదలైనవాటిని విశ్లేషించడాన్ని కూడా అచేతనను గ్రహించడానికి ఫ్రాయిడ్ ఆధారం చేసుకున్నాడు. స్వప్నాల నిగూఢ భాష వెనుక దాగి ఉండేది అచేతనలోకి అణచివేయబడిన ఒక నిషిద్ధ వాంఛ ప్రతీకాత్మకంగా సంతృప్తం కావడమేనని ఫ్రాయిడ్ భావించాడు. అందువల్ల స్వప్నాలను 'అచేతన గురించిన జ్ఞానానికి దారివేసే రాజమార్గం'గా ఆయన పరిగణించాడు.

ఫ్రాయిడ్ సైద్ధాంతిక కృషిని మూడు రకాలుగా కొందరు పరిశీలకులు విభజించారు. మొదటిది, చికిత్సా పద్ధతిగా మనోవిశ్లేషణను అభివృద్ధి చేయడం. ఇందులోని ప్రధాన అంశం "స్వేచ్ఛా సంసర్గం" అనే చికిత్సా విధానం. రెండవది, సాధారణ మనోవిశ్లేషణ సిద్ధాంతం. దీనిలో భాగంగానే మానసిక నిర్మితిని మూడు భాగాలుగా విభజించే సిద్ధాంతాన్ని ఫ్రాయిడ్ ప్రతిపాదించాడు. మూడవది, మానవ వికాస క్రమాన్ని విహంగావలోకనం చేసే రచనలు. ఈ రచనలలో తన మౌలిక తాత్విక దృక్పథం అయిన అద్వైతానికి అనుగుణంగా మానవ జీవితాన్ని శాసించే రెండు శక్తులుగా జీవ సహజాతం (Eros, life instict), మృత్యు సహజాతం (Thanatos, death instinct)లను ఫ్రాయిడ్ ప్రతిపాదించాడు.

మనం ముందే చెప్పుకున్నట్లుగా ఫ్రాయిడ్ సైద్ధాంతిక ప్రతిపాదనలు అత్యంత వివాదాస్పద మైనవిగా పరిగణించబడ్డాయి. ఫ్రాయిడ్ సహచరులలోనే అనేకమంది ఆయన ప్రతిపాదనలను అంగీకరించలేదు. లైంగికత పట్ల ఉండే నైతిక, జీవ వ్యతిరేక ధోరణిని తిరస్కరించి జీవన పరిపూర్ణతకి దాని నిర్వివాదమైన పాత్రను నొక్కి చెప్పడంలో ఫ్రాయిడ్ కృషి గణనీయమైంది. ఫ్రాయిడ్ ప్రాతిపదిక మానవాళికి ఆనందదాయకమైన జీవితాన్ని గడిపే పరిస్థితుల్ని నిర్వచించడం. మానవ హేతుబద్ధతను ప్రశ్నార్థకం చేయడాన్ని ఆవశక్యమైన విమర్శగా చూడడం, మానవ స్వభావాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తుంది. ఇక విమర్శలకొస్తే ఫ్రాయిడ్ సిద్ధాంతానికి అనృతీకరణ (falsification)కు గురి చేయబడే ఆస్కారం లేదు కాబట్టి ఇది శాస్త్రీయ సిద్ధాంతం కాదనేది ఒక విమర్శ. కొద్దిమంది రోగుల, స్వీయ అనుభవాల ప్రాతిపదికగా సార్వజన ప్రతిపాదనలు చేసాడనేది మరో విమర్శ. లైంగికతకు అవసరాన్ని మించిన ప్రాధాన్యతను ఆపాదించడం ద్వారా మానవ జీవితంపై సామాజిక, ఆర్థిక కారణాల ప్రభావాన్ని నిర్లక్ష్యం చేయడం జరిగిందనే విమర్శ మరొకటి. అచేతన అనే భావన మనిషి హేతుబద్ధతను ప్రశ్నించడం ద్వారా, మానవ పురోగతినే ప్రశ్నిస్తుందనే విమర్శ కూడా ఉంది. మనోవిశ్లేషణా చికిత్స పద్ధతిలో చేతనంలోకి తేబడిన అచేతనాంశాల సత్య ప్రామాణికతను కూడా ప్రశ్నించడం జరిగింది. వాటివల్ల కుటుంబ సంబంధాలు గందరగోళానికి గురయ్యాయనే ఆరోపణలు చేయబడ్డాయి. అయితే, ఫ్రాయిడ్ ఇటువంటి సంబంధాల అస్థిరతకు వ్యతిరేకమనే విషయాన్ని మనం గమనంలో ఉంచుకోవాలి. ఫ్రాయిడ్‌పై ఉన్న మరో తీవ్రమైన విమర్శ పితృస్వామిక పక్షపాతంతో సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం అనేది. ఈ

విమర్శ సహేతుకమైనది. పురుష లైంగికతనే సాధారణ లైంగిక క్రమంగా భావించడం, స్త్రీ లైంగికతకు సమాన స్థాయినివ్వక పోవడం ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇక, మృత్యు సహజాతాన్ని, దీనికి ప్రాతిపదికగా మనిషిలోని దౌర్జన్యకాంక్షను ప్రతిపాదించడం మీద కూడా విమర్శలు ఉన్నాయి. స్వీయ రక్షణ, లైంగికతలు శారీరక పునాది కల నిజమైన సహజాతాలు కాగా, మృత్యువు, దౌర్జన్యతలు అట్టి సహజాతాలు కానేరవనే వాదన ఉంది.

ఇవన్నీ పరిగణనలోనికి తీసుకున్న పిమ్మట కూడా, మానవ స్వభావాన్ని, వ్యక్తి - సమాజ సంబంధాలను అర్థం చేసుకునేందుకు ఫ్రాయిడ్ సిద్ధాంతాల అధ్యయనం దోహదం చేస్తుందనేది గుర్తించడం అవసరం.

ఈ పుస్తకంలో అనువదించి ప్రచురించబడినది **నాగరికత - దాని అపశృతులు** (Civilization and its Discontents)అనే ఫ్రాయిడ్ రచన. ఈ రచనలో ఫ్రాయిడ్ ప్రధాన ప్రతిపాదన సహజాతాల అణచివేత లేకుండా నాగరికత సాధ్యం కాదనేది. ఎందుకంటే, మానవునిలో సహజాత శక్తి కలిగిన దౌర్జన్యత అంతర్భాగంగా ఉంటుంది. దీని నుండి అనివార్యంగా వచ్చే నిర్ధారణ మానవ జీవితంలోని అసంతోషానికి కారణం నాగరికత అనేది. ఈ సమస్యకు సకారాత్మక పరిష్కారంగా సహజాతాల ఉదాత్తీకరణను ఫ్రాయిడ్ ప్రతిపాదించాడు. అయినప్పటికీ, రచన చివరిలో రెండు నిర్ణాయక శక్తులైన జీవ, మృత్యు సహజాతాలలో, జీవసహజాతం తనస్థానాన్ని బలోపేతం చేసుకోవాలని కోరుకుంటూనే, అదే సమయంలో ఈ పోరాటంలో విజయం ఎంతవరకు సాధ్యమో చెప్పలేమన్న నిరాశావహ దృక్పథంతో ముగించాడు.

★★★

నాగరికత - దాని అపశృతులు

I

అధికారం, విజయం, సంపదలను తమ పరం చేసుకోవడానికి ప్రజలు ప్రయత్నిస్తారు. వాటిని ఇతరులలో చూసి మెచ్చుకొంటారు. జీవితానికి ఉన్న అసలైన విలువను వారు తక్కువగా అంచనా వేస్తారు. ఇలాంటి తప్పుడు కొలబద్దలను ప్రజానీకం సర్వసాధారణంగా ఉపయోగిస్తుందనే అభిప్రాయానికి రాకుండా ఉండడం అసాధ్యం. అయితే ఇటువంటి సాధారణ అభిప్రాయాలను వెలువరించేటప్పుడు మానవ ప్రపంచం, దాని మానసిక జీవితం ఎంత వైవిధ్యభరితాలో మనం మరచిపోయే ప్రమాదం వుంది. కొద్దిమంది గొప్ప వ్యక్తులుంటారు. వీరి లక్షణాలు, విజయాలు, జనసామాన్య ఆదర్శాలకు, లక్ష్యాలకు ఎంతో దూరంగా ఉన్నప్పటికీ జనం వీరిని మెచ్చుకోక మానరు. ఈ గొప్పవారిని మెచ్చుకొనేది అల్పసంఖ్యాకులేననీ అసలు ఎక్కువమంది వీరిని పట్టించుకోనే పట్టించుకోరనీ ఎవరైనా అనుకోవచ్చు. కాని అసలు విషయం అంత తేలికైంది కాదు. ఎందుకంటే, జనం ఆలోచనలకు, చేతలకు మధ్య వ్యత్యాసం ఉంది. వారి కోర్కెల మూలాలలో ఎంతో వైవిధ్యత ఉంది.

ఈ కొద్దిమంది అసాధారణ వ్యక్తులలో ఒకరు నాకు రాసిన లేఖలో తనను నా స్నేహితుడిగా అభివర్ణించుకొన్నాడు. నేను లోగడ నా చిన్నపుస్తకాన్ని ఒకదానిని ఆయనకు పంపాను. ఆ పుస్తకం మతాన్ని ఒక భ్రాంతిగా[1] చిత్రిస్తుంది. ఆ పుస్తకంలో మతంమీద నేను వెలువరించిన అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నానని రాశాడు.కాని నేను మత మనోభావాల అసలైన మూలాలను సరిగా ఆమోదించలేదని విచారం వ్యక్తంచేశాడు. ఇదొక ప్రత్యేకమయిన అనుభూతని, అదెప్పుడూ తనలో ఉందని, దానిని ఇతరులు గూడా నిర్ధారించారని, ఇంకా అది లక్షలాది జనులలో ఉందని తాను భావిస్తున్నానని, దానిని తాను మహా సాగరానుభూతి (oceanic feeling)గా చెబుతానని అన్నాడు! ఇంకా అతను ఈ అనుభూతి ఆత్మగతమైందని, విశ్వాసానికి సంబంధించింది కాదని అంటాడు. అది వ్యక్తిగత అమర్త్యతకి హామీ ఇవ్వదు. కాని అది మతైక శక్తికి మూలం.

---

[1] *The Future of an illusion (భ్రాంతి భవితవ్యం)* 1927.

ఈ శక్తిని మత సంఘాలు, మాత వ్యవస్థలు కొల్లగొట్టి ప్రత్యేక దిశలలో ప్రచలింపజేశాయి. ఇందులో ఇంకా ఏమీ మిగిలిపోలే దనడంలో సందేహం లేదు. ప్రతి విశ్వాసాన్ని, ప్రతి భ్రమను తిరస్కరించినా కేవలం ఈ ఒక్క మహా సాగరానుభూతి కారణంగా తాను మతావలంబినని ఎవరైనా భావిస్తే, ఆ భావన సరైనదేనని అతని అభిప్రాయం.

నేను అత్యంతంగా గౌరవించే ఈ మిత్రుని[1] అభిప్రాయాలు – అతను మతమాంత్రిక శక్తిని మెచ్చుకుంటూ ఒక పద్యం కూడా వ్రాశాడు–నాకు పెద్ద చిక్కే తెచ్చిపెట్టాయి. ఈ మహాసాగరానుభూతిని నాలో నేను దర్శించలేక పోయాను. అనుభూతుల శాస్త్రీయ వివరణ అంత తేలిక కాదు. అనుభూతుల చిహ్నాలు శరీరంమీద కనిపిస్తే వాటిని వర్ణించడానికి ఎవరైనా ప్రయత్నించవచ్చు. ఇది సాధ్యం కానప్పుడు – మహా సాగరానుభూతి కూడా ఇలాంటి వర్ణనకు లొంగదు – అట్టి అనుభూతులను అంటిపెట్టుకుని వుండే భావ సంబంధ విషయాలలో సమాధానం కోసం వెతకవలసిందే. నేను గనుక నా మిత్రుని సరిగా అర్థం చేసుకొని ఉంటే, అది విలక్షణ, విచిత్ర ప్రవృత్తి కల ఒక నాటక రచయిత, తనకు తాను విధించుకొన్న మృత్యువును ఎదుర్కొంటున్న తన కథానాయకునికి ఇచ్చిన "ఈ ప్రపంచం నుండి మనం బయటకు పడలేము"[2] అనే ఓదార్పు కంటే భిన్నంకాదు. అంటే, ఈ బాహ్య ప్రపంచం మొత్తంతో చెరిగిపోని బంధంలాంటి అద్వైతాన్ని అనుభూతి చెందడం. నిజానికి, ఇది బౌద్ధిక దృక్పథ స్వభావం కలిగి ఉన్నట్లుగా నాకు కనిపిస్తున్నది. అయితే దానికి తోడుగా అనుభూతి స్వరం ఉంటుందనేది వాస్తవమే. కాని ఇట్టి అనుభూతి స్వరం అనేది సమాన విస్తృతితో జరిగే ఇతర ఆలోచనా క్రియల సందర్భంలో కూడా ఉంటుంది. నా అనుభవాన్ని బట్టిచూస్తే, అటువంటి అనుభూతి ప్రాథమిక స్వభావం మీద నాకు నమ్మకం కుదరడం లేదు. అంతమాత్రం చేత అది ఇతరులకు కలగలేదని చెప్పే హక్కు నాకు లేదు. అయితే ఇక్కడ ఉన్న ప్రశ్న ఒక్కటే. మనం దానిని సరిగా అర్థం చేసుకొన్నామా ? మతానికి ఉన్న ఏకైక భూమిక అదేనా ? ఈ సమస్యను పరిష్కరించడంలో నిర్ణయాత్మక ప్రభావాన్ని నెరపగలదేదీ నేను సూచించలేదు. తమ చుట్టూ ఆవరించి ఉన్న బాహ్య ప్రపంచంతోఉన్న సంబంధాన్ని మొదటి నుంచి ఇందుకోసమే ఉద్దేశించబడిన

---

1. *అతని రెండు పుస్తకాలు రామకృష్ణ (1929), వివేకానంద (1930) ప్రచురించబడ్డాయి కనుక నేనింత వరకు మాట్లాడిన ఆ స్నేహితుని పేరు దాచనవసరం లేదు. అతడు రోమా రోలా.*
2. *Christian Dietrich Grabbe (1810-36) : హానిబల్ – "నిజంగా ఈ ప్రపంచం నుండి మనం బయటపడలేం. మనం ఎప్పటికి అందులోనే ఉంటాము."*

ఒకతక్షణ అనుభూతిద్వారా మనుషులు గ్రహిస్తారని చెప్పే భావన చాలాచిత్రమైందేకాక, మన మనోవిజ్ఞాన శాస్త్ర అవగాహనలో ఏ మాత్రం ఇమడదు. కాబట్టి అట్టి అనుభూతిని మనోవిశ్లేషణాత్మకంగా - అంటే దాని మూలాలకు వెళ్ళి - వివరించడం సమర్ధనీయమే అవుతుంది. ఈ దిగువ ఆలోచనా విధానం స్వయంవిదితం. మనకు ఖచ్చితంగా తెలిసేది. మనం ఖచ్చితంగా చెప్పగలిగేది మన ఆత్మ (Self), మన అహం (ego) గురించి మాత్రమే (దానితో ఉన్నంత సన్నిహిత సంబంధం మరి దేనితోనూ ఉండదు - అనువాదకుడు). ఈ అహం మనకు స్వయం ప్రతిపత్తి కలదిగా, ఏకీకృతమయినదిగా, స్పష్టంగా ప్రతి ఇతర వస్తువు నుండి వేరైనదిగా కనిపిస్తుంది. అయితే ఈ కనిపించిందేదీ వాస్తవం కాదని, అహం అనేది ఏ రకమైన ఖచ్చితమైన సరిహద్దు లేకుండా, మనం ఇడ్ అని పిలిచే అచేతనాపూరిత మానసిక అస్తిత్వంలోకి కొనసాగుతుందని, ఇడ్‌కు అహం ముఖంగా పనిచేస్తుందనే విషయాన్ని మొదటిగా మనోవిశ్లేషణ పరిశోధన ఆవిష్కరించింది. అహం, ఇడ్‌ల సంబంధం గురించి ఇంకా ఎంతో పరిశోధన జరగవలసి ఉంది. ఏమైనప్పటికీ బాహ్యప్రపంచంతో అహంకు స్పష్టమైన సరిహద్దు ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే, అసాధారణ స్వభావం కలిగి ఉన్నప్పటికీ, రోగగ్రస్త స్థితిగా పరిగణించ వీలులేని, ఒకే ఒక్క స్థితిలో మాత్రం ఈ పరిస్థితి ఉండదు. ప్రేమలో ఉన్నత శిఖరాలు చేరినప్పుడు అహం - వస్తువు మధ్య వున్న సరిహద్దు రేఖ చెరిగిపోయే అవకాశం ఉంది. అతని ఇంద్రియాలు పలికే సాక్ష్యానికి విరుద్ధంగా, ప్రేమలో పడ్డ వ్యక్తి 'నేను', 'నువ్వు' ఒక్కటే అంటాడు. పైగా అది నిజమే అన్నట్లు ప్రవర్తిస్తాడు. సాధారణ శరీర ధర్మ విధుల ద్వారా తాత్కాలికంగా పరిష్కరించుకో గలిగినది కూడా రోగగ్రస్త క్రమం ద్వారా గందరగోళ పర్చబడే అవకాశం వుంది. అహానికి - బాహ్య ప్రపంచానికి మధ్య ఉన్న సరిహద్దు రేఖలను అస్తవ్యస్తంగా తయారుచేసే అనేక స్థితులను మనకు రోగ లక్షణ శాస్త్రం పరిచయం చేసింది. కొన్ని సందర్భాలలో, ఒక వ్యక్తి శరీర భాగాలు, అతని మానసిక జీవితంలోని కొన్ని భాగాలు కూడా - అతని ఇంద్రియజ్ఞానం, ఆలోచనలు, అనుభూతులు - అతనికి పరాయివి అయినట్లు, అతనికి చెందినవి కానట్లు కనిపిస్తాయి. మరికొన్ని సందర్భాలలో తనలోనుంచి పుట్టిన, తన అహం మాత్రమే ధృవీకరించ వలసిన విషయాలను వ్యక్తి బాహ్య ప్రపంచానికి ఆపాదించడం జరుగుతుంది. అంతేకాదు, అహం సరిహద్దులు స్థిరంగా ఉండవు.

ఇంకొంత ఆలోచించిన మీదట తేలే విషయం ఏమంటే యుక్త వయస్కుడైన వ్యక్తిలో అహం అనుభూతి మొదటినుంచి ఒకేవిధంగా ఉండటం జరగదు. అది ఒక

అభివృద్ధి క్రమం ద్వారా పయనించి ఉండి ఉంటుంది. అయితే, దానిని మనం రుజువు చేయలేం. కాని ఈ అభివృద్ధి క్రమాన్ని వాస్తవ క్రమానికి వీలైనంత దగ్గరగా నిర్మించడం సాధ్యమౌతుంది. చంటిబిడ్డ తన మీదకు ఉద్దీపనలను (stimuli) పంపే బాహ్య ప్రపంచం నుంచి తన 'అహం'ను ఇంకా నేరుగా గుర్తించలేదు. అతను క్రమంగా అనేక ప్రోత్సాహాలకు ప్రతిస్పందిస్తూ, అహం, బాహ్య ప్రపంచాలను వేరు వేరుగా చూడడం నేర్చుకుంటాడు. ఉత్తేజమూలాలు – వీటిని తరువాత శిశువు తన శరీర అంగాలే అని తెలుసుకొంటాడు – ఏ క్షణంలోనైనా అతనికి సంవేదనల (sensations)ను అందించగలవనే వాస్తవం అతనిమీద గట్టిగా ముద్రితమవుతుంది. అయితే ఇతర మూలాలు తరచు అతనికి దొరకకుండా తప్పించు కుంటాయి. వీటిలో చంటిబిడ్డ అత్యంతంగా కోరుకునే తల్లి స్థనం కూడా ఉంది. ఇది అతడు ఏడ్చి గోలపెట్టినప్పుడు మాత్రమే పునర్దర్శనం ఇస్తుంది. ఈ విధంగా, ప్రప్రథమంగా అహంకు వ్యతిరేకంగా ఒక 'వస్తువు' రూపొందుతుంది. ఈ వస్తువు 'బాహ్యం'గా ఉంటుంది.. ఒక ప్రత్యేక చర్య (పిల్లవాని ఏడుపు) ఉన్నప్పుడే అది తప్పనిసరిగా దర్శనమిస్తుంది. సాధారణ సంవేదనల రాశినుంచి అహం విడిపోవడానికి – అంటే బాహ్యాన్ని, ఒక వెలుపలి ప్రపంచాన్ని గుర్తించడానికి – ఇంకొంత ప్రోత్సాహం తరచుగా, అనేకంగా సంభవించే తప్పించుకోలేని బాధాకర, అసంతోషకర సంవేదనల నుంచి వస్తుంది. సుఖ సూత్రం (pleasure principle) అపరిమిత ఆధిపత్యం చెలాయించే క్రమంలో ఈ బాధాకర, అసంతోషకర సంవేదనల పరిహారం జరుగుతుంది. అటువంటి అసంతోషానికి కారణం, మూలం అయ్యే ప్రతిదానిని, అహం నుంచి వేరుచేసి, బయటకు నెట్టడం ద్వారా ఒక శుద్ధ సుఖకర అహాన్ని తయారుజేసే ప్రవృత్తి జనిస్తుంది. ఈ శుద్ధ సుఖకర అహం ఒక విచిత్రమైన, ప్రమాదభరిత బాహ్యాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ ఆదిమ సుఖకర అహం సరిహద్దులు అనుభవం ద్వారా సవరించుకునే క్రమంనుంచి తప్పించుకోలేవు. సుఖకర సంవేదనలను కలుగచేసే కొన్ని విషయాలను వదులుకోవటానికి ఎవరూ ఇష్టపడరు. ఈ వదులుకోలేని విషయాలు అహానికి కాక, వస్తువుకి చెందినవి. వదిలించుకోవాలనుకొన్నా కొన్ని బాధలను వదిలించుకోలేము. ఎందుకంటే వాటి అంతర్గత మూలం కారణంగా అహం నుంచి అవి అవిభాజ్యాలు. క్రమేపి వ్యక్తి ఒక పద్ధతిని నేర్చుకొంటాడు. ఆ పద్ధతిలో, ఉద్దేశపూర్వకంగా ఇంద్రియ ప్రక్రియలను చేపట్టడంద్వారా, తగు కండర చర్యలద్వారా, ఏది అంతరంగికమైందో–అంటే ఏది అహంకు చెందిందో – అనే వాటిమధ్య తేడాను గుర్తించడం నేర్చుకొంటాడు. ఈ విధంగా వాస్తవికతా సూత్రాన్ని

తొలి దశలను ఎంతవరకు చూడగలడు ? అక్కడక్కడ, కొన్నిచోట్ల తవ్వి తీసిన సెర్వియన్ గోడ భాగాలను అతడు చూడగలడు. అతడికి విషయ పరిజ్ఞానం చాలినంత ఉంటే - బహుశ అతడు, నగర ప్రణాళికలో, ఆ గోడ పూర్తిగతిని, రోమ్ చతురస్రాన్ని, వాటి ఆనవాళ్ళను తెలుసుకోగలుగుతాడు. ఈ ప్రాచీన ప్రాంతంలో ఆనాడు ఉన్న భవంతుల కొద్దిపాటి అవశేషాలు మినహా అతనేమీ కనుగొనలేడు. ఎందుకంటే ఆ భవనాలు ఇక ఏమాత్రం లేవు. రిపబ్లికన్ శకం నాటి రోమ్‌కు సంబంధించిన అత్యంత విలువైన సమాచారం అతని వద్ద వుంటే, మహా అయితే ఆ కాలానికి చెందిన గుడులు, పబ్లిక్ భవనాలు ఉన్న స్థలాలను గుర్తించగలడు. వాటి స్థానాన్ని ఇప్పుడు శిథిలాలు ఆక్రమించాయి. అయితే, ఇవి తొలినాటి నిర్మాణాల శిథిలాలు కావు. అగ్ని ప్రమాదాలు, వినాశాల తరువాత జరిగిన పునరుద్ధరణల శిథిలాలు. పునర్వికాసం తరువాత గత కొద్ది శతాబ్దాల కాలంలో అభివృద్ధి చెందిన మహానగర సంకీర్ణంలోకి, ఈ ప్రాచీన శిథిలాలు అవశేషాలు చక్కగా ఇమిడి పోయాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నగర భూగర్భంలో, ఆధునిక భవంతుల అడుగున నిక్షిప్తమయిన వాటిలో ప్రాచీన అవశేషాలు తక్కువ సంఖ్యలో ఏమీలేవు. రోమ్ నగరం లాంటి చారిత్రక స్థలాలలో గతం పరిరక్షించబడిన తీరు ఇది.

ఇప్పుడు మనమొక ఊహా విహారం చేద్దాం : కాసేపు రోమ్ నగరం మానవావాసం కాదను కొందాం. అది సుదీర్ఘ గతాన్ని కలిగివున్న ఒక మానసిక అస్తిత్వం - అంటే దేనిలో అయితే ఒకసారి ఉనికిలోకి వచ్చింది మరి గతించిపోదో, దేనిలో అయితే గత వికాస దశలన్నీ అంత్యదశ వరకు సరసనే కొనసాగుతాయో - అటువంటి మనోఅస్తిత్వం అనుకొందాం. దీని అర్థం ఏమిటంటే, రోమ్‌లో సీజర్ల రాజప్రాసాదాలు, సెప్టిమియస్ సెవరస్ నిర్మించిన సెప్టిజోనియమ్ ఆనాటిలాగా సమున్నతంగా నిలబడడం, సెయింట్ ఆంజలో కోట బురుజుల మీద గోత్స్ దాడిచేసి పడగొట్టిన సుందరమైన ప్రతిమలు ఈ నాటికీ నిలిచివుండడం, తదితరమైనవి జరిగినట్లు. అంతేకాదు ఇంకా ఉంది. పాలజ్జో సఫరెలి వున్న స్థలంలో - పాలజ్జోను తీసివేయకనే - జూపిటర్ కాపిటోలినస్ మందిరం నిలబడివున్నట్లు. అయితే, రోమన్ సామ్రాజ్య ప్రజలు చివరిసారిగా చూసిన ఆకృతిలో కాదు ఇది నిలబడింది. అది తన తొలి ఆకృతుల - ఇట్రస్కన్ కళాకృతులను, మృణ్మయ భూషణాలంకృతాలైన ఆకృతుల స్థితినిగూడా ప్రదర్శిస్తుంది. ఇప్పుడెక్కడైతే నాట్య క్రీడాశాల ఉందో అక్కడే కాలగర్భంలో కలిసిపోయిన నీరో చక్రవర్తి స్వర్ణభవంతిని కూడా మనం దర్శించవచ్చు. నాటి బహుదేవతాలయం మీద, హాడ్రియన్ మనకు వారసత్వంగా

మిగిల్చిపోయిన నేటి బహు దేవతాలయాన్ని మాత్రమే కాదు, అదే స్థలంలో అగ్రిప్ప నిర్మించిన తొలి మందిరాన్నీ చూస్తాం. వాస్తవానికి అదే స్థలంలో ప్రాచీన దేవాలయాన్ని, దానిమీద నిర్మించిన శాంటి మెరియా సొప్రా మినర్వా చర్చినికూడా చూడవచ్చు. సందర్శకులు వీటిలో దేనిని చూడాలనుకున్నా తనచూపు దిశను లేదా తన స్థానాన్ని మార్చుకుంటే సరిపోతుంది.

మన స్వైర కల్పనను ఇంకా కొనసాగించడం వల్ల ప్రయోజనం లేదు. ఎందుకంటే, అది అనూహ్యమైన విషయాలకు, మరింత అర్ధరహిత విషయాలకు దారితీస్తుంది. మనం చారిత్రక ఘటనల వరుస క్రమాన్ని స్థలపరంగా చెప్పాలనుకొంటే, వాటిని స్థలంలో ప్రక్క ప్రక్కనే ఉంచడం ద్వారా మాత్రమే ఆ పని చేయగలం. ఒకే స్థలంలో రెండు వేర్వేరు వస్తువులు ఏక కాలంలో ఉండలేవు. మన ప్రయత్నం ఉబుసుపోక ఆడే ఆట అవుతుంది. దానికి ఒక్క సమర్ధన మాత్రమే ఉంది. మానసిక జీవిత లక్షణాలను దృశ్యపరంగా వివరించడం వల్ల, వాటిపై పట్టు సాధించే క్రమానికి మనం ఎంతో దూరంలో వున్నామని ఇది తెలియచేస్తుంది.

మనం పరిశీలించాల్సిన మరో అభ్యంతరం ఉంది. మనస్సు గతాన్ని తెలుసుకోవడానికి మనం సరిగ్గా ఒక నగర గతాన్ని ఎందుకు ఎంచుకొన్నామనే ప్రశ్న అడగబడవచ్చు. ఏది ఏమైనప్పటికి మెదడు చెక్కు చెదరకుండా ఉండి, దాని కణజాలం ఏ ఆఘాతం వల్లనో, తాపాల వల్లనో వినాశం కావించబడనప్పుడు మాత్రమే మానసిక జీవితంలో గతం అంతా పరిరక్షితమవుతుందనే ప్రాక్కల్పన సరైనదని రుజు చేయడం సాధ్యమౌతుంది. రోమ్ నగరం కంటె తక్కువ ఒడిదుడుకులు ఎదుర్కొన్న నగరం అయినా లేక లండన్* నగరంలా ఎప్పుడూ శత్రు దాడులకు గురికాని నగరమయినా, ఏ నగర చరిత్రలోనయినా, రోగ కారణాలతో పోల్చదగిన వినాశకర ప్రభావాలు లేకుండా ఉండవు. నగర జీవితంలో అత్యంత ప్రశాంతమైన, అభివృద్ధికర కాలంలో కూడా భవంతులను పడగొట్టడం, పునర్నిర్మించడం జరుగుతూనే ఉంటుంది. నగరం అనేది మానసిక నిర్మాణంతో ఈ విధంగా పోల్చడానికి అనువైనది కాదనే విషయాన్ని అనుభవంతో నిమిత్తం లేకుండానే చెప్పవచ్చు.

---

* *ఇది ఈ రచనా సమయమైన 1929-30ల నాటికి మాత్రమే వాస్తవం. రెండో ప్రపంచ యుద్ధం (1939-45)లో లండన్ నగరం భీకరమయిన విమానదాడులకు గురయింది – అను.*

ఈ అభ్యంతరానికి మనం తలవంచుతాం; విస్పష్టమైన భేదాన్ని చూపే మన ప్రయత్నాన్ని మానుకుని, దానికి బదులు మనకు అత్యంత సన్నిహిత సంబంధం ఉన్న సదృశవస్తువు - జంతు శరీరం లేదా మానవ శరీరం - వైపుకు మరలుదాం. కాని ఇక్కడ గూడా మనకు అదే సమస్య ఎదురవుతుంది. వీటి తొలి వికాస దశలు ఏ విధంగాను పరిరక్షించబడలేదు. అవి తరువాతి దశలలోకి పూర్తిగా మిళితమైపోయాయి. వాస్తవానికి అవి ఈ తరువాత దశలకు పదార్థాన్ని సరఫరా చేశాయి. యుక్త వయస్కునిలో మనం పిండాన్ని చూడలేం.

బాల్యంలో ఉండే వినాళగ్రంధి స్థానంలో యౌవన ప్రాదుర్భావంలో సంయోజక కణజాలం చేరుతుంది. ఇంక వినాళగ్రంధి ఏమాత్రం ఉండదు. ఎదిగిన వ్యక్తి మజ్జ ఎముకలో చిన్న పిల్లవాని ఎముక స్థూలరేఖను చూడవచ్చు. కాని అది లావు, పొడవు పెరిగి దాని అంతిమ ఆకృతినిపొందే క్రమంలో అంతర్ధానమవుతుంది. ఒక్క మనసు విషయంలో మాత్రమే, దాని అంతిమ రూపంతో పాటు దాని తొలిదశల పరిరక్షణ సాధ్యమన్నది వాస్తవం. అయితే ఈ దృగ్విషయాన్ని మనం దృశ్యపరంగా వివరించలేమన్నది కూడా వాస్తవమే.

బహుశ మనం ఈ విషయంలో చాలా దూరం పోతున్నట్లున్నాం. బహుశ మనం ఈ దిగువ విషయం మాత్రమే చెప్పగలం; మానసిక జీవితంలో గతించిందంతా సంరక్షితమై ఉండి వుండవచ్చు; దానివినాశనం తప్పనిసరి నియమమేమీ కాదు. అయితే, మనస్సు విషయంలో కూడా కొన్ని గత విషయాలు - సహజ గతిలో కాని, లేదా మినహాయింపుగా కాని - పునర్జీవింపచేయడానికి, పునరుద్ధరించడానికి సాధ్యంకానంతగా తుడిచిపెట్టబడడం కాని లేక కలిపిచేసుకోబడడం కాని సాధ్యమైన విషయమే. పరిరక్షణ కొన్ని అనుకూల పరిస్థితుల మీద ఆధారపడి వుంటుంది. అది సాధ్యమైనదే కాని దాని గురించి మనకు ఏమీ తెలియదు. మానసిక జీవితంలో గత విషయాలు పరిరక్షించబడటం మినహాయింపుగా కంటె నియమంగానే జరగుతుందనే వాస్తవానికి అంటిపెట్టుకుని ఉండటం మాత్రమే మనం చేయగలం.

'మహాసాగర' అనుభూతి అనేకమందిలో ఉందని ఒప్పుకోవడానికి మనం పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. దాని జాడను వెనుకకు వెళ్లి అహం అనుభూతి ముందు దశలో చూడడానికి మనం సానుకూలంగా ఉంటాం. తదుపరి, మతావసరాలకు మూలంగా చెప్పబడడానికి ఈ అనుభూతికి ఉన్న హక్కు ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది.

నా వరకు నాకు ఈ వాదన అంత బలమైనదిగా కనిపించడం లేదు. అంతగా అయితే, ఒక అనుభూతి బలమైన అవసరాన్ని వ్యక్తీకరిస్తున్నపుడు మాత్రమే అది శక్తికి మూలం అవుతుంది. శిశువు నిస్సహాయత, అది సృష్టించిన 'తండ్రి కోసం తపించడం' నుండి మతావసరాలు జనించాయనేది నాకు నిర్వివాదాంశంగా కనిపిస్తున్నది. మరీ ముఖ్యంగా ఎందుకంటే ఈ అనుభూతి శైశవ దశ నుంచి పొడిగించబడడమే కాక, విధి చలాయించే అధికారం పట్ల ఉండే భీతి ద్వారా శాశ్వతంగా నిలబెట్టబడుతోంది. బాల్యంలో తండ్రి రక్షణ అవసరం. అంతటి బలమైన మరో అవసరాన్ని నేను ఊహించలేను. మహాసాగరానుభూతి వహించిన పాత్ర–ఇది అపరిమిత స్వానురాగ (limitless narcissism) పునరుద్ధరణ లాంటిదానిని కోరవచ్చుగాక–ఈ విధంగా అగ్రస్థానం నుంచి తొలగించ బడింది. మతభావనల మూలాలను శైశవ నిస్సహాయత వరకు వెనక్కి పయనించి స్థూలంగా తెలుసుకో వచ్చు. దాని వెనక ఇంకా ఏదో ఉండిఉండవచ్చు. కాని ప్రస్తుతానికి అది అంధకారంలో ఆవృతమై ఉంది.

తరువాతి దశలో మహా సాగరానుభూతి మతానికి ముడిపెట్టబడిందని నేను ఊహించగలను. దాని భావ రూపకల్పన అయిన "విశ్వంతో సంలీనం" అనే భావన మతపర ఓదార్పుకుచేసే ప్రథమయత్నంగా కనిపిస్తుంది. బాహ్య ప్రపంచం నుంచి వచ్చే ముప్పుని ఇంద్రియ గ్రాహ్యం కాని విషయాలతో వ్యవహరించడం నాకు చాలాకష్టం. నాకు మరో స్నేహితుడున్నాడు. అతనికి అపరిమితమైన జ్ఞానతృష్ణ ఉంది. ఈ తృష్ణ అతనిని అత్యంత అసాధారణ ప్రయోగాల వైపుకు నడిపించి, అంతిమంగా అతనికి విజ్ఞాన సర్వస్వాన్ని అందించింది. అతడు నాకు నమ్మకంగా చెప్పాడు : బాహ్య ప్రపంచం నుంచి ఉపసంహరించుకోవడం, శారీరక ప్రకార్యాలపై మనస్సును లగ్నం చేయడం, విశేష శ్వాస పద్ధతులవంటి యోగక్రియలను ఆచరించడం చేస్తే ఎవరైనా తనలోతాను నూతన శారీరక సంవేదనలను, తన శారీరక స్థితి గురించి ఇనుమడించిన స్పృహను కల్పించుకోవడం సాధ్యమౌతుంది. దీర్ఘకాలంగా మరుగునపడిఉన్న మనస్సు ఆదిమ స్థితులకు ప్రతీపగమనంగా అతడు వీటిని పరిగణించాడు. మార్మిక వాదంలోని వివేచనకు శారీరక భూమికగా వాటిని అతనుచూశాడు. సమాధి (trance), హర్షోన్మాదం (ecstacy) లాంటి మానసిక జీవితపు అనేక పరివర్తనల నిగూఢ సంబంధాలను కనుక్కోవడం అంత కష్టం కాదు. కాని షిల్లర్ మాటలలో ఇలా ప్రకటించాలనిపిస్తోంది.

"ఈ అరుణద్యుమ రోజా దీప్తి నతడు శ్వాసిస్తోన్నాడు కదా ! అలానే ఉల్లసించనీ అతన్ని సదా !!"

II

నా భ్రాంతి భవితవ్యం అనే రచనలో నేను మతానుభూతి లోతైన మూలాల గురించి కంటే సామాన్య మానవుడు మతాన్ని ఎలా అర్థం చేసుకుంటాడు అనే విషయాన్ని ఎక్కువగా పట్టించుకున్నాను. సామాన్యుడు మతాన్ని ఇలా అర్థం చేసుకుంటాడు. అది ఒక ప్రక్క మనకి అసూయ కలిగించేటంతటి సమగ్రతతో ఈ ప్రపంచ ప్రహేళికను వివరించగల వ్యవస్థ. మరోప్రక్క అది మానవుని జీవితాన్ని అనుక్షణం పర్యవేక్షిస్తూ, ఈ లోకంలో అతనికి ఎదురయ్యే ప్రతికూలతలకు, వైఫల్యాలకు అనంతర జన్మలో నష్టపరిహారం చెల్లిస్తానని చెప్పే శ్రద్ధాళువైన దేవుడున్నాడని చెప్పే సిద్ధాంతాల, వాగ్దానాల వ్యవస్థ. ఈ దేవుణ్ణి విశేషంగా ఉన్నతీకరించబడిన తండ్రి రూపంలో మాత్రమే సామాన్య మానవుడు ఊహించగలడు. అంతకంటే వేరే విధంగా ఊహించలేడు. అటువంటి దేవుడు మాత్రమే బిడ్డలైన మానవుల అవసరాలను అర్థం చేసుకోగలడు. వారి ప్రార్థనలకు, వారి పశ్చాత్తాపాలకు మెత్తపడ తాడు. ఈ మొత్తం వ్యవహారం ఎంత అసాధారణ శైశవంగా, ఎంత వాస్తవ విరుద్ధంగా కనిపిస్తుం దంటే, మానవాళిని ప్రేమించేవారెవరికైనా మానవులలో అధిక భాగం ఇటువంటి జీవిత దృక్పథాన్ని దాటిపోలేదనే ఆలోచన బాధని కలిగిస్తుంది. ఇంతకంటె అవమానకరమైన సంగతి మరొకటుంది. అదేమిటంటే నేటి జనంలో ఎంతోమంది ఇలాంటి మతం మనజాలదని గ్రహించారు. అయినా వారంతా దానిలోని ఒక్కొక్క అంశాన్ని దొడ్డి దారిన దయనీయంగా కాపాడ ప్రయత్నిసున్నారు. మత ప్రతిపాదిత దేవుని స్థానంలో ఒక అవైయక్తిక, అమూర్త, ఛాయామాత్ర సూత్రాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఆ దేవుణ్ణి రక్షించవచ్చని అనుకొనే తాత్వికులను కలుసుకునే నిమిత్తం, అంతేకాక వారిని "మీరు వృథాగా దేవుని పేరును ఉచ్చరించకండి" అని హెచ్చరించే నిమిత్తం అవసరమైతే దైవాన్ని విశ్వసించే జనాళిలో ఒకరిగా కలిసిపోవాలని ఎవరికైనా అనిపించవచ్చు. గతంలో గూడా కొంతమంది గొప్ప వ్యక్తులు అలా ప్రవర్తించినప్పటికి వారు అలా ఎందుకు చేయవలసివచ్చిందో మనకు తెలుసు కాబట్టి, వారిని ఉదాహరణగా పరిగణించరాదు.

ఇప్పుడు మనం సామాన్య మానవుని, అతని మతాన్ని తిరిగి పరిశీలిద్దాం. సార్థక నామధేయ మైన ఒకే ఒక మతం అది. ఈ సందర్భంలో మొదటిగా మన మనస్సులో

మెదిలేది కళాశాస్త్రాలతో మతసంబంధం గురించి మన మహాకవులు, చింతనులలో ఒకరైన గోథె చెప్పిన ప్రసిద్ధ వాక్యం.

"శాస్త్రం, కళ ఉన్నవానికి మతమున్నట్లే, ఆరెండింటిలో ఏదీ లేని వానిని కనీసం మతాన్ని కలిగి ఉండనీ".

ఈ వాక్యం ఒక ప్రక్క మానవుడు సాధించిన రెండు ఘన విజయాలకు (కళా, శాస్త్రాలకు), మతానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని చిత్రిస్తుంది. మరో వైపు, జీవితంలో వాటికున్న విలువపరంగా చూస్తే ఈ ఘన విజయాలు, మతం ఒకదానిని మరొకటి ప్రతిబింబించ గలవు. లేదా ఒకదాని స్థానంలో మరొకటి ప్రతిష్ఠితం కాగలవు అని పేర్కొంటుంది. కళా శాస్త్రాలు లేని సామాన్య మానవునికి మతంగూడా లేకుండా చేయాలని మనం ప్రయత్నిస్తే అందుకు కవిమద్దతు లభించదనేది స్పష్టం. ఈకవి వాక్యంవిలువను గుర్తించేక్రమానికి చేరువయ్యేందుకు ఒక ప్రత్యేకమార్గాన్ని ఎంచు కొందాం. మన అనుభవం ప్రకారం జీవితం కడుదుర్భరమైంది. అది మనకెన్నో బాధల్ని, నిరాశా నిస్పృహలను, అసంభవమనిపించే సమస్యలను తెచ్చిపెడుతుంది. వాటిని భరించడానికి మనకు ఉపశమన చర్యల ఆసరా తప్పనిసరి. థియోడర్ ఫోంటానే చెప్పినట్లుగా 'సహాయక వ్యవస్థలు లేకుండా మనం మనుగడ సాగించలేం'. బహుశ అటువంటి మూడు వ్యవస్థలున్నాయి; దు:ఖ భారాన్ని తేలికపరిచే శక్తిమంతాలైన ప్రక్కదారులు; దు:ఖాన్ని తగ్గించే ప్రత్యామ్నాయ సంతృప్తులు; బాధను మరిపించే మత్తుపదార్థాలు. అటువంటిదేదో ఒకటి అనివార్యం[1]. ఎవరి తోటను వారే సాగుచేసుకోవాలి అనే సలహాతో **కాందిదా** అనే తన రచనను ముగించేటప్పుడు, వోల్టేర్[2] పైన పేర్కొన్నటువంటి ప్రక్కదారులని ఉద్దేశించాడు. శాస్త్ర సంబంధమైన కృషి కూడా ఇటువంటిదే. కళ ద్వారా పొందే తృప్తి, వాస్తవిక తృప్తితో పోలిస్తే భ్రాంతి అనేమాట నిజమే. అయినా మనస్సుపై దాని ప్రభావం ఏమాత్రం తక్కువ కాదు. ఇందుకు మానసిక జీవితంలో స్వైరకల్పన నిర్వహించే పాత్రకు మనం ధన్యవాదాలు చెప్పాలి. మత్తు పదార్థాలైతే, మన శరీరాన్ని ప్రభావితంచేసి దాని రసాయనిక రచనను మార్చివేస్తాయి. వీటి అన్నింటిలోను మతం స్థానం ఎక్కడో చెప్పడం కష్టం. దాని స్థానం ఎక్కడో ఇంకా వెదకాల్సే ఉంది.

---

1. *In Die Formme Helene అనే తన రచనలో విల్‌హెల్మ్‌బుష్ ఇలా చెప్పాడు : చింతలున్న వానికి బ్రాందీ కూడా ఉంది.*
2. *వోల్టేర్ ఫ్రాంకోమెరీ ఆరోట్ (1694 - 1778) : ప్రసిద్ధ ఫ్రెంచ్ తత్వవేత్త, చరిత్రకారుడు, నాటక, వ్యాస రచయిత. (అనువాదకుని వివరణ)*

మానవ జీవితానికి అర్థం ఏమిటి ? అనే ప్రశ్న ఎన్నోసార్లు వేయడం జరిగింది. అయినా ఇంతవరకు దానికి సమాధానం రాలేదు. బహుశ దానికి ఎప్పటికైనా సరైన సమాధానం వస్తుందనే ఆశకూడా లేదు. ఈ ప్రశ్నవేసేవారు మరో విషయాన్ని గూడా దానికి జోడిస్తున్నారు. జీవితానికి అర్ధమే లేకపోతే, వారికి సంబంధించినంతవరకూ అది విలువను కోల్పోతుంది అని చెపుతున్నారు. కాని ఇటువంటి బెదరింపు వల్ల మారేదేమీ ఉండదు. అంతేకాదు అసలు ఈ ప్రశ్ననే కొట్టి పారవేసే హక్కు మనకుందని అనిపిస్తుంది. ఎందుకంటే అది మానవాళి మితిమీరిన ఆత్మవిశ్వాసం నుండి జనించింది. దీని అనేక ఇతర రూపాలు ఇప్పటికే మనకి తెలుసు. జంతువుల ప్రయోజనం మానవులకు ఉపయోగపడడం అనే అర్ధంలో తప్ప బహుశ వాటి జీవితార్థాన్ని గురించి ఎవరూ మాట్లాడరు. కాని ఈ వాదమూ నిలువదు. ఎందుకంటే జంతువులను వర్గీకరించి, వర్ణించి అధ్యయనం చేయడం మినహా మనిషి ఏ విధంగాను ఉపయోగించుకోలేని జంతువులనేకం వున్నాయి. మరి ఎన్నో జీవ జాతులు ఈ మాత్రంగా గూడా ఉపయోగపడకుండ మరుగైపోయాయి. ఎలాగంటే, వాటిమీద మనిషి కన్ను పడకముందే అవి పుట్టడం, గిట్టడం జరిగిపోయింది. మళ్ళీ చెప్పాలంటే, ఒక్క మతం మాత్రమే జీవితార్థాన్ని గురించి సమాధానం చెప్పగలదు. జీవితానికి అర్థం ఉంది అనే భావన మతంతోపాటే నిలబడుతుంది, మతంతోపాటే పడిపోతుంది అని చెబితే తప్పు ఏమీలేదు.

అందుకని, మానవులు తమ ప్రవర్తన ద్వారా ఏ ఏ జీవితార్థాలను, ఆదర్శాలను లక్ష్యాలను ప్రదర్శిస్తున్నారు అనే పరిమిత విస్తృతి గల ప్రశ్న మీద మన దృష్టిని నిలుపుదాం. వారు జీవితం నుంచి ఆశించేదేమిటి ? దానితో వారేమి సాధించాలని చూస్తున్నారు ? ఈ ప్రశ్నకు వచ్చే సమాధానం స్పష్టం. వారు సుఖంకోసం యత్నిస్తారు. సుఖంగా ఉండాలని, వీలైతే అలాగే కొనసాగాలని కోరుకొంటారు. ఈ ప్రయత్నానికి రెండు పార్శ్వాలున్నాయి. అవి సకారాత్మక లక్ష్యం, నకారాత్మక లక్ష్యం. ఒక ప్రక్క అది అసుఖ, బాధారాహిత్యాలను కోరుకుంటుంది. మరోప్రక్క గాఢ సుఖ సంవేదనలను అనుభవించాలని కోరుకుంటుంది. దాని సంకుచితార్థంలో “సుఖం” అనేమాట ఈ చివరిదానికే (గాఢసుఖ సంవేదనలకే) అన్వయిస్తుంది. లక్ష్యాలలోని ఈ ద్విదా విభజనను అనుసరించి మానవ యత్నం రెండు దిశలలో సాగుతుంది. అధికంగానో లేదా పూర్తిగానో ఈ లక్ష్యాలలో ఏదో ఒకదానిని యథార్థీకరించుకోవాలనే యత్నంమీద ఆధారపడి ఆ దిశ ఉంటుంది.

జీవితార్థాన్ని నిర్ణయించేది సుఖ సూత్ర ప్రణాళిక మాత్రమే. మొదటినుంచి గూడా మానసిక యంత్రాంగం మీద ఈ సుఖ సూత్రమే ఆధిపత్యం చెలాయిస్తుంది. దాని సామర్థ్యం గురించి ఎవరికీ ఏ అనుమానం లేదు. కాకపోతే, దాని ప్రణాళిక మొత్తం ప్రపంచానికి – దాని బృహత్, సూక్ష్మ రూపాలతో సహా – ఎదురై నిలుస్తుంది. దానిని చివరికంట తీసుకుపోయే అవకాశం ఏమాత్రం లేదు. విశ్వ నియమాలన్నీ దానికి వ్యతిరేకాలే. 'సుఖంగా ఉండాలి' అనే మనిషి ఆకాంక్ష ఈ 'సృష్టి' ప్రణాళికలో చేర్చబడలేదు అని ఎవరికైనా అనిపిస్తుంది. "సుఖం" అనేది దాని ఖచ్చితమయిన అర్థంలో అతిగా నిరోధించబడ్డ అవసరాల ఆకస్మిక సంతుష్టి నుంచి వస్తుంది. దాని స్వభావాన్ని బట్టి, అది ఒక విడిఘటనా దృగ్విషయంగా మాత్రమే సాధ్యమౌతుంది. సుఖసూత్రం కోరిన ఏ పరిస్థితి అయినా దీర్ఘకాలం కొనసాగితే, దాని నుంచి వచ్చే తృప్తి అంత ఎక్కువగా ఉండదు. విశేష, విభిన్న విషయాలనుంచి మాత్రమే ఎక్కువ తృప్తిని పొందేట్టు, మామూలు యథాతథ స్థితి నుంచి తక్కువ తృప్తిని పొందేట్టు మనం నిర్మితులమయ్యాము.[1] ఈ విధంగా మన నిర్మాణం సుఖావకాశాలను పరిమితం చేసింది. అసుఖాన్ని అనుభవించాల్సి రావడం ఎక్కువగా సంభవిస్తుంది. మనకు దు:ఖం మూడు వైపుల నుంచి ముంచుకొస్తుంది; ఒకటి, కృశించి, నశించిపోయే అనివార్యత కలిగి, బాధలు, వ్యాకులతలనే హెచ్చరిక సంకేతాలు లేకుండ మనలేని మన స్వంత శరీరం నుండి. రెండు, మనకు వ్యతిరేకంగా తీవ్ర ప్రచండతతో ముంచెత్తే, దయా విహీన, వినాశకర శక్తులతో మన మీదికి విరుచుకుపడే బాహ్య ప్రపంచం నుండి. మూడు, మనకు ఇతరులతో ఉన్న సంబంధాల నుండి. ఈ మూడోదాని నుంచి వచ్చే అసుఖం అన్నింటిని మించింది. ఈ బాధ, విధికృతమయిన అనివార్యత విషయంలో ఇతరత్రా కలిగే బాధలకు ఏమాత్రం తీసిపోకపోయినా, దీనిని మనం ఒక విధంగా ఊరకే వచ్చిన అదనపు బాధగా ఎంచుతాము.

ఈ బాధాకర సంభావ్యతల ఒత్తిడి వల్ల, మనుషులు సుఖ వాంఛను పరిమితం చేసుకోవడానికి అలవాటు పడినట్లైతే – బాహ్య ప్రపంచపు ఒత్తిడికి లోనై సుఖ సూత్రం మితమైన వాస్తవికతా సూత్రంగా మారినట్లుగానే – కేవలం అసుఖం బారినుంచి తప్పించుకొన్నందుకే లేదా తాను అనుభవించే బాధ నుండి బయటపడినందుకే తాను

---

[1] గోధె (Goethe) వాస్తవానికి ఇలా హెచ్చరిస్తాడు : వరుసగా అన్ని రోజులు మంచిగా గడచిపోతుంటే అంతకంటె దుర్భరమైంది ఏదీ ఉండదు. అయితే, ఇది ఒక అతిశయోక్తిగా చెప్పి ఉండవచ్చు.

సుఖంగా ఉన్నానని మనిషి భావించినట్లయితే, అంతేకాక, ఇంకా మొత్తంమీద బాధను అధిగమించడమనే లక్ష్యం సుఖలబ్ధిని నేపథ్యంలోకి పంపినట్లయితే, అందులో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఇంకొంత ఆలోచించిన మీదట, ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించడానికి వేర్వేరు మార్గాలున్నాయని తెలుస్తుంది. విభిన్న లోక జ్ఞాన సంప్రదాయాలు ఈ మార్గాలన్నింటిని చెప్పాయి. మానవాళి వాటిని ఆచరించింది. ప్రతి అవసరాన్ని అపరిమితంగా తీర్చుకోవడమనేది అత్యంత ఆకర్షణీయమైన జీవన విధానంగా గోచరిస్తుంది. కాని దాని అర్థం, ఆనందానికి జాగరూకత కంటె ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇవ్వడం. అయితే దానితోపాటు శిక్ష వెన్నంటి వుంటుంది. అసుఖాన్ని పరిహరించడమే ముఖ్య ఉద్దేశంగా ఉన్న ఇతర పద్ధతులు అవి ఏ సుఖ మూలాలపై తమ దృష్టిని కేంద్రీకరించాయి అనేదానిని బట్టి వేరువేరుగా చూపబడ్డాయి. వీటిల్లో కొన్ని పద్ధతులు అతికిపోతే, కొన్ని మధ్యస్థంగా ఉన్నాయి. కొన్ని ఏకపక్షాలు కాగా, మరికొన్ని సమస్యను ఏక కాలంలో అనేకచోట్ల ఎదుర్కొంటాయి. మానవ సంబంధాల నుంచి వ్యక్తికి కలిగే బాధను ఎదుర్కోవడానికి అతడు వెంటనే అనుసరించే రక్షణ ఏకాంతాన్ని ఆశ్రయించడం. ఇతరులకు దూరంగా ఉండడం. ఈ పద్ధతివల్ల వచ్చే సుఖం, మనకు తెలిసినంతవరకు, ప్రశాంతత వల్ల కలిగే సుఖం మాత్రమే. భయావహ బాహ్య ప్రపంచం నుంచి ఎదురయ్యే సమస్య నుంచి వ్యక్తి తనను తాను కాపాడుకోవాలనుకొంటే, అతడు దానికి విముఖుడు కావడమే మార్గం. కాని నిజానికి దానికంటె మంచి మార్గం మరొకటి ఉంది : అది మానవ సమాజంలో సభ్యుడు కావడం. ఇంక, విజ్ఞాన శాస్త్రం అందించిన సాంకేతిక నైపుణ్యం సాయంతో ప్రకృతిపై పట్టు సాధించి దానిని మానవ సంకల్పానికి అనుగుణంగా మలుచుకోవడం. ఇది బహుజన హితం కోసం అందరితో కలసి పనిచేయడం అవుతుంది. కాని బాధను పరిహరించే అత్యంత ఆసక్తికర విధానాలు ఇందు నిమిత్తం మన శరీరాన్ని ప్రభావితం చేసేవిగా ఉంటాయి. చివరకు తేలేది ఏమంటే బాధ అనేది సంవేదన తప్ప అన్యంకాదు. దానిని మనం అనుభూతి చెందినంతసేపే అది ఉంటుంది. మన శరీరం నియంత్రిత మైన కొన్ని రీతులవల్ల మాత్రమే ఈ అనుభూతి మనకు కలుగుతుంది.

రసాయనిక పద్ధతి – మత్తుని ఆశ్రయించడం – అపరిణతమైనదే అయినా, అదే అన్ని విధానాలలోకి ప్రభావకరమైంది. ఎవరైనా దాని యంత్రాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకొన్నారని నేననుకోను. అయితే కొన్ని కొత్త పదార్థాలు రక్తంలో కాని, కణజాలంలో కాని కలిసిపోయినప్పుడు తిన్నగా అవి సుఖ సంవేదనలను కలిగిస్తాయనేది మాత్రం

వాస్తవం. అవి మన ఇంద్రియ సంవేదనీయ తను నియంత్రించే పరిస్థితులను కూడా ఎంతగా మారుస్తాయంటే అప్పుడు అసుఖదాయకమైన ప్రచోదనలను గ్రహించే శక్తిని మనం కోల్పోతాము. ఈ రెండు ప్రభావాలు ఏకకాలంలో సంభవించడమే కాదు, అవి రెండు ఎంతో సన్నిహితంగా కలిసే ఉంటాయి. అటువంటి ప్రభావాలున్న పదార్థాలు మన శరీర రసాయనంలో ఉండి ఉండాలి. ఎందుకంటే, అత్యుత్తేజిత చిత్తభ్రమ (mania) అనబడే ఒక మానసిక స్థితి ఉంది. మత్తు పదార్థం ఉపయోగించకుండానే, మత్తు స్థితికి సదృశమైన స్థితి దీనిలో కలుగుతుంది. అంతేకాక సుఖ సంవేదన సాపేక్షంగా తేలికగా సాధ్యం కావడం, కష్టసాధ్యం కావడం మధ్య మన సాధారణ మానసిక జీవితం డోలనాలను చేస్తుంది. దీనికి సమాంతరంగా, పెరిగిన లేదా తగ్గిన అసుఖ గ్రాహకత ఉంటుంది. మానసిక ప్రక్రియల ఈ విష పార్శ్వాన్ని ఇప్పటిదాకా శాస్త్రీయ పరిశోధనలకు గురి చేయకపోవడం విచారకరం. సుఖం కోసం పోరాడడంలో, దు:ఖాన్ని దూరంగా ఉంచడంలో, మాదక మాధ్యమాలు అందించిన సేవకు అమితమైన విలువనిచ్చి, వ్యక్తులు, ప్రజలు, ఒకేరకంగా, వారి లెబీడో నిర్వహణలో వాటికి స్థిరస్థానాన్ని కల్పించారు. తక్షణ సుఖ ఫలమే కాక, బాహ్య ప్రపంచం నుండి అత్యంతంగా వాంఛింపపడ్డ స్వాతంత్ర్యం కూడా ఈ మాధ్యమాల వల్లనే మనకు సాధ్యపడింది. ఎందుకంటే ఈ **"చింతల నిమజ్జని"** (drowner of cares) సహాయంతో ఏ సమయంలో నైనా, వాస్తవిక ప్రపంచ ఒత్తిళ్ళ నుంచి తప్పించుకొని మెరుగైన సంవేదనాభరిత స్థితితో కూడిన తనదైన ప్రపంచంలో ఆశ్రయం పొందవచ్చని మనిషికి తెలుసు. ఖచ్చితంగా మత్తు పదార్థాల ఈ లక్షణమే వాటివలన కలిగే ప్రమాదాన్ని, వాటి హానికర స్వభావాన్ని కూడా నిర్ణయిస్తుందనేది బాగా తెలిసిన విషయమే. మానవ కళ్యాణానికి వినియోగించదగ్గ ఎంతో శక్తి, కొన్ని పరిస్థితులలో, అనవసరంగా వృధా కావడానికి ఈ మాధ్యమాలు కారణమవుతున్నాయి.

ఏమైనప్పటికీ, మన మానసిక యంత్రాంగ సంక్లిష్ట నిర్మితి అనేక ఇతర ప్రభావాలకు అవకాశ మిస్తుంది. ఒక సహజాతం సంతృప్తమైనప్పుడు, అది మనకు సుఖాన్ని అభిమంత్రించినట్లే. బాహ్య ప్రపంచం మనల్ని ఆకలి బాధకు గురిచేసినప్పుడు, అది మన అవసరాలను సంతృప్తి పరచనప్పుడు, తీవ్రమైన బాధ కలుగుతుంది. అందుకని తన బాధల నుండి కొంతమేరకైనా, సహజాత ప్రచోదనలను ప్రభావితం చేయడం ద్వారా విముక్తి పొందాలని వ్యక్తి ఆశించే అవకాశం వుంది. బాధలకు వ్యతిరేకంగా నియోగించే ఈ తరహా రక్షణ, జ్ఞానేంద్రియ యంత్రాంగంపై ప్రయోగించడానికి ఉద్దేశించబడలేదు.

అది మన అవసరాల అంతర్గత మూలాలపై ఆధిపత్యం సాధించయత్నిస్తుంది. ప్రాచ్య దేశాల లౌకిక ప్రజ్ఞ, యోగాచరణలో నిర్దేశించినట్లుగా, సహజాతాలను నిర్మూలించడంలో దీని మితిమీరిన రూపం ఉంది. అది విజయవంతమైతే వ్యక్తి దానితోపాటు ఇతర కార్యాలన్నింటిని త్యజించడం ఖాయం. అతడు తన జీవితాన్ని త్యాగం చేసినట్లే. మరో మార్గంలో అతను ప్రశాంతత నుండి వచ్చే సుఖాన్ని మరల పొందడం మాత్రమే జరిగింది. మన లక్ష్యాలు మితమైనవి అయినప్పుడు, కేవలం సహజాత జీవితాన్ని నియంత్రించాలని మనం ప్రయత్నిస్తున్నప్పుడు మనం ఇదే మార్గాన్ని అనుసరిస్తాము. అట్టి సందర్భంలో నియంత్రణ చేసేవి వాస్తవికతా సూత్రానికి లోబడి ఉన్న ఉన్నత మానసిక శక్తులు. ఇక్కడ ఏ విధంగాను సంతృప్తి లక్ష్యాన్ని విడనాడడం జరగలేదు. కాని కొంతవరకు బాధా విముక్తి లభించింది. ఎందుకంటే, విశృంఖల సహజాతాలతో పోలిస్తే, ఆశ్రిత సహజాతాలలో అసంతృప్తి అంత బాధాకరం అనిపించదు. దీనికి ప్రతిగా, సుఖాన్ని అనుభవించడానికి కావలసిన నిబిడీకృత శక్తులలో నిరాకరించ సాధ్యంకాని క్షీణత ఉంది. అహంచే అదుపు చేయబడని విశృంఖల సహజాత ప్రచోదనను సంతృప్తం చేయడంవల్ల లభించే తృప్తి, అదుపులో ఉన్న సహజాతాన్ని తృప్తి పరచడంవల్ల లభించే సుఖంకంటె ఎంతో అధికంగా ఉంటుంది. విచల (perverse) సహజాతాలు ప్రేరేపించే ప్రబల ఆకర్షణకు, సాధారణంగా నిషిద్ధ వస్తువుల పట్లవుండే ఆకర్షణకు ఇక్కడ విషయ నిర్వహణ పరమైన వివరణ లభిస్తుంది.

మరో బాధా నివారణోపాయం లిబీడో స్థానంలో వేరే మానసిక అంశాన్ని నియోగించడం. ఇందుకు మన మానసిక యంత్రాంగం అనుమతిస్తుంది. దీనివల్ల ఈ యంత్రాంగపు కార్యాచరణ గణనీయమైన రీతిలో సరళత సంతరించుకుంటుంది. ఇక్కడ ఎదురయ్యే సమస్య ఏమిటంటే, సహజాతాల ఉదాత్తీకరణ (sublimation) సహాయకారిగా పనిచేస్తుంది. మానసిక, బౌద్ధిక కార్యకలాపాల నుంచి సుఖాన్ని కావలసినంతగా వ్యక్తి పెంచుకోగలిగితే, అతడు దానినుంచి అత్యంతంగా లాభిస్తాడు. విషయాలు ఇలా ఉన్నప్పుడు విధి అతనిని ఏమీ చేయలేదు. ఒక కళాకారుడు తను సృష్టి చేసేటప్పుడు పొందే తృప్తి, అతడు తన స్వైరకల్పనకు రూపం ఇచ్చేటప్పుడు పొందే తృప్తి, ఒక శాస్త్రజ్ఞుడు సమస్యల పరిష్కారంలో, నూతన సత్యాల ఆవిష్కారంలో పొందే తృప్తిలాంటి తృప్తికి ఒక ప్రత్యేక గుణం ఉంది. ఏనాటికైనా ఒక నాటికి మనం ఈ లక్షణాన్ని అధిమానసిక శాస్త్ర (meta psychology) పరంగా నిర్వచించగలుగుతాం. ఇప్పటికి మనం ఆ తృప్తి

విలక్షణమైనదిగా, ఉన్నతమైనదిగా కనిపిస్తుందని ఆలంకారికంగా మాత్రమే చెప్పగలం. కాని ఈ రకం తృప్తి తీవ్రత, అపరిణత, ప్రాథమిక సహజాత ప్రచోదనలను సంతృప్తి పరచినప్పుడు వచ్చే తృప్తితో పోలిస్తే మితంగా ఉంటుంది. అది మన భౌతిక సత్వాన్ని (being) సంక్షుభితం చేయదు. ఈ పద్ధతిలో బలహీనాంశం ఏమిటంటే, ఇది అందరికీ వర్తించదు, కొందరికి మాత్రమే అందుబాటులో వుంటుంది. ప్రత్యేక ప్రవృత్తులు, ప్రజ్ఞలు ఉండేవారికే అది వర్తిస్తుంది. ఆచరణలో చూస్తే ఈ ప్రవృత్తులు, ప్రజ్ఞలు కొద్దిమంది మాత్రమే కలిగి ఉంటారు. ఇవి ఉన్న ఆ కొద్దిమందికైనా ఈ పద్ధతి బాధల నుంచి పూర్తి రక్షణ కల్పించలేదు. అది అదృష్ట శరాఘాతాలకు వ్యతిరేకంగా దుర్భేద్య రక్షణ కవచాన్ని కల్పించలేదు. బాధామూలం వ్యక్తి శరీరం అయిన సందర్భాలలో, అది తరచు విఫలమవుతుంది.[1]

ఆంతరంగిక, మానసిక ప్రక్రియల నుండి సంతృప్తిని పొందడం ద్వారా బాహ్య ప్రపంచం నుండి స్వతంత్రంగా ఉండాలనే మనిషి ఉద్దేశాన్ని ఈ విధానం ఈ మేరకు స్పష్టం చేస్తుండగా, ఇప్పుడు ప్రస్తావించబోయే విధానం ఆ లక్షణాలనే మరింత శక్తి మంతంగా ప్రదర్శిస్తుంది. ఇందులో వాస్తవికత తోటి సంబంధం మరింత సడలించ బడుతుంది. భ్రాంతుల నుండి తృప్తి పొందడం జరుగుతుంది. ఈ భ్రాంతులను వాటిని

---

1. అతడి జీవితాభిరుచులు ఏ దిశ ననుసరించాలో చెప్పే ప్రత్యేక ప్రవృత్తి ఒక వ్యక్తిలో లేనప్పుడు, అందరికీ అందుబాటులో ఉండే సాధారణ వృత్తిపని, వోల్టేరు ఇచ్చిన వివేచనాయుత సలహా నిర్దేశించిన పాత్రను నిర్వహించగలదు, లిబీడో నిర్వహణలో పనికి గల ప్రాముఖ్యాన్ని తగినంతగా, ఈ సంక్షిప్త పరిశీలనలో చర్చించడం సాధ్యంకాదు. పనికి ప్రాధాన్యతనివ్వడం వ్యక్తిని వాస్తవికతకు కట్టిపడవేసినంతగా, ఏ ఇతర జీవిత నిర్వహణాంశం కట్టిపడవేయలేదు. ఎందుకంటే, వ్యక్తి చేసే పని కనీసంగా వాస్తవ ప్రపంచంలో, మానవ సమాజంలో అతనికి స్థిరమైన స్థానం కల్పిస్తుంది. లిబీడోలోని అత్యధిక నిర్మాణాంశాలను - అవి స్వానురాగం, దౌర్జన్యం లేదా కాముకతలలో దేనికి సంబంధించినవైనప్పటికీ - వృత్తిపని మీదకు, ఇంకా తత్సంబంధ మానవ సంబంధాల మీదకు స్థానాంతరీకరించేందుకు సమర్థించేందుకు అత్యావశ్యకమైనదిగా పనికి వున్న విలువ కంటే తక్కువదేమీకాదు. వృత్తిపనిని స్వేచ్ఛగా ఎంచుకోగలిగినట్లయితే, అది ప్రత్యేక సంతృప్తికి మూలమవుతుంది. అంటే ఉదాత్తీకరణ ద్వారా ఉన్న ప్రవృత్తులను, కొనసాగుతున్న లేదా శారీరక నిర్మాణం ద్వారా పునర్బలోపేతమైన సహజాత ప్రచోదనలను ఉపయోగించుకునే అవకాశాన్ని అది కల్పిస్తుంది. అయినా, పని సుఖానికి మార్గం అనే విషయం అంతగా జనం మెప్పు పొందలేదు. సంతృప్తికి వున్న ఇతర అవకాశాల కోసం ప్రయత్నించినంతగా పనికోసం ఎవరూ ప్రయత్నించరు. తప్పనిసరి అయిన పరిస్థితులలోనే మనుష్యులలో అత్యధికులు పనిచేస్తారు. పని అంటే వున్న ఈ మానవ సహజ విముఖత క్లిష్ట సామాజిక సమస్యలను లేవనెత్తుతుంది.

అవిగానే గుర్తించడం జరుగుతుంది. అయితే వాటికి, వాస్తవికతకు మధ్య ఉన్న అంతరం సుఖప్రాప్తినిఆటంకపరచటానికి వీలులేకుండా చేయబడుతుంది. ఈ భ్రాంతులు జనించే ప్రాంతం ఊహా జీవితం. వాస్తవికత పట్ల స్పృహ వృద్ధిచెందే సమయంలో, ఈ ప్రాంతాన్ని వాస్తవికతా పరీక్షలకు గురిచేసే అవసరాల నుండి ఉద్దేశపూర్వకంగా వదిలివేయడం జరుగుతుంది. కష్టసాధ్యమైన కోర్కెలను తీర్చుకోవడానికి ఈ ప్రాంతాన్ని వేరుగా ఉంచడం జరిగింది. స్వైరకల్పన ద్వారా పొందే తృప్తులలో అగ్రభాగాన నిలిచేది కళాసృష్టి నుండి లభించే ఆనందానుభూతి. ఈ అనుభూతి కళా సృజనాత్మకత లేని వారికి గూడా కళాకారుని కృతుల ద్వారా లభ్యమవుతుంది. అయితే కళా ప్రభావానికి లోనయ్యే వారుగూడా, దీనికి సుఖమూలంగాను, జీవితంలో ఉపశమనంగాను అంతగా విలువనివ్వడం లేదు. కళ మనలో కల్పించేది మితమైన మత్తుమాత్రమే. ఇది ప్రధాన జీవనావసరాల ఒత్తిడినుంచి తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది. అంతకంటే ఇంకేమీ ఇవ్వలేదు. నిజమైన బాధను మరిపించేంత శక్తి దీనికి లేదు.

మరో విధానం ఉంది. అది శక్తివంతంగా, సాకల్యంగా పనిచేస్తుంది. ఇది వాస్తవికతను ప్రధాన శత్రువుగా పరిగణిస్తుంది. బాధకంతటికీ వాస్తవికతే మూలమని భావిస్తుంది. కాబట్టి, దానితో కలిసి జీవించడం అసాధ్యంగా ఇది పరిగణిస్తుంది. ఎలాగైనా సుఖంగా ఉండాలని కోరుకునే వ్యక్తి దానితో అన్ని సంబంధాలు తెంచుకోవాలంటుంది. ఏకాంతవాసి (hermit) ప్రపంచాన్ని పట్టించుకోడు. దానితో ఏ సంబంధాలు పెట్టుకోడు. కానీ, ఇంతకంటే ఎక్కువ చేయవచ్చు. వాస్తవ ప్రపంచంలో తాను భరించలేని లక్షణాలను తొలగించి, వాటి స్థానంలో తన కోర్కెల కనుగుణంగా ఉండే లక్షణాలతో మరో ప్రపంచాన్ని సృష్టించుకునే ప్రయత్నం చేయవచ్చు. కాని, నిరాశా నిస్పృహలతో తెగించిన మానసిక స్థితిలో, ఆనందానికి ఎవరైనా ఈ మార్గాన్ని అనుసరిస్తే లభించేది శూన్యమే. వాస్తవికత అట్టి వ్యక్తి శక్తికి మించినది. తన తీవ్రమైన చిత్తభ్రాంతి నుండి బయటపడడానికి సహాయపడేవారు ఎక్కువ సందర్భంలో విభ్రమకు లోనవుతారనే గట్టి అభిప్రాయం వుంది. ప్రపంచానికి సంబంధించి మనం భరించలేని అంశాన్ని, దాని స్థానే ఒక వాంఛను నిర్మించడం ద్వారా సవరించి, ఆ భ్రమను వాస్తవంలోనికి చొప్పించడం జరుగుతుందనే బలమైన వాదన కూడా వుంది. వాస్తవికతను భ్రమా జనితంగా పునర్నిర్మించడం ద్వారా సుఖాన్ని ఖరారు చేసుకోవడానికి, బాధ నుండి రక్షణ పొందడానికి అనేకమంది ప్రజలు కలిసిచేసే ఇట్టిప్రయత్నానికి ఒక ప్రత్యేక ప్రాముఖ్యత ఆపాదితమైంది. మానవజాతి

అనుసరించే మతాలన్నింటిని ఈ తరహా సామూహిక భ్రమల క్రింద జమకట్టాలి. అట్టి భ్రమలో భాగమైనవారు, తాము భ్రమలో పడినట్లు గుర్తించలేరనేది సుస్పష్టం.

సుఖాన్ని పొందడానికి, దు:ఖాన్ని దూరంగా ఉంచడానికి మానవులు ఆచరించే పద్ధతులు అన్నింటిని నేను పూర్తిగా ఏకరువు పెట్టానని భావించడం లేదు. ఇదే విషయాన్ని భిన్నమైన క్రమంలో చెప్పవచ్చని కూడా నాకు తెలుసు. ఒక పద్ధతిని నేను ఇంకా చెప్పలేదు. దానికి కారణం మర్చిపోవడం కాదు. తరువాత వేరే సందర్భంలో దీనిని చెప్పాల్సిన అవసరం ఉంది కాబట్టి, జీవ కళలోని ఈ ఉపాయాన్ని (technique) ఎవరైనా మరిచిపోవడం ఎలా సంభవం ? అత్యంత విశిష్ట లక్షణాల ఎన్నదగిన సమ్మేళనం ఈ పద్ధతిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అది కూడా మనిషిని విధి (దానిని అలా పిలవడమే బాగుంటుంది) నుంచి స్వతంత్రునిగా చేయాలనే లక్ష్యం కలిగి వుంది. ఆ లక్ష్యంతోనే, సంతృప్తిని అంతర్గత మానసిక ప్రక్రియలలోనే చూస్తుంది. అలా చూడడంలో, ఇంతకు ముందు మనం మాట్లాడుకున్న లిబీడో స్థానాంతరీకరణకున్న అవకాశాన్ని ఉపయోగించుకుంటుంది. కాని అది బాహ్య ప్రపంచం నుండి మరలిపోదు. తద్విరుద్ధంగా, బాహ్య ప్రపంచానికి చెందిన వస్తువులను పట్టుకు వేళ్ళాడుతుంది. వాటితో వుండే ఉద్వేగభరిత సంబంధాల ద్వారా సుఖాన్ని పొందుతుంది. బాధా పరిహరణ లక్ష్యం - దీనిని మానసిక అలసట నుండి జనించిన నిర్లిప్తతగా మనం చెప్పవచ్చు-తో అది తృప్తి చెందదు. దానిని లెక్కచేయకుండా దాటి ముందుకు పోతుంది. సుఖాన్ని సకారాత్మకంగా నెరవేర్చుకోవడానికి జరిగే మౌలిక, ఉద్వేగభరిత ప్రయత్నానికి ఇది అంటిపెట్టుకుని వుంటుంది. బహుశ, మరి ఏ ఇతర పద్ధతి కంటే గూడ, ఈ పద్దతి వాస్తవంలో ఈ లక్ష్యానికి చేరువగా వస్తుంది. ప్రతిదానికి ప్రేమను కేంద్రంగా చేసే జీవిత విధానం గురించి, ప్రేమించడంలోను, ప్రేమించబడడం లోను యావత్ సంతృప్తి వుందనుకునే జీవిత విధానం గురించి నేను మాట్లాడు తున్నాను. ఈ తరహా మానసిక దృక్పథం మనందరికి సహజంగానే వస్తుంది. ప్రేమ అభివ్యక్తమయ్యే ఒక రూపం లైంగిక ప్రేమ. అవధులు లేని సుఖ సంవేదన యొక్క అత్యంత గాఢ అనుభవాన్ని ఇది మనకు ఇచ్చింది. ఈ విధంగా మన సుఖాన్వేషణలో లైంగిక ప్రేమ మనకొక మార్గాన్ని అందించింది. మనకు ప్రథమంగా సుఖాన్నిచ్చిన మార్గంలో దానిని వెతుక్కోవడం కంటే మరో సహజ మార్గం ఎక్కడ ఉంటుంది ? ఈ మార్గంలో జీవించడంలోని బలహీనతను చూడడం సులభం. అలా కాకపోతే ఏ మనిషి కూడా ఈ మార్గాన్ని వదిలి, మరో మార్గాన్ని చేపట్టడు. మనం ప్రేమిస్తున్నప్పుడు, బాధకు

సంబంధించి ఉండేంత అత్యంత రక్షణ రాహిత్య స్థితిలో మరెప్పుడూ ఉండం. మన ప్రియతమ వస్తువును, లేదా దాని ప్రేమను పోగొట్టుకున్నప్పుడు ఉన్నంత నిస్సహాయంగా, అసుఖంగా మరెప్పుడూ ఉండం. అయితే, సుఖసాధనంగా ప్రేమకున్న విలువ ఆధారంగా సాగించే జీవన విధానాన్ని ఇది తోసిపుచ్చలేదు. దీనిని గురించి చెప్పవలసింది ఇంకా ఎంతో వుంది.

జీవితానందాన్ని సౌందర్యానుభూతిలో ప్రధానంగా అన్వేషించడమనే ఆసక్తికరమైన విషయాన్ని ఇప్పుడు చర్చిద్దాం. ఆ సౌందర్యం ఏదైనా కావచ్చు. మన జ్ఞానేంద్రియాలకు, బుద్ధితోనే సౌందర్యం - మానవ ఆకృతుల, కవళికల, సహజ వస్తువుల, స్థల దృశ్యాల, కళా - శాస్త్ర సృష్టి సౌందర్యం - ఏదైనా కావచ్చు. ఈ సౌందర్య దృక్పథం జీవిత లక్ష్యానికి బాధనుంచి కల్పించగల రక్షణ స్వల్పం. కాని అది చాలా మేరకు పరిహారం చేయగలదు. సౌందర్యానుభవం ఒక విశేషమైన, మితంగా మత్తు కలుగజేసే గుణం కల అనుభూతిగా ఉంటుంది. సౌందర్యం వల్ల స్పష్టమైన ఉపయోగం ఏదీ లేదు. దానికి ఒక విస్పష్ట సాంస్కృతిక ఆవశ్యకత గూడా ఏదీ లేదు. అయినా అది లేకపోతే నాగరికతే లేదు. ఏ ఏ పరిస్థితులలో వస్తువులు అందంగా వున్నట్లు పరిగణించబడతాయి అనే విషయాన్ని సౌందర్య శాస్త్రం అన్వేషిస్తుంది. కాని అది సౌందర్య స్వభావం, పుట్టుకల గురించి ఏ రకమైన వివరణ ఇవ్వలేదు. మామూలుగా ఎప్పటిలాగే, మారుమోగే శూన్యపదాల వెల్లువ మాటున వైఫల్యం దాగివుంది. సౌందర్యాన్ని గురించి మనోవిశ్లేషణ ఏమైనా చెప్పించాలంటే, దురదృష్టవశాత్తు అదీ లేదు. లైంగికానుభూతి నుండి ఇది జనిస్తుందన్నదొక్కటే రూఢిగా తెలిసిన విషయం. దాని లక్ష్య సాధనలో నిరోధించబడ్డ ప్రచోదనకు సౌందర్యారాధన ఒక తిరుగులేని దృష్టాంతంగా కనిపిస్తుంది. సౌందర్యం, ఆకర్షణలు మౌలికంగా లైంగిక వస్తువు ధర్మాలు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. జననాంగాలను చూడడం ఎప్పుడూ ఉత్తేజకరంగా ఉంటుంది. కాని వాటిని ఎవడూ ఎప్పుడూ అందమైన వని చెప్పలేదు. తద్భిన్నంగా సౌందర్యం గుణం గౌణ (secondary) లైంగిక లక్షణాలకు చెందినట్లుగా కనిపిస్తుంది.

(నా వివరణ) అసంపూర్తిగా ఉన్నప్పటికీ, మన అన్వేషణకు ముగింపుగా కొన్ని విషయాలు చెప్పడానికి ప్రయత్నిస్తాను. సుఖ సూత్రం మనమీద మోపే సుఖ సాధనను ఒక ప్రణాళికగా నెరవేర్చడం సాధ్యంకాని పని. అయినా, ఏదో విధంగా ఆ ప్రణాళికను నెరవేర్చే ప్రయత్నాలను మనం వదలివేయలేం. ఈ దిశగా వేరు వేరు మార్గాలను

చేపట్టవచ్చు. ఈ లక్ష్యపు సకారాత్మక పార్శ్వానికి చెందిన సుఖార్జనకుగాని, దాని నకారాత్మక పార్శ్వానికి చెందిన అసుఖ పరిహరణకు గాని మనం ప్రాధాన్యం ఇవ్వచ్చు. ఈ రెండు మార్గాలలో దేని ద్వారా గూడా మనం కోరినదంతా పొందలేం. అల్ప పరిమాణంలో అయితే సుఖం సాధ్యమని మనం గుర్తించినట్లయితే, అప్పుడు సుఖం అనేది వ్యక్తి లిబీడో నిర్వహణ సమస్య అవుతుంది. అందరికీ అన్వయించే ఉమ్మడి నియమం ఏదీలేదు. తనని తాను రక్షించుకోవలసిన పద్ధతిని ఎవరికి వారు అన్వేషించుకోవాలి. అతని ఎంపికను నిర్దేశించే దిశలో అనేక అంశాలు పనిచేస్తుంటాయి. మనిషి బాహ్య ప్రపంచం నుంచి ఎంత వాస్తవ తృప్తిని పొందుతున్నాడు ? దాని నుంచి ఏ మేరకు స్వతంత్రుడుగా వున్నాడు ? - అంతిమంగా, తన వాంఛాను గుణంగా దానిని మార్చగల ఎంత బలం ఉందని భావిస్తున్నాడు ? - అనేది అసలు ప్రశ్న. ఈ విషయంలో, బాహ్య పరిస్థితులతో నిమిత్తం లేకుండానే, అతని మనో నిర్మితి ఒక నిర్ణయాత్మక పాత్రను పోషిస్తుంది. లైంగికేచ్ఛను ప్రధానంగా పరిగణించే వ్యక్తి, ఇతరులతో ఒక ఔద్వేగిక సంబంధాలకు ప్రాముఖ్యతనిస్తాడు. స్వయం సమృద్ధుడుగా ఉండాలనుకొనే స్వానురాగి తన నిజమైన సంతృప్తిని తన అంతర్గత మానసిక ప్రక్రియలలో చూస్తాడు. బాహ్య ప్రపంచంపై తన బలాన్ని ప్రదర్శించ ప్రయత్నించే క్రియాశీలమైన వ్యక్తి, ఆ ప్రపంచాన్ని ఎప్పుడూ వదిలిపెట్టడు. రెండో వర్గానికి చెందిన వ్యక్తి విషయానికి వస్తే, అతనికి అందుబాటులోకి వచ్చే స్వీయ ప్రజ్ఞా పాటవాల స్వభావం, అతను సాధిచగలిగిన సహజాతాల ఉదాత్తీకరణ, అతను వేటిపై అభిరుచిని ప్రదర్శిస్తాడనే సంగతిని నిర్ణయిస్తాయి. వ్యక్తి ఎన్నుకున్న జీవన విధానం అసంపూర్ణమైనదని రుజువైనప్పుడు కొన్ని అపాయాలు ఎదురవుతాయి. ఇవి వ్యక్తి అభిరుచి అవధులు మీరినప్పుడు, దానిని శిక్షిస్తాయి. ఒక జాగరూకుడైన వ్యాపారవేత్త తన పెట్టుబడి మొత్తాన్ని ఎలా ఒకే వ్యాపారంలో పెట్టడో, అలాగే, బహుశ, మన లోకజ్ఞానం ఒకే ఒక ఆకాంక్ష నుండి సంపూర్ణ తృప్తిని ఆశించరాదని సలహా ఇస్తుంది. దాని విజయం అనిశ్చితం. ఎందుకంటే అది అనేక అంశాల కలయిక మీద ఆధారపడి ఉంటుంది. అది బహుశ దేనిమీద కంటె కూడ మనోనిర్మితి, తన ప్రకార్యాన్ని పరిసరాలకు అనుగుణంగా మార్చుకొని, ఆ తరువాత సుఖాన్ని పొందడం కోసం పరిసరాలను వినియోగించు కోవడంలో చూపగల సామర్థ్యం మీద ఆధారపడి వుంటుంది. ఏ వ్యక్తి అయితే ప్రత్యేకంగా అననుకూల సహజాత నిర్మితితో పుట్టాడో, ఏ వ్యక్తి విషయంలో అయితే తరువాతి విజయాలకు అనివార్యంగా అవసరమైన లెబీడో పరివర్తన మరియు దాని మూలకాంశాల పునరమరిక జరగలేదో, అతనికి బాహ్య

పరిస్థితుల నుంచి కొంత కష్టమైన సమస్యలు ఎదురైనప్పుడు, సుఖం పొందడం దుస్తరమవుతుంది. కనీస ప్రత్యామ్నాయ తృప్తిని పొందేందుకు అట్టి వ్యక్తికి మిగిలిన చివరి జీవనోపాయం నాడీరుగ్మత దిశగా నెట్టబడడమే. సాధారణంగా ఈ రుగ్మతకు లోను కావడమనేది వ్యక్తి యవ్వన దశలోనే జరుగుతుంది. తన సుఖాన్వేషణ ఏ మాత్రం నెరవేరడంలేదని తరువాతి దశలో గ్రహించిన వ్యక్తి. దీర్ఘకాలిక మాదకత ఇచ్చే సుఖంలో ఓదార్పు పొందుతాడు లేదా అతను ఉన్మాదస్థితి (psychosis)లో కనిపించే నిరాశావహ తిరుగుబాటుకు ప్రయత్నిస్తాడు[1].

ఎంపిక, సర్దుబాటుల ఈ క్రీడను మతం నియంత్రిస్తుంది. ఎందుకంటే, సుఖలబ్ధి, బాధా విముక్తి విషయంలో తన మార్గాన్ని ఒకే విధంగా అందరిపై మతం విధిస్తుంది. ఆ మార్గం ఏమిటంటే, జీవితపు విలువను కుంగదీయడం మరియు భ్రాంతిజనిత పద్ధతిలో వాస్తవ ప్రపంచ చిత్రాన్ని వికృతీకరించడం. వీటి వెనుక వివేకాన్ని భయానికి గురిచేయడం ఉంది. ఈ మూల్యంతో, మనుషులను మానసికంగా శైశవ దశకు నెట్టడం ద్వారా, వారందరినీ సామూహిక భ్రాంతిలోకి లాగడం ద్వారా, ఎంతోమందిని వైయక్తిక నాడీ రుగ్మతలకు లోనుగాకుండా మతం తప్పించింది. కాని, ఇంతకు మించి ఏమీలేదు. మనం చెప్పినట్లుగా, మనుషులకు సాధ్యాలైన, అటువంటి సుఖానికి చేర్చే మార్గాలు ఇంకా ఉన్నాయి. కాని ఖచ్చితంగా సుఖానికి చేర్చగలది మాత్రం ఏదీలేదు. మతం గూడా ఈ విషయంలో తన మాట నిలబెట్టుకోలేదు. అంతిమంగా, మతావలంబి అయిన వ్యక్తికి దేవుని అస్తవ్యస్త ఆజ్ఞల (inscrutable decrees) గురించి తప్పనిసరిగా మాట్లాడ వలసివస్తే, బాధల నుంచి సుఖానికి చేర్చేందుకు, అంతిమ సాంత్వనం ఇచ్చేందుకు తనకు ఇక మిగిలింది బేషరతుగా ప్రణమిల్లడమే అని అతను అంగీకరించినట్లు అవుతుంది. అతను దానికి ముందు నుండి సంసిద్ధంగా ఉండి ఉంటే, అతనికి అనేక డొంకతిరుగుడు మార్గాలను ఆశ్రయించాల్సిన అవసరం బహుశ తప్పేది.

* * *

---

[1] *(1931లో చేర్చిన వివరణ) : పైన ఇచ్చిన వివరణలో ఉన్న చోట్లలో కనీసం ఒక్కదాని గురించి వివరించాల్సిన బాధ్యత నాపై వుంది. మానవాళి సుఖ సంతోషాలకున్న అవకాశాలను గురించిన ఏ చర్చలోను కూడా స్వానురాగానికి – వస్తుగత లిబీడోకి మధ్య ఉన్న సంబంధాన్ని లెక్కలోకి తీసుకోకుండా వదలివేయడానికి లేదు. ప్రాథమికంగా స్వీయ ఆధారితమైన అస్థిత్వం లిబీడో నిర్వహణకు ఎటువంటి ప్రాధాన్యత కలిగి ఉందనే విషయం మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది.*

III

సుఖానికి సంబంధించిన మన అన్వేషణ, ఇప్పటికే మనందరికీ తెలిసిన దానిని మించి అధికంగా ఏమీ చెప్పడం లేదు. దీని నుండి ప్రారంభమై, మనుషులకు సుఖంగా ఉండడం ఎందుకంత దుర్లభమవుతోందనే సమస్యను మనం పరిశీలించినప్పటికీ, కొత్త అంశమేదీ నేర్చుకునే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. మనకు బాధ కలిగించే మూడు మౌలిక అంశాలైన – ప్రకృతికి వున్న తిరుగులేని శక్తి. మన శరీరాల బలహీనత, కుటుంబం, రాజ్యం, సమాజంలోని మానవ సంబంధాలను నియంత్రించడంలోని పరిమితుల – గురించి ఈ ప్రశ్నకు సమాధానంగా లోగడే చెప్పాము. మొదటి రెండు మూలాల గురించి మనం ఒక నిర్ణయానికి రావడానికి ఎక్కువ సమయం అవసరంలేదు. ఈ బాధా మూలాలను అంగీకరించి, వాటి అనివార్యతకు తలొగ్గాలని ఆ నిర్ణయం మనలను ఒత్తిడి చేస్తుంది. మనం ఎప్పటికీ ప్రకృతిని పూర్తిగా జయించలేం. ప్రకృతిలో భాగమైన మన శరీరం నిరంతర పరివర్తనాశీలమైన నిర్మాణం, సర్దుబాటు చేసుకోవడంలో, విజయం సాధించడంలో దానికున్న సామర్థ్యం పరిమితం. ఈ గుర్తింపు మనలను నిశ్చేష్టులను చేయదు. పైగా అది మన కార్యాచరణకు దిశానిర్దేశం చేస్తుంది. బాధను మొత్తాన్ని తొలగించలేకపోయినా, కొంతమేరకు తొలగించుకోవచ్చు. కొంతమేరకు తగ్గించుకోవచ్చు. వేలాది సంవత్సరాల అనుభవం మనకు దీనిని రూఢి చేసింది. ఇక మూడో మూలమైన సమాజ జనిత వేదన పట్ల మనకున్న దృక్పథం వేరు. దానిని మనం సుతరాము అంగీకరించం. మనం మనకోసం చేసుకున్న నియమాలు, మనలో ప్రతి ఒక్కరికి ఎందుకు రక్షణ కల్పించవో, హితం చేకూర్చనో మనకు అర్థంకాదు. బాధా విముక్తి సాధించే విషయంలో మనం ఎందుకు విఫలమయ్యామో పరిశీలించినప్పుడు మనకు ఒక సందేహం కలుగుతుంది.. ఈ వైఫల్యం వెనుక ఒక అజేయమైన ప్రాకృతిక అంశం దాగి వుంది. మన స్వంత మనోనిర్మితే ఈ ప్రాకృతిక అంశం.

ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడం ప్రారంభించినప్పుడు ఎదురయ్యే ఒక ఆశ్చర్యకరమైన వాదన గురించి ఆలోచించకుండ ఉండలేము. అదేమంటే, మనం దేనినైతే నాగరికత అంటున్నామో అదే మన దు:ఖానికి చాలావరకు కారణం. మనం దీనిని వదిలి ఆదిమ దశకు మరలి వెళ్ళగలిగినట్లయితే చాలా సుఖంగా ఉంటాము. మరి దీనిని

విస్మయకరవాదంగా ఎందుకు పేర్కొంటున్నానంటే, మనం నాగరికతను ఏ విధంగా నిర్వచించినప్పటికీ బాధలకు కారణాలైన వాటినుండి వచ్చే ప్రమాదాలకు వ్యతిరేకంగా మన రక్షణ కోసం వేటినైతే ఆశ్రయిస్తున్నామో అవన్నీ అదే నాగరికతలో భాగం.

ఇంతమంది జనం నాగరికత అంటే అనూహ్యమైన వైరి దృక్పథాన్ని ఏర్పరచుకోవడం ఎలా సంభవించింది ? అప్పటి నాగరికత స్థితిమీద ఏర్పడిన, దీర్ఘకాలంగా నాటుకుపోయిన, గాఢ అసంతృప్తి దీనికి కారణమని నేను నమ్ముతున్నాను. కొన్ని నిర్దిష్ట చారిత్రక సంఘటనలు ఎదురైనప్పుడు, ఆ అసంతృప్తి కారణంగా నాగరికత పట్ల ఖండన క్రమేపి వృద్ధి చెందింది. ఆ చారిత్రక ఘటనలలో చివరిదీ, దానికంటె ముందరిదీ నాకు తెలుసు. అయితే ఆ సంఘటనల గొలుసుకట్టును మానవ జాతి చరిత్రలో తగుమేరకు వెనక్కు తీసుకుపోయేటంత పరిజ్ఞానం నాకులేదు. ఈ రకం నాగరికతా వైరి కారకం ఒకటి క్రైస్తవం సాధించిన విజయంలో ఇమిడి ఉండి ఉంటుంది. ఎందుకంటే, క్రైస్తవ సిద్ధాంతం ఇహ జీవితానికి అల్పమైన విలువను ఆపాదించడంతో అది సన్నిహిత సంబంధం కలిగి వుంది. ఈ సంఘటనలలో చివరిదానికంటె ముందరి సంఘటన ఏమిటంటే, అన్వేషక సముద్ర యానం సాధించిన పురోగతి వల్ల ఆదిమ ప్రజలు, జాతులతో సందర్శనం కలగడం. సరైన పరిశీలన చేయని ఫలితంగా, వారి ఆచార వ్యవహారాలను తప్పుగా అర్థంచేసుకోవడంవల్ల, ఆ ప్రాచీన జాతులు, ప్రజలు అల్ప అవసరాలతో, సరళ సుఖమయ జీవితాన్ని గడుపుతున్నట్లుగా ఐరోపా వాసులకు కనిపించారు. ఉన్నత నాగరికులైన ఐరోపా వాసులకు అటువంటి జీవితం దుర్లభం. ఆ తరువాతి అనుభవం ఇటువంటి అభిప్రాయాలలో కొన్నింటిని సరిదిద్దింది. చాలా విషయాలలో పరిశీలకులు, అటువంటి జీవితాన్ని సంక్లిష్ట సాంస్కృతిక ఆకాంక్షలు లేకపోవడానికి పొరపాటుగా ఆపాదించారు. వాస్తవానికి, వారి అలాంటి జీవితం, ప్రకృతి వనరుల సమృద్ధి వల్ల వారి ముఖ్య అవసరాలు తేలికగా తీరడంవల్ల సాధ్యమైంది. చివరి సందర్భం మనకు ప్రత్యేకంగా పరిచితమైంది. నాడీ రుగ్మతల యంత్రాంగం గురించి జనానికి తెలిసినప్పుడు ఆ సందర్భం వచ్చింది. ఈ యంత్రాంగం నాగరికులు అనుభవించే ఆ కొద్దిపాటి సుఖాన్ని కూడా అందకుండా చేసే ప్రమాదం ఉంది. తన సాంస్కృతిక ఆదర్శాలను పాటించి తీరాలని వ్యక్తిపై సమాజం పెట్టే ఒత్తిడిని తట్టుకోలేక అతను నాడీరుగ్మతకు లోనవుతాడని కనుగొనడం జరిగింది. ఆ ఒత్తిడిని తగ్గించినా, పూర్తిగా తొలగించినా, అది వ్యక్తి ఆనందాన్ని తిరిగి పొందే అవకాశాన్ని కల్పిస్తుందనే నిర్ధారణకు రావచ్చు.

ఆశాభంగం కలిగించే మరో అదనపు అంశం ఉంది. ఇటీవల కొద్ది తరాలుగా ప్రకృతి శాస్త్రాల్లో, వాటి సాంకేతిక అన్వయంలో మానవాళి అసాధారణ ప్రగతి సాధించింది. ఈ ప్రగతి, ముందెన్నడు ఊహించలేని విధంగా, ప్రకృతి మీద మానవుని ఆధిపత్యాన్ని నెలకొల్పింది. ఈ ప్రగతిలోని ప్రతి అడుగు ప్రతి ఒక్కరికి తెలుసు. అందుకని వాటిని ఇప్పుడు వరుసగా ఏకరువు పెట్టడం అనవసరం. మానవులు ఈ ప్రగతిని చూసి గర్వపడుతున్నారు. వారికి ఆ హక్కు ఉంది. స్థల కాలాలపై నూతనంగా సాధించిన ఈ ఆధిపత్యం, ప్రకృతి శక్తులను లొంగదీసుకోవడం - ఇవి వేలకు వేల సంవత్సరాలుగా ఉన్న ఆకాంక్షను నెరవేర్చినప్పటికీ, జీవితం నుండి సంతృప్తి మానవాళి ఆశించిన మోతాదులో పెరగలేదని వారు గమనించారు. అలానే అవి వారికి అధిక ఆనందాన్ని కూడా కలిగించలేదు. ఈ విషయాన్ని గుర్తించడం నుండి, ప్రకృతిపై ఆధిపత్యం ఒక్కటే మానవ సుఖానికి ముందస్తు షరతు కాదనే నిర్ణయానికి మనం రాక తప్పదు. అలానే సాంస్కృతిక యత్నానికి కూడా మానవ సుఖమొక్కటే లక్ష్యంకాదు. కాని, దీని నుండి మన సుఖ సంతోషాల సాధనలో సాంకేతిక ప్రగతికి ఏమీ విలువ లేదనే నిర్ధారణకు మనం రాకూడదు. నాకు తోచినప్పుడెల్ల ఎంతో దూరాన ఉన్న నా బిడ్డ గొంతుక వినడంలో నా సంతోషం ఇనుమడించదా ! లేదా అత్యంత కష్టమైన సుదీర్ఘ సముద్రయానం చేసి నిరపాయంగా తిరిగి వచ్చిన నా స్నేహితుని గురించి అత్యల్ప సమయంలో తెలుసుకోవడంలో నా సంతోషం అధికంకాదా అని ఎవరైనా అడగవచ్చు. దీని అర్థం - వైద్యం శిశుమరణాలను ఎంతగానో తగ్గించడం, బాలింతలకు అంటువ్యాధులు సోకకుండా చేయడం, ఒక నాగరిక మానవుని సగటు జీవిత కాలాన్ని పెంచడం - ఇవన్నీ ఏమీ కావనేనా ? ఈ రకం ప్రయోజనాలకు మరిన్ని ప్రయోజనాల జాబితాను కలపవచ్చు. వీటన్నింటికీ మనం అత్యంతంగా తెగనాడుతున్న శాస్త్ర, సాంకేతిక ప్రగతి యుగానికే ఋణపడి వున్నాం. కాని ఇక్కడ మనకు ఒక నిరాశావహ విమర్శ వినపడుతుంది. అది ఇలా హెచ్చరిస్తుంది : ఈ సంతృప్తులలో అధికభాగం, ఒక కథలో చెప్పినట్లుగా, చలికాలపు శీతల రాత్రి దుప్పటి క్రింద ఉన్నకాలును బయటకు తీసి మళ్ళీ లోపలకు దూర్చినప్పుడు కలిగే ఆనందం లాంటి “చౌకబారు ఆనంద”పు నమూనాని అనుసరిస్తాయి. ఈ అనంత దూరాలను జయించే రైలే లేకపోతే, నా బిడ్డ స్వస్థలం వదిలి అంతదూరం పోయేవాడూ కాదు, నాకు టెలిఫోన్లో అతడి గొంతు వినాల్సిన అవసరమూ వచ్చేది కాదు. నౌకాయానాన్ని ప్రవేశపెట్టకపోతే, నా స్నేహితుడు సముద్రయానం చేసేవాడు కాదు. అతని గురించి నా

వ్యాకులతను తగ్గించుకోవడానికి కేబుల్ పంపవలసిన అవసరం ఏర్పడేది కాదు. శిశు మరణాలను తగ్గించినందువల్ల ఉపయోగం ఏమి జరిగింది, సరిగ్గా ఆ తగ్గింపు సంతానోత్పత్తిపరంగా అత్యంత నిగ్రహాన్ని మనమీద రుద్దుతున్నప్పుడు ? ఏతావాతా తేలింది ఏమంటే, ఆరోగ్య సూత్రాలు రాజ్యమేలక ముందు కాలంలో సాకిన సంతానం కంటే ఇప్పుడు ఎక్కువ సంతానాన్ని సాకడంలేదు. అదే సమయంలో వివాహ వ్యవస్థలో మన లైంగిక జీవితానికి క్లిష్ట పరిస్థితులను సృష్టించుకున్నాం. ఇంకా బహుశా ప్రకృతి వరణం (natural selection) వలన ప్రయోజనకర ప్రభావాలకు వ్యతిరేకంగా మనం పనిచేశాం. అంతిమంగా, జీవితం కష్టతరమై, సుఖ సంతోషాలు లేనిదై, మృత్యువునే విముక్తి దాయిగా ఆహ్వానించేటంతగా దుర్భరమైనప్పుడు, అట్టి జీవితం సుదీర్ఘమవడంవల్ల మనకు ప్రయోజనమేమిటి ?

ఈనాటి నాగరికతలో మనం సుఖంగా లేమనేది నిర్వివాదం. కాని, తొలియుగం మానవులు సుఖంగా ఉన్నారా ? ఉంటే ఏమేరకు, వారి సుఖంలో వారి సంస్కృతి ఏ పాత్ర నిర్వహించింది అనే విషయాల మీద ఒక అభిప్రాయం ఏర్పరచుకోవడం చాలా కష్టం. జనాళి బాధను మనం ఎప్పుడూ వస్తుగతంగా చూడ ప్రయత్నిస్తాం. అంటే మన కోర్కెలు, మన సంవేదనీయతలతో సహా వారి పరిస్థితులలో మనలను ఊహించుకొని, ఆ తరువాత వారు సుఖాన్నో, దు:ఖాన్నో అనుభవించే ఏ ఏ సందర్భాలున్నాయో మనం పరిశీలిస్తాం. విషయాన్ని ఈ విధంగా పరిశీలించడం అత్యంత వస్తుగత విధానంగా కనిపిస్తుంది. ఎందుకంటే అది ఆత్మాశ్రయ సంవేదనీయతలోని భిన్నరూపాలను విస్మరిస్తుంది. ఇలా వస్తుగతంగా కనిపించే ఈ విధానం నిజానికి అత్యంత ఆత్మాశ్రయ విధానం. ఎందుకంటే, అది ఒకరి మానసిక స్థితులను ఇతరుల – ఆ ఇతరులెవరో ఎరుక లేకపోయినా – మానసిక స్థితుల స్థానంలో ఉంచుతుంది. ఏది ఏమైనా సుఖమనేది ప్రధానంగా ఆత్మాశ్రయమే. ప్రాచీనకాలంలో నౌకలకు తెడ్డువేసే బానిసలు, 30 సం॥ల యుద్ధ కాలంలో రైతులు, పవిత్ర విచారణకు గురైన బాధితులు, మూకుమ్మడి ఊచకోతకు ఎదురు చూసే యూదులలాంటి కొన్ని సన్నివేశాలకు మనం ఎంత భీతావహతతో ముడుచుకుపోయినా, వారి అనుభవాలలోకి మనం పరకాయ ప్రవేశం చేయడం అసంభవం. అలానే స్వతస్సిద్ధమైన బుద్ధి మాంద్యం, ఇంద్రియ గ్రహణ శక్తి క్రమేపీ జడత్వానికి గురికావడం, ఆశలు విచ్ఛిన్నం కావడం, అపరిణతమైన లేదా సున్నితమైన పద్ధతులలో మత్తునాశ్రయించడం లాంటి ప్రక్రియలు ఇట్టి పరిస్థితులకు గురయిన వారిలో బాధను,

సుఖాన్ని గ్రహించే సామర్థ్యంలో ఎటువంటి మార్పులు కొనివస్తాయో ఊహించడం కూడా అసంభవం. అత్యంత బాధాకర సందర్భాలలో ప్రత్యేక మానసిక రక్షణ ఉపాయాలు రంగంలోకి తేబడతాయి. ఇంకా ఈ సమస్యపై చర్చను ఇలాగే కొనసాగించినందువల్ల ప్రయోజనం శూన్యమని నాకనిపిస్తున్నది.

సుఖ సాధనంగా నాగరికతకున్న విలువ మీద సందేహాలు తలెత్తాయి. కాబట్టి, అటువంటి ఈ నాగరికత స్వభావం మీద మన దృష్టిని సారించవలసిన సమయం ఆసన్నమైనది. దానిని గురించి ఎంతో కొంత తెలుసుకునేదాకా దాని స్వభావాన్ని కొద్ది పదాలలో నిబద్ధించే సూత్రం కోసం మనం చూడకూడదు. అందుకని మనం నాగరికత గురించి మరోమారు ఈ దిగువ మాటలు చెప్పవలసి ఉంటుంది. "నాగరికత" అనే పదం మానవుడు సాధించిన విజయాలను, మన పూర్వీకులైన జంతువుల నుంచి మనలను వేరుగా చూసే నియమాలను వర్ణిస్తుంది. అంతేకాదు, ప్రకృతి నుంచి మనుషులకు రక్షణ, మనుషుల మధ్య పరస్పర సంబంధాల సర్దుబాటు అనే రెండు ప్రయోజనాలను నాగరికత నెరవేరుస్తుంది. నాగరికత గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకోవడానికి మానవ సమూహాలలో కనిపించిన నాగరికత యొక్క వివిధ ప్రత్యేక లక్షణాలను మనం ఒకచోటికి తీసుకు వస్తాం. అలా చేయడంలో, భాషా వాడుకను లేదా దానిని పిలిచే మరో పేరైన భాషా అనుభూతిని మార్గ నిర్దేశకంగా చేసుకోవడానికి మనం తటపటాయించం. ఎందుకంటే, అలాచేస్తే అమూర్త స్థాయిలో వ్యక్తీకరణకు వీలుగా లేని అంతర్గత వివేచనలకు న్యాయం చేయడం సాధ్యమౌతుందనేది మన నమ్మకం.

మొదటి దశ తేలికే. ధరణిని మానవాళికి ప్రయోజనకారిగా చేయడం, ప్రకృతి శక్తుల భీభత్సం నుండి తమని తాము కాపాడుకోవడం, తదితర మానవోపకార కార్యకలాపాలు, వనరులు అన్నింటిని సాంస్కృతికాలనే మనం గుర్తిస్తున్నాం. ఈ వైపు నుంచి నాగరికతను చూస్తే ఏ సందేహమూ రాదు. వీలైనంతగా గతంలోకి వెనక్కుపోతే, పనిముట్ల ఉపయోగం, నిప్పుపై అదుపు, నివాస నిర్మాణం - వీటిని మనం మొదటి నాగరికతా కార్యాలుగా చూడవచ్చు. వీటిల్లో నిప్పుపై నియంత్రణ అసాధారణమైందిగా కనిపిస్తుంది. అనితరసాధ్యం కూడా.[1] మిగతా అంశాలకొస్తే, అప్పటి నుంచి మానవాళి

---

1. మనోవిశ్లేషణ సమాచారం - ఇది అసంపూర్తిగా, కొంత అస్పష్టంగా ఉన్నప్పటికీ - ఆధారంగా ఆ మానవాద్భుత కార్యం మూలానికి సంబంధించి అతిశయోక్తిలా అనిపించే ఒక ఊహను చేయవచ్చు. ఆదిమ మానవుడు నిప్పును చూసినప్పుడు, దానికి సంబంధించిన తన శైశవవాంఛను సంతృప్తిపరుచు

అవి ఆవిష్కరించిన నూతన మార్గాలను అనుసరిస్తోంది. వాటికున్న ఉద్దీపనను తేలికగానే ఊహించవచ్చు.

ప్రతి పరికరంతో తన అవయవాలను – అవి చాలకాలైనా, ఇంద్రియకాలైనా – మనిషి పరిపూర్ణం గావించుకున్నాడు. లేదా వాటి ప్రకార్య పరిమితులను తొలగించుకున్నాడు. చాలక యాంత్రిక శక్తి బృహత్ శక్తులను అతని అధీనంలో ఉంచింది. తన కండరాలకు లాగే వాటిని అతను ఎలా కావాలంటే అలా ఉపయోగించగలడు. ఓడలు, విమానాలు తయారుచేయడం వల్ల నీరు, గాలి అతని చలనాలను ఆపలేకపోయాయి. కళ్ళజోళ్ళ ద్వారా తన నేత్రకటకంలోని లోపాలను సవరించుకొంటున్నాడు. దూరదర్శిని ద్వారా అనంతదూరాన్ని చూస్తున్నాడు. సూక్ష్మదర్శినితో తన నేత్రపటం (retina) విధించిన దర్శనీయ పరిమితులను అధిగమిస్తున్నాడు. ఒక గ్రామఫోన్ డిస్క్ క్షణభంగురాలైన శ్రావక (auditory) ముద్రలను ఎలా అయితే నిలవచేసుకుంటుందో, అలాగే క్షణభంగురాలైన దృశ్యపరమైన (visual) ముద్రలను నిలువచేసే పరికరాన్ని ఫోటో గ్రాఫిక్ కెమేరా రూపంలో సృష్టించాడు. లోతుగా చూస్తే, ఈ రెండూ కూడా అతనికి ఉన్న స్మరణకు తెచ్చుకునే శక్తి. అంటే జ్ఞాపక శక్తి, భౌతికీకరణలే. దేవతా కథలలో గూడ అసంభవంగా పరిగణించబడ్డ దూరాల్నించి కూడ టెలిఫోన్ సహాయంతో వినవచ్చు. రాత అనేది దాని పుట్టుకలో, పరోక్షంలో ఉన్న మనిషివాణి. నివాస గృహం తల్లి గర్భానికి ప్రత్యామ్నాయం. తల్లి గర్భం మనిషి మొదటి నివాసం. దానిని ఇంకా అతడు కోరుకునే సంభావ్యత ఉంది. దానిలో అతడు సుఖంగా, సురక్షితంగా ఉండేవాడు.

కునేందుకు తన మూత్రధార ప్రవాహంతో దానిని ఆర్పే అలవాటును చేసుకొన్నాడనేదే ఆ ఊహ. పైకి ఎగసిపడే అగ్ని జ్వాలా కీలల పట్ల మూల శిశ్న దృష్టి ఉందని పురాణాలు సందేహం లేకుండా చెబుతున్నాయి. మూత్రవిసర్జనం ద్వారా నిప్పునార్పడం – (ఈ ఇతివృత్తంతో లిలిపుట్ల మధ్య గలివరు లాంటి, రాచెలియస్ గర్గంటువ లాంటి ఆధునిక బృహత్కాయులు ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నారు) – మగవాడు కావించే ఒక లైంగిక క్రియ, స్వలింగ సంపర్క పోటీలో లైంగిక శక్తిని ఆనందించడం. ఈ వాంఛను పరిత్యాగంచేసి, నిప్పునార్పక వదిలివేసిన మొదటి మానవుడు, నిప్పును తనతో తీసుకుపోయి తన ప్రయోజనానికి దాన్ని లొంగదీసుకున్నాడు. లైంగికోద్రేకాగ్నిని అదుపులో పెట్టుకోవడం ద్వారా సహజ అగ్ని శక్తిని మచ్చిక చేసుకున్నాడు. ఈ రకంగా అతడు గావించిన సహజాత పరిత్యాగానికి పారితోషికం ఈ మహా సాంస్కృతిక విజయం. ఇంకా చూస్తే, ఈ వాంఛా ప్రలోభానికి లొంగుబాటును స్త్రీ దేహ నిర్మాణం అసంభవం చేసింది. కాబట్టి వంటింటి పొయ్యిలో బంధింపబడిన నిప్పుకు ఆమెను సంరక్షకురాలిగా నియమించడం జరిగిందా అనిపిస్తుంది. యశోకాంక్ష, నిప్పు, శిశ్న కామోద్రేకాల మధ్య ఉన్న సంబంధాన్ని మనోవిశ్లేషణానుభావం క్రమం తప్పకుండా సూచించడం విశేషం.

తొట్టతొలి తాను బలహీన జంతుజీవిగా అవతరించిన ఈ భూమి మీదకు, తన జాతికి చెందిన ప్రతి ఒక్కరు నిస్సహాయ పసికూనగా తిరిగి ప్రవేశించవలసిన ఈ భూమి మీదకు మనిషి తన శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలతో ఈ పరికరాల్ని తెచ్చాడు. ఈ పరికరాల్ని కనుగొనడం ఒక అద్భుత గాథలా అనిపించడమే కాదు. నిజానికి ఇది ప్రతి అద్భుత గాథలోని కలను సాకారం చేసుకోవడమే. ఈ విభవాలన్ని తన సాంస్కృతిక సముపార్జన ద్వారా వచ్చాయని మనిషి చెప్పుకోవచ్చు. సర్వశక్తియుత ఆదర్శ భావాలను మనిషి ఎప్పుడో ఏర్పరచుకున్నాడు. ఈ ఆదర్శాలను అతడు దేవుళ్ళుగా మూర్తిమంతం చేసుకున్నాడు. తన తీరని, తీర్చుకోలేని వాంఛలను ఈ దేవుళ్ళకు ఆపాదించాడు. అందుకని దేవుళ్ళను సాంస్కృతిక ఆదర్శమూర్తులుగా చెప్పవచ్చు. ఈ రోజు మనిషి ఈ ఆదర్శసాధనకు చేరువయ్యాడు. అతడు దాదాపు దేవుడే అయ్యాడు. అయితే, మానవాళి సామాన్యభిప్రాయం ప్రకారం ఆదర్శాలు సాధారణంగా ఎలా సాధించబడతాయో ఆ రీతిలోనే ఇది కూడ జరిగిందనేది నిజం. ఈ ఆదర్శసాధన ఎప్పుడూ పూర్తిగా జరగదు. కొన్ని సందర్భాలలో సగం మాత్రమే సాధ్యం. మరికొన్ని సందర్భాలలో అసలు జరగనే జరగదు. ఆ విధంగా మనిషి కృతకావయవం లాంటి దేవుడు అయ్యాడు. తన సహాయకావయవాలన్నింటినీ ధరించినప్పుడు, అతడు నిజంగా శోభాయమానంగా వెలుగొందుతాడు. కాని ఆ అవయవాలు అతని నుంచి పుట్టుకు రాలేదు. కొన్నిసార్లు అవి అతనికి చాల ఇబ్బంది కలిగిస్తాయి. అయినా కాని, ఈ రకమైన అభివృద్ధి ఖచ్చితంగా క్రీ.శ.1930లో అంతంకాదు అనే ఆలోచనతో అతడు తనను తాను ఓదార్చుకోవడానికి అర్హత ఉంది. నాగరికతా క్షేత్రంలో, రాబోయే యుగాలు, బహుశ అనూహ్యమైన మహా విజయాలను తీసుకొస్తాయి. అవి దేవుని తోడి మనిషి సాదృశ్యాన్ని మరింత పెంచుతాయి. కాని మన పరిశోధనల ప్రయోజనం దృష్ట్యా, నేటి మానవుడు తన దైవ సదృశ లక్షణాలతో ఆనందాన్ని పొంద లేకపోతున్నాడు అనే అంశాన్ని మనం మరచిపోలేము.

ఏ దేశాలలో అయితే, భూ సంపదను వినియోగించుకోవడంలోను, ప్రకృతి శక్తుల నుండి రక్షణ పొందడంలోను మనిషికి సహాయపడే ప్రతిదీ – క్లుప్తంగా చెప్పాలంటే అతనికి ఉపయోగపడే ప్రతిదీ – చేపట్టబడి, సమర్థవంతంగా నిర్వహించబడుతుందో, అట్టి దేశాలు ఉన్నత నాగరికతా స్థాయిని సాధించాయని గుర్తిస్తాము. అటువంటి దేశాలలో, భూమిని వరదలతో ముంచెత్తే ప్రమాదం ఉన్న నదీ ప్రవాహాలను నియంత్రించి, ఆ నీటిని కాలువల ద్వారా నీటి కరువు ఉన్న ప్రదేశాలకు మళ్లించడం జరుగుతుంది.

నేలను శ్రద్ధగా సాగుచేసి, ఆ నేలలో బాగా పండుతాయనుకొన్న పంటలను వేస్తారు. భూగర్భంలో దాగిఉన్న ఖనిజ సంపదను వెలికితీసి కావలసిన పరికరాలుగా, పాత్రలుగా మలుస్తారు. భావ ప్రసార సాధనాలు మరిన్నిగా, మరింత వేగవంతమైనవిగా, విశ్వసనీయమైనవిగా తయారయ్యాయి. క్రూర, అపాయకర జంతువులను అంతంచేయడం జరిగింది. సాధు జంతువుల పెంపకం అభివృద్ధి చెందింది. ఇవే కాక, మనం నాగరికత నుంచి వేరే కొన్ని కావాలని కోరుకుంటాం, ఇదే దేశాలలో ఈ వేరే కొన్ని కూడ నెరవేర్చబడాలని మనం ఆశించడాన్ని స్పష్టంగా గమనించవచ్చు. మనం మొదట్లో కోరుకున్నదానిని తిరస్కరిస్తున్న చందంగా, ప్రజలు తమ శ్రద్ధను ఆచరణాత్మక విలువలేని, నిరుపయోగమైన వాటి దిశగా కూడా మరల్చడం - ఉదాహరణకు, పట్టణాలలో ఆట స్థలాల కోసం, మంచి స్వచ్ఛమైన గాలికోసం అవసరమైన పచ్చిక మైదానాలలో పూలపాన్పులు కూడా అమర్చడం లేదా ఇళ్ళ కిటికీలు పూల కుండీలతో అలంకరించడం - మనం గమనించినప్పుడు, దానిని మనం నాగరికతా చిహ్నంగా స్వాగతిస్తున్నాం. నాగరికత విలువనివ్వాలని మనం ఆశిస్తున్న ఈ నిరుపయోగకరమైంది సౌందర్యమని మనం వెంటనే గ్రహిస్తాం. నాగరికుడైన మానవుడు ప్రకృతిలో అందాన్ని ఎక్కడ చూసినా ఆరాధించాలని, హస్తకళల ద్వారా తన శక్తి మేరకు దానిని వస్తువుల రూపంలో సృజించాలని మనం కోరుకుంటాం. మనం నాగరికత నుంచి ఆశించేది ఇంతటితోనే అయిపోలేదు. ఇంకా శుభ్రత ను, క్రమత ను చూడాలని కోరతాం. స్ట్రాట్‌ఫర్డ్‌లో షేక్స్‌పియర్ తండ్రి ఇంటి ముందు ఒక పెద్ద పేడకుప్ప ఉందని మనం చదివినప్పుడు, ఆ కాలం ఇంగ్లీషు గ్రామీణ, పట్టణ సాంస్కృతిక స్థాయి అంత ఉన్నతమైందిగా భావించలేం. వైనర్‌వాల్డ్[1] వీధుల్లో కాగితం చెత్తకుప్పలను చూసినప్పుడు మనకు ఆగ్రహం కలుగుతుంది. దానిని అనాగరిక మైనదిగా (నాగరికతకు వ్యతిరేకమైనదిగా) మనం వ్యవహరిస్తాం. మానవ దేహం విషయంలోకూడ శుభ్రతను పాటించా లంటాం. రాయ్ సొలియల్[2] నుంచి అభ్యంతరకర దుర్గంధం వచ్చిందని తెలిసినప్పుడు ఆశ్చర్యచకితుల మవుతాము. ఇసోలా బెలా[3] లోని నెపోలియన్ ఉదయ కాలకృత్యాలు తీర్చుకున్న ఆ చిన్న వాష్‌బేసిన్ చూసి

---

1. (వియన్నా పొలిమేరలలో ఉన్న అడవుల, కొండల ప్రాంతం)

2. (ఫ్రాన్స్ చక్రవర్తి అయిన 14వ లూయీ)

3. (మగియోర్ సరస్సులోని ప్రఖ్యాత ద్వీపం. మారెంగో యుద్ధానికి కొద్ది రోజుల ముందు నెపోలియన్ ఆ ద్వీపాన్ని సందర్శించాడు.)

తల పంకిస్తాం. సబ్బును ఉపయోగించడం నాగరికతకు కొలబద్ద అనే భావం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు. ఇదే విషయం క్రమత కూ వర్తిస్తుంది. శుభ్రతలాగే, మనిషి చేసే పనులన్నింటికీ క్రమత వర్తిస్తుంది. పరిశుభ్రతను మనం ప్రకృతిలో ఆశించక పోయినా, తద్విరుద్ధంగా క్రమత ను దానినుంచే అనుకరించాం. మహత్తర ఖగోళ క్రమతా పరిశీలన మానవ జీవితంలో క్రమత ను ప్రవేశపెట్టడానికి నమూనాను అందించడమే కాక, అలా చేయడానికి మొదటి అవకాశాన్ని కల్పించింది. క్రమం అంటే తిరిగి, తిరిగి చేయాలనే ఒక తరహా ఒత్తిడి. ఈ పునశ్చరణ ఒత్తిడి ఎలాంటిదంటే, సర్వకాలాలకి వర్తించే ఒక నియమాన్ని పెట్టుకున్నప్పుడు, ఒక పనిని ఎప్పుడు, ఎక్కడ, ఎలా చేయాలనే దానిని అది నిర్ణయిస్తుంది. దీని కారణంగా,

అటువంటి ప్రతి సందర్భంలోను అనిశ్చితి, ఊగిసలాట తప్పుతుంది. క్రమత వలన లాభాలు ఉంటాయనేది నిర్వివాదం. క్రమత మనుషులు స్థల కాలాలను అత్యంత ప్రయోజనకరంగా వాడుకోవడానికి అవకాశం కల్పించింది. అదే సమయంలో తమ మానసిక శక్తిని సంరక్షించుకునే వీలు కల్పించింది. మొదటినుంచే, ఏ మాత్రం కష్టంలేకుండానే, మానవ కార్యకలాపాలలో క్రమత చోటుచేసుకుందని భావించడానికి ఆస్కారం ఉంది. ఇలా జరగకుండా, దీనికి విరుద్ధంగా, మానవులు తమ కార్యకలాపాలలో అజాగ్రత్త, అక్రమత, అవిశ్వసనీయతలకు సంబంధించిన అంతస్సిద్ధ ప్రవృత్తిని ప్రదర్శిస్తే వారు ఖగోళ క్రమతా నమూనాను అనుసరించేట్లు చేయడానికి అత్యంత శ్రమైక శిక్షణ అవసరమవుతుందని మనం అనుకోవచ్చు.

నాగరికతావశ్యకతాంశాలలో సౌందర్యం, పరిశుభ్రత, క్రమతలు ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తాయనేది స్పష్టం. అయితే ఇవి మానవ జీవితానికి, ప్రకృతిపై అదుపు మరియు మనం పరిశీలించబోయే కొన్ని ఇతర కారకాలంతటి ముఖ్యమైనవని ఎవరూ అనలేరు. అలాగని అవి అల్పాలని, వాటిని నేపథ్యంలోకి నెట్టివేయాలని గూడా ఎవరూ అనలేరు. కేవలం ఉపయోగకర విషయాలతోనే నాగరికత నిర్మితం కాదు. ఈ విషయాన్ని సౌందర్య చర్చలో సూచించాము. నాగరికతాభిరుచుల నుంచి సౌందర్యాన్ని తొలగించం. క్రమత ఉపయోగం ఏమిటో విదితమే. ఇక పరిశుభ్రత విషయానికి వస్తే ఆరోగ్యానికి అది అవసరం అనే విషయం మరువరాదు, శాస్త్రీయ వ్యాధి నిరోధక చికిత్స ఆవిష్కారానికి ముందు నుంచీ ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధం మానవులకు తెలుసు. అయినా ఔపయోగికత ఒక్కటే ఈ యత్నాలను పూర్తిగా వివరించలేదు. ఇదే కాక ఇంకా ఏదో పనిచేస్తూ ఉండి ఉండాలి.

మానవుని ఉన్నత మానసిక కార్యాలైన బౌద్ధిక, శాస్త్రీయ, కళాత్మక విజయాలకు నాగరికత ఇచ్చే మాన్యత, ప్రోత్సాహం, మానవ జీవితంలో భావాలకు అది కల్పించే అగ్రగామి పాత్ర - ఈ లక్షణాలు, మరి ఏ ఇతర లక్షణాలకంటె కూడ నాగరికతను బాగా నిర్వచిస్తాయి, ఆ భావనలలో అగ్రభాగాన నిలిచేది మత వ్యవస్థలు. ఈ మతాల సంకీర్ణ నిర్మితి మీద వేరేచోట[1] కొంత చర్చించాను. తరువాత వచ్చేది తాత్విక చింతన. చివరగా వచ్చేవి మానవాదర్శాలు - వ్యక్తులు, ప్రజలు లేదా మానవాళి సంభావ్య పరిపూర్ణతకు సంబంధించిన మనిషి భావాలు. ఈ భావాల ఆధారంగా అతడు చేసే ప్రతిపాదనలు, అతడు కావించిన ఈ ఆవిష్కరణలు పరస్పర స్వతంత్రాలు కావు. తద్భిన్నంగా అవి ఒకదానితో ఒకటి సన్నిహితంగా అల్లుకుపోయి ఉన్నాయి. ఇలా అల్లుకుపోయిన కారణంగా వాటి వర్ణన మాత్రమే కాక, వాటి మానసిక వ్యుత్పన్నతను కనుక్కోవడం కూడ కష్టతరమౌతుంది. ఔపయోగికత, సుఖ ప్రదాయకత అనే రెండు సమన్విత లక్ష్యాలు మానవ కార్యకలాపాలన్నింటికి ప్రేరక శక్తి అనుకుంటే, మనం ఇప్పుడు చర్చిస్తున్న నాగరికతాభివ్యక్తులకు కూడా ఇవి వర్తిస్తాయని మనకు అనిపిస్తుంది. కాని, ఇది శాస్త్రీయ, సౌందర్య రంగాలలో మాత్రమే తేలికగా గోచరమవుతుంది. కాని ఇతర కార్యకలాపాలు కూడ మనుషులలోని బలమైన అవసరాలకు సదృశాలే - బహుశ ఈ అవసరాలు కొద్దిమందిలోనే అభివృద్ధి చెంది ఉండవచ్చు. ఒక ప్రత్యేక మతం, దర్శనం లేదా ఆదర్శానికి సంబంధించిన విలువల నిర్ణయాల ఆధారంగా మనం తప్పుదారి పట్టడానికి అవకాశం ఇవ్వకూడదు. మానవాత్మ సాధించిన అత్యంత ఉన్నత విజయాలను వాటిల్లో మనం చూడాలనుకున్నా లేదా అవన్నీ వట్టి మతిభ్రంశాలని ఖండించినా, అవి ఎక్కడ ఉన్నా, ప్రత్యేకించి అవి ఎక్కువ ప్రబలంగా ఉన్నా, అక్కడ ఉన్నత స్థాయి నాగరికత అంతర్భూతంగా ఉందని మనం గుర్తించక తప్పదు.

నాగరికతా లక్షణాలలోని చివరిది, కాని ప్రాముఖ్యతలో తీసిపోనిది, ఇంకా అంచనా కట్టబడవలసే ఉంది: మానవుల మధ్య పరస్పర సంబంధాలు, వారి సామాజిక సంబంధాలు - ఒక వ్యక్తిని ఇరుగు పొరుగువానిగా, పరోపకారిగా, మరొకరి లైంగిక వస్తువుగా, కుటుంబ, రాజ్య సభ్యునిగా ప్రభావితం చేసే సంబంధాలు - ఏ పద్ధతిలో క్రమబద్ధీకరించబడ్డాయి ? అనేది ఈ చివరి అంశం. ఇక్కడ ముఖ్యంగా ఉన్న చిక్కు ఏమిటంటే, ప్రత్యేక ఆదర్శాల డిమాండ్లను వేరుగా స్పష్టంగా ఉంచి, సాధారణార్థంలో నాగరీకరించబడడం

---

[1] Future of an illusion (భ్రాంతి భవితవ్యం) 1927.

అంటే ఏమిటో చూడడం. సామాజిక సంబంధాల నియంత్రణకుచేసే ప్రథమ ప్రయత్నంలో నాగరికత రంగ ప్రవేశంచేస్తుంది అనే సమస్యా వివరణంతో మనం చర్చ మొదలుపెడదాం. ఆ ప్రయత్నం లేకపోతే సంబంధాలు వ్యక్తి ఇష్టానుసారానికి లోనవుతాయి. అంటే దాని అర్థం శారీరకంగా బలవంతుడైన వ్యక్తి తన అభిరుచులకు, సహజాతాలకు అనుగుణంగా వాటిని నిర్ణయిస్తాడు. అంతకంటె మరో బలవంతుడు మొదటి బలవంతునికి తారస పడినా పరిస్థితిలో మార్పుఏమీరాదు. అధిక సంఖ్యాకులు ఒకచోటచేరి, విడి వ్యక్తులకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండడం ద్వారా, అట్టి విడివ్యక్తుల కంటె బలవంతమయినపుడే మానవ ఉమ్మడి జీవితం సాధ్యమౌతుంది. ఈ సంఘాధికారం వ్యక్తి అధికారానికి వ్యతిరేకంగా న్యాయమైనదిగా నిలపబడింది. వ్యక్తి అధికారం పశుబలంగా ఖండింపబడింది. వ్యక్తి అధికారం స్థానంలో సంఘాధికారాన్ని ప్రతిష్ఠించడం నాగరికతా నిర్మాణంలో ఒక నిర్ణయాత్మకమైన ముందడుగు. ఇందులో అసలు సంగతి ఏమిటంటే, సంఘంలో సభ్యులు తమ సంతృప్తికిగల అవకాశాలను పరిమితం చేసుకొంటారు. అదే వ్యక్తులైతే అటువంటి పరిమితులను విధించుకోరు. అందుకని నాగరికతకు మొదటి ఆవశ్యకత ఏమిటంటే, న్యాయం - అంటే ఒకసారి చట్టం చేసిన తరువాత దానిని వ్యక్తికి అనుకూలంగా ఉల్లంఘించడం జరగదనే హామీ. అటువంటి చట్టంలో నైతికతకు సంబంధించి ఏమీ లేదు. సాంస్కృతిక వికాస గతిలో చట్టం ఇక ఏమాత్రం ఒక చిన్న సముదాయపు - అంటే ఒక కులం లేదా ప్రజా సమూహంలో ఒక శ్రేణి లేదా ఒక జాతి సముదాయం - సంకల్ప వ్యక్తీకరణ కాదు. ఒక వ్యక్తి ఇతరుల పట్ల హింసాత్మకంగా ప్రవర్తించినట్లే, అట్టి చిన్న సముదాయం ఇతర, బహుశా బహుళ సంఖ్యాక సమూహాల మీద హింసాత్మకంగా ప్రవర్తించవచ్చు. దీని అంతిమ పర్యవసానం - సంఘంలో సభ్యులు కాలేనివారు తప్ప-అందరూ తమ సహజాతాలను త్యాగం చేయడం ద్వారా రూపు దిద్దుకున్న చట్టబద్ధ పాలన అవుతుంది. ఈ చట్ట బద్ధపాలన ఎవరినీ - సంఘంలో సభ్యులు కాలేని వారు తప్ప - పశుబలం దయా ధర్మాలకు వదిలివేయదు.

వ్యక్తి స్వేచ్ఛ నాగరికత ఇచ్చిన బహుమతి కాదు. అసలు ఏ నాగరికత లేకముందు అది ఎంతగానో ఉంది. అయితే, ఎక్కువ భాగం అప్పుడు దానికి విలువలేదు అనేది వాస్తవం. ఎందుకంటే, మనిషి దానిని రక్షించుకోగల స్థితిలో లేడు. నాగరికతా వికాసం దానిమీద ఎన్నో ఆంక్షలు విధిస్తుంది. న్యాయం ఆ ఆంక్షల నుంచి ఎవరూ తప్పించుకోరాదని నిర్దేశిస్తుంది. మానవ సమూహంలో స్వేచ్ఛా వాంఛగా అనుభూతికి వచ్చేది, సమాజంలో

ఉన్న అన్యాయానికి వారు ఎదురుతిరగడం కావచ్చు. కాబట్టి, ఇది నాగరికత మరింత అభివృద్ధి చెందడానికి దోహదం చేయవచ్చు. అది నాగరికతతో పొందిక కలిగి ఉండవచ్చు. లేక, అది ఆ సమూహపు – నాగరికతతో ఇంకా సర్దుబాటు కుదరని మౌలిక మూర్తిమత్వ అవశేషాల నుంచి కూడ ఉద్భవించవచ్చు. ఇది వారిలో నాగరికతపట్ల శత్రుత్వానికి ప్రాతిపదిక కావచ్చు. అందుకని స్వేచ్ఛ కోసం ఆరాటం కొన్ని నాగరికతా రూపాలు, అవసరాలకు లేదా మొత్తం నాగరికతకే వ్యతిరేకంగా నిర్దేశితమవుతుంది. ఏ ప్రభావం కూడా మనిషి తన స్వభావాన్ని చెద పురుగుల స్వభావంగా మార్చుకొనేట్లు చేయలేదు. అతడు తన వ్యక్తి స్వేచ్ఛా హక్కును సమూహ సంకల్పానికి వ్యతిరేకంగా రక్షించుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఇందులో సందేహం లేదు. మానవాళి జరిపే పోరాటాలలో అధిక భాగం వ్యక్తి స్వేచ్ఛా కాంక్షకు, సమాజపు సాంస్కృతిక అవసరాలకు మధ్య ఒక కార్యసాధక రాజీ మార్గాన్ని – ఇది ఆనందాన్ని తెచ్చేది కూడ అవుతుంది – కనుగొనడమనే ఒకే ఒక్క కర్తవ్యం చుట్టూ కేంద్రీకృతమై వుంటాయి. మానవాళి భవిష్యత్తును స్పృశించే సమస్యలలో ఒకటి ఏమిటంటే, అటువంటి పరిష్కారాన్ని ఏదో ఒక ప్రత్యేక నాగరికతా రూపంతో సాధించగలమా లేక ఈ ఘర్షణ అపరిష్కృతమా అనేది.

మానవ జీవితపు ఏ లక్షణాలను నాగరికమైనవిగా పరిగణించాలి అనే సంగతి తేల్చుకోవడానికి సామాన్య అనుభూతిని మార్గదర్శకం చేసుకొని, నాగరికతా స్థూలచిత్రాన్ని మనం స్పష్టంగా రూపొం దించుకున్నాం. కాని ఇప్పటికే సార్వత్రికంగా తెలియని దానిని దేనిని ఇంతవరకు మనం కనుక్కోలే దనేది నిజం. అదే సమయంలో, నాగరికత పరిపూర్ణతకు పర్యాయపదమని, మానవులు పరిపూర్ణులు కావడానికి అది పూర్వ నిర్దేశిత మార్గమనే అపోహకు లోనుకాకుండ మనం జాగ్రత్త వహించాం. కాని ఇప్పుడు ఒక దృక్పథం దానికై అదే మనముందుకొచ్చింది. అది వేరే దిశలో మనలను తీసుకు పోవచ్చు. నాగరికతాభివృద్ధి మానవాళి అనుభవించే ఒక ప్రత్యేక ప్రక్రియగా మనకు అనిపిస్తుంది. ఈ ప్రక్రియలో అనేక విషయాలు మనకు పరిచితమైనవిగా కనిపిస్తాయి. మనకు పరిచితాలైన మానవ సహజాత ప్రవృత్తులలో ఇది తీసుకువచ్చే మార్పులను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రక్రియను మనం విరమించవచ్చు. ఈ సహజాత ప్రవృత్తుల సంతృప్తే మన జీవితాల ఆచరణాత్మక కర్తవ్యం. ఈ సహజాతాలలో కొన్ని పూర్తిగా ఉపయోగించ బడటం ఏ విధంగా జరుగుతుందంటే, వాటి స్థానంలో వేరేది వచ్చి చేరుతుంది. దీనిని మనం వ్యక్తిలో శీల లక్షణంగా అభివర్ణిస్తాం. అటువంటి ప్రక్రియకు అత్యంత విశేష

ఉదాహరణను యుక్త వయస్కుల పాయు కామోద్రేకం (anal erotism) లో చూడవచ్చు. విసర్జక ప్రక్రియ, తత్సంబంధిత అవయవాలు, విసర్జితాల పట్ల వారి తొలి ఆసక్తి, వారి ఎదుగుదల క్రమంలో ఒక లక్షణ సమూహంగా మార్పు చెందుతుంది. ఈ లక్షణ సమూహం, మితవ్యయం, క్రమత, పరిశుభ్రతలుగా మనకు పరిచితం. ఈ లక్షణాలు వాటికై అవి విలువైనవే, ఆహ్వానించదగినవే అయినప్పటికీ, అవి తీవ్ర రూపం దాల్చినప్పుడు ప్రబలమై మనం పాయు శీలం (anal character) అని వ్యవహరించే దానిని ఉత్పన్నం చేస్తాయి. ఈ మార్పు ఎలా జరిగేది మనకు తెలియదు. కాని మనకు కలిగిన ఈ అవగాహన[1] సరైనదే అనడంలో సందేహం లేదు. క్రమత, పరిశుభ్రతలు – వాటి కీలక ఆవశ్యకత, సుఖ మూలాలుగా వాటి అనుగుణ్యత అంత సువిదితం కానప్పటికీ – నాగరికత ముఖ్య అవసరాలేననే విషయం ఇప్పుడు మనం గమనించాం. సరిగ్గా ఇక్కడ, నాగరికతా ప్రక్రియకి, వ్యక్తి లిబీడో వికాసానికి మధ్య ఉన్న సారూప్యతని గమనించకుండ ఉండలేం. ఇతర సహజాతాలు (పాయు కామోద్రేకం కాక), వాటిని తృప్తిపరచడానికి అవసరమైన పరిస్థితులను స్థానాంతరీకరించడం ద్వారా, వేరే మార్గాలలోకి మళ్ళేవిధంగా చేయబడ్డాయి. చాలా సందర్భాలలో ఈ ప్రక్రియ మనకు సుపరిచితమైన (సహజాత లక్ష్యాల) ఉదాత్తీకరణతో కలసి సంభవిస్తుంది. కాని కొన్ని పరిస్థితులలో దానిని ఉదాత్తీకరణ నుండి వేరేచేసి చూడవలసి ఉంటుంది. సహజాత ఉదాత్తీకరణ సాంస్కృతిక వికాసపు అత్యంత విశిష్ట లక్షణం. ఉన్నత మానసిక కార్యాలైన శాస్త్ర, కళా, భావజాల కార్యకలాపాలకు నాగరిక జీవితంలో ప్రముఖ పాత్రను సాధ్యం చేసింది ఇదే. మొదటి అభిప్రాయపు ప్రభావానికి వ్యక్తి లోనయినట్లయితే, ఉదాత్తీకరణను సహజాతాల మీద నాగరికత ఏక పక్షంగా రుద్దిన విపరిణామం అనిచెప్పే అవకాశం ఉంది. కాని దీనిగురించి ఇంకొంచెం లోతుగా ఆలోచించడం విజ్ఞత అనిపించు కుంటుంది. అంతిమంగా – ఈ అంశం చాలా ముఖ్యమైనదిగా కనిపిస్తుంది – సహజాత పరిత్యాగం ఆధారంగా నాగరికత ఏ మేరకు నిర్మితమైంది? శక్తిమంతాలైన సహజాతాలు సంతృప్తి చెందకపోవడాన్ని (అణచివేత, దమనం లేదా మరో పద్ధతి ద్వారా) ఎంతవరకు ముందే ప్రాతిపదికగా చేసుకుంది? అనే విషయాలను విస్మరించడం అసంభవం. ఈ 'సాంస్కృతిక అసంతుష్టత' మానవ సామాజిక సంబంధాల విశాలక్షేత్రం మీద ఆధిపత్యం చలాయిస్తుంది. మనం ఇంతకు ముందే

---

[1] *Character and Anal Erotism (శీలము – పాయు కామోద్రేకం) అనే నా రచనను చూడండి. అలానే ఎర్నెస్ట్ జోన్స్, తదితరుల రచనలు కూడ చూడవచ్చు.*

ఊహించినట్లు, నాగరికతలన్నీ ఎదురొడ్డి పోరాడవలసిన వైరి భావనకు కారణం ఇదే. ఇది మన శాస్త్ర అధ్యయనం మీద గూడా తీవ్రమైన డిమాండ్లు చేస్తుంది. ఇక్కడ ఎంతో వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒక సహజాతాన్ని తృప్తి చెందకుండచేయడం ఎలా సంభవమో అర్థంచేసుకోవడం అంత తేలికకాదు. ఏ అపాయం జరగకుండా అలా చేయడాన్ని అర్థం చేసుకోవడం కూడా అంత తేలికకాదు. ఈ నష్టాన్ని మానసిక నిర్వహణ పరంగా పూరించినట్లయితే తీవ్ర అపవ్యవస్థలు చోటుచేసుకోవడం తథ్యం.

వ్యక్తి సాధారణ పరిణతి క్రమంతో పోల్చదగిన ఒక ప్రత్యేక ప్రక్రియ నాగరికతా వికాసం అనే మన అవగాహనకు ఏ విలువను ఆపాదించవచ్చునో తెలుసుకోవాలంటే, మనం మరో సమస్యను స్పష్టంగా ఎదుర్కోవలసి ఉంది. నాగరికత ఎలాపుట్టింది? దాని వికాసాన్ని ఏది ప్రభావితం చేస్తుంది? దాని గతిని ఎవరు నిర్ణయిస్తారు? – లాంటి ప్రశ్నలకు మనం వేసుకోవాలి.

◆

IV

సమస్య బృహత్తరంగా కనిపిస్తున్నది. దాని సముఖంలో మనమీద మనకు నమ్మకం కుదరడంలేదు. ఇక్కడ నేననుకుంటున్న కొన్ని ఊహా ప్రతిపాదనలను మీ ముందుంచుతాను.

ఈ భూమిమీద తన సౌభాగ్యాన్ని శ్రమ చేయడం ద్వారా మెరుగుపరచుకోవడం అక్షరాలా తన చేతుల్లోనే ఉందని ఆదిమ మానవుడు కనుగొన్న తరువాత, సాటి మనిషి తనతో కలిసి పని చేస్తున్నాడా లేక తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడా అనేది అతనికి తటస్థ విషయం కానేరదు. తోటి మనిషి సాటి శ్రామికుడుగా అతనికి విలువైనవాడు అవుతాడు. కలిసి జీవించడం ఇరువురికి ఉపయోగకరం. అంతకుముందు, అతని వానర-సదృశ ప్రాక్చరిత్రలో గూడ, మానవుడు కుటుంబాలను ఏర్పరచుకునే అలవాటు చేసుకున్నాడు. ఆ కుటుంబ సభ్యులు బహుశ అతని మొదటి సహాయకులు. జననాంగ తృప్తి అవసరం-ఆకస్మికంగా వచ్చి వెళ్లిన అతిథి గురించి దీర్ఘకాలం మళ్ళీ ఏమీ వినబడనట్లుగా కాక-శాశ్వత ఆవాసం ఏర్పాటుచేసుకున్న అంశంగా రూపు దిద్దుకున్న సమయంలో కుటుంబం ఏర్పడిందని భావించవచ్చు. ఇది సంభవించినప్పుడు స్త్రీని తన దగ్గరే అట్టిపెట్టుకోవాలనే ప్రేరణ పురుషుడికి కలిగింది. లేదా సామాన్యంగా చెప్పుకోవాలంటే లైంగిక వస్తువులను తన వద్దే ఉంచుకోవాలనే ప్రేరణ కలిగింది. అదే సమయంలో, నిస్సహాయులైన తన బిడ్డలకు దూరంగా ఉండాలని కోరుకోని స్త్రీ, వారి అవసరార్థం బలవంతుడైన మగవానితో ఉండి తీరాల్సివచ్చింది[1]. ఈ ఆదిమ కుటుంబంలో నాగరికత

---

[1] ***లైంగిక ప్రక్రియ జీవకాలకత*** (organic periodicity) *స్థిరపడడం వాస్తవమే కాని, మానసిక లైంగికోద్రేకత మీద దాని ప్రభావం తారుమారయింది. ఈ మార్పు, ఏ నాసికోద్దీపనల ద్వారా అయితే బహిష్టు ప్రక్రియ మగవాని మానసిక నిర్మాణం మీద ప్రభావం చూపిందో, ఆ నాసికోద్దీపనల తగ్గుదలతో ముడిపడివున్నట్లు కనిపిస్తుంది. అప్పుడప్పుడే ప్రభావం చూపే స్వభావంకల నాసికొద్దీపనలకు భిన్నంగా శాశ్వత ప్రభావాన్ని కలిగించే సామర్థ్యంగల చాక్షుష ఉద్దీపనలు వాటి స్థానాన్ని చేపట్టాయి. అధిగమించబడిన ఒక వికాస దశనుండి రక్షణగా, బహిష్టు మీద ఆంక్ష ఈ 'జీవ దమనం' నుండి వచ్చింది. అన్ని ఇతర ప్రేరణలు బహుశ గౌణ స్వభావం కలిగినవి. మరో స్థాయిలో ఇదే ప్రక్రియ, గతించిన నాగరికతా దశకు చెందిన దేవుళ్ళు రాక్షసులుగా మారినప్పుడు పునరావృతమైంది. నాసికోద్దీపనల క్షీణతకు కారణం మానవుడు భూమి మీద నుంచి లేచి నిటారుగా నిలబడడం. దీనితో పూర్వం గోప్యంగా ఉన్న జననాంగాలు బహిర్గతమయ్యాయి. అందుకని వాటికి రక్షణ అవశ్యకమైంది. దీనితో అతనిలో లజ్జా భావన ప్రేరేపించబడింది.*

ప్రధాన లక్షణాలలో ఒకటి లోపించింది. దాని అధిపతి అయిన తండ్రికి అపరిమితమయిన నిర్ణయాధికారం ఉంది. “నా టోటెమ్ అండ్ టాబూ అనే రచనలో ఈ కుటుంబం నుంచి సోదర గణాల రూపంలోని సమిష్టి జీవన దశ ఎలా ఏర్పడిందో చూపడానికి ప్రయత్నించాను. తమ తండ్రిపై కొడుకులు ఆధిపత్యం సాధించడం ద్వారా, ఒక వ్యక్తిగా ఉండడం కంటె సమూహంగా ఉండడం బలమని కనుగొన్నారు. అలా వారు నూతనంగా సాధించిన దానిని ఒక పద్ధతిలో ఉంచుకోవడానికి, కొడుకులంతా తమలో తాము కొన్ని ఆంక్షలను విధించుకొన్నారు. ఈ ఆంక్షలమీద తెగ సంకేత (totemic) సంస్కృతి ఆధారపడి ఉంది. ఈ ఆంక్షలే మొదటి ‘హక్కు’ లేదా ‘చట్టం’. అందువలన, మానవ సామూహిక

మనిషి నిలువు ఆకృతి అలవర్చుకోవడంతో ఈ ప్రమాదభరిత నాగరికతా ప్రక్రియ ప్రారంభమై ఉండవచ్చు. ఇహ అక్కడ నుంచి మొదలై గొలుసుకట్టు సంఘటనల క్రమం నాసికోద్దీపనా క్షయం, బహిష్టు సమయాన్ని వేరు చేయడం నుండి చాక్షుషోద్దీపనలు ప్రాముఖ్యాన్ని సంతరించుకోవడం, జననాంగాలు బహిర్గతం కావడం వరకు మరి ఆపై అవిరామ లైంగికోద్రేకం, కుటుంబ నిర్మాణం, అంతిమంగా మానవ నాగరికత సన్నిహిత సంబంధం కల జంతువుల జీవిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దీనిని జాగ్రత్తగా సరిచూడడం అతి ముఖ్యం.

పరిశుభ్రతకు సంబంధించిన సాంస్కృతిక ధోరణిలో గూడ విస్పష్టంగా ఒక సామాజిక అంశం ఉంది. పరిశుభ్రతా ప్రమాణాల రీత్యా దానిని తరువాత సమర్ధించడం జరిగింది. కాని ఈ మల మూత్రాలను తొలగించాలనే కోర్కెనుండి పరిశుభ్రతకు ప్రేరణ లభిస్తుంది. ఇదే శైశవంలో అయితే వేరు. పసిపిల్లలకు మల మూత్రాలు జుగుప్సను కలిగించవు. వారి శరీరంలో భాగంగా ఉండి, బయటికి వచ్చాయి గనుక, అవి వారికి విలువైనవిగా కనిపిస్తాయి. పిల్లల పెంపకంలో వారి ఎదుగుదల క్రమాన్ని వేగిరపరచడానికి ప్రత్యేక శ్రద్ధను చూపవలసి ఉంటుంది. ఈ శ్రద్ధ మల మూత్రాలను విలువలేనివిగా, జుగుప్సాకరమైనవిగా, బీభత్సమైనవిగా, గర్హనీయాలుగా చేయవలసి ఉంది. మానవుడు నిటారు స్థితిని అలవరచుకొన్నాక నాసికోద్దీపనలకు పట్టినగతే శరీరం నుంచి బహిష్కరించబడిన పదార్ధాలకు వాటి దుర్గంధం మూలంగా పట్టి ఉండకపోతే అటువంటి విలువల విపర్యయం జరిగిఉండేది కాదు. అందుకని, జీవ దమనానికి మొట్టమొదటిగా పాయు కామోద్రేకం గురయ్యింది. ఇది నాగరికతకు మార్గం సుగమం చేసింది. పాయు కామోద్రేకం ఇలా పరివర్తనం చెందడానికి ఒక సామాజికాంశం కారణం. మానవుడు ఎంతగా ప్రగతిచెందినా, తన మల మూత్రాలను కాకుండా, ఇతరుల మల మూత్రాలను మాత్రమే అసహ్యించుకుంటాడు. అందువల్ల, పరిశుభ్రంగా లేని వ్యక్తి–మల మూత్రాలను దాచని వ్యక్తి – ఇతరులకు ఇబ్బంది కలిగించిన వాడవుతున్నాడు. అట్టి వ్యక్తి అవతలి వారికి ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదు. మనం సాధారణంగా పరుషంగా వాడే తిట్లన్నీ దానినే ధృవీకరిస్తున్నాయి. మనిషి జంతు ప్రపంచంలో తనకు అత్యంత విశ్వాస పాత్రమైన కుక్క పేరును ఒక తిట్టు పదంగా ఉపయోగించడాన్ని అర్ధం చేసుకోవడం కష్టమే. అయితే, దానికి ఉన్న రెండు లక్షణాలవల్ల కుక్క మనిషి నుండి ఈ విధమైన ద్వేషానికి గురయ్యింది. వాసన పట్టడం దాని ప్రధాన లక్షణం. దానికి మల మూత్రాలంటే అసహ్యంలేదు. అది తన లైంగిక కార్యాలకు సిగ్గుపడదు.

జీవనానికి ద్వంద్వ పునాది ఉంది. మొదటిది, బాహ్యావసరం సృష్టించిన పనిచేయక తప్పని స్థితి. రెండవది అయిన ప్రేమశక్తి పురుషుణ్ణి తన లైంగిక వస్తువు - స్త్రీ - మొదటి ఎడబాటుకు అయిష్టుణ్ణి చేసింది. అంతేకాదు, తన నుండి విడివడ్డ, తనలో భాగమైన తన బిడ్డను వదలుకోవడానికి స్త్రీని విముఖురాలిని చేసింది. ప్రేమ, ఆవశ్యకతలు నాగరికతకు మాతా పితలయ్యాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో కలిసి జీవించగలగడం నాగరికత ప్రథమ ఫలితం. ఈ రెండు మహా శక్తులు ఈ విషయంలో సహకరించు కుంటున్నాయి గనుక, నాగరికతా వికాసం బాహ్య ప్రపంచం మీద మరింత నియంత్రణ దిశగా, సమూహాల్లో జనం ఇంకా ఎక్కువగా నివసించే దిశగా ఎలాంటి ఆటంకాలు లేకుండ పయనిస్తుందని ఆశించవచ్చు. నాగరికత, దాని భాగస్వాముల మీద, వారిని సుఖపెట్టే విధంగా కాక మరోవిధంగా ఎలా పనిచేస్తుందో అర్థంచేసుకోవడం అంత తేలిక కాదు.

ఏ వైపు నుంచి ఏది అడ్డం వస్తుందో అని అన్వేషించే ముందు నాగరికతకు ప్రేమ ఒక పునాది అనే గుర్తింపు, లోగడ మనం చేసిన చర్చలో వదిలివేసిన ఖాళీని పూరించడానికి మరొక దిశలో ప్రయత్నించడానికి ఒక మిషగా పనికి రావచ్చు. లైంగిక (జననాంగ) ప్రేమ తనకు అత్యంత బలమైన సంతృప్తి అనుభవాలను కలిగించిందని, అది వాస్తవానికి సుఖం అంటే ఏమిటో తెలియజేసే ఒక మూల రూపాన్ని తనకు అందించిందని మనిషి కనుగొన్న విషయం, అతనికి తన జీవితంలో సుఖ తృప్తికి లైంగిక బంధాలను ఆశ్రయించాలనీ, జననాంగ కామోద్రేకాన్ని తన జీవిత కేంద్ర బిందువుగా చేసుకోవాలని సూచించి ఉంటుందని అక్కడ మనం చెప్పాం. అంతేకాదు, అతడలా చేయడంలో బాహ్య ప్రపంచంలో ఒక భాగమయిన అతడు ఎంచుకున్న ప్రేమ వస్తువు మీద ఆధార పడడం అత్యంత ప్రమాదకరమార్గమని, ఆ ప్రేమవస్తువు నిరాకరిస్తేనో లేక అవిశ్వాసంతోనో, మరణం తోనో దాన్ని పోగొట్టుకొంటేనో అతను తీవ్రమైన బాధకు గురవుతాడనీ అక్కడ చెప్పడం జరిగింది. ప్రతి యుగంలోనూ జ్ఞానులు ఈ పద్ధతిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. అయినాకూడ, ప్రజలలో అధిక భాగం దీని ఆకర్షణ నుంచి బయటపడలేదు.

కొద్దిమంది మాత్రం, ఏది ఏమైనప్పటికీ, వారి నిర్మితి కారణంగా ప్రేమ మార్గంలో సుఖాన్ని పొందగలుగుతున్నారు. కాని ఇది జరగడానికి ముందు ప్రేమ ప్రకార్యంలో బహుముఖ పర్యవసానాలు గల మానసిక పరివర్తనలు తప్పవు. ప్రేమించబడడం కంటె

ప్రేమించడం విలువైనదని భావించడం ద్వారా వీరు ప్రేమ వస్తువు నుంచి స్వతంత్రులవుతారు. ప్రేమ వస్తువును కోల్పోవడం నుండి తమను తాము రక్షించుకునేందుకు వారు తమ ప్రేమను ఏ ఒక వస్తువుపైకో కాక మొత్తం మానవాళిమీదికి మళ్ళిస్తారు. జననాంగ ప్రేమలోని అనిశ్చితతలు, నిరాశలనుండి, దాని లైంగిక లక్ష్యాలకు విముఖం కావడం మరియు ఈ సహజాతాన్ని లక్ష్య నిరోధానికి గురైన ప్రచోదనగా మార్చడం ద్వారా తప్పించుకుంటారు. ఈ పద్ధతిలో వారు సమపాళ్ళలో స్థిర, వాత్సల్యానుభూతి పొందుతారు. ఈ అనుభూతి లైంగిక ప్రేమ తుఫాను ప్రకంపనల నుంచే పుట్టినా, దానికి దీనికి ఏ మాత్రం బాహ్య సాదృశ్యం లేదు. ఇట్టి అంతర్గత సుఖానుభూతి పొందడం కోసం ఈ విధంగా ప్రేమను వినియోగించడంలో బహుశ అసీజె (Assisi)కి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ చివరికంటా వెళ్ళాడు. సుఖ సూత్రాన్ని సంతృప్తి పరిచే ఉపాయంగా దేనినైతే మనం గుర్తించామో, దానిని తరచు మతంతో ముడిపెట్టడం జరిగింది. అహానికి – వస్తువులకు మధ్య లేదా వస్తువులకు – వస్తువులకు మధ్య తేడాను విస్మరించడం జరిగిన మారుమూల ప్రాంతాలలో ఈ సంబంధం ఉండి ఉండవచ్చు. ఒకానొక నైతిక దృక్పథం ప్రకారం – ఈ నైతిక దృక్పథం గాధ ప్రేరణ ఇప్పుడు చేరగల అత్యున్నత శిఖరం. మన చర్చ ఈ తొలి దశలోనే ఈ దృక్పథం మీద నాకున్న రెండు ముఖ్య అభ్యంతరాలను ప్రస్తావించాలను కుంటున్నాను. విచక్షణా రహిత ప్రేమ, తన వస్తువుకు అన్యాయం చేయడం ద్వారా, తన విలువలో కొంతభాగాన్ని కోల్పోతుంది. రెండోది, మనుషులంతా ప్రేమార్హులుకారు.

కుటుంబ నిర్మాణానికి దారి తీసిన ప్రేమ, ప్రత్యక్ష లైంగిక తృప్తిని త్యాగం చేయని దాని మౌలిక రూపంలోను, దాని సవరించబడ్డ రూపమైన లక్ష్యనిరోధిత అనురాగం రూపంలోను కూడ నాగరికతలో పనిచేయడం కొనసాగిస్తుంది. ఈ రెండు రూపాల్లోను చెప్పుకోతగిన సంఖ్యలో మనుషులను కలిపే పని కొనసాగిస్తుంది. ఉమ్మడి పని ప్రయోజనాల ద్వారా సాధించే దానికంటే తీవ్ర స్థాయిలో ప్రేమ ఆ పని కొనసాగిస్తుంది. 'ప్రేమ' అనే పదాన్ని భాష నిర్లక్ష్యంగా ఉపయోగించడానికి జన్యుపరమైన సమర్ధన ఉంది. స్త్రీ, పురుషుల మధ్య అట్టి సంబంధాన్ని ప్రజలు 'ప్రేమ' అని వ్యవహరిస్తారు. అయితే, కుటుంబంలో తల్లిదండ్రులు – బిడ్డల మధ్య, అన్నతమ్ముళ్ళ, అక్కచెల్లెళ్ల మధ్య ఉండే సకారాత్మక అనుభూతులను కూడా 'ప్రేమ' అనే వారు వ్యవహరిస్తారు. కాని, మనం దానిని 'లక్ష్య నిరోధిత ప్రేమ' లేదా 'అనురాగం' అని పిలవవలసి ఉంది. లక్ష్య నిరోధిత

ప్రేమ వాస్తవానికి దాని మౌలిక స్వభావంలో సంపూర్ణంగా ఇంద్రియక ప్రేమే. మనిషి అచేతనంలో ఇంకా అది అలాగే ఉంది. ఈ రెండూ గూడ - సంపూర్ణ ఇంద్రియక ప్రేమ, లక్ష్య నిరోధిత ప్రేమ - కుటుంబం వెలుపలికి విస్తరించి, అంతకు ముందు ఒకరినొకరు ఎరుగని మనుషుల మధ్య నూతన బంధాలను ఏర్పరుస్తాయి. జననాంగ ప్రేమ నూతన కుటుంబాల ఏర్పాటుకు, లక్ష్య నిరోధిత ప్రేమ 'స్నేహాలకు' దారితీస్తాయి. సాంస్కృతికంగా ఈ స్నేహాలు విలువైనవి. జననాంగ ప్రేమకున్న పరిమితులు వీటికి ఉండవు. ఉదాహరణకు జననాంగ ప్రేమ ప్రత్యేకితం (exclusive). పరిణామ గతిలో ప్రేమ-నాగరకతల సంబంధం అసందిగ్ధతను కోల్పోతుంది. ఒక ప్రక్క నాగరికత ప్రయోజనాలకు ప్రేమ వ్యతిరేకంగా నిలుస్తుంది. మరోవైపు నాగరికత ప్రేమను ఆంక్షలతో బెదిరిస్తుంది.

రెండింటిమధ్య ఈ ఘర్షణ తప్పించుకోలేనిదిగా కనిపిస్తుంది. దీనికిగల కారణాలను మనం వెంటనే గుర్తించలేం. అది మొదట్లో కుటుంబానికి, విస్తృత సమూహానికి మధ్య ఘర్షణగా అభివ్యక్త మవుతుంది. వ్యక్తి ఈ విస్తృత సమాజానికి చెంది ఉంటాడు. నాగరికత చేసే ముఖ్యమైన పనులలో ఒకటి ప్రజలను సమూహాలలోకి తీసుకురావడమేనని ఇదివరకే మనం గ్రహించాం. కాని, కుటుంబం వ్యక్తిని వదులుకోదు. ఒక కుటుంబ సభ్యులు ఒకరికొకరు ఎంత దగ్గరైతే, తరచు వారు ఇతరులకు అంత దూరం కావడానికి ప్రయత్నిస్తారు. ఆ మేరకు వారికి విస్తృత జీవిత వలయంలోకి ప్రవేశించడం కష్టతరమవుతుంది. జాతి వికాసపరంగా చూస్తే ఉమ్మడి జీవిత విధానం ముందరిది. ఇప్పటికీ బాల్యంలో ఉండేది ఇదొక్కటి మాత్రమే. తరువాత ఆర్జించిన సాంస్కృతిక జీవిత విధానం తనను అధిగమించడానికి అది అవకాశమివ్వదు. తన కుటుంబం నుంచి తనను తాను వేరుచేసుకోవడం ప్రతి యుక్త వయస్కునికీ ఒక సమస్యే అవుతుంది. సమాజం ఈ సమస్య పరిష్కారానికి ఋతుక్రమ ఆరంభానికి, ఉపనయనానికి సంబంధించిన సంస్కారాల ద్వారా దోహదం చేస్తుంది. ఈ కష్టాలన్నీ మానసిక వికాసాంతర్గతాలేననే భావన కలుగుతుంది. నిజానికి, పునాది స్థాయిలో ఇవన్నీ జీవాభివృద్ధికికూడా అంతర్గతాలే.

ఏ స్త్రీలైతే మొదట్లో తమ ప్రేమను నాగరికతకు పునాదిగా చేశారో, వారే తర్వాత నాగరికతకు వ్యతిరేకంగా నిలిచి, తమ ప్రతిబంధక, నిరోధక ప్రభావాన్ని ప్రదర్శించారు. కుటుంబ లైంగిక జీవిత ప్రయోజనాలకు స్త్రీలు ప్రాతినిధ్యం వహిస్తారు. నాగరికత

అధికాధికంగా మగవారి వ్యవహారమైంది. పోనుపోను మరింత కష్టమైన కర్తవ్యాలను నాగరికత వారి ముందుంచి, సహజాత ఉదాత్తీకరణ భారాన్ని వహించమని వారిని ఒత్తిడి చేస్తుంది. ఈ సహజాత ఉదాత్తీకరణ భారాన్ని స్త్రీలు వహించలేరు. అనంత ప్రమాణంలో మానసిక శక్తి మనిషికి అందుబాటులో ఉండదు కనుక, అతను తగు ఉపాయంతో లిబీడోని విభజించి తన కార్యాన్ని సాధించుకోవలసి ఉంటుంది. సాంస్కృతిక లక్ష్యాలకు అవసరమైన శక్తిని పురుషుడు స్త్రీలనుంచి, లైంగిక జీవితంనుంచి చాలామేరకు ఉపసంహ రించుకుంటాడు. తోటి పురుషులతో అతని నిరంతర సంయోగం, వారితో అతనికున్న సంబంధాల మీద ఆధారపడడం అతనిని భర్తగా, తండ్రిగా నిర్వర్తించవలసిన విధులకు దూరం చేస్తుంది. ఈ విధంగా, నాగరికత కారణంగా తాను నేపథ్యంలోకి తోసివేయబడ్డానని భావించిన స్త్రీ, దానియెడ వైరి దృక్పథాన్ని అనుసరిస్తుంది.

లైంగిక జీవితాన్ని అదుపాజ్ఞలలో ఉంచాలనే నాగరికతా ప్రవృత్తి, సాంస్కృతిక విభాగాన్ని విస్తృతీకరించాలనే దాని రెండో ప్రవృత్తికంటే అస్పష్టమైందేమీ కాదు. నాగరికత మొదటి దశ అయిన తెగ సంకేత దశ నాటికే వావివరుస లేకుండ లైంగిక సహభాగిని ఎంచుకోవడం నిషేధించ బడింది. సర్వకాలాల్లోకి మానవుని కామజీవితం అనుభవించిన అత్యంత తీవ్ర విచ్ఛేదం బహుశ ఇదేనేమో. స్త్రీ పురుషులను ప్రభావితం చేసే మరికొన్ని ఆంక్షలను, నియమాలను చట్టాలు, ఆచారాలు విధిస్తాయి. నాగరికతలన్నీ ఈ విషయంలో సమానంగాలేవు. మిగిలివున్న లైంగిక స్వేచ్ఛను కొంతమేరకు సమాజ ఆర్థిక నిర్మితికూడ ప్రభావితం చేస్తుంది. మనకు ఇంతకు మునుపే తెలిసినట్లుగానే, నాగరికత ఆర్థికావసరాల నియమాలకు లోబడి వర్తిస్తుంది. ఎందుకంటే తన ప్రయోజనాలకోసం పెద్ద మొత్తంలో వినియోగించుకొనే మానసిక శక్తిని లైంగికత నుండి ఉపసంహరించుకోవలసిన అవసరం దానికి ఉంది. లైంగికత విషయంలో నాగరికత సమాజంలోని ఒక వర్గం మరొక వర్గాన్ని దోపిడికి గురిచేసి నప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో అలా ప్రవర్తిస్తుంది. అణచబడిన అంశాలు మళ్లీ పైకి ఎక్కడ పెల్లుబికి వస్తాయో అనే భీతి. సమాజాన్ని కొన్ని కఠినమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకొనేట్లు చేసింది. అలాంటి అభివృద్ధిలో మన పాశ్చాత్య నాగరికత ఉన్నత స్థాయికి చేరింది. ఒక సాంస్కృతిక సమూహం పిల్లల లైంగిక జీవితాభివ్యక్తిని నిషేధించడంతో ప్రారంభించడం మానసికంగా సరైనదే. ఎందుకంటే, బాల్యంలో దానిని అదుపులో పెట్టకుండా, యుక్త వయస్సులో లైంగిక లాలసతను అదుపు చేయడం సాధ్యం కాదు. కాని, తేలికగా రుజువు చేయగలిగిన, వాస్తవానికి కొట్టవచ్చినట్లు కనిపించే

దృగ్విషయాల్ని నిరాకరించేంత వరకు గనుక అట్టి సమూహం వెళితే, అది ఏ విధంగాను సమర్థనీయం కాదు. లైంగికంగా పరిణతి చెందిన వ్యక్తికి సంబంధించిన మేరకు లైంగిక వస్తువు ఎంపిక విజాతి లింగానికే - అంటే పురుషుడైతే స్త్రీకి, స్త్రీ అయితే పురుషుడికి - పరిమితం. జననాంగేతర తృప్తిని భ్రష్టశీలత (perversion)గా ఎంచి నిషేధించడం జరిగింది. ఈ నిషేధాలలో కనిపించే అందరికీ ఒకే రకమైన లైంగిక జీవితం ఉండాలి అనే నియమం, మానవుల లైంగిక నిర్మితిలోని అసాదృశ్యతలను - అవి స్వతస్సిద్ధాలైనా, ఆర్జితాలైనా - విస్మరిస్తుంది. వారిలో అధిక సంఖ్యాకులకు లైంగికానందాన్ని దూరం చేస్తుంది. ఆవిధంగా అది తీవ్ర అన్యాయానికి మూలం అవుతుంది. అటువంటి ఆంక్షల ఫలితమేమంటే, మానసిక ఆరోగ్యవంతులలో - వారి శారీరక నిర్మితి ఆటంకం కానివారు - మొత్తం లైంగిక అభిరుచులు, ఏ మాత్రం నష్టం జరగకుండా, వాటికి తెరిచి ఉన్న మార్గాలలోకి పయనిస్తాయి. కాని విజాతి లైంగిక (heterosexual) జననాంగ ప్రేమ (genital love) నిషేధం నుంచి మినహాయించబడినప్పటికీ, సమాజ జనిత ఆమోదం, ఏక దంపతీ వివాహం తప్పనిసరి చేయబడడం ద్వారా కొన్ని పరిమితులకు గురయ్యింది. నేటి నాగరికత కొన్ని విషయాలను స్పష్టం చేస్తుంది : ఒక స్త్రీ ఒక పురుషుడి మధ్య ఒంటరి, అవిభాజ్య పునాదిపై నిలిచిన లైంగిక సంబంధాలను మాత్రమే అది అనుమతిస్తుంది. లైంగికత దానంతటది ఒక సుఖ మూలకం కావడానికి నాగరికత ఇష్టపడదు. మానవజాతి ప్రత్యుత్పత్తికి లైంగికత తప్ప వేరే ప్రత్యామ్నాయం ఇప్పటివరకు లేనందువలన మాత్రమే లైంగికతను నాగరికత అంగీకరిస్తుంది.

ఇది ఒక అతిగా వర్ణించిన చిత్రం. కొద్దికాలంపాటు కూడా దానిని ఆచరణలో పెట్టడం అసంభవమని రుజువైందని ప్రతి ఒక్కరికి తెలుసు. తమ లైంగిక స్వేచ్ఛ మీద జరిగిన అటువంటి విస్తృత దురాక్రమణకు బలహీనులు మాత్రమే తలవంచుతారు. బలవంతులు తలవంచరు కాని ఒక నష్టపరిహారం ప్రాతిపదిక మీద ఇది జరిగింది. ఈ షరతు తరువాత ప్రస్తావించబడుతుంది.[1] తన శాసనాల ప్రకారం శిక్షించితీరవలసిన అనేక అతిక్రమణలను నిశ్శబ్దంగా అంగీకరించవలసిన పరిస్థితి నాగరిక సమాజానికి ఏర్పడింది. నాగరిక సమాజం ఎలాగు తన లక్ష్యాలన్నింటిని సాధించ లేదు గనుక, అది అటువంటి దృక్పథాన్ని అవలంబించడం పూర్తిగా నిరపాయకరమని భావించే తప్పు మరొకవైపు మనం చేయకూడదు. నాగరిక మానవుని లైంగిక జీవితం తీవ్రంగా వికలమైంది.

---

1. (ఈ నష్టపరిహారం కొంతమేరకు భద్రతను పొందడం.)

మన జుట్టు, పళ్ళు అవయవాలుగా అనిపించిన విధంగానే ఒక ప్రకార్యంగా లైంగికత విషయంలో కూడా లోనికి ముడుచుకొనిపోయే క్రమం జరుగుతున్నట్లు కొన్నిసార్లు అనిపిస్తుంది. సుఖానుభూతులకు, తద్వారా మన జీవిత లక్ష్యసాధనకు, మూలాధారంగా దాని ప్రాముఖ్యత తగ్గిపోయిందని భావించడం సరైనదే[1].

కేవలం నాగరికతా ఒత్తిడి మాత్రమే కారణం కాదు, అసలు ఆ ప్రకార్య స్వభావంలోనే పూర్తి తృప్తిని మనకు దక్కనీయకుండ చేసి, మనలను వేరే మార్గాలు పట్టించేది ఏదో ఉందని కొన్నిసార్లు అనిపిస్తుంది. ఏదీ తేల్చిచెప్పడం కష్టం.[2]

---

1. *ఈ రోజు అందరిచే గుర్తించబడిన ఆ సున్నిత ఆంగ్ల రచయిత జాన్ గాల్స్‌వర్ధీ రచనలలోని ఒక చిన్న కథను గురించి మొదటినుంచి నేను ఉన్నత అభిప్రాయాన్ని ఏర్పరచుకొన్నాను. ఆ కథ పేరు 'ఆపిల్ వృక్షం'. నేటి నాగరిక ప్రజా జీవనంలో ఇద్దరు మనుషుల మధ్య సరళ, సహజ ప్రేమకు ఎలా చోటు లేకుండాపోయిందో ఈ కథ మనకు తెలియచేసింది.*

2. *పైన చెప్పిన అభిప్రాయాన్ని ఈ దిగువ పరిశీలనలు బలపరుస్తున్నాయి. మానవుడు జంతు ప్రపంచానికి చెందిన (ఇతర జంతువుల వలె) స్పష్టమైన ద్విలైంగిక ప్రవృత్తిని కలిగిన జీవి. సౌష్ఠవంతో కూడిన రెండు సమ భాగాల కలయికగా ఉంటాడు వ్యక్తి. కొంతమంది పరిశోధకుల ప్రకారం ఆ రెండు సగాలలో ఒకటి పూర్తిగా మగ, ఒకటి పూర్తిగా ఆడ. ఈ రెండు సగాలలో దేనికది మౌలికంగా స్త్రీ పురుష లక్షణ సమన్వితమైనదై ఉండడమూ సంభవమే. లింగం (sex) జైవిక వాస్తవం, మానసిక జీవితంలో దీనికి అసాధారణ ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, మనోవైజ్ఞానికంగా దానిని అర్థం చేసుకోవడం కష్టం. ప్రతి మానవుడు ఆడ, మగ రెండింటి సహజాత ప్రచోదనలను, అవసరాలను, గుణాలను ప్రదర్శిస్తాడని చెప్పడానికి మనం అలవాటుపడ్డాము. కాని శరీర నిర్మాణ శాస్త్రం ఆడ, మగతనాల లక్షణాలను చెప్పగలగడం నిజమే అయినా, మనోవిజ్ఞాన శాస్త్రం ఆ పని చేయలేదు. మానసిక శాస్త్రానికి ఆడ – మగ తేడా నిష్క్రియాత్మకత, క్రియాత్మకతల మధ్య తేడాగా అయిపోయింది. ఇందులో మనం చాలా త్వరపడి క్రియాత్మకతను మగతనంతోను, నిష్క్రియాత్మకతను ఆడతనంతోను సాదృశ్యంగా పరిగణిస్తాం. ఈ విషయం జంతువులలో సార్వత్రికమని రుజువుకాలేదు. ద్విలైంగికతా సిద్ధాంతం చుట్టూ ఇంకా చీకట్లు ఆవరించే ఉన్నాయి. దీనికి సహజాత సిద్ధాంతంతో ఎటువంటి సంధానాన్ని ఇంకా కనుక్కోకపోవడం మనోవిజ్ఞాన శాస్త్రంలో పెద్ద అవరోధమే. ఇది ఎలాగున్నా ప్రతి వ్యక్తి తన లైంగిక జీవితంలో ఆడ, మగ వాంఛలను ఒకే వస్తువు సంతృప్తి పరచలేదని, వాటి రెండింటినీ దూరం దూరంగా ఉంచి, దేనికనుగుణమైన మార్గంలోకి దానిని మళ్ళించకపోతే, అవి ఒకదానికొకటి అడ్డు అవుతాయని గుర్తించడానికి మనం సిద్ధంగా ఉండాలి. ఇబ్బంది కలిగించే మరొక పరిస్థితి ఏమిటంటే, లైంగిక సంబంధంలో – దానికి వుండే (క్రూర) లైంగిక పరహింసా ప్రవృత్తికి అదనంగా – తరచు కొంత మోతాదులో స్పష్టమైన ప్రవృత్తి కలిసి ఉంటుంది. తన భర్త ఒక*

వారంగా తనను కొట్టడం లేదు కనుక అతడు తనను ప్రేమించడంలేదని వాపోయే ఒక గ్రామీణ స్త్రీ ప్రదర్శించిన అవగాహన, సహనశీలత స్థాయిలో, ఈ చిక్కులను ప్రేమ వస్తువు ప్రతిసారి చూడడం జరగదు.

ఈ విషయాన్ని మరింత లోతుగా పరిశీలించే ప్రాక్కల్పన ఏదైనా ఉంది అంటే, అది ఇంతకు ముందు నేను 47-48 పేజీలలోని పాద సూచికలో చెప్పిన దాని నుంచి ప్రారంభమయ్యేది. మనిషి నిటారు భంగిమ స్వీకరించడంతో, వాసన పీల్చే శక్తి ప్రాధాన్యత తగ్గిపోవడంతో, పాయు కామోద్రేకం ఒక్కటి మాత్రమే కాక అతని మొత్తం లైంగికత జైవిక దమనానికి గురయ్యే ప్రమాదం ఏర్పడింది. అలా అయిన కారణంగా, లైంగిక ప్రకార్యంతో పాటు మనం వివరించి చెప్పలేని ప్రతికూలత కలిసి ఉంటుంది. ఇది లైంగిక ప్రకార్యాన్ని పూర్తి సంతృప్తిని పొందనీయకుండ నిలువరించి, లైంగిక లక్ష్యం నుంచి దానిని తప్పించి, ఉదాత్తీకరణలలోకి, లిబీడో స్థానాంతరీకరణలలోకి మలుపుతుంది. లైంగిక జీవితం అంటే ఇటువంటి ఒక ప్రాథమిక ప్రతికూల దృక్పథం ఉంటుందని బ్లూలెర్ ఒకసారి చెప్పడం నాకు తెలుసు. నాడీ రోగులందరు - ఇంక ఇతరులు అనేకులు గూడ - మనం మూత్రానికి, మలానికి మధ్య పుట్టామనే' వాస్తవాన్ని అంగీకరించరు. జననాంగాలు కలిగించే గాఢ వాసనలను చాలామంది సహించలేరు. అది వారి లైంగిక సంయోగ క్రియను చెడగొడుతుంది. నాగరికతా వికాసంతో కలిసి వృద్ధి చెందిన లైంగిక దమనానికి అత్యంత లోతైన మూలం అంతకుముందరి జంతు స్థితికి వ్యతిరేకంగా, మనిషి నిటారు భంగిమ ద్వారా సాధించిన నూతన జీవితానికి జైవిక రక్షణ కల్పించడమని మనం కనుగొనవచ్చు. ఈ శాస్త్రీయ పరిశోధనా ఫలితం తరచు మనకు వినిపించే సామాన్య అపోహలతో అసాధారణ రీతిలో ఏకీభవిస్తుంది. ప్రస్తుతానికి ఈ విషయాలన్నీ శాస్త్రం ధృవీకరించని అనిర్ధారిత సంభావ్యతలు మాత్రమే. మనం మరో విషయం మరువరాదు. మనం కాదనలేని నాసికోద్దీపనల క్షీణత ఉన్నప్పటికీ, మనకు జుగుప్సాకరమనిపించే జననాంగాల గాఢమైన వాసనలకు లైంగికోద్దీపకాలుగా ఎంతో విలువనిచ్చి, వాటిని వదిలిపెట్టడానికి నిరాకరించేవారు ఐరోపా ప్రజలలో కూడా ఉన్నారు.

V

లైంగిక జీవితంలోని ఈ అవరోధాలను సరిగ్గా నాడీరోగులుగా పరిగణించబడేవారు సహించలేరని మనోవిశ్లేషణ శాస్త్రం మనకు ఎరుకపరిచింది. నాడీరోగి తన కొరకు, తన రోగలక్షణాలలో, ప్రత్యామ్నాయ సంతృప్తులను సృష్టించుకొంటాడు. ఇవి వాటంతటవి అతనికి దు:ఖం కలిగించడంగాని లేదా పరిసరాలతో, అతడు నివసించే సమాజంతో అతనికి ఉన్న సంబంధాలలో ఇబ్బందులు సృష్టించడం ద్వారా అతడి బాధకు మూలకారణాలు కావడం గాని జరుగుతుంది. ఈ రెండో విషయాన్ని అర్థం చేసుకోవడం తేలికే. మొదటిది నూతన సమస్యను తెచ్చిపెడుతుంది. కాని నాగరికత లైంగిక తృప్తి పరిత్యాగం మాత్రమే కాక ఇతర పరిత్యాగాలను కూడా కోరుతుంది.

సాంస్కృతిక వికాసంలో ఇమిడిఉన్న క్లిష్టతను వికాసంలోని ఒక సాధారణ సమస్యగా పరిగణించి పరిశీలించాము. ఈ క్లిష్టతకు లిబీడో జడత్వం, కొత్తదానికోసం పాతవైఖరిని వదులుకోవడానికి అది చూపే విముఖతలను కారణాలుగా చూపించాము. నాగరికత అనేకమంది వ్యక్తుల మధ్య సంబంధాల మీద ఆధారపడితే, లైంగిక ప్రేమ ఇరువురి మధ్య సంబంధం మీద ఆధారపడుతుంది. ఇందులో మూడో మనిషి ప్రమేయం అప్రస్తుతం. ఆందోళనాకారకం. నాగరికత, లైంగికతల మధ్య వైరుధ్యాన్ని ఈ పరిస్థితి నుండి వచ్చినట్లు మనం చూపిస్తున్నప్పుడు దాదాపు పై విషయాన్నే చెబుతున్నాము. ఒక ప్రేమ సంబంధం శిఖర స్థితిలో ఉన్నప్పుడు, పరిసరాలకు సంబం ధించిన వాటిపట్ల ఆసక్తికి అందులో చోటు ఉండదు, ప్రేమజంట వారికి వారే లోకంగా ఉంటారు. వారికి పుట్టిన బిడ్డ గూడ వారి సంతోషానికి అవసరం లేదు. మరే ఇతర సందర్భంలో కూడ ప్రణయం (Eros) తన అస్తిత్వసారాన్ని, అంటే ఒకరికంటే ఎక్కువమందిని ఒకరిగా రూపొందించే తన లక్ష్యాన్ని, ఇంత స్పష్టంగా అభివ్యక్తం చేయలేదు. అయితే, ఇద్దరు మనుషుల మధ్య ప్రేమద్వారా దీనిని సాధించిన తరువాత ప్రణయం మరింత ముందుకు పోవడానికి తిరస్కరిస్తుంది.

లిబీడో పరంగా తమలో తాము సంతృప్తులైన, ఉమ్మడి పని, ఉమ్మడి ప్రయోజనాలతో బంధితులైన ఇలాంటి ద్వంద్వ వ్యక్తులున్న సాంస్కృతిక సముదాయాన్ని మనం బాగానే

ఊహించగలం. ఇలాగే గనుక జరిగినట్లయితే, లైంగికత నుండి ఏ శక్తిని ఉపసంహరించ వలసిన అవసరం నాగరికతకు ఉండేది కాదు. కాని ఈ వాంఛనీయ పరిస్థితి ఇప్పుడు కాని, ఇంతకుముందెన్నడు కాని లేదు. మనం ఇంతవరకు అనుమతించిన బంధాలతో నాగరికత ఎప్పుడూ తృప్తిపడలేదని వాస్తవికత మనకు చూపిస్తున్నది. సముదాయ సభ్యులను లిబీడో పరంగా ఒకచోట కలిపి ఉంచడంతో పాటు, ఈ లక్ష్యం కోసం తన కందుబాటులో ఉన్న ప్రతి మార్గాన్ని అది ఉపయోగిస్తుంది. సముదాయ సభ్యుల మధ్య బలవత్తరమైన తాదాత్మ్యీకరణలను స్థాపించే ప్రతి పద్ధతిని అది అనుసరిస్తుంది. స్నేహ సంబంధాల ద్వారా సముదాయ బంధాన్ని బలపరచడానికి లక్ష్య నిరోధిత లిబీడోను పెద్ద ఎత్తున రంగంలోకి దింపుతుంది. ఈ లక్ష్యాల విజయానికి లైంగిక జీవితంమీద ఆంక్షలు తప్పనిసరి. కాని, నాగరికతను ఈ బాటననుసరించమని ఒత్తిడి చేసేది, లైంగికత పట్ల దానికి వ్యతిరేకతను కలిగించేది ఏమిటో మనం అర్థం చేసుకోలేకపోతున్నాం. ఇంతవరకు మనం కనుక్కోలేని ప్రతిబంధక కారకమేదో ఉండి తీరాలి.

నాగరిక సమాజ ఆదర్శ నిర్దేశాలుగా మనం వ్యవహరిస్తున్న వాటిలో ఒకటి ఇందుకు ఆధారం అందించవచ్చు, ఆ ఆదర్శం ఇది. 'నీవు నీ పొరుగువానిని నీ వలె ప్రేమించు'. ఈ ఆదర్శం ప్రపంచ ప్రసిద్ధం. నిస్సందేహంగా ఇది క్రైస్తవం కన్న ముందరిది. కాని క్రైస్తవం గర్వంగా దానిని తనదిగా చెప్పుకొంటున్నది. కాని నిజానికి ఇది మరీ అంత పురాతనమైనది కూడా కాదు. చరిత్ర ఆరంభం తరువాత గూడ అది మానవాళికి ఇంకా కొత్తదే. దీనిని మనం మొదటిసారిగా వింటున్నట్లు సరళ దృష్టితో చూద్దాం. అలా చూసినప్పుడు మనకు కలిగే సంభ్రమాశ్చర్యాలను అణచుకోలేం. దానిని మనం ఎందుకు ఆచరించాలి ? దాని వలన మనకు ఏం మంచి జరుగుతుంది ? కాని, అన్నింటికంటె ముందు దానిని సాధించడం ఎలా ? అదెలా సంభవమవుతుంది ? నా ప్రేమ నాకు విలువైంది. దానిని విచక్షణా రహితంగా విసరి పారవేయలేను. అది నాకు కొన్ని విధులను నిర్దేశిస్తుంది. వాటి నిర్వహణ కోసం ఎన్నో త్యాగాలకు నేను సిద్ధపడాలి. ఒకరిని నేను ప్రేమించానంటే, అతను ఏదో విధంగా దానికి అర్హుడై ఉండాలి. (అతను నాకు ఏ విధంగా ఉపయోగపడతాడనే విషయాన్ని, లైంగిక వస్తువుగా నాకతని ఉపయోగం ఏమిటి అనేదాన్ని గూడ లెక్కలోకి తీసుకోను. ఎందుకంటె నీవు నీ పొరుగువానిని నీవలె ప్రేమించు అనే నీతి సూత్రానికి ఈ రెండు సంబంధాలలో ఏదీ పరిగణనలోకి రాదు) సాటి వ్యక్తి ముఖ్య విషయాలలో నన్ను పోలిఉండి, నన్ను నేను అతనిలో ప్రేమించుకోగలిగితే, అతను

నా ప్రేమకు అర్హుడవుతాడు. అతను నాకంటే అత్యంత అధికంగా పరిపూర్ణుడై, అతనిలో నా ఆత్మధర్మాన్ని నేను ప్రేమించగలిగినా, అతను నా ప్రేమకు అర్హుడవుతాడు. మళ్ళీ అతను నా మిత్రుని పుత్రుడైతే నేను అతనిని ప్రేమించాల్సి ఉంటుంది. ఎందుకంటె, అతనికేదైన హాని జరిగితే నా మిత్రుడు అనుభవించే బాధ నాకూ బాధ అవుతుంది. నేను దానిని పంచుకోవాలి. అయితే, అతను నాకు కొత్త వాడైతే, అతని యోగ్యత వల్ల కాని లేదా నా ఔద్వేగిక జీవితానికి అతను సంతరించుకొన్న ప్రాధాన్యత వల్లకాని అతను నన్ను ఆకర్షించలేకపోతే, అతనిని నేను ప్రేమించడం దుర్లభం. అలా చేస్తే నేను తప్పుచేసిన వాణ్ణవుతాను. ఎందుకంటె, నావారందరు వారిపట్ల నా ప్రేమకు విలువనిచ్చి దానిని వారికి నేను ఇస్తున్న ప్రాధాన్యతకు గుర్తుగా పరిగణిస్తున్నారు. ఇప్పుడు వారితో సమానంగా నేను ఒక కొత్త వ్యక్తిని తీసుకొచ్చి నిలిపితే, వారందరికి అన్యాయంచేసిన వాడినవుతాను, అయితే అట్టి కొత్త వ్యక్తిని అతను – ఒక పురుగులా, ఒక వానపాములా, ఒక గరికపాములా – కేవలం ఈ భూవాసి అయిన కారణంగా నేను (ఈ సార్వత్రిక ప్రేమతో) ప్రేమించ వలసివస్తే నా ప్రేమలో లవలేశం మాత్రమే అతనికి దక్కుతుంది. ఇది ఏ విధంగా చూసినా, నా వివేచన మేరకు నాకు నేను ఉంచుకునేంత కూడా కాదు. ఇలా, ఎంతో గంభీరతతో ప్రకటితమైన నైతిక సూత్రాన్ని నెరవేర్చడం హేతుబద్ధమని చెప్పలేనప్పుడు, ఇక దాని అర్థం ఏమిటి ?

ఇంకా నిశితంగా పరిశీలిస్తే మరిన్ని సమస్యలు కనిపిస్తున్నాయి. ఈ కొత్త వ్యక్తి మొత్తంమీద నా ప్రేమకు అనర్హుడని మాత్రమే ఒప్పుకోవాలి. నేనంటే అతనికి ప్రేమలేశం కూడా లేనట్లు, నన్ను గురించి ఏ మాత్రం ఆలోచించనివానిగా అతను కనిపిస్తాడు. దానివలన అతనికి ఏదైన మంచి జరుగుతుంది అనుకుంటే, నాకు హానిచేయడానికి అతను ఏమాత్రం వెనుకాడదు. నాకు అతను చేసే హానికి, దానివల్ల అతను పొందే ప్రయోజనానికి మధ్య ఏదైనా పొంతన ఉందా అని అతను ప్రశ్నించుకోడు. నిజంగా దానివల్ల ఏదైనా ప్రయోజనం పొందాల్సిన అవసరం కూడా లేదు. దానివల్ల అతనికి ఏ రకమైన వాంఛ సంతృప్తమైనా, నన్నతడు అపహసించడానికి, అవమానించ డానికి, అపవాదులు వేయడానికి, తన అధిక్య శక్తిని నా మీద ఉపయోగించడానికి వెనుకాడడు. అతడు మరింత భద్రతగా ఉండి, నేనుమరింత నిస్సహాయ స్థితిలో ఉండి ఉంటే కూడ, అతడు నాయెడ ఈ విధంగానే ప్రవర్తిస్తాడని నేను మరింత ఖచ్చితంగా భావిస్తాను. అతను గనుక వేరే విధంగా ప్రవర్తిస్తే – కొత్తవ్యక్తిగా నాపట్ల కొంత క్షమ, ఆలోచనలతో

ప్రవర్తిస్తే - నేనూ అతని యెడ, ఎటువంటి సందర్భంలోనైనా, ఎటువంటి నైతిక సూత్రంతో సంబంధం లేకుండా, అలాగే ప్రవర్తిస్తాను. నిజంగా ఈ బృహత్తరమైన సార్వత్రిక ఆజ్ఞ 'పొరుగువాడు నిన్ను ప్రేమించిన విధంగా నీవు నీ పొరుగువానిని ప్రేమించు' అని ఉంటే నేనేమీ అభ్యంతరం చెప్పను. రెండో ఆజ్ఞ ఇంకొకటి ఉంది. ఇది మొదటి దానికంటె మరింత అగోచరమయిందిగా నాకు కనిపిస్తున్నది. ఇది నాలో మరింత బలవత్తరమైన వ్యతిరేకతను రేకెత్తిస్తుంది. అదేమిటంటే 'నీ శత్రువులను ప్రేమించు' దీని గురించి మరోసారి ఆలోచించినప్పుడు, దీనిని మరింత కఠినమైన విధింపుగా పరిగణించడంలో నేను పొరపాటు చేశానని గ్రహించాను. అట్టడుగుకు పోయిచూస్తే రెండూ ఒకటే[1].'

నన్ను ఇప్పుడొక గంభీరస్వరం పెచ్చరిస్తోంది : 'నీ పొరుగువాడు నీ ప్రేమకు అర్హుడు కాడు కాబట్టే, పైగా అతడు నీ శత్రువు కాబట్టే. సరిగ్గా ఈ కారణం వల్లనే నీవు అతనిని నీకువలె ప్రేమించాలి', నేను దీనిని 'అది అసంబద్ధమైనది కాబట్టే దానిని నేను నమ్ముతున్నాను' అనే నానుడి లాంటిదిగా అర్థం చేసుకుంటాను.

నా పొరుగు వానిని, తనను తాను ప్రేమించుకొన్నట్లు నన్ను ప్రేమించమని ఆదేశిస్తే, సరిగ్గా నేను సమాధానం చెప్పినట్టే చెప్పి, అవే కారణాలతో నన్ను తిప్పికొట్టే అవకాశం ఉంది. అలాచేయడానికి అతనికి అవే వస్తుగత కారణాలు ఉండకపోవచ్చని నేను భావిస్తున్నాను. కాని నాకున్న భావనే అతనికీ ఉండవచ్చు. అలా అయినప్పటికీ మానవ ప్రవర్తనలో తేడాలుంటాయి. అలాంటి తేడాలు నియతమైనవి అనే సత్యాన్ని విస్మరించి నీతిశాస్త్రం వాటిని 'మంచి'; 'చెడు'గా వర్గీకరిస్తుంది. ఈ నిరాకరించలేని తేడాలను తొలగించనంతవరకు ఉన్నత నైతిక ఆదర్శాలపట్ల విధేయత వలన నాగరికతా లక్ష్యాలకు నష్టం వాటిల్లుతుంది. ఎందుకంటే చెడుగా ఉండడానికి అది సానుకూలత చేకూరుస్తుంది.

---

1. మంచి ఊహాపోహలున్న రచయిత - ఏ సందర్భంలోనైనా హాస్యపూరితంగా - తీవ్ర నిషేధిత మనోవైజ్ఞానిక సత్యాలకు అభివ్యక్తి నీయవచ్చు. హైనే (జర్మన్ కవి, 1797 - 1856) ఈ విధంగా చెప్పుకొన్నాడు : 'నాది అత్యంత శాంత ప్రవృత్తి. నాకున్న కోర్కెలు ఏవంటే, పూరికప్పుతో ఉన్న నిరాడంబర కుటీరం, కాని మంచిపానుపు, మంచి ఆహారం, తాజాపాలు వెన్న, కిటికీలకు పూల అలంకరణ, గుమ్మం ముందు కొన్ని అందమైన వృక్షాలు, దేవుడు గనుక నా సుఖాన్ని పరిపూర్ణం చేయదలచుకుంటే, నాకున్న శత్రువులలో ఆరుగురినో, ఏడుగురినో, ఆ చెట్లకు ఉరితీసి నన్నానందింపచేస్తాడు. వారు చనిపోయేముందు, నా హృదయం ద్రవించి, వారు నాకు తమ జీవితకాలంలో చేసిన అన్యాయాలకు వారిని నేను క్షమిస్తాను, ఎవరైనా తన శత్రువులను క్షమించితీరాలనేది నిజం - కాని వారిని ఉరితీయకముందు కాదు'.

ఫ్రెంచ్ ఛేంబర్‌లో మరణశిక్ష మీద చర్చ జరుగుతున్నప్పటి సంఘటన ఇప్పుడు అనివార్యంగా గుర్తురాక మానదు. అందులో ఒక సభ్యుడు దాని రద్దుని బలపరుస్తూ తీవ్రంగా వాదిస్తున్నాడు. ఆ వాదనను మార్మోగే చప్పట్లతో మిగతావారు బలపరుస్తున్నారు. సరిగ్గా అప్పుడే ఒక గొంతు ఇలా పలికింది : 'హంతకులే మొదటి అడుగువేయాలి'.

దీని అంతటికి వెనక ఉన్న వాస్తవం - దీనిని జనం ఎప్పుడూ నిరాకరించ సిద్ధంగా ఉంటారు - మనుషులు కేవలం ప్రేమించబడాలని కోరుకునే, తమపై దాడి జరిగితే మహా అయితే తమను తాము కాపాడుకోవడం మాత్రమే చేయగలిగిన సాత్విక జీవులేమీ కారు. దీనికి భిన్నంగా, మనుషులు వారి సహజాత ప్రవృత్తిలో గణనీయమైన భాగంగా దౌర్జన్యతత్వం ఉన్న జీవులు. దీని పర్యవసానం ఏమంటే, వారికి పొరుగువాడు కేవలం సహాయకుడు మాత్రమే కాదు లేదా లైంగిక వస్తువు మాత్రమే కాదు. వారి దౌర్జన్య ప్రవృత్తిని తన మీద ప్రయోగించి సంతృప్తి పొందడానికి, జీతభత్యాలు లేకుండా వారు తనను దోచుకోవడానికి, తన ఇష్టంలేకుండానే తనను లైంగిక వస్తువుగా వాడుకోవడానికి, తన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి, తనను అవమానపర్చడానికి, తనను హింసించడానికి, చిత్రవధ చేయడానికి, చంపడానికి వారిని ప్రలోభపెట్టేవాడు కూడా. మనిషికి తోటి మనిషే తోడేలులాంటివాడు. యావత్ జీవిత, చారిత్రక అనుభవం నేపథ్యంలో ఈ విషయాన్ని తిరస్కరించే ధైర్యం ఎవరికి ఉంటుంది ? తప్పనిసరిగా, ఈ క్రూర దౌర్జన్య ప్రవృత్తి ఏదో ఒక మిష కోసం ఎదురుచూస్తూ ఉంటుంది లేదా మరోపనిలో తన్ను తాను నియోగించుకుంటుంది. ఈ మరో పని లక్ష్యాలు తేలికపాటి చర్యలతో కూడా సాధించగలిగినవి అయి ఉండవచ్చు.పరిస్థితులు అనుకూలంగా ఉండి, మానసిక ప్రతికూల శక్తులు అడ్డుకోనప్పుడు అయత్నంగానే దౌర్జన్యం అభివ్యక్తి పొందుతుంది. ఇంక మనిషిని ఒక క్రూరమృగాన్ని చేస్తుంది. ఈ క్రూరమృగాల్లాంటి మనుషులు తమ జాతి అని కూడా చూడరు. జాతుల వలస దశలో, హూణుల దండయాత్రలలో, మంగోలులని పిలవబడే ప్రజలు చెంఘిజ్‌ఖాన్, టామర్లేన్‌ల నాయకత్వంలో చేసిన యుద్ధాలలో, పవిత్ర మత యుద్ధంలో జెరూసలెంను పట్టుకొన్నప్పుడు, ఇంకా చెప్పాలంటే ఇటీవలి (మొదటి) ప్రపంచ సంగ్రామంలో జరిగిన దారుణాలను, అకృత్యాలను తలచుకున్న వారెవరైనా ఈ దృక్పథపు వాస్తవానికి వినమ్రతతో తలవంచవలసిందే.

దౌర్జన్య ప్రవృత్తిని మనలోను పసిగట్టవచ్చు. ఇతరులలో అది ఉందనుకోవడం కూడా సమంజసమే. ఈ దౌర్జన్య ప్రవృత్తి కారణంగానే పొరుగువారి తోడి మన సంబంధాలు

చెదిరిపోతు న్నాయి. దీని కారణంగానే మన నాగరికత ఎంతో (శక్తిని) వ్యయం చేయాల్సి వస్తుంది. మానవులలోని ఈ పరస్పర ప్రాథమిక శతృత్వం ఫలితంగా నాగరిక సమాజం విచ్ఛిత్తి చెందుతుందనే భయం నిరంతరం వెన్నాడుతోంది. ఉమ్మడి పని ప్రయోజనం దానిని కలిపి ఉంచలేదు. వివేచనాపూరిత ప్రయోజనాలకంటే సహజాత వాంఛలు బలమైనవి. మానవుని దౌర్జన్య సహజాతాలకు పరిమితులు విధించడానికి, మానసిక ప్రతిచర్యా నిర్మితుల ద్వారా వాటి అభివ్యక్తిని అదుపు చేయడానికి నాగరికత తీవ్రంగా ప్రయత్నించాల్సి ఉంటుంది. అందుకే, ప్రజలలో తాథాత్మీకరణను, లక్ష్యనిరోధిత ప్రేమ సంబంధాలను ప్రోత్సహించడం, లైంగిక జీవితంపై ఆంక్షలు విధించడం, తోటివానిని నీకువలె ప్రేమించు అని ఆదర్శ నిర్దేశితాన్ని – మానవ మౌలిక స్వభావానికి విరుద్ధమైనది దీనిని మించింది లేదు అనే వాస్తవం ఈ నిర్దేశితానికి సమర్ధనీయతను సమకూరుస్తుంది – జారీ చేయడం లాంటి పద్ధతులు ఉద్దేశించబడ్డాయి. ఎంత కృషి చేసినా, నాగరికత చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలితాలు సాధించలేదు. నేరస్తుల యెడ హింసను అమలుపరచే హక్కును తాను చేపట్టడం ద్వారా నాగరికత దారుణ పాశవిక హింసను నిలువరించాలని ఆశిస్తుంది. కాని తగు జాగ్రత్తలతో, సున్నిత రూపాలలో అభివ్యక్తమయ్యే మానవ దౌర్జన్యం మీద చట్టం తన పట్టును బిగించలేకపోయింది. మనలో ప్రతి ఒక్కరు యుక్తవయస్సులో తోటివారి మీద ఎన్నో ఆశలు పెంచుకుంటాం. అవన్నీ భ్రమలని గుర్తించే సమయం ఒకటి ఆసన్నమవుతుంది. వారి దుర్బుద్ధి మూలంగా తన జీవితానికి కలిగిన కష్టం, బాధ వ్యక్తి తెలుసుకున్నప్పుడు ఇది జరుగుతుంది. అదే సమయంలో, నాగరికతను మానవ కార్యాచరణలోని ఘర్షణ, పోటీలను తొలగించ యత్నిస్తోందని తూలనాడడం సరికాదు. ఈ అంశాలు నిస్సందేహంగా ఆవశ్యకాలే. కాని వైరుధ్యం అవశ్యం శతృత్వం కానవసరం లేదు. దానిని కేవలం దుర్వినియోగం చేసి, శతృత్వానికి ఒక సందర్భం చేయడం జరిగింది.

దు:ఖాల నుంచి విముక్తికి ఒక మార్గం కనుగొన్నామని కమ్యూనిస్టులు నమ్ముతారు. వారి దృష్టిలో మానవుడు మొత్తంగా మంచివాడు. పొరుగువానిని అభిమానించేవాడు. కాని ప్రైవేటు ఆస్తిహక్కు అతడి స్వభావాన్ని కలుషితం చేసింది. ప్రైవేటు సంపదపై యాజమాన్యం వ్యక్తికి అధికారాన్ని ఇస్తుంది. దీనితో అతను పొరుగు వానిని చిన్నచూపు చూసే ప్రలోభానికి గురవుతాడు. అదే సమయంలో ఆస్తినుండి దూరం చేయబడ్డ వ్యక్తి తనను అణచివేసే వానికి వ్యతిరేకంగా శతృభావనతో తిరగబడడం తప్పనిసరి. ప్రైవేటు ఆస్తి రద్దుచేసి, సంపదను ఉమ్మడి సొత్తుగా ఉంచి, దానిని అనుభవించడానికి అందరినీ

అనుమతిస్తే, మనుషుల మధ్య ద్వేషం, శతృత్వాలు మటుమాయమవుతాయి. ప్రతి ఒక్కరి అవసరాలు తీరతాయి. కనుక, ఇతరుని తనవిరోధిగా పరిగణించాల్సిన కారణం ఎవరికీ ఉండదు. అందరూ మనస్ఫూర్తిగా అవసరమైన పనులన్నీ చేస్తారు. కమ్యూనిస్టు వ్యవస్థపై చేసే ఆర్థిక విమర్శల జోలికిపోను. ప్రైవేటు ఆస్తి రద్దు ఆవశ్యకమా ? అది ప్రయోజనకరమా ? అనే ప్రశ్నలను నేను పరిశీలించలేను.[1] ఈ వ్యవస్థకు ఆధారాలైన మానసిక భూమికలు సమర్ధనీయం కాని భ్రమలని నేను గుర్తించగలిగాను. ప్రైవేటు ఆస్తిని రద్దు చేయడం ద్వారా మానవ దౌర్జన్యకాంక్షకున్న పరికరాలలో ఒకదానిని లేకుండా చేస్తున్నాము. అది నిజంగా బలమైనదే కాని అత్యంత బలమైంది మాత్రం కాదు. కాని దౌర్జన్య ప్రవృత్తిచే దుర్వినియోగం చేయబడిన అధికారం, ప్రాబల్యాలలోని తేడాలను మనం ఏ విధంగాను మార్చలేకపోయాము. అంతేకాదు దాని స్వభావంలోను ఏ మాత్రం మార్పు తేలేక పోయాం. దౌర్జన్యాన్ని ఆస్తి సృష్టించలేదు. అదుపాజ్ఞలు లేని దౌర్జన్యత, ఆస్తి ఇంకా అప్పటికి అత్యల్పంగానే ఉన్నా, ప్రాచీన కాలం నుండి రాజ్యమేలింది. శైశవ దశలోనే, ఆస్తి దాని మౌలిక పాయు రూపాన్ని పూర్తిగా త్యజించకముందే, దౌర్జన్య ప్రవృత్తి కనిపిస్తుంది. (బహుశ తన మగబిడ్డతో తల్లికి ఉన్న సంబంధం అనే ఒక్క మినహాయింపు తప్ప) జనుల మధ్య ప్రతి ప్రేమ, వాత్సల్య బంధానికి అది ఆధారం అవుతుంది. భౌతిక సంపద మీద వ్యక్తిగత హక్కులను తొలగించినా గూడా, లైంగిక సంబంధాలలో ఇంకా ప్రత్యేక హక్కు కొనసాగుతుంది. ఈ ప్రత్యేక హక్కు ఇతర అంశాలలో సమంగా ఉండే మనుషుల మధ్య తీవ్ర అయిష్టతకు, తీవ్ర హింసాత్మక శతృత్వానికి మూలం అవుతుంది. లైంగిక జీవితంలో పూర్తి స్వేచ్ఛను అనుమతించి, నాగరికతకు జీవకణమైన కుటుంబాన్ని రద్దు చేయడం ద్వారా ఈ కారణాన్ని కూడా తొలగించినా, నాగరకతా వికాసం ఏ కొత్త పుంతలు తొక్కుతుందో ఊహించడం నిజానికి అంత తేలిక కాదు. కాని మనం ఒకటి ఊహించవచ్చు. మానవ స్వభావ అవినాశ్య లక్షణం అక్కడ కూడా వెన్నంటి ఉంటుంది.

---

[1] తను యుక్త వయస్సులో ఉన్నప్పుడు పేదరికపు కష్టాలను చవిచూసిన వ్యక్తికి, భాగ్యవంతులు తనపై చూసిన ఉపేక్ష, దర్పాలను అనుభవించిన వ్యక్తికి మనుషుల మధ్య సంపదల అసమానతలకు, ఈ అసమానతల పర్యవసానాలకు వ్యతిరేకంగా పోరాడడానికి జరిగే ప్రయత్నాల యెడ అవగాహన, సుహృద్భావం లేవనే అనుమానానికి ఆస్కారంలేదు. ఖచ్చితంగా చెప్పాలంటే, ఈ పోరాటాన్ని న్యాయంపేరిట, అందరూ సమానమే అనే ఒక అమూర్తనియమం ఆధారంగా చేయాలని యత్నిస్తే, దానికి సుస్పష్టమైన అభ్యంతరాన్ని చెప్పాల్సి ఉంది. ప్రకృతి వ్యక్తులకు అత్యంత అసమాన శారీరక లక్షణాలను, మానసిక సామర్థ్యాలను కల్పించడం ద్వారా నివారణ లేని అన్యాయాలను ప్రవేశపెట్టింది.

ఈ దౌర్జన్య ప్రవృత్తిని తృప్తిపర్చుకోవడమనే కోర్కెను విడనాడడం మానవులకు అంత సులువు కాదనేది స్పష్టం. అది లేకుండా మనుషులు హాయిగా ఉండలేరు. చొరబాటుదారుల పట్ల శతృత్వం రూపంలో ఈ దౌర్జన్య ప్రవృత్తి విడుదల కావడానికి అవకాశం కల్పించడం ద్వారా సాపేక్షంగా చిన్నదైన సాంస్కృతిక సమూహం కల్పించే ప్రయోజనాన్ని నిందించాల్సిన పనిలేదు. చెప్పుకోదగిన సంఖ్యలో ప్రజలను ప్రేమతో బంధించవచ్చు. అయితే, వారి దౌర్జన్య వ్యక్తీకరణలను స్వీకరించడానికి వెలుపల వేరే ప్రజలు ఉన్నపుడు మాత్రమే ఇది సాధ్యపడుతుంది. నేను ఇదే సంగతిని వేరే సందర్భంలో చర్చించాను. ప్రక్క ప్రక్క ప్రదేశాలలో నివసిస్తూ, ఇంకా ఇతర సంబంధాలు కలిగి ఉండే సమూహాలలోనే సరిగ్గా నిత్యం ఘర్షిస్తూ, హేళన చేసుకుంటూ ఉండడం జరుగుతుంది. ఉదాహరణకు స్పానియార్డులు - పోర్చుగీసువారు, ఉత్తర - దక్షిణ జర్మన్లు, ఆంగ్లేయులు - స్కాట్లండ్ వాసులు మొదలైనవారు. ఈ దృగ్విషయానికి 'అల్పభేద స్వానురాగం' అని నామకరణం చేశాను. అయితే ఈ పేరు దానిని పూర్తిగా వివరించదు. దౌర్జన్య ప్రవృత్తిని వెసులుబాటైన, సాపేక్షంగా నిరపాయకరమైన రీతిలో సంతృప్తిపరచడం ద్వారా సమూహ సభ్యుల మధ్య ఐక్యతను ఇది సుగమం చేసిందని మనం ఇప్పుడు గ్రహించవచ్చు. ఈ సందర్భంలో, అంతటా చెల్లాచెదురైన యూదులను గమనిస్తే, వారు తమ ఆతిధేయ దేశాల నాగరికతలకు ఎంతో ఉపయోగకరమైన సేవలను అందించారు; కాని, దురదృష్టవశాత్తు, మధ్యయుగాలలో సంభవించిన యూదుల ఊచకోతలన్నీ కూడా వారితోడి క్రైస్తవులకు ప్రశాంతతని, భద్రతని చేకూర్చడానికి సరిపోలేదు. మనుషుల మధ్య సార్వత్రిక ప్రేమ తన క్రైస్తవ సమాజానికి ప్రాతిపదిక అని దేవదూత పాల్ ప్రకటించినప్పుడు, క్రైస్తవేతరుల పట్ల క్రైస్తవుల తీవ్ర అసహనానికి ఇది అనివార్యంగా దారి తీసింది. రోమన్లు తమ సమాజ జీవితాన్ని ఒక రాజ్యంగా ప్రేమ భూమికపై నిర్మించుకోక పోయినా, వారికి మతమనేది రాజ్యసంబంధ విషయమైనా, వారి రాజ్యమంతటా మతం వ్యాపించి ఉన్నా, మత అసహనం అనేది వారికి పూర్తిగా పరాయిది. జర్మన్ ప్రపంచాధిపత్య స్వప్నంలో యూదు వ్యతిరేకత భాగం కావడం యాదృచ్ఛికం కాదు. రష్యాలో నూతనకమ్యూనిస్టు నాగరికతా స్థాపన క్రమంలో బూర్జువాలను వేధించడాన్ని ఒక మానసిక ఊతంగా చేసుకోవడాన్ని అర్థం చేసుకోవడం కష్టంకాదు. బూర్జువాలను తుడిచిపెట్టిన తర్వాత సోవియట్లు ఏమి చేస్తారనేది ఊహకందని ఆందోళన కలిగించే విషయం.

మనిషి లైంగికత పైనే కాక, అతడి దౌర్జన్య ప్రవృత్తి మీద గూడ అంతటి మహా త్యాగాలను నాగరికత విధిస్తే, అటువంటి నాగరికతలో అతడు సుఖంగా జీవించడం ఎంత కష్టమో మనం బాగా అర్థం చేసుకోగలం. వాస్తవానికి ఆదిమ మానవునికి సహజాతం మీద ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో అతడు సుఖంగా ఉన్నాడు. దానికి ప్రతిగా ఈ సుఖాన్ని కొంతకాలం పాటు అవిచ్ఛిన్నంగా అనుభవించడానికి అతనికి ఉన్న అవకాశాలు చాలా తక్కువ. సుఖాన్ని అనుభవించే అవకాశాలలో కొన్నింటిని నాగరిక మానవుడు తన భద్రతలో కొంత భాగం కోసం వదులుకున్నాడు. అయితే ఈ సహజాతాలను స్వేచ్ఛగా అనుభవించడానికి, ఆదిమ కుటుంబాలలో, కుటుంబ పెద్దకు మాత్రమే అవకాశం ఉండేదని మనం మరువరాదు. మిగతావారంతా బానిసలలా అణిగిమణిగి ఉండేవారు. నాగరికతారంభ కాలంలో నాగరికత ప్రయోజనాలను అనుభవించే అల్ప సంఖ్యాకులు, ఆ ప్రయోజనాలకు నోచుకోలేని అధిక సంఖ్యాకులకు మధ్య ఉన్న తేడా తీవ్రంగా ఉండేది. నేడున్న ఆదిమ ప్రజలను పరిశీలించిన పరిశోధకులు, వారి లైంగిక జీవితం స్వేచ్ఛాయుతమైందని ఏమాత్రం అసూయపడవల్సింది లేదని చూపారు. వారి జీవితం వేరే రకం ఆంక్షలకు గురైంది. ఇవి ఆధునిక నాగరిక మానవుని జీవితం మీది ఆంక్షల కంటె బహుశా మరింత తీవ్రమైనవి.

మన సుఖజీవనానికి తోడ్పడే ప్రణాళికాబద్ధ జీవితానికి దోహదం చేయలేనందుకు, తొలగించ వీలుండీ తొలగించకుండ దు:ఖాన్ని కొనసాగనిచ్చినందుకు మనం న్యాయంగానే నాగరికతను తప్పు పడుతున్నప్పుడు, నిస్సందేహంగా మనం మంచిపనే చేస్తున్నాము. మనం నాగరికతకు శత్రువులుగా ప్రవర్తించడం లేదు. మన అవసరాలు తీర్చగల, విమర్శించ వీలులేని మార్పులు క్రమేపీ నాగరికతలో తీసుకురావచ్చని మనం ఆశించవచ్చు. ఎటువంటి సంస్కరణలకు లొంగని కొన్ని చిక్కులు నాగరికతా స్వభావంలోనే ఉన్నాయన్న భావన మనకు సుపరిచితం కావాలి. సహజాతాలను అదుపుచేసే కర్తవ్యాలను – వీటికి మనం సిద్ధపడి ఉన్నాం – మించి, 'సమూహాల మనోవైజ్ఞానిక దారిద్ర్యం' అనే మరో ప్రమాదం మన గమనానికి వస్తుంది. సమాజ బంధాలు ప్రధానంగా సభ్యులు ఒకరితో ఒకరు తాథాత్మ్యం చెందడం ద్వారా నిర్మితమైనప్పుడు, నాయక తరహాకు చెందినవారికి వారికి దక్కాల్సిన ప్రాముఖ్యం దక్కనప్పుడు, ఈ అభిప్రాయం మరింత భయపెడుతుంది. ఇప్పుడున్న అమెరికా సాంస్కృతిక స్థితి నాగరికతకు జరిగే ఇటువంటి భయంగొల్పే నష్టాన్ని అధ్యయనం చేయడానికి మంచి అవకావం కల్పిస్తుంది. కాని అమెరికా నాగరికతకు దూరంగా ఉంటాను. నేను కూడ అమెరికన్ పద్ధతులను అమలుచేయాలని అనుకుంటున్నాననే అభిప్రాయం కలిగించడం నాకు ఇష్టంలేదు.

◆

VI

నేను చెప్పేదంతా జన సామాన్యానికి తెలిసిందేనని, నేను ఇప్పుడు కలాన్ని, కాగితాన్ని, తర్వాత దశలో అచ్చుకూర్చేవాని, అచ్చువేసేవాని శ్రమను, పరికరాలను ఖర్చుచేయడం వాస్తవానికి స్వయం విదితమైన విషయాల వివరణ కోసమేనని ఇప్పుడు అనిపించినంతగా నా గత రచనల సందర్భంలో ఎప్పుడూ అనిపించలేదు. అందువలన, ఒక ప్రత్యేక, స్వతంత్ర దౌర్జన్య సహజాతాన్ని గుర్తించడాన్ని సహజాతాలకు సంబంధించిన మనో విశ్లేషణ సిద్ధాంతాన్ని సవరించడంగా భావించడం సాధ్యమైతే దానిని నేను సంతోషంగా స్వీకరిస్తాను.

అయితే, అసలు సంగతి అది కాదని, చాలాకాలం క్రితమే కలిగిన ఆలోచనా ధోరణికి ఇప్పుడు మరింత స్పష్టత సమకూర్చి, దాని పర్యవసానాలను తుదికంటా అనుసరించడం మాత్రమే జరిగిందనే విషయాన్ని మనం గమనించవచ్చు. విశ్లేషణా సిద్ధాంతంలో నిదానంగా అభివృద్ధి చెందిన భాగాలలోకెల్లా సహజాత సిద్ధాంత గమనం అత్యంత బాధాకరంగా ముందుకు సాగింది. అయినా మొత్తం (మనో విశ్లేషణ సిద్ధాంత) నిర్మితికి ఆ సిద్ధాంతం ఎంత ఆవశ్యకమంటే, దాని స్థానంలో ఏదో ఒకదానిని ఉంచకతప్పదు. నాకు మొదట్లో ఉన్న గందరగోళంలో నా ఆరంభ బిందువుగా కవి - తాత్వికుడు అయిన పిల్లర్ చెప్పిన 'ఆకలి, ప్రేమలు ప్రపంచాన్ని నడిపిస్తాయి' అనే కావ్యాన్ని గ్రహించాను. ఆకలిని వ్యక్తిని రక్షించే సహజాతంగా తీసుకోవచ్చు. ప్రేమ వస్తువుల కోసం ఆరాటపడు తుంది. దీని ప్రధాన విధి, అన్ని విధాల ప్రకృతి ఆమోదించిన, జాతుల పరిరక్షణ. ఈ విధంగా, అహం సహజాతాలు (ego instincts), వస్తు సహజాతాలు (object instincts), మొదట్లో ఒకదాని కొకటి ఎదురై నిలిచాయి. వస్తు సహజాతాల శక్తిని సూచించడానికి, కేవలం వీటి శక్తిని సూచించడానికి మాత్రమే, 'లిబీడో' (libido) పదాన్ని ప్రవేశపెట్టాను. ఈ విధంగా, అహం సహజాతాలకు, వస్తుగత 'లిబీడోజనిత' ప్రేమ సహజాతాలకు (వాటి విస్తృతార్థంలో) మధ్య వైరుధ్యం ఉంది. ఈ వస్తు సహజాతాలలో ఒకటైన పరహింసాపూరిత కామ సహజాతం (sadist instinct) మిగతా వాటికంటె పూర్తిగా వేరైనది అన్నమాట నిజం. ఎందుకంటే దాని లక్ష్యం ప్రేమించడం నుంచి

ఎంతో దూరం. అంతేకాదు, అది కొన్ని విషయాలలో అహం సహజాతాలకు అనుసంధానమై ఉంటుంది. ప్రేమ లక్ష్యం ఏ మాత్రం లేని ఆధిపత్య సహజాతాలతో దానికి దాచలేని సన్నిహిత సంబంధం ఉంది. ఈ తేడాలన్నింటిని అధిగమించడం జరిగింది. ఎలాగంటే పరహింసాపూరిత కామం అనేది లైంగిక జీవితంలో ఒక భాగం. ఈ లైంగిక జీవిత కార్యకలాపాలలో అనురాగం స్థానాన్ని క్రౌర్యం ఆక్రమించడం జరగవచ్చు. ఆత్మ పరిరక్షణ ప్రయోజనాలకు, లిబీడో వాంఛలకు మధ్య జరిగే ఘర్షణ ఫలితమే నాడీ రుగ్మత. ఈ ఘర్షణలో అంతిమంగా అహమే గెలుస్తుంది. కాని, తీవ్రమైన బాధలు, పరిత్యాగాల మూల్యం ఇందునిమిత్తం అది చెల్లించాల్సి ఉంటుంది.

ఎప్పుడో తోసిపుచ్చబడిన తప్పుడు అవగాహనగా ఈ దృక్పథాన్ని ఈనాటికి కూడా చూడడం లేదని ప్రతి విశ్లేషకుడు అంగీకరిస్తాడు. అయినా, అణచబడిన శక్తుల నుండి అణచే శక్తులకు, వస్తు సహజాతాల నుంచి అహానికి మన పరిశోధనలు ముందుకు సాగే కొలది, దీనిలో మార్పులు అనివార్యం అయ్యాయి. స్వానురాగ భావన (narcissism)ను ప్రవేశపెట్టడం ఈ దిశలో నిర్ణయాత్మకమైన ముందడుగు. అంటే, అహం లిబీడోతో కూడి ఉంటుందని, వాస్తవానికి అహమే లిబీడో మూల వాసమని, అది లిబీడోకు ముఖ్య కేంద్రంగా కొంతమేరకు ఉండిపోతుందని కనుగొనడం జరిగింది. ఈ స్వానురాగ లిబీడో వస్తువుల దిశకు మరలి వస్తు లిబీడో అవుతుంది. అది తిరిగి స్వానురాగ లిబీడోగా మారగలదు. స్వానురాగ భావన ఆఘాత నాడీ రుగ్మతలను, ఉన్మాద స్థితికి అతి దగ్గరగా ఉండే ప్రభావాలతోపాటు, ఉన్మాద స్థితిని కూడ విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకోవడానికి వీలు కల్పించింది. లైంగికతకు వ్యతిరేకంగా, అహం స్వీయ రక్షణార్థం చేసే ప్రయత్నాలే స్థాన చలిత నాడీ రుగ్మతలు (transference neuroses) అని వ్యాఖ్యానించాము. ఇప్పుడు ఆ వ్యాఖ్యానాన్ని మనం వదులు కోవాల్సిన అవసరం లేదు. కాని లిబీడో భావనకు దెబ్బ తగులుతుంది. అహం సహజాతాలు గూడా లిబీడో సంబంధితాలైనందువల్ల, లిబీడోని సర్వసాధారణంగా సహజాత శక్తితో కలిసి ఉండేదిగా చేయాల్సిన ఆవశ్యకత ఉందని కొంతకాలంపాటు అనిపించింది. ఈ విషయాన్ని సి.జి.యూంగ్[1] ఇంతకుముందే ప్రతిపాదించాడు. అయినా, సహజాతాలన్నీ ఒకే కోవకు చెందినవి కావని నాకో నమ్మకం ఉంది. అయితే దీనికి కారణాలు నేను చెప్పలేను. 'సుఖసూత్రానికి ఆవల' (Beyong the Pleasure Principle) అనే నా రచనలో పునశ్చరణ ఒత్తిడి, సహజాత జీవితపు

---

1. సి.జి.యూంగ్ (C.G.Jung) 1875-1961 : స్విట్జర్లాండ్‌కు చెందిన మనోవిజ్ఞాన శాస్త్రవేత్త (అను.)

సాంప్రదాయ (conservative) స్వభావం మొదటిసారి నా దృష్టిలో పడ్డప్పుడు నా తరువాత అడుగువేశాను. జీవారంభం గురించిన ఆలోచనలు, జైవిక సమాంతరతల (biological parallels) నుండి ప్రారంభించి, జీవ పదార్థాన్ని పరిరక్షించి దానిని ఇంకా ఇంకా పెద్ద యూనిట్లుగా[2] కలిపే సహజాతమే కాక, ఆ యూనిట్లను విడగొట్టి తిరిగి వాటిని తొలి అసేంద్రియ స్థితికి తేవాలనే వ్యతిరేక సహజాతం గూడ మరొకటి ఉండి తీరాలనే నిర్ణయానికి వచ్చాను. అంటే దానికి అర్థం జీవ సహజాతం (Eros) తో పాటు మృత్యు సహజాతం (death Instinct) కూడ ఒకటి ఉంది. ఈ రెండు సహజాతాల ఏకకాల పరస్పర విరుద్ధ చర్యలతో మనం జీవిత దృగ్విషయాన్ని వివరించగలం. ఈ భావిత మృత్యు సహజాత కార్యకలాపాలేమిటో వివరించడం అంత సులువుకాదు. జీవ సహజాత అభివ్యక్తీకరణలు ప్రత్యేకంగా, కొట్టవచ్చినట్లుగా కనిపిస్తాయి. కాని మృత్యు సహజాతం జీవిలో ఉంటూనే, దానిని దాని వినాశనం వైపు తీసుకుపోవడానికి నిశ్శబ్దంగా పనిచేస్తుందని ప్రతిపాదించవచ్చు. కాని దీనిని మనం రుజువుగా పరిగణించలేం. అంతకంటె ఫలప్రదమైన ఆలోచన ఏమిటంటే, ఆ మృత్యు సహజాతంలో కొంత భాగం బాహ్య ప్రపంచం వైపుకు మళ్ళి దౌర్జన్యం, వినాశకర సహజాత రూపంలో వెలుగులోకి వస్తుందని భావించడం. ఈ విధంగా ఈ సహజాతాన్ని జీవ సహజాత సేవలో వినియోగించుకోవచ్చు. ఎలాగంటే, తనను తాను వినాశం చేసుకునేబదులు జీవి ఏదో ఇతర వస్తువును – అది సజీవమైనదైనా, నిర్జీవమైనదైనా – నాశనం చేస్తుంది. దీనికి విరుద్ధంగా, బాహ్యోభిముఖమైన ఈ దౌర్జన్య ప్రవృత్తిని నియంత్రిస్తే, అది అప్పటికే ఉనికిలో ఉన్న ఆత్మ వినాశనాన్ని తప్పనిసరిగా అధికం చేస్తుంది. అదే సమయంలో, పైన చెప్పిన దానిని బట్టి చూస్తే, ఈ రెండు రకాల సహజాతాలు అరుదుగా గాని – బహుశ ఎప్పుడూ గూడ – విడివిడిగా కనిపించవనీ, వివిధ నిష్పత్తులలో ఒక దానితో ఒకటి సమ్మిశ్రణమై కనిపిస్తాయనీ, అలా ఉండడంవల్ల వాటిని విడివిడిగా గుర్తించలేక పోతున్నామనీ మనం అనుకోవచ్చు. లైంగికతలో ఒక అంతర్భాగంగా మనకుఎప్పటినుంచో తెలిసిన పరహింసాపూరిత కామంలో ప్రేమ-వినాశకర సహజాతాల బలమైన సమ్మిశ్రణం మన ముందుంటుంది. అలా ఉండగా, దీనికి వ్యతిరేకమైన స్వహింసాపూరిత కామం (masochism), లోపలికి మళ్ళించిన

---

2. విస్తృతి దిశగా సాగే జీవసూత్రపు నిరంతర ప్రవృత్తికి, సహజాతాల సాధారణ సాంప్రదాయ స్వభావానికి మధ్య ఆవిర్భవించే వ్యతిరేకత కొట్టొచ్చినట్లుగా ఉంటుంది. ఇది మరిన్ని సమస్యల అధ్యయనానికి ఆరంభ బిందువు అవుతుంది.

వినాశకరత, లైంగికతల సంయోగం అవుతుంది. మరోవిధంగా అయితే మనకు కనిపించని ధోరణిని ఈ సంయోగం మనకు స్పష్టంగా దర్శనీయం చేస్తుంది.

మృత్యు లేదా వినాశకర సహజాతం ఒకటి ఉంది అనే భావనకు విశ్లేషకుల బృందాల నుండి కూడా వ్యతిరేకత వచ్చింది. ప్రేమలో అపాయకరమైనది, విరోధమైనది ఏది ఉన్నా, దానిని ప్రేమ మౌలిక స్వభావంలోనే ఉన్న ద్విధృవత (bipolarity)కి తరచు ఆపాదించడం నేనెరుగుదును. నేను ఇక్కడ ఇంతవరకు వివరించిన దృక్పథాలను తాత్కాలిక ప్రాతిపదికపై ఉంచి ప్రారంభించాను, కాని ఈ దృక్పధాలు కాలగతిలో నేను మరోవిధంగా, అంటే వాటికి భిన్నంగా, ఆలోచించలేనంతగా నా మీద పట్టు సాధించాయి. సైద్ధాంతికంగా చూస్తే అవి ఏ ఇతర సంభావ్య సిద్ధాంతాల కంటె కూడ ఉపయోగకరాలనిపిస్తున్నాయి. వాస్తవాలను విస్మరించకుండ, వ్యతిరేకించకుండ అవి ఎంతో సరళతను ప్రదర్శిస్తున్నాయి. శాస్త్రం ఎప్పుడూ ఈ సరళత కోసమే ప్రాకులాడుతుంది. పరహింసాపూరిత కామం, స్వహింసాపూరిత కామం, రెండింటిలోను ఎప్పుడూ కూడ, కామోద్రేకంతో మిళితమైన వినాశకర సహజాత (అది భాహ్యాబిముఖం కానీ, అంతరాభిముఖం కానీ) అభివ్యక్తీకరణలను మనం చూశాం. కాని, సర్వవ్యాప్తాలైన కాముకేతర దౌర్జన్యత, వినాశాలను మనం ఎలా విస్మరించగలిగామో, జీవితార్థ వివరణలో వాటికున్న ఉచిత స్థానాన్ని ఎందుకు గుర్తించలేకపోయామో నాకు ఏ మాత్రం అర్థం కాని విషయం. (లోనికి గురి పెట్టబడిన వినాశకర వాంఛ. అది కామోద్రేకంతో మిళితమై ఉన్నపుడు తప్ప, మన దృష్టికి అందకుండ తప్పించుకుంటుంది) మనో విశ్లేషణ సాహిత్యంలోకి వినాశకర సహజాత భావన మొదటిగా ప్రవేశించినప్పుడు, దానిపట్ల నేనెంత ఆత్మరక్షణ ధోరణి అవలంబించిందీ, ఆ తరువాత దానిని స్వాగతించడానికి నాకెంత కాలం పట్టిందీ ఇంకా గుర్తు ఉంది. కాబట్టి, ఇతరులు దాని యెడ తిరస్కారాన్ని ప్రదర్శించడం, ఇంకా ప్రదర్శిస్తూ ఉండడం నాకంత విస్మయం కలిగించడం లేదు. ఎందుకంటే "చెడ్డతనానికి", దౌర్జాన్యానికి, వినాశకరతకు, అలాగే క్రౌర్యానికి పుట్టుకతోనే వచ్చే ప్రవృత్తి ఉంది అని అంటే మనకు చాలా అయిష్టంగా ఉంటుంది. దేవుడు మనుషులను తన పరిపూర్ణ రూపంలో మలిచాడు. నిర్వివాదాంశమైన చెడ్డతనపు అస్తిత్వాన్ని, దేవుని సర్వ శక్తిమంతత్వంతో, లేక సర్వసద్గుణ సంపన్నతతో సమన్వయం చేయడం - క్రైస్తవ శాస్త్రం ఎంతగా కాదని వాదించినా - ఎంత దుర్లభమో గుర్తుచేయడాన్ని ఎవరూ కోరుకోరు. దేవునికి తప్పించుకోవడానికి ఉన్న ఒకే ఒక్క మిష సైతాను; ఆవిధంగా, ఆర్యుల ఆదర్శ ప్రపంచంలో యూదు ఎలాగైతే ఆర్థిక విధుల

నిర్వాహకుడిగా పనిచేశాడో, దేవుడు కూడా అలాంటి పాత్రనే నిర్వహించాల్సి ఉంటుంది. అలా అయినా కూడా, సైతాను అస్తిత్వానికి, సైతాను ప్రతిరూపమైన దుష్టత్వం ఉనికికి దేవుడే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ ఇబ్బందుల దృష్ట్యా, ఏదో ఒక వీలైన సందర్భంలో మనలో ప్రతి ఒక్కరం మానవాళి గాఢ నైతిక స్వభావానికి మోకరిల్లగలిగితే మంచిది. అది మనకు ఆదరణను చేకూరుస్తుంది. ఆ కారణంగా, మనం చాలావరకు క్షమించబడతాం[1].’

జీవశక్తి అభివ్యక్తి రూపాలను, మృత్యు సహజాత శక్తి నుండి వేరుగా చూపడానికి మరోమాటు లిబీడో పేరును ఉపయోగిద్దాం.[2] ఆ సహజాతాన్ని అర్థం చేసుకోవడం బహుదుస్తరమని ఒప్పుకోవాలి. జీవశక్తి వెనుక, నేపథ్యంలో ఉన్నదానిగా, దానిని ప్రస్తావించడం మాత్రమే మనం చేయగలం. దాని ఉనికి – అది జీవశక్తితో మిళితమై

---

1. గోథె రాసిన మెఫిస్టో ఫెలీజ్‌లో చెడును వినాశకర సహజాతంతో అసాధారణ రీతిలో, విశ్వసనీయంగా తదాత్మీక రించడం కనిపిస్తుంది.

   “ కేవల విరహిత శూన్యంలోంచి
   ప్రభవించిన వేవైనా సరే
   అన్నీ సర్వం సహ వినాశ నార్హాలే .....
   పాపకృత్యాలని వేటినైతే లిఖించావో
   అవన్నీ నాలోని సైతాను సయ్యాటలే
   నిజం చెప్పొద్దూ, వినాశనం నా నైజం.

   పవిత్రమైనదానిని, మంచిదానినికాకుండ, ప్రకృతికున్న సృష్టి చేసే శక్తిని, జీవాన్ని పెంపొందించే శక్తిని – అంటే జీవశక్తిని తన విరోధిగా సైతాను పేర్కొంటాడు.

   జలధారనించీ, ధరిత్రినించీ, విచ్చుకొనే వాయువునించీ
   వేనవేల క్రిములు కీటకాలై ప్రాకుతాయి.
   పొడిగాలిలోనూ, తడివానలోనూ
   వేడిమిలోను, శైత్యంలోను,
   ఏదో గ్రహపాటున నాలోని జ్వాలేగాని
   నాలో సర్వదాగ్నిలా ప్రజ్వలిస్తూండక పోతే .....
   ఇక నా గొప్పేముంది మీ ముందు ఒప్పుకొనేందుకు ?”

   (పై రెండు పద్యాలు గోథె రాసిన ఫౌస్ట్ ఒకటో భాగం, దృశ్యం 3 లోనివి)

2. *ప్రతి సహజాత అభివ్యక్తీకరణలోను లిబీడోకు పాలు ఉంది. కాని ఆ అభివ్యక్తీకరణలో అంతా లిబీడో కాదు అని మన ప్రస్తుత దృక్పథాన్ని క్రోడీకరించవచ్చు.*

ఉండడంవల్ల బహిర్గతపరచబడకపోతే – దృష్టికి రాకుండా తప్పించు కుంటుంది. పరహింసా పూరిత కామంలో, ఎక్కడైతే మృత్యు సహజాతం కామ లక్ష్యాన్ని తన అర్థంలోకి వక్రీకరిస్తూనే, అదే సమయంలో కామవాంఛను పూర్తిగా సంతృప్తం చేస్తుందో అక్కడ మనం ఈ సహజాతపు స్వభావాన్ని, జీవశక్తితో దానికున్న సంబంధాన్ని గురించి విస్పష్టమైన అవగాహన పొందగలుగుతాము. కాని, అది లైంగిక కారణం లేకుండా, దాని అంధవినాశకర ఉన్మత్తతలో కనిపించినప్పుడు గూడా, అది కలిగించే సహజాత సంతృప్తి అసాధారణ స్థాయిలో స్వానురాగపర ఆనందంతో కలిసి ఉందని మనం గుర్తించకుండ ఉండలేం. సర్వశక్తిమంతత్వం కోసం అహానికున్న తొలి వాంఛలను ఇది పరిపూర్తి చేస్తుంది కాబట్టి ఇలా జరుగుతుంది. ఈ వినాశకర సహజాతాన్ని పరిమితం చేసి, లొంగదీసుకుని, లక్ష్య నిరోధానికి గురిచేసినట్లయితే, దానిని వస్తువుల మీదికి నిర్దేశించినప్పుడు, అది తప్పనిసరిగా కీలకావసరాల సంతృప్తినీ, ప్రకృతిపై నియంత్రణను అహానికి సమకూరుస్తుంది. ఈ సహజాతం ఉందనడానికి సైద్ధాంతిక భూమికలే ఆధారం కనుక, దీనికి వ్యతిరేకంగా లేవదీసే సైద్ధాంతిక అభ్యంతరాలకు ఇది పూర్తిగా అభేద్యమైంది కాదని మనం అంగీకరించాలి. ప్రస్తుతం మనకున్న జ్ఞానపరిధిలో విషయాలు ఇలా ఉన్నాయి. భావి పరిశోధనలు, ఆలోచనలు నిస్సందేహంగా విషయాన్ని అటో ఇటో తేల్చివేయగల వెలుగు ప్రసరిస్తాయి.

అందుకని ఇక మీదట చెప్పబోయే విషయాలలో దౌర్జన్య ప్రవృత్తి అనేది మనిషిలోని ఒక మౌలిక స్వతస్సిద్ధ సహజాత స్వభావం అనే దృక్పథాన్ని ప్రాతిపదిక చేసుకుంటాను. అది నాగరికతకు అతిపెద్ద ప్రతిబంధకమనే నా అభిప్రాయాన్ని తిరిగి ప్రస్తావిస్తాను. నా పరిశీలనా క్రమంలో ఒక సందర్భంలో నాగరికత అనేది మానవాళి గురయ్యే ఒక ప్రత్యేక ప్రక్రియ అనే భావన కలిగింది. ఇప్పటికీ నేను ఇంకా ఆఆలోచనతోనే ఉన్నాను. వేరువేరు విడివిడి వ్యక్తులను కలపడం, ఆ తరువాత కుటుంబాలను, తదుపరి జాతులను, ప్రజలను, దేశాలను ఏకీకృతంచేసి మానవాళిని ఒకటిగాచేసే లక్ష్యం కల జీవసూత్రం తన లక్ష్య సాధనకు నియోగించిన ఒక ప్రక్రియ నాగరికతని నేను ఇప్పుడు అదనంగా చెప్పదలచుకున్నాను. అది ఇలా ఎందుకు జరగాలో మనకు తెలియదు. కాని జీవసూత్రం చేసేపని ఖచ్చితంగా ఇదే. ఈ మానవ సమూహాలు ఒకదానితో ఒకటి లెబీడోద్వారా బంధితం కావాలి. కేవలం అవసరం ఒక్కటే కాని, కలసి పనిచేయడంలోని ప్రయోజనాలు గాని వారిని కలిపి ఉంచలేవు. కాని మనిషిలోని సహజ దౌర్జన్య సహజాతం – అందరి యెడ ఒక్కనికి ఉండే శత్రుత్వం, ఒక్కనియెడ అందరికి ఉండే శత్రుత్వం – నాగరికతా

ప్రణాళికను వ్యతిరేకిస్తుంది. ఈ దౌర్జన్య సహజాతం మృత్యు సహజాతం నుంచి ఉత్పన్నమై దాని ముఖ్య ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. ఈ మృత్యు సహజాతం జీవ సహజాతం ప్రక్కనే కొనసాగుతూ దానితోపాటు ప్రపంచాధిపత్యాన్ని పంచుకుంటుంది.. నాగరికతా పరిణామాన్ని అర్థం చేసుకోవడం మనకిక ఏ మాత్రం కష్టంకాదని నేను అనుకుంటున్నాను. జీవన, మృత్యు సహజాతాలమధ్య, జీవన – మరణాల మధ్య పోరాటం మానవజాతిలో తనను తాను ఎలా ఆవిష్కరించుకుంటుందో నాగరికత మనకు చూపాలి. ఈ పోరాటం జీవితం అంతటా అవశ్యం ఉండి తీరుతుంది. అందుకని నాగరికత పరిణామాన్ని సంక్షిప్తంగా మానవజాతి జీవితం కోసం జరిపే పోరాటంగా అభివర్ణించవచ్చు. ఈ బృహత్కాయుల పోరాటాన్నే, మన ఆయాలు తమ స్వర్గ సంబంధ జోలపాటలతో అనునయింపజూసేది.

VII

మన బంధువర్గమైన జంతువులు అటువంటి ఏ రకమైన సాంస్కృతిక పోరాటాన్ని ఎందుకు ప్రదర్శించవో మనకు తెలియదు. బహుశ వాటిలో కొన్ని – తేనెటీగలు, చీమలు, చెదపురుగులు – మనం వాటిలో పొగిడే లక్షణాలైన రాజ్య సంస్థలు, పని విభజన, వ్యక్తి నియంత్రణలు నెలకొల్పు కోవడానికి వేలకువేల సంతర్సరాలపాటు పెనుగులాడి ఉంటాయి. ఈ జంతువుల స్థితులలో లేదా ఆ స్థితులలో వ్యక్తులను నిర్దేశించబడిన పాత్రలలో మనం సుఖాన్ని పొందగలమనే ఆలోచనకు ఆస్కారం లేదని మన అనుభవాలే మనకు తెలియచెప్పడం జరిగింది. ఇది మన ప్రస్తుత స్థితికి ఒక సూచిక. ఇతర జంతు జాతుల విషయంలో, వాటి పరిసరాల ప్రభావానికి, పరస్పరం పోటీపడే వాటిలోని సహజాతాలకు మధ్య ఒక తాత్కాలిక సమతౌల్యం వచ్చి ఉండవచ్చు. ఆ విధంగా అభివృద్ధి ఆగిపోవడం సంభవించి ఉండవచ్చు. ఆదిమ మానవునికి క్రొత్తగా లిబీడో అందుబాటులోకి వచ్చినప్పుడు, అది వినాశకర సహజాతంలో ఒక్కమాటుగా పెల్లుబికే క్రియాశీలతను పునరుద్ధరించి ఉండవచ్చు. సమాధానాలు లేని అనేక ప్రశ్నలు ఇక్కడ ఇంకా ఉన్నాయి.

మరో ప్రశ్న మనలను మరింత ఆలోచనకు గురి చేస్తుంది. తనను వ్యతిరేకించే దౌర్జన్య ప్రవృత్తిని నిరోధించడానికి, నిరపాయం చేయడానికి, వీలైతే దానిని పూర్తిగా తొలగించడానికి నాగరికత ఏ పద్ధతులను ఉపయోగిస్తున్నది ? మనం ఇప్పటికే ఈ సాధనాలలో కొన్నింటిని తెలుసుకున్నాం. కాని అత్యంత ముఖ్యమైనదిగా కనిపించే ఒకదానిని మాత్రం మనం స్పృశించలేదు. దీనిని వ్యక్తి వికాస చరిత్రలో మనం అధ్యయనం చేయగలం. దౌర్జన్య వాంఛను కనిపించే విషయమైనా, ముందుగా మన ఊహకు మాత్రం అందదు. అతని దౌర్జన్యం అంతఃక్షేపిత మవుతుంది. అంతరీకరణం అవుతుంది. వాస్తవానికి అది ఎక్కడ బయలుదేరిందో అక్కడికే తిరిగి పంపబడుతుంది. అంటే అది అతని అహం దిశగా నిర్దేశించబడుతుంది. అహంలో ఒక భాగం దానిని గ్రహిస్తుంది. ఈ గ్రహించిన భాగం అధ్యహం (super ego)గా మారి మిగిలిన అహంకు ఎదురై నిలిచి, 'అంతరాత్మ' రూపంలో, అహం తన సంతృప్తి కోసం బాహ్య వ్యక్తులపై జరిపే తీవ్రదౌర్జన్యాన్ని ఇప్పుడు అహం మీద అమలు చేయడానికి సిద్ధంగా ఉంటుంది. ఈ కఠోరమైన అధ్యహానికి, దీనికి లోబడిఉన్న అహానికిమధ్య ఉన్న ఉద్రిక్తతనే మనం అపరాధ భావన అని పిలుస్తాం.

అది శిక్షావసరంగా అభివ్యక్తమవుతుంది. వ్యక్తిలోని ప్రమాదకర దౌర్జన్య వాంఛను బలహీనపరచి, నిరాయుధం గావించి - జయించిన నగరంలో ఆయుధాగారం ఉంచినవిధంగా - ఈ వాంఛను అదుపులో ఉంచడానికి అతని అంతరంగంలోనే ఒక ప్రతినిధిని ఏర్పరచడం ద్వారా, నాగరికత దానిపై ఆధిపత్యాన్ని సంతరించుకొంటుంది.

అపరాధ భావనకు సంబంధించి, ఇతర మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలతో పోలిస్తే, మనో విశ్లేషకునికి భిన్నాభిప్రాయాలుంటాయి. కాని అతనికి కూడా దాని వివరాలు చెప్పడం అంత తేలిక కాదు. మొదటిగా అసలు ఒక వ్యక్తిలో అపరాధ భావన ఎలా కలుగుతుంది అనే ప్రశ్న వేసుకుంటే, దానికి ప్రశ్నించ వీలులేని సమాధానం వస్తుంది. తనకు 'చెడు' అని తెలిసి కూడా ఒక వ్యక్తి ఏదైనా పనిని చేసినట్లయితే అతను "అపరాధం" (మతానుయాయులు దీనినే "పాపం" అంటారు) చేశానని భావిస్తాడు. కాని ఈ సమాధానం మనకు తెలియచేసేది చాలా స్వల్పమని మనం గ్రహిస్తాం. వ్యక్తి వాస్తవానికి చెడ్డపని చేయకపోయినా, తనలో ఆ పని చెయ్యాలనే ఉద్దేశ్యం ఉన్నట్లు అతను గుర్తించినా కూడా, అతడు తనను తాను అపరాధిగా భావించుకునే అవకాశం ఉందని కొంత తటపటాయింపు తరువాత మనం పైన చెప్పిన విషయానికి అదనంగా చేరుస్తాం. ఉద్దేశ్యాన్ని పనిని సమానంగా ఎందుకు పరిగణించాలి అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ రెండు సందర్భాలలోను, చెడు అయినది గర్హనీయమనీ, ఆచరణలో పెట్టరానిదని వ్యక్తి ముందుగానే గ్రహించినట్లు భావించవలసి ఉంది. ఈ నిర్ణయానికి ఎలా వచ్చినట్లు ? మంచి నుంచి చెడును వేరుగా గుర్తించే మౌలిక, ప్రాకృతిక శక్తి మనిషికి ఉంటుందనే ప్రతిపాదనను మనం తిరస్కరించ వచ్చు. చెడ్డదైన విషయం, ఎక్కువ సందర్భాలలో అహానికి అపాయకరమైంది గాని, హానికరమైందిగాని ఏమాత్రం కాదు. తద్విరుద్ధంగా అది అహానికి వాంఛితమైనది, ఆనందకరమైనది కావచ్చు. ఇక్కడ, అందుకని, ఒక బాహ్య ప్రభావం పనిచేస్తూ ఉంటుంది. దేన్ని మంచిగా, దేన్ని చెడుగా పరిగణించాలో అది నిర్ణయిస్తుంది. స్వీయ అనుభూతులు వ్యక్తిని ఈ దారిలో నడిపించి ఉండకపోవచ్చు కాబట్టి ఈ బాహ్య ప్రభావానికి లోనుకావడానికి అతనికొక ప్రేరణ ఉండి తీరాలి. అటువంటి ప్రేరణను వ్యక్తి నిస్సహాయత, ఇతరులపై ఆధారపడవలసి రావడంలో మనం తేలికగా కనుగొనవచ్చు. దీనికి మనం ప్రేమ భ్రష్టతా భీతి అని నామకరణం చేయవచ్చు. మనిషి తాను ఆధారపడి ఉన్న మరో మనిషి ప్రేమను కోల్పోతే, అతనికి వివిధ రకాల అపాయాల నుంచి కూడా రక్షణ ఉండదు. వీటన్నింటిని మించి, తనకు ఆధారం కల్పించే ఈ బలీయమైన వ్యక్తి

శిక్షారూపంలో తన ఆధిక్యతను ప్రదర్శించే ప్రమాదానికి అతడు గురవుతాడు. అందుకని, మొదటిగా చెడు అయినది ఏది అంటే వ్యక్తిని ప్రేమ భ్రష్టతకు గురి చేసే ప్రతీదీను. ఈ భ్రష్టత కలిగించే భయం కారణంగా వ్యక్తి అట్టి దాని నుండి తప్పించుకోవాల్సి వుంటుంది. ఇది కూడ వ్యక్తి ఇప్పటికే చెడ్డపని చేశాడా లేదా చేయనుద్దేశిస్తున్నాడా అనే వాటి మధ్య పెద్ద తేడా లేకుండా చేస్తుంది. రెండు సందర్భాలలోను అధికారం (authority) విషయాన్ని కనుగొన్నపుడు అపాయం సంభవిస్తుంది. రెండు సందర్భాలలోను అధికారం ఒకేవిధంగా ప్రవర్తిస్తుంది.

ఈ మన: స్థితిని చెడ్డ అంతరాత్మ (bad conscience) అంటాం. కాని వాస్తవానికి ఈ పేరుకు అది తగదు. ఎందుకంటే, ఈ దశలో అపరాధ భావన స్పష్టంగా ప్రేమ భ్రష్ట భీతి, 'సామాజిక' వ్యాకులత మాత్రమే. చిన్నపిల్లల్లో అది మరొకటి ఎప్పటికీ కానేరదు. కాని చాలా మంది పెద్దలలో కూడ తండ్రి లేదా తల్లిదండ్రులిద్దరి స్థానాన్ని విస్తృత మానవ సమాజం ఆక్రమించిన మేరకు మాత్రమే అది మారడం జరిగింది. ఫలితంగా అటువంటి మనుషులు అధికార వ్యవస్థకు తెలిసే అవకాశం లేదని లేదా నింద తమ మీదకు రాదని వారికి నమ్మకమున్నంత వరకు తమకానందాన్నిచ్చే ఏ చెడ్డపని చేయడానికైనా వెనుకాడరు. కనుగొనబడతామనేది ఒక్కటే వారికుండే భయం. నేటి సమాజం ఇటువంటి మానసిక స్థితి సాధారణంగా పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది.

అధ్యహం స్థాపన ద్వారా అధికారం అంతరీకరణం జరిగినపుడు మాత్రమే ఒక గొప్ప మార్పు సంభవిస్తుంది. అపుడు అంతరాత్మ అనే దృగ్విషయం ఉన్నత దశకు చేరుకొంటుంది. వాస్తవానికి, ఈ దశవరకు అంతరాత్మ గురించి, అపరాధ భావన గురించిగాని మనం మాట్లాడరాదు.[1] సరిగ్గా ఇక్కడే పట్టుబడతామనే భయం కూడా అంతర్హితమవుతుంది. ఇంక చెడు చేయడం, చేయాలను కోవడంల మధ్య తేడా పూర్తిగా మాయమవుతుంది. ఎందుకంటే, ఆలోచనలతో సహా అధ్యహం నుంచి ఏదీ దాచలేం. వాస్తవ దృక్పథం నుంచి చూస్తే, పరిస్థితి తీవ్రత అంతరించి పోయిందనేది నిజం.

---

1. *ఈ సంక్షిప్త వివరణలో వాస్తవానికి క్రమపరివర్తనల ద్వారా సంభవించే ఘటనలను తీవ్రంగా కుదించి చూపడాన్ని, ఇక్కడ ప్రశ్న అధ్యహం ఉనికి మాత్రమే కాక దాని సాపేక్షబలం, ప్రభావ క్షేత్రాలు కూడా అన్న విషయాన్ని విచక్షణా జ్ఞానమున్న వారు ఎవరైనా అర్థం చేసుకొంటారు. పరిగణనలోకి తీసుకొంటారు. అంతేకాక, అంతరాత్మ, అపరాధ భావనల గురించి పైన చెప్పినదంతా అందరికీ తెలిసిందే, దాదాపు నిర్వివాదాంశమైంది.*

ఎందుకంటే ఈ నూతన అగికారం – అధ్యహం – కి, మనకు తెలిసి, తాను దేనితో అయితే సన్నిహితంగా బంధితమై ఉందో అట్టి అహాన్ని బాధించే ఉద్దేశం ఉండే అవకాశం లేదు. కాని, గతించిన వాటి, గతంలో అధిగమించబడిన వాటి మనుగడ కొనసాగడానికి దారితీసే జన్య ప్రభావం, విషయాలు మొదట్లో ఎలా ఉన్నాయో ఇపుడూ మౌలికంగా అలాగే ఉండడం అనే వాస్తవం ద్వారా తన ఉనికిని తెలియజేస్తుంది. పాప పంకిలమైన అహాన్ని, అదే వ్యాకులతానుభూతితో అధ్యహం వేధిస్తుంది. బాహ్య ప్రపంచంచే దానిని (అహాన్ని–అను.) శిక్షింపజేసే అవకాశాల కోసం అది (అధ్యహం–అను.) వేచి వుంటుంది.

ఈ రెండో వికాస దశలో అంతరాత్మ ఒక విచిత్ర లక్షణాన్ని ప్రదర్శిస్తుంది. ఇది మొదటి దశలో ఉండదు. దీనికి కారణం చెప్పడం కూడ అంత తేలిక కాదు. ఎందుకంటే, ఒక మనిషి ఎంత ఎక్కువగా సచ్ఛీలుడైతే, అంతరాత్మ ప్రవర్తన అంత తీవ్రంగాను, అవిశ్వసనీయంగాను ఉంటుంది. అంతిమంగా, ఋషిత్వాన్ని అత్యంతంగా పాటించేవాళ్ళే తాము అత్యంత పాపులమని నిందించుకొనేటంతగా ఇది ఉంటుంది. దీని అర్థం సచ్ఛీలత దానికి రావలసిన పారితోషికంలో కొంత భాగాన్ని కోల్పోతుంది. సాధుశీలి, సంయమనశీలి అయిన అహం కూడా దాని పథ నిర్దేశకుని (అధ్యహం–అను) విశ్వాసాన్ని చూరగొనలేక, ఆ విశ్వాసాన్ని పొందడానికి వృధా ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ కష్టాలన్నీ కృతకాలని వెంటనే అభ్యంతరం లేవనెత్తబడుతుంది. మరింత అప్రమత్తంగా ఉండే అంతరాత్మ నైతిక మానవునికి ఖచ్చితమైన గీటురాయి అని చెప్పడం జరుగుతుంది. ఋషులు సహజాతాలను సంతృప్తిపరచుకోవాలనే ప్రలోభాలకు ప్రత్యేకంగా తీవ్రమైన స్థాయిలో గురవుతారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, వారు తమని తాము పాపులమని చెప్పుకోవడంలో అంత తప్పేమీలేదు. ఎందుకంటే, అందరికీ తెలిసినట్లుగా, నిరంతర అవరోధాలతో ప్రలోభాలు మరింత పెరుగుతాయి. అలాకాక, అప్పుడప్పుడు వాటిని తృప్తిపరిస్తే కనీసం తాత్కాలికంగానైనా అవి తగ్గిపోతాయి. అత్యంతంగా సమస్యలతో నిండిఉండే నైతిక రంగం మరో వాస్తవాన్ని మన ముందుంచుతుంది : అదేమిటంటే, దురదృష్టం–అంటే బాహ్య అవరోధం–అధ్యహంలోని అంతరాత్మ అధికారాన్ని పెద్ద ఎత్తున పెంచుతుంది. మనిషికి అంతా సవ్యంగా నడుస్తున్నంతకాలం అంతరాత్మ ఉదారంగా ఉంటుంది. అహాన్ని అన్ని రకాల పనులు చేయనిస్తుంది. కాని దురదృష్టం మనిషిని వెంటాడినపుడు, అతడు తన ఆత్మ శోధనకు పూనుకొంటాడు. సుఖపరిత్యాగాలను తనపై

విధించుకొంటాడు. ప్రాయశ్చిత్త విధులతో తనను తాను శిక్షించుకొంటాడు.[1] మొత్తం ప్రజ ఇలాగే ప్రవర్తిస్తారు, ప్రవర్తిస్తున్నారు. దీనిని అంతరాత్మ మౌలిక దశగా తేలికగానే వివరించవచ్చు. అయితే, ఈ దశను, అంతరాత్మ అధ్యహంలోకి చొప్పించబడిన తర్వాత కూడా త్యజించకపోవడం మనం గమనించవచ్చు. ఇది అధ్యహం ప్రక్కన, వెనువెంట కొనసాగుతుంది. విధి అనేది తల్లిదండ్రుల పాత్రకు ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతుంది. వ్యక్తి దురదృష్టవంతుడైతే, అతడు ఇక ఏమాత్రం ఈ ఉన్నత అధికారం ప్రేమకు నోచుకోలేదన్నమాట. ఆ విధంగా ప్రేమ భ్రష్టతతో బెదిరించబడినప్పుడు అతడు మళ్ళీ ఒకసారి తన అధ్యహంలోని పితరుల ప్రతినిధికి దాసోహమంటాడు. ఇదే అంతా సవ్యంగా సాగిపోతున్న రోజుల్లో అయితే అతడు ఈ పితరుల ప్రతినిధిని విస్మరించడానికి సిద్ధంగా ఉంటాడు. విధిని మతార్థంలో దైవ సంకల్ప వ్యక్తీకరణ కంటే భిన్నమైనది కాదని గ్రహించినప్పుడు ఈ విషయం మరింత స్పష్టమవుతుంది. ఇజ్రాయిల్ ప్రజలు తామే దేవుని ముద్దుబిడ్డలమని విశ్వసించారు. ఆ గొప్ప తండ్రి దురదృష్ట పరంపరను వారిపై కురిపించినప్పుడు వారికి అతడి మీది విశ్వాసం సడలలేదు. వారు అతని అధికారాన్ని, ధర్మనిరతిని ప్రశ్నించలేదు. బదులుగా వారు ప్రవక్తలను తయారుచేశారు. ఆ ప్రవక్తలు ప్రజలకు వారి పాపాలను ఎత్తిచూపారు. వారు తమ అపరాధ భావనలో నుండి తమ పురోహిత మత వ్యవస్థకు చెందిన మరింత కఠినమైన ఆజ్ఞలను సృష్టించారు. ఇందుకు భిన్నంగా ఆదిమ మానవుడు ప్రవర్తించే తీరు విశేషమైనది. దురదృష్టం ఎదురైనప్పుడు అతడు నిందా బాధ్యతను తనపై వేసుకోక, తను పూజించే వస్తువుమీదకు నెడతాడు. ఎందుకంటే అది దాని పనిని సరిగా చేయలేదు. అందుకని, తనని తాను శిక్షించుకోవడానికి మారు, దానిని శిక్షిస్తాడు.

---

1. *దురదృష్టం ఫలితంగా నీతి పెరగడం అనే విషయాన్ని మార్క్‌ట్వైన్ తాను రాసిన "నేను ఒకసారి దొంగిలించిన మొదటి పుచ్చకాయ" (The first melon I ever stoel) అనే ఒక చిన్న ఆహ్లాదకరమైన కథలో సోదాహరణంగా చూపడం జరిగింది. ఈ మొదటి పుచ్చకాయ పక్వానికి వచ్చిందికాదు. మార్క్‌ట్వైన్ ఒక బహిరంగ పఠన కార్యక్రమంలో ఈ కథను చెప్పడం నేను విన్నాను. కథ పేరు చెప్పిన తరువాత అతడు ఆగిపోయి, సందేహంలో పడినట్లుగా అతనిని అతడే 'అదే మొదటిదా?' అని ప్రశ్నించుకున్నాడు. దానితో మొత్తం విషయం చెప్పినట్లయింది. దొంగిలించబడింది మొదటి పుచ్చకాయ ఒక్కటే కాదనేది స్పష్టం.*

ఈ విధంగా అపరాధ భావనకు రెండు మూలాలున్నట్లు తెలుస్తుంది. ఒకటి అధికారం పట్ల భయం నుంచి కలిగేది, రెండోది తరువాత దశలో అధ్యహం పట్ల భయం నుంచి కలిగేది. మొదటిది సహజాత సంతృప్తి పరిత్యాగాన్ని నొక్కి చెబితే, రెండోది దానితోపాటు శిక్షను గూడ నొక్కి చెబుతుంది. ఎందుకంటే, నిషిద్ధ వాంఛల కొనసాగింపును అధ్యహం నుంచి దాచలేము. అంతేకాదు, మనం మన అధ్యహం తీవ్రతను - అంతరాత్మ ప్రబోధాన్ని - ఎలా అర్థం చేసుకోవాలో నేర్చుకున్నాం. ఇది బాహ్యాధికారం తీవ్రతను కొనసాగించడం మాత్రమే. ఇది బాహ్యాధికారానికి వారసురాలై, పాక్షికంగా దాని స్థానాన్ని ఆక్రమిస్తుంది. అపరాధ భావనతో సహజాత పరిత్యాగం ఎటువంటి సంబంధాన్ని కలిగి ఉందో మనం ఇప్పుడు పరిశీలిద్దాం. వస్తుత:, బాహ్యాధికార భయం ఫలితమే సహజాత పరిత్యాగం; బాహ్యాధికారపు ప్రేమను కోల్పోకుండా ఉండడం కోసం వ్యక్తి తన సంతృప్తిని పరిత్యాగం చేశాడు. ఈ పరిత్యాగాన్ని నిర్వర్తించిన వ్యక్తి బాహ్యాధికారంతో సమాన స్థాయిని పొందుతాడు. అతనిలో ఏ అపరాధభావన ఇక మిగిలి ఉండదు. కాని ఇదే అధ్యహం కలిగించే భయం విషయం అయితే వేరుగా ఉంటుంది. ఇక్కడ పహజాత పరిత్యాగం ఒక్కటే సరిపోదు. ఎందుకంటే కోర్కె మిగిలిపోతుంది. దీనిని అధ్యహం నుంచి దాచడం వీలుపడదు. ఈ విధంగా పరిత్యాగపాలన చేసినప్పటికీ అపరాధ భావన ఏర్పడుతుంది. అధ్యహాన్ని రూపొందించడంలో లేదా మరో విధంగా చెప్పాలంటే అంతరాత్మ రూపకల్పనలో ఇది నిర్మాణపరంగా తీవ్రమైన ఇబ్బందిని తెచ్చిపెడుతుంది. సహజాత పరిత్యాగానికి సంపూర్ణ విముక్తికి దారితీసే శక్తి ఇక ఏమాత్రం లేదు. సచ్చీల జనిత నిగ్రహానికి ప్రతిఫలంగా ప్రేమ తప్పక లభిస్తుందనే హామీ ఇవ్వడం ఇక జరగదు. ప్రేమను కోల్పోవడం, బాహ్యాధికారంచే శిక్షించబడడం నుండి ఉత్పన్నమయ్యే బాహ్యజనిత అసంతోషం స్థానే శాశ్వత అంతరంగ అసంతోషం, అపరాధ భావన కలిగించే ఒత్తిడి మనిషి పరమయ్యాయి.

ఈ పరస్పర సంబంధాలు ఎంత సంక్లిష్టమైనవి, అదే సమయంలో ఎంత ముఖ్యమైనవి అంటే, చెప్పిందే చెప్పినట్లయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, నేను వాటిని మరో కోణం నుంచి పరిశీలిస్తాను. అపుడు వాటి కాలక్రమత ఇలా ఉంటుంది : బాహ్యాధికారం చేసే దౌర్జన్యం కారణంగా మొదటిగ సహజాత పరిత్యాగం వస్తుంది. (ఇదే ప్రేమను కోల్పోవడం గురించిన భయంకూడ, ఎందుకంటే ఈ శిక్షాత్మక దౌర్జన్యం నుండి ప్రేమ కాపాడుతుంది). ఆ తరువాత ఒక అంతరంగిక అధికారం రూపొందడం, దానివలన, అంటే అంతరాత్మ వలని భయంతో సహజాత పరిత్యాగం జరగడం సంభవిస్తుంది. ఈ

రెండో పరిస్థితిలో చెడు ఉద్దేశాలు, చెడుపనులతో సమం చేయబడడం ద్వారా అపరాధ భావనకు, శిక్షావసరానికి దారితీసాయి. అంతరాత్మ దౌర్జన్యత, అధికారపు దౌర్జన్యతను బలపరుస్తుంది. నిస్సందేహంగా ఇంత వరకు విషయాలు స్పష్టంగా పేర్కొనబడ్డాయి. కాని దురదృష్టం (బయటనుండి విధించబడిన పరిత్యాగం) ప్రభావం మరింత పెరగడానికి, ఉత్తములు, అత్యంత విధేయులు అయిన ప్రజలలో అసాధారణ అంతరాత్మ తీవ్రత ఉండడానికి ఇక్కడ అవకాశం ఎక్కడ ఉంది ? మనం ఇప్పటికే అంతరాత్మ రెండు ప్రత్యేక లక్షణాల గురించి వివరించాము. కాని ఆ వివరణలు విషయ మూలానికి పోలేదని, ఇంకా వివరించవలసిన అవశేషం వేరైన, పూర్తిగా మనోవిశ్లేషణకు చెందిన ఒక భావన ఎట్టకేలకు ముందుకు వచ్చింది. అదొక ప్రత్యేకమైన భావన. మనం చర్చించే విషయం అంత గందరగోళంగా, అర్థంకాకుండా ఎందుకు ఉందో ఇది తెలియచేస్తుంది. ఎందుకంటే, అంతరాత్మ (ఖచ్చితంగా చెప్పాలంటే తరువాత అంతరాత్మగా మారనున్న వ్యాకులత) మొదట్లో సహజాత పరిత్యాగానికి నిజమైన కారణమని, అయితే తరువాత వాటి సంబంధం తలక్రిందులవుతుందని ఇది చెపుతుంది. ప్రతి సహజాత పరిత్యాగం ఇపుడు అంతరాత్మకు గతిశీలక మూలం అవుతుంది. తరువాత చేసే ప్రతి కొత్త పరిత్యాగం అంతరాత్మ తీవ్రతను, అసహనాన్ని పెంచుతుంది. అంతరాత్మ ఆవిర్భావ చరిత్ర గురించి మనకు తెలిసిన దానితో దీనిని సమన్వయం చేయగలిగితే మనం - అంతరాత్మ సహజాత పరిత్యాగ ఫలితం లేదా (బయటినుంచి మనపై విదించబడిన) సహజాత పరిత్యాగం అంతరాత్మను సృష్టిస్తుంది. తదుపరి ఈ అంతరాత్మ మరింత పరిత్యాగాన్ని కోరుతుంది - అన్న వైచిత్రిపూర్వక ప్రకటనను కూడ సమర్థించడానికి సిద్ధపడతాం.

ఇంతకుముందు అంతరాత్మ ఆవిర్భావం గురించి మనం చెప్పినదానికి, ఇపుడు చెబుతున్న దానికి మధ్య ఉన్న వైరుధ్యం మరీ పెద్దదేమీ కాదు. ఈ వైరుధ్యాన్ని ఇంకా తగ్గించేందుకు ఒక మార్గం ఉంది. మన వివరణను సులభతరం చేసేందుకు దౌర్జన్య సహజాతాన్ని ఉదాహరణగా తీసు కొందాం. మనం చర్చించే పరిత్యాగం అన్ని వేళల దౌర్జన్య పరిత్యాగమనే భావిద్దాం. (దీనిని మనం తాత్కాలిక ప్రతిపాదనగానే గ్రహిద్దాం.) వ్యక్తి సంతృప్తం చేయని ప్రతి దౌర్జన్య ఖండాన్ని అధ్యహం స్వీకరించి తాను (అహంమీద) జరిపే దౌర్జన్య తీవ్రతను పెంచుతుంది. ఇదే అంతరాత్మ మీద సహజాత పరిత్యాగ ప్రభావం. అయితే ఇది, అంతరాత్మ మౌలిక దౌర్జన్యత బాహ్యాధికారపు తీవ్రతకు కొనసాగింపేనని, అందువలన దీనికి పరిత్యాగంతో ఏమీ సంబంధం లేదనే వాదనతో

సమన్వయం కాదు. కాని, మనం అధ్యహం దౌర్జన్యతలోని ఈ తొలివిడతకు భిన్నమైన నిర్ధారణను ప్రతిపాదించ గలిగితే, ఈ తేడాను అధిగమించవచ్చు. బిడ్డకుండే మొదటి, అత్యంత ముఖ్యమయిన సంతృప్తులను నిరోధించిన అధికారానికి వ్యతిరేకంగా ఆ బిడ్డలో గణనీయమైన మేరకు దౌర్జన్యత ఉత్పన్నమవుతుంది. బిడ్డను పరిత్యజించమని కోరినవి ఏరకం సహజాత సంతృప్తులయినా అయి ఉండవచ్చు. కాని బిడ్డ ప్రతీకార ప్రేరిత దౌర్జన్యత నుండి లభించే సంతృప్తిని పరిత్యాగం చేయక తప్పదు. ఈ క్లిష్ట పరిస్థితి నుండి బయటపడే మార్గాన్ని పరిచితమైన యంత్రాంగాలద్వారా అతడు కనుగొంటాడు. తాథాత్మీకరణం ద్వారా ఎదుర్కోవడం సాధ్యంకాని అధికారాన్ని తనలోనికి తీసుకొంటాడు. ఇప్పుడు ఆ అధికారం అతడి అధ్యహంగా మారుతుంది. బిడ్డ ఆ అధికారం యెడ ఎటువంటి దౌర్జన్యాన్ని ప్రదర్శించదలచాడో, ఆ దౌర్జన్యం అంతా ఇపుడు అధ్యహం సర్దుకుపోక తప్పదు. దీనివల్ల తండ్రిపాత్ర దిగజార్చబడింది. ఇక్కడ తరచు జరిగే విధంగానే, (వాస్తవ) సన్నివేశం తారుమారయింది : 'నేను తండ్రినై నీవు బిడ్డవైతే, నేను నిన్ను అదుపాజ్ఞలలో ఉంచక తప్పదు'. అధ్యహానికి, అహానికి మధ్యన ఉండే సంబంధం అనేది, ఇంకా విభజించబడని అహానికి, బాహ్య వస్తువుకి మధ్యనుండే వాస్తవ సంబంధాలు, వాంఛచే వక్రీకరించబడడం ద్వారా, పునరావృతం కావడం. ఇది విలక్షణమైనది కూడ. కాని ముఖ్యమైన తేడా ఏమిటంటే, అధ్యహం మౌలిక తీవ్రత, వ్యక్తి వస్తువు నుండి అనుభవించిన తీవ్రతకు లేదా దానికి ఆపాదించబడిన తీవ్రతకు అంతగా ప్రాతినిధ్యం వహించదు. ఇందుకు భిన్నంగా, అధ్యహం దాని (వస్తువు-అను)పట్ల వ్యక్తికి ఉన్న దౌర్జన్యతను ప్రతిబింబిస్తుంది. ఇదే గనుక వాస్తవమైతే, దౌర్జన్య ప్రచోదనను అణచివేయడంద్వారా మొదట అంతరాత్మ ఉద్భవిస్తుందని,తదుపరి అదేవిధమైన సరికొత్త అణచివేతల కొనసాగింపు ద్వారా అది మరింత బలపడుతుందనేది నిజమని మనం నొక్కి చెప్పవచ్చు.

ఈ రెండు దృక్కోణాలలో ఏది సరైంది ? జైవిక పరంగా ఖండించడానికి వీలులేని మొదటిదా ? లేక ఆహ్వానించదగిన రీతిలో సిద్ధాంతాన్ని మలిచిన రెండోదా ? స్పష్టత దృష్ట్యాను, ప్రత్యక్ష పరిశీలన నుండి లభించిన ఆధారం దృష్ట్యాను చూస్తే, రెండూ సమర్థనీయాలే. అవి ఒకదానికొకటి పరస్పరం ఖండించుకోవు. ఏదో ఒక సందర్భంలో అవి కలుస్తాయి కూడ. తండ్రి నుంచి వస్తుందని ఊహించబడిన శిక్షాత్మక దౌర్జన్య పరిమాణం, బిడ్డలో కలిగే ప్రతీకార ప్రేరిత దౌర్జన్యతను కొంతవరకు నిర్ణయిస్తుంది. అనుభవం చెప్పేదేమంటే, బిడ్డ ఏర్పరచుకొనే అధ్యహం తీవ్రత, తాను ఎదుర్కొన్నటు

వంటి పరిస్థితుల తీవ్రతకు ఏవిధంగాను, సరిపోలదు. మొదటిదాని తీవ్రత, రెండవదాని తీవ్రత నుండి స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తుంది. చాలా గారాబంగా పెంచబడ్డ బిడ్డ అతిపరుషమైన అంతరాత్మను ఏర్పరచు కోవచ్చు. కాని ఈ స్వతంత్రతను అతిగా చెప్పడం కూడా పొరపాటు అవుతుంది. ఆంక్షలతోకూడిన పెంపకం అధ్యహం రూపొందడం మీద బలమైన ప్రభావాన్ని చూపుతుందని విశ్వసించడం పెద్దకష్టమేమీకాదు. దీనికంతటికి అర్థమేమిటంటే, అధ్యహం, అంతరాత్మ రూపొందడంలో అంతస్సిద్ధ నిర్మాణాంశాలు, వాస్తవ పరిసర ప్రభావాలు కలిసి పనిచేస్తాయి. ఇందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. తద్భిన్నంగా, ఇది ఇలాంటి అన్ని ప్రక్రియలకు అన్వయించే సార్వత్రిక కార్యకారణ షరతు.[1]

ఒక బిడ్డ తానెదుర్కొనే మొదటి పెద్ద సహజాత కుంఠనానికి (frustration) అతి తీవ్ర దౌర్జన్యంతోను, అంతే తీవ్ర అధ్యహంతోను ప్రతిచర్య జరిపితే, అతడు జాతి జైవిక వికాస (phylogenetic) నమూనాను అనుసరిస్తున్నాడన్నమాట. ఆ సమయానికి సమర్థనీయమైన ప్రతిస్పందనను మించి అతను ప్రవర్తిస్తున్నాడు. ప్రాక్చరిత్ర కాలపు తండ్రి నిస్సందేహంగా భయానకంగా ప్రవర్తించేవాడు. మితిమీరిన దౌర్జన్యతను అతనికి ఆపాదించవచ్చు. ఈ విధంగా వైయక్తిక వికాసం నుండి జాతి జైవిక వికాసానికి మారితే, అంతరాత్మ పుట్టుకకు సంబంధించి రెండు సిద్ధాంతాల మధ్య ఉన్న తేడా మరింతగా తగ్గిపోతుంది. మరోప్రక్క ఈ రెండు రకాల వికాస ప్రక్రియల మధ్య మరో ముఖ్యమైన

---

1. పిల్లల పెంపకానికి సంబంధించిన రెండు ముఖ్య రోగజనక విధానాల - అతికాఠిన్యత, అతిగారాబం గురించి ఐచ్‌హోరన్ చేసిన బాలాపరాధ (delinquency) అధ్యయనం వేవర్డ్ యూత్ (1926) సందర్భంలో ఫ్రాంజ్ అలెగ్జాండర్ తన గ్రంథం "ది సైకోఎనాలిసిస్ ఆఫ్ ది టోటల్ పర్సనాలిటీ" (1927)లో ఖచ్చితంగా అంచనా కట్టాడు. 'అతిగా లాలించి, గారాబంచేసే తండ్రి' పిల్లల్లో అతి తీవ్రమైన అధ్యహం రూపొందడానికి కారణం అవుతాడు. ఎందుకంటే, తాము పొందుతున్న ప్రేమ ఫలితంగా, దౌర్జన్యాన్ని లోనికి తిప్పుకోవడం తప్ప, బయటికి వ్యక్తీకరించే మార్గం వారికి లేదు. ప్రేమ రాహిత్యంతో పెంచబడిన అపరాధ బాలల (delinquent children)లో అహంకు, అధ్యహంకు మధ్య తన్యత (tension) ఉండదు. అందువల్ల వారి మొత్తం వెలుపలికే సారించబడుతుంది. ఉన్నట్లుగా భావించబడే ఒక అంతస్సిద్ధ కారకమే కాకుండా, మరి రెండు కారకాల సంయుక్తా చరణ నుంచి ఒక తీవ్ర అంతరాత్మ పుడుతుందని చెప్పవచ్చు. ఆ రెండు కారకాలు ఏవంటే, దౌర్జన్యత విడుదలకు దారితీసే సహజాత కుంఠనం, దౌర్జన్యతను లోపలికి మలిపి అధ్యహానికి అందించే ప్రేమించబడటమనే అనుభవం.

తేడా కనిపిస్తుంది. అపరాధ భావన ఇడిపస్ కాంప్లెక్స్ నుంచి జనిస్తుందని, తండ్రిని సోదర బృందం చంపినప్పుడు ఇది ఏర్పడిందనే భావన నుంచి మనం తప్పించుకోలేము. ఆ సందర్భంలో దౌర్జన్య చర్య అణచివేతకు గురికాకుండ పరిపూర్తి చేయబడింది. అదే దౌర్జన్య చర్య బిడ్డలో అణచివేతకు గురి కావడం అతనిలోని అపరాధ భావనకు మూలంగా భావించబడుతోంది. ఇక్కడకు వచ్చేసరికి పాఠకుడు ఆగ్రహంతో ఈ విధంగా గట్టిగా ప్రకటిస్తే నేనేమీ ఆశ్చర్యపోను : "వ్యక్తి తండ్రిని చంపినా చంపకపోయినా - రెండు సందర్భాలలోను అపరాధానుభూతికి గురవుతాడన్న మాట ! ఇక్కడ మనం కొన్ని సందేహాలను లేవనెత్తవచ్చు. అణచివేయబడ్డ దౌర్జన్యత నుండి అపరాధ భావన జనించడం వాస్తవం కాకపోయి ఉండాలి, లేదా తండ్రిని సోదర బృందం చంపడం కల్పితమైనా అయి ఉండాలి. ప్రాచీన మానవుని పిల్లలు తమ తండ్రులను చంపడం అనేది ఇప్పటి పిల్లలు చేసేదానికంటే తరచుగా ఏమీ చేయలేదు. ఇది కాల్పనికంకాక, చారిత్రక వాస్తవమైతే, జరుగుతుందని ప్రతి ఒక్కరు ఊహించేది - అంటే, సమర్థనీయంకానిది తాను నిజంగా చేయడంవల్ల వ్యక్తి అపరాధాను భూతికి లోనుకావడం - జరిగినట్లవుతుంది. ప్రతినిత్యం జరిగే ఈ సంఘటన గురించి మనోవిశ్లేషణ ఇంతవరకు ఏ వివరణ ఇవ్వలేదు."

పై వాదన నిజమే. మనం ఈ లోటును తప్పక భర్తీ చేయాలి. అయితే, ఈ విషయంలో పెద్ద రహస్యం ఏమీ లేదు. ఒక వ్యక్తి తప్పు చేసిన కారణంగా అపరాధాను భూతికి గురయితే, ఆ అనుభూతిని పశ్చాత్తాపం అని పిలవడం సరి అయినది. పరిపూర్తి చేయబడిన పనితో మాత్రమే దీనికి సంబధం ఉంటుంది. అయితే అంతరాత్మ - అంటే అపరాధానుభూతి చెందడానికి సంసిద్ధత - ఆ చర్య జరగడానికి ముందే అస్తిత్వంలో ఉండడం దీనికి తప్పనిసరి ప్రాతిపదిక. అందువలన ఈ రకమైన పశ్చాత్తాపం అంతరాత్మ ఆవిర్భావ మూలాన్ని, మొత్తంగా అపరాధానుభూతిని కనుక్కోవడానికి ఎప్పటికీ ఉపకరించదు. ఈ దైనందిన సంఘటనలలో మామూలుగా ఇలా జరుగుతుంది. అంతరాత్మ పరిమితమైన బలాన్ని మాత్రమే సమకూర్చుకుంటుంది. సంతృప్తి చెందడంవలన అవసరం సహజంగానే బలహీనపడుతుంది. దీనితో అంతకు ముందరి బలాబలాల తుల్యత పున:స్థాపితమవుతుంది. పశ్చాత్తాపం వలన కలిగే అపరాధ భానవ - అది ఎంత తరచుగా జరిగినా, దాని ఆచరణాత్మక ప్రాముఖ్యత ఎంత గొప్పదైనా - పరిశీలనను ప్రస్తుత చర్చనుండి మనోవిశ్లేషణ వదలివేయడం సమర్థనీయమే.

కానీ మనుషులలోని అపరాధ భావనను ఆదిమ కాలంలో తండ్రిని హత్యచేయడం వరకు తీసుకుపోతే, అది 'పశ్చాత్తాపం' మాత్రమే అవుతుంది. మనంపైన ప్రతిపాదించిన దానికి విరుద్ధంగా, నిజానికి ఆ కాలంలో, అంటే తండ్రి హత్యకు ముందు, అంతరాత్మ, అపరాధ భావన లేవనుకోవాలా ? అలా అయితే, ఈ సందర్భంలో పశ్చాత్తాపం ఎక్కడనుంచి వచ్చింది ? ఈ సందర్భం మనకు అపరాధ భావన రహస్యాన్ని విడమరిచి మన కష్టాలకు ముగింపు పలుకుతుంది అనడంలో సందేహం లేదు. అది అలా చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను. తండ్రి యెడ ఉండే ఆదిమ ద్విసంవేగస్థితి (Primordial ambivalence)[1] ఫలితమే ఈ పశ్చాత్తాపం. తండ్రిని కొడుకులు ద్వేషించారు. అదే సమయంలో ప్రేమించారు కూడ. వారి దౌర్జన్య చర్య ద్వారా తమ ద్వేషాన్ని సంతృప్తిపరచుకొన్న పిదప, ఆ చర్యపట్ల వారిలో కలిగిన పశ్చాత్తాప రూపంలో వారి ప్రేమ బహిర్గతమయింది. తండ్రితో తాదాత్మ్యం ద్వారా ఇది అధ్యహాన్ని రూపొందించింది. తండ్రి అధికారాన్ని అది దఖలు చేసింది. ఈ చర్య పునరావృతం కాకుండా నిరోధించే లక్ష్యంతో ఆంక్షలను సృష్టించింది. తరువాత తరాలలో తండ్రికి వ్యతిరేకంగా దౌర్జన్యకాంక్ష పునరావృతం కావడం వలన అపరాధ భావన కూడా కొనసాగింది. అణచివేయబడి, అధ్యహానికి కొనిపోబడ్డ ప్రతి దౌర్జన్య చర్యతో అపరాధ భావన మరింత బలపడింది. ఎట్టకేలకు సంపూర్ణమైన స్పష్టతతో రెండు విషయాలను ఇప్పుడు మనం గ్రహించగలమని నేను అనుకొంటున్నాను : అంతరాత్మ ఆవిర్భావంలో ప్రేమ వహించిన పాత్ర. అపరాధ భావన యొక్క తిరుగులేని అనివార్యత. ఒకడు తండ్రిని చంపాడా లేక ఆ చర్యకు దూరంగా ఉన్నాడా అనేది అంత ముఖ్య నిర్ణాయాత్మకాంశం కాదు. రెండు సందర్భాలలోను అతడు అపరాధానుభూతి చెందవలసిందే. ఎందుకంటే, జీవసూత్రం, వినాశకర లేక మృత్యు సహజాతాల మధ్య సాగే శాశ్వత పోరాటం, ద్విసంవేగస్థితి వలన కలిగే ఘర్షణల అభివ్యక్తీకరణే అపరాధ భావన. మానవులు కలిసి జీవించడం ఆరంభమయ్యా కాగానే ఈ ఘర్షణ ప్రారంభమైంది. కుటుంబం కాక మరో రూపాన్ని సమాజం స్వీకరించనంతవరకు, అంతరాత్మ రూపొందడానికి, తొలి అపరాధ భావన కలగడానికి సాగే ఘర్షణ ఇడిపస్ కాంప్లెక్స్ రూపంలో అభివ్యక్తమై తీరాలి. సమూహాన్ని విస్తృతం గావించే ప్రయత్నం జరిగినప్పుడు, అదే ఘర్షణ గతంమీద ఆధారపడిన రూపాల ద్వారా కొనసాగుతుంది. అది బలపడి, అపరాధ భావన మరింత తీవ్రమవడానికి కారణం అవుతుంది. అత్యంత సన్నిహిత సమూహంగా మానవులను గుదిగూర్చే అంతరంగ కామ ప్రచోదనను నాగరికత ఔదల

దాలుస్తుంది గనుక, ఈ లక్ష్యం నిరంతరం బలపడే అపరాధ భావనద్వారా మాత్రమే నెరవేరుతుంది. తండ్రి పరంగా ఆరంభ మైనది సమూహపరంగా పూర్తి అయింది. కుటుంబంలో మొదలై యావత్ మానవాళి అభివృద్ధిక్రమానికి నాగరికత గనుక తప్పనిసరి అవసరమైతే, అలాంటప్పుడు – ద్విసంవేగస్థితి నుంచి ఉత్పన్నమయ్యే అంతస్సిద్ధ ఘర్షణ ఫలితంగా, ప్రేమ, మృత్యువుల మధ్య శాశ్వత పోరాట ఫలితంగా – అపరాధ భావన పెరగడం విడదీయరాని విధంగా దానితో ముడివడి ఉంది. ఈ పెరుగుదల, బహుశా వ్యక్తి భరించలేని స్థాయికి చేరుకుంటుంది. 'దైవాధికారా'న్ని కదిలించే విధంగా అధిక్షేపిస్తూ మహాకవి రాసినది గుర్తుకొస్తోంది.

ఈ భూమికి, అలసి సొలసి పోయిన ఈ భువికి,
చూసి చూసి మీరే లాక్కొచ్చారు మా అపరాధిత్వానికి
మళ్ళీ మీరే ఈడ్చుకెళ్లారక్కడ్నించి నిర్లక్ష్య తీరాలకి,
మమ్మల్నీ ఘోర పశ్చాత్తాపం గొంతు పిండటానికి;
ఓ క్షణికావేశ దుశ్చర్య..... ఓ యుగ పర్యంత వ్యధ !

(గోథె రాసిన విల్‌హిల్మ్‌మెయిస్టర్‌లోని త్రికోణ – తీగల వాయిద్యం మీద వాయించే పాటలలో ఒకటి)

మనలో అనేకమంది సత్యాన్వేషణ కోసం వేధించే అనిశ్చిత, అవిశ్రాంత అన్వేషణల ద్వారా మార్గాన్ని వెదుక్కోవలసి వుండగా, కొద్దిమందికి మాత్రం తమ అనుభూతుల సుడిగుండం నుంచి సునాయాసంగా నిగూఢ సత్యాలు వెలికితీయగలిగే శక్తి దత్తం చేయబడిందన్న గ్రహింపు మనకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తుంది.

* * *

VIII

చివరి మజిలీకి చేరాక, ఇంతకంటె మంచి నిపుణుడైన మార్గదర్శి కాలేక పోయినందుకు, నిర్మానుష్యమైన దారులనుండి, ఇబ్బందికరమైన డొంకతిరుగుళ్ళ నుండి వారిని కాపాడలేకపోయి నందుకు పాఠకులను రచయిత క్షమాపణలు వేడాలి. దీనిని ఇంతకంటె బాగా నెరవేర్చి ఉండవచ్చుననే విషయంలో ఎలాంటి సంశయానికి తావులేదు. కనీసం ఈ చివరి దశలో కొన్ని దిద్దుబాట్లు చేసుకోవడానికి ప్రయత్నిస్తాను.

అపరాధ భావనమీద మనం చేసిన చర్చ ఈ వ్యాసం రూపురేఖలను దెబ్బతీసిందని పాఠకుడు అభిప్రాయ పడుతున్నాడని నేను అనుకుంటున్నాను. ఈ చర్చ అవసరాన్ని మించి ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడంతో, దానితో సన్నిహిత సంబంధంలేని మిగతా అంశాలు ఒక పక్కకునెట్టబడ్డాయి. ఇది నా రచన నిర్మితిని దెబ్బతీసి ఉండవచ్చుకాని, నాగరికతా వికాసంలో అపరాధ భావన అత్యంత ముఖ్యమైన సమస్య అని, నాగరికతా వికాసానికి మనం చెల్లించే మూల్యం అపరాధ భావన తీవ్రతరం కావడం ద్వారా ఆనందాన్ని కోల్పోవడమని నేను చెప్పదల్చుకున్న విషయాలకు అనుగుణంగానే ఈ రచన ఉంది.[1] మన అన్వేషణ అంతిమ నిర్ధారణ అయిన ఈ ప్రకటనలో ఏదైనా విశేషాంశం కనిపిస్తే,

---

[1] *"అలా అంతరాత్మ మనలనందరిని పిరికివాళ్ళనుగా చేస్తున్నది....."*
ఈ రోజు యువతకు గరిపే విద్య వారి జీవితాలలో లైంగికత నిర్వహించే పాత్రను వారి నుంచి దాచిపెడుతోందనేదొక్కటే దానికి వ్యతిరేకంగా మనం ఆరోపించే నింద కాదు. విద్య చేసే మరో పాపం ఏమంటే, మునుముందు తాము గురికానున్న దౌర్జన్యతకు వారిని సమాయత్తపరచకపోవడం, అటువంటి లోపభూయిష్ట మనోవైజ్ఞానిక శిక్షణతో యువతను జీవితంలోకి నెట్టడంజరుగుతోంది. ఇదెలా ఉందంటే, ధృవయాత్రకు వెళ్లేవారికి వేసవి దుస్తులు, ఇటలీ సరస్సుల పటాలను సమకూర్చి పంపినట్లుంది. ఇందులో నైతికాదర్శాలను కొంతమేరకు దురుపయోగం కావించినట్లు స్పష్టమవుతుంది. విద్య ఈ దిగువ చెప్పిన రీతిగా బోధిస్తే, ఆ ఆదర్శాల కాఠిన్యత పెద్దగా హాని చేయదు : 'మనుషులు సుఖంగా ఉండాలంటేను, తోటివారిని సుఖంగా ఉంచాలంటేను వారు ఇలా ఉండితీరాలి; కానీ వారు అలా ఉండవకపోవచ్చుననే విషయాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి', ఇలా చెప్పడానికి బదులు ప్రతి ఇతరుడు ఆ నైతికాదర్శాలను నిర్వర్తిస్తున్నాడని, అంటే ప్రతి ఇతరుడు శీలవంతుడే అని యువతను నమ్మిస్తున్నారు. యువత శీలవంతంగా ఉండాలనే ఆదర్శం దీనిపైనే ఆధారపడి ఉంది.

దానిని బహుశ అపరాధానుభూతికి, చేతనకు మధ్య ఉన్న అత్యంత విలక్షణమైన - ఇప్పటికీ ఇంకా పూర్తిగా వివరించబడని - సంబంధంతో ముడిపెట్టవచ్చు. సాధారణం అని భావించబడే, తరుచుగా తారసపడే పశ్చాత్తాపం విషయంలో, ఈ అనుభూతి చేతనకు తెలిసిపోయేటంత స్పష్టంగా ఉంటుంది. వాస్తవానికి, 'అపరాధ అనుభూతి'కి బదులుగా 'అపరాధ చేతన' అనడానికి అలవాటుపడ్డాము. నాడీ రుగ్మతలకు సంబంధించిన మన అధ్యయనం, సాధారణ (మానసిక-అను) స్థితులను అర్థం చేసుకోవడానికి అత్యంత విలువైన సూచికలను అందించింది. అదే సందర్భంలో ఇది కొన్ని వైరుధ్యాలను మనముందుకు తెచ్చింది. ఆ రుగ్మతలలో ఒకటైన ఆవేశిత నాడీ రుగ్మత (obsessional neurosis)లో అపరాధ భావన చేతనంలో ప్రస్ఫుటంగా వినిపిస్తుంది. అది వైద్యపరమైన చిత్రాన్ని, రోగి జీవితాన్ని ప్రబలంగా ప్రభావితం చేస్తుంది. అంతేకాక దాని సరసన మరొకటిది కనిపించడానికి ఆస్కారమివ్వదు. కాని నాడీ రుగ్మతకు సంబంధించిన ఇతర సందర్భాలు, రూపాలలో అది పూర్తిగా అచేతనంగా ఉంటుంది. అలాగని దాని ప్రభావం తక్కువగా ఏమీ ఉండదు. వారిలో 'అచేతన అపరాధ భావన' ఉందని చెబితే రోగులు మనల్ని విశ్వసించరు. వారు మనలను కనీసంగా అయినా అర్థం చేసుకోవడానికి వీలుగా, శిక్ష కోసం అచేతనావసరం ఒకటి ఉందని వారికి చెబుతాము. ఈ శిక్షావసరంలోనే అపరాధ భావన అభివ్యక్తమవు తుంది. కాని ఒక నిర్దుష్ట నాడీ రుగ్మతతో దానికి ఉన్న సంబంధాన్ని అతిగా అంచనా వేయరాదు. ఆవేశిత నాడీ రుగ్మతలో గూడ తమకు అపరాధ భావన ఉన్నట్లు తెలియని లేదా కొన్ని పనులను చేయకుండ నిలువరించబడినప్పుడు, దానిని ఒక వేధిస్తున్న అసౌకర్యంగా, ఒక రకమైన వ్యాకులతగా మాత్రమే అనుభూతి చెందే రోగులున్నారు. అంతిమంగా ఈ విషయాలన్నింటిని అర్థం చేసుకోవడం సాధ్యమే. కాని ఇప్పటికిప్పుడు సాధ్యం కాదు. అపరాధ భావన దాని మూలంలో మానసిక భౌగోళిక లక్షణాలకు సంబంధించిన వ్యాకులతా రూపం తప్ప అన్యంకాదని తెలిసినప్పుడు మనకది ఆనందాన్ని కలుగచేయవచ్చు. దాని తరువాతి దశలలో అపరాధ భావన అధ్యహంపట్ల ఉండే భయంతో పూర్తిగా సరిపోలుతుంది. చేతనంతో వ్యాకులతకున్న సంబంధాలు అంతే అసాధారణ తేడాలను ప్రదర్శిస్తాయి. ప్రతి రోగ లక్షణం వెనుక ఎక్కడో అక్కడ వ్యాకులత అన్నివేళల ఉంటుంది. కాని ఒకప్పుడేమో అది తనను తాను ఎంత పూర్తిగా దాచుకొంటుందంటే మనం అచేతనమైన వ్యాకులత గురించి చెప్పవలసి వస్తుంది. లేదా మనం మరింత స్పష్టమైన మనోవైజ్ఞానిక అంతరాత్మ కావాలనుకుంటే, వ్యాకులత అనేది

మొదటిగ ఒక అనుభూతి మాత్రమే కాబట్టి, వ్యాకులత ఏర్పడే అవకాశాల గురించి మనం మాట్లాడవలసి వస్తుంది. ఫలితంగా, నాగరికత నుండి జనించిన అపరాధ బావన, ఆ విధమైనదిగా కాక, చాలావరకు అచేతనమైనదిగా లేదా జనం ఇతర ప్రేరణలను అన్వేషించే విధంగా చేసే ఒక రుగ్మతగా, ఒక అసంతృప్తిగా కనిపిస్తుంది. ఎలా చూసిన ప్పటికీ, మతాలు మాత్రం నాగరికతా వికాస క్రమంలో అపరాధ భావన నిర్వహించిన పాత్రను విస్మరించలేదు. వేరే సందర్భంలో నేను గుర్తించడంలో విఫలమైన మరో ముఖ్యమైన విషయమేమంటే, తాము పాపమని పిలిచే ఈ అపరాధ భావన నుంచి మానవాళిని విముక్తం చేస్తామని మతాలు చెబుతాయి. ప్రతి ఒక్కరికి అన్వయించే అపరాధాన్ని తనపై వేసుకున్న ఒక ఏకైక వ్యక్తి బలిదానం ద్వారా క్రైస్తవంలో ఈ విముక్తిని సాధించిన తీరునుంచి, నాగరికతారంభం కూడా అయిన ఈ ఆదిమ అపరాధం సంభవించిన ఆ ప్రధమ సందర్భం ఏమై ఉంటుందో ఊహించడం మనకు సాధ్యమైంది.

మనం తరచు సందిగ్ధంగా, పర్యాయపదాలుగా ఉపయోగించిన 'అధ్యహం', 'అంతరాత్మ', 'అపరాధ భావన', 'శిక్షావసరం', 'పశ్చాత్తాపం', లాంటి పదాల అర్థాన్ని వివరించడం మరీ అంత ముఖ్యమైన విషయం కానప్పటికీ, అనవసరమైన విషయం మాత్రం కాదు. ఈ పదాలన్నీ ఒకే స్థితికి సంబంధించిన ఒక క్రియా వాహకం (agency). అంతరాత్మ అనేది దానికి మనం ఆపాదించిన అనేక విధులలో ఒకటి. అహం ఉద్దేశాలను, అది చేసే పనులను పర్యవేక్షించడంలో, విచక్షణీక రించడంలో, అదుపుచేయడంలో ఈ విధి ఇమిడి ఉంటుంది. ఈ విధంగా చూస్తే అపరాధ భావన, అధ్యహం పరుషత, అంతరాత్మ తీవ్రత అన్నీ ఒకటే అవుతాయి. ఇది తాను ఇలా పర్యవేక్షించడాన్ని అహం గ్రహించడంగా, తన ప్రయత్నాలకు అధ్యహం విధించే షరతులకు మధ్య ఉన్న ఉద్రిక్తతను అహం అంచనా కట్టగలగడంగా ఉంటుంది. ఈ విమర్శక క్రియావాహకంపట్ల భయం (యావత్ సంబంధానికి భూమిక అయిన భయం), శిక్షావసరం అనేవి పరహింసా ప్రవృత్తితో ప్రేరితమైన అధ్యహం ప్రభావంలో, స్వహింసా ప్రవృత్తికి లోనైన అహపు సహజాత అభివ్యక్తీకరణ అవుతాయి. ఒకవిధంగా చెప్పాలంటే ఇది, అధ్యహంతో కాముక అనుబంధాన్ని ఏర్పర్చుడానికి, అహంలో ఉన్న అంతర్గత వినాశకర సహజాతంలోని ఒక భాగం వినియోగించబడడం. అధ్యహం ఉనికి నిరూపించబడే వరకు మనం అంతరాత్మను గురించి మాట్లాడకూడదు. అపరాధ భావన విషయానికొస్తే అది అధ్యహం ఏర్పడకముందు, అంటే అంతరాత్మకంటే కూడా ముందే అస్తిత్వంలో ఉన్నదని మనం ఒప్పుకోవాలి. ఆ

సమయంలో అది బాహ్యాధికారం అంటే ఉండే భయానికి తక్షణ వ్యక్తీకరణ. అహానికి, ఆ అధికారానికి మధ్య ఉన్న ఉద్రిక్తతకు గుర్తింపు. అధికారం నుండి ప్రేమను పొందాలనే అవసరానికి, సహజాత సంతృప్తికోసం పడే ఆరాటానికి మధ్య ఉండే ఘర్షణ నుండి అది సరాసరి ఉత్పన్నమవుతుంది. సహజాత తృప్తి నిరోధించబడడం దౌర్జన్య ప్రవృత్తికి దారితీస్తుంది. అపరాధ భావన యొక్క రెండు దొంతర్లను – ఒకటి బాహ్యాధికారం వలన భీతితో వచ్చేది, మరొకటి అంతరంగ అధికారం పట్ల భీతితో జనించేది – అధ్యారోపణం (superimposition) చేయడం అంతరాత్మ స్థితిలోకి అంతర్ దృష్టి సారించడానికి వీలులేకుండ అనేక విధాలుగా మనలను అడ్డుకొంది. అపరాధ భావన ఏర్పడినప్పుడు అహం చూపే ప్రతిస్పందనకు మరోపేరు పశ్చాత్తాపం. ఇందులో అతికొద్ది మార్పులతో, అపరాధ భావనవెనుక ఉండి పనిచేసే వ్యాకులతకు సంబంధించిన ఇంద్రియ గ్రాహకాంశం ఇమిడి ఉంటుంది. అసలు అదే ఒక శిక్ష. పైగా అది శిక్షావసరాన్ని తనలో కలిగి ఉండే అవకాశం ఉంది. ఈ విధంగా పశ్చాత్తాపం గూడ అంతరాత్మ కంటె ముందే ఏర్పడింది.

ఈ మన అన్వేషణలో మనలను కలవరపెట్టిన వైరుధ్యాలను పున:సమీక్షించడంలో నష్టం ఏమీలేదు. ఈ విధంగా, ఒక దశలో నిరోధించబడ్డ దౌర్జన్యచర్యల పర్యవసానంగా అపరాధ భావన ఏర్పడితే, మరోదశలో – సరిగ్గా చారిత్రకారంభకాలంలో తండ్రి చంపబడినప్పుడు – అది నెరవేర్చబడ్డ దౌర్జన్యచర్య ఫలితంగా ఏర్పడింది. కాని ఈ క్లిష్టతనుండి బయటపడే మార్గం కనుగొనబడింది. ఎలాగంటే, అంతరంగిక అధికార వ్యవస్థ అయిన అధ్యహం ఏర్పడటం పరిస్థితిని సమూలంగా మార్చివేసింది. దీనికి ముందు అపరాధ భావన, పశ్చాత్తాపాన్ని సరిపోలి ఉండేది. (వాస్తవంగా నిర్వర్తించబడిన దౌర్జన్యచర్య తరువాత కనిపించేప్రతిస్పందనకు 'పశ్చాత్తాపం' అనే పదాన్ని కేటాయించా లని సందర్భోచితంగా మనం ఇక్కడ చెప్పవచ్చు) దీని తరువాత, అధ్యహం సర్వజ్ఞత కారణంగా, ఉద్దేశించిన, నిర్వర్తించిన దౌర్జన్యాలకు మధ్య తేడా తన శక్తిని కోల్పోయింది. ఇక మీదట, (ప్రపంచాని కంతటికీ తెలిసిన విధంగా) వాస్తవంగా నిర్వర్తించబడిన హింసా చర్యవల్ల కూడా అపరాధ భావన ఉత్పన్నం కాగలదు. మనోవైజ్ఞానిక స్థితిలో జరిగిన ఈ మార్పుతో సంబంధం లేకుండ, ద్విసంవేగస్థితి నుంచి ఉత్పన్నమయ్యే ఘర్షణ – రెండు ఆదిమ సహజాతాల (ప్రేమ–దౌర్జన్యం : అను) మధ్య ఘర్షణ – కూడ అదే ఫలితాన్ని ఇచ్చింది. అపరాధ భావన – చేతనల మధ్య మారుతూ ఉన్న సంబంధాల సమస్యా పరిష్కారాన్ని

ఇక్కడ చూడడానికి మనం ప్రేరేపించబడతాం. చెడుకార్యం వలన కలిగే పశ్చాత్తాపం నుంచి జనించే అపరాధ భావన ఎప్పుడూ చేతనంగానే ఉంటుందని, చెడు ప్రచోదన గ్రహింపు నుంచి జనించే అపరాధ భావన అచేతనంగా ఉంటుందని భావించవచ్చు. కాని ఈ సమాధానం అనిపించినంత సరళమైందికాదు. ఆవేశిత నాడీ రుగ్మత దీనికి వ్యతిరేకంగా బలంగా వాదిస్తుంది.

రెండో వైరుధ్యం మనం అధ్యహంకు ఉందని భావించే దౌర్జన్య శక్తికి సంబంధించింది. ఒక దృక్పథం ప్రకారం ఆ శక్తి బాహ్యాధికారపు శిక్షాత్మక శక్తిని కేవలం కొనసాగిస్తూ, దానిని మనస్సులో సజీవంగా ఉంచుతుంది. దీనికి భిన్నంగా, మరో దృక్పథం ప్రకారం, వ్యక్తి ఉపయోగించ కుండా ఉన్నటువంటి తన స్వంత దౌర్జన్య శక్తిని ఇప్పుడు తనపై లక్ష్య నిరోధాన్ని విధిస్తున్న అధికారం మీదికి సారించడం ఇందులో ఇమిడి ఉంది. మొదటి దృక్పథం అపరాధ భావన చరిత్రకు అందనిదిగా పైకి కనిపించే ఈ వైరుధ్యాన్ని నిశిత పరిశీలన దాదాపు పూర్తిగా పరిష్కరించింది. అంతరంగంలోకి మరల్చబడిన దౌర్జన్యతతో ప్రతి సందర్భంలోను మనం వ్యవహరించవలసి రావడమనేది ఈ మొత్తం విషయంలో అవశ్యకమైన ఉమ్మడి అంశంగా మిగిలిపోయింది. మనం అధ్యహంకు ఆపాదించే రెండు దౌర్జన్య మూలాలను విడమరిచి చూడడానికి వైద్యపరమైన పరిశీలన మనకు దోహదం చేస్తుంది. ఒక్కొక్క సందర్భంలో ఈ రెండింటిలో ఏదో ఒకటి మరింత బలమైన ప్రభావాన్ని చూపడం జరుగుతుంది. కాని సాధారణ నియమం ప్రకారం అయితే అవి రెండు కలిసే పనిచేస్తాయి.

లోగడ నేను తాత్కాలికంగా అంగీకరించమని సిఫారసు చేసిన దృక్పథాన్ని తీవ్ర పరిశీలనకు గురిచేయవలసిన సందర్భం ఇదే అనుకొంటున్నాను. ఇటీవలి మనో విశ్లేషణ సాహిత్యంలో, ఏ రకం కుంఠనం అయినా, నిరోధించబడిన సహజాత తృప్తి అయినా అపరాధ భావనను తీవ్రతరం చేస్తుంది లేదా చేయవచ్చు అనే భావన వైపు మొగ్గు కనిపిస్తుంది. ఇది దౌర్జన్యకర సహజాతాలకు మాత్రమే పరిమితం అని మనం అనుకున్నట్లయితే ఒక గొప్ప సైద్ధాంతిక సరళీకరణను సాధించవచ్చు. అప్పుడు ఈ సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేసేది దాదాపు ఏమీ ఉండదు. ఎందుకంటే ఒక అసంతృప్త కామ వాంఛ స్థానంలో అధికం కాబడిన అపరాధ భావన కనిపించడాన్ని, గతిశీల, నిర్మాణపర ఆధారాలతో ఎలా వివరించగలం ? ఇది డొంకతిరుగుడు మార్గంలో మాత్రమే సాధ్యం. అంటే కామతృప్తిని నిరోధించడం, అట్టి నిరోధానికి కారణమైన వ్యక్తి పట్ల

దౌర్జన్యం చేయాలనే కాంక్షను ప్రేరేపిస్తుందనీ, అయితే ఈ దౌర్జన్యతను తిరిగి అణచి వేయవలసి ఉంటుందని మనం భావించవలసి ఉంటుంది. కాని అలా జరిగితే, అది అణచివేయబడి అధ్యహంకు అందించబడిన దౌర్జన్య ప్రవృత్తి అపరాధ భావనగా పరివర్తితం కావడం తప్ప మరొకటి కాదు. అపరాధ భావన పుట్టుకకు సంబంధించిన మనోవిశ్లేషణ పరిశోధనలు దౌర్జన్య సహజాతాలకు మాత్రమే పరిమితమైతే, చాలా ప్రక్రియలు సరళంగాను, స్పష్టంగాను ఉంటాయని నాకు నమ్మకం ఉంది. వైద్య పరిశీలనా పరంగా మనకు స్పష్టమైన సమాధానం లభించదు. ఎందుకంటె, మన ప్రాక్కల్పన చెబుతున్నట్లుగా రెండురకాల సహజాతాలు (జీవ సహజాతం, మృత్యు సహజాతం - అను) పరిశుద్ధ రూపంలో, స్వతంత్రంగా కనిపించడం దాదాపు ఎప్పుడూ జరగదు. కాని కొన్ని అసాధారణ సందర్భాల పరిశీలన బహుశ నేను జరుగుతుందని ఊహిస్తున్న దిశనే సూచించవచ్చు.

విషయం పట్ల ఈ పరిమిత దృక్పథాన్ని దమన ప్రక్రియకు అన్వయించడం ద్వారా ఈ దృక్పథం నుండిందిగువ ప్రతిపాదనను సూత్రీకరించడం ఇప్పుడు సాధ్యమే అనిపిస్తుంది. ఒక సహజాత ప్రవృత్తి దమనానికి గురైనప్పుడు, దాని లిబీడో సంబంధిత మూలకాలు రోగ లక్షణాలుగాను, దానిలోని దౌర్జన్యకర అంశాలు అపరాధ భావనగాను పరివర్తిత మవుతాయి. ఈ ప్రతిపాదన సత్యానికి ఒక మేరకు దగ్గరగా ఉన్నప్పటికీ అది మన ఆసక్తికి అర్హమైనదే అవుతుంది.

ఈ రచనను చదివిన పాతకులలో కొంతమందికి, జీవ - మరణ సహజాతాల మధ్య పోరాటం గురించిన సూత్రీకరణను తాము తరచు విన్నట్లు అనిపించవచ్చు. మానవాళి అనుగమించే నాగరికతా ప్రక్రియ ప్రత్యేక లక్షణంగా ఈ పోరాటం ఉంటుందని చెప్పబడింది. అంతేకాక, దానికి వ్యక్తి వికాసంతోడి సంబంధం కల్పింపబడింది. ఇంకా మొత్తంమీద అది సేంద్రియ జీవరహస్యాన్ని బహిర్గతం చేసిందని కూడా భావించబడింది. ఈ మూడు ప్రక్రియల మధ్య ఉన్న పరస్పర సంబంధాలను స్పృశించకుండా ఉండలేము. నాగరికతా వికాసం. వ్యక్తివికాసం రెండూ కూడ అత్యంత సాధారణ జీవ లక్షణాలలో పాలుపంచుకోవాల్సిన కీలకమైన ప్రక్రియలే అన్న విషయం దృష్టిలో ఉంచుకున్నప్పుడు అదే సూత్రాన్ని పునరుక్తం చేయడం సమంజసమే అవుతుంది. మరోవైపు ఈ సాధారణ లక్షణం ఉంచడం - సరిగ్గా దాని సాధారణ స్వభావం కారణంగా - ప్రత్యేక పరిమితులతో అది సంకుచితమయ్యేదాక (ప్రక్రియలమధ్య) తేడాలను కనుక్కోవడంలో మనకు సహాయపడదు. వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా, సుఖసూత్రం నిర్దేశించిన, జీవసూత్రం

ప్రేరేపించిన కర్తవ్యం ఏమిటంటే, విడివిడిగా ఉన్న వ్యక్తులను, లిబీడో సంబంధాలతో ఒక సమీకృత సమూహంలోకి కలిపివేయడం. ఏది ఏమైనా మనం నాగరికతా ప్రక్రియ, వ్యక్తుల వికాస లేదా విద్యా ప్రక్రియల మధ్య సంబంధాన్ని చూసినట్లయితే, ఆ రెండు ప్రక్రియలు – ఒకే ప్రక్రియను విభిన్న తరహా వస్తువులకు అన్వయించడం కాకపోయినా – స్వభావంలో చాలావరకు సదృశాలు అని పెద్ద తటపటా యింపు లేకుండానే నిర్ధారిస్తాం. మానవ జాతి నాగరికతా ప్రక్రియ, వ్యక్తివికాస ప్రక్రియ కంటె మరింత ఉన్నత అమూర్త స్థాయికి చెందినది. అందువలన దానిని నిర్దుష్ట పదాలలో అర్థం చేసుకోవడం కష్టతరం. అలానే ఆ రెండింటి మధ్య ఉన్న సాదృశ్యాలను కొసకంటా సాగదీయలేం. కానీ రెండు ప్రక్రియల లక్ష్యాల మధ్య ఉన్న సాదృశ్యం దృష్ట్యా – ఒక సందర్భంలోనేమో వ్యక్తిని సమూహంలోకి సమీకృతం చేయడం, మరో సందర్భంలోనేమో అనేక వ్యక్తులను ఒక ఏకీకృత సమూహంగా మలచడం – అవి అనుసరించిన మార్గాలు, వాటి ఫలితాల మధ్య ఉన్న సాదృశ్యాన్ని చూపి ఆశ్చర్యచకితులం కానవసరంలేదు.

రెండు ప్రక్రియలను విడమరిచి చూపించే ఒక లక్షణాన్ని, దాని అసాధారణ ప్రాముఖ్యం దృష్ట్యా, పేర్కొనకుండా ఇంక ఎక్కువ కాలం వాయిదా వేయలేము. వ్యక్తి వికాస ప్రక్రియలో సుఖాన్ని అన్వేషించే క్రమంలో అనుసరించే సుఖసూత్ర ప్రణాళిక ముఖ్యలక్ష్యంగా ఉంటుంది. ఒక మానవ సమూహంలోకి సమీకృతం కావడం లేదా దానికి అనుగుణంగా మారడం సుఖ లక్ష్యసాధనకు ముందే పూర్తిచేయవలసిన అతిక్రమించలేని నిబంధనగా కనిపిస్తుంది. ఈ షరతు లేకుండానే సుఖాన్ని సాధించగలిగితే, బహుశ అలా జరగడం కోరుకోదగినదే కావచ్చు. దీనినే వేరే మాటల్లో చెప్పాలంటే, వ్యక్తి వికాసం అనేది రెండు ప్రచోదనల ఫలితంగా కనిపిస్తుంది. ఒకటి మనం మామూలుగా 'స్వహితం' అని పిలిచే సుఖార్తి, రెండు మనం 'పరహితం' అని పిలిచే ఇతరులతో సంలీనం చెందాలనే ప్రచోదన. ఈ వర్ణనలలో ఏదీ ఉపరితలం దాటి లోతుకుపోదు. మనం చెప్పుకున్నట్లుగా, వ్యక్తి వికాస ప్రక్రియలో స్వహిత (సుఖార్తి) ప్రచోదనను నొక్కి చెప్పడం జరుగుతుంది. 'సాంస్కృతికమైనది'గా అభివర్ణించదగిన రెండో ప్రచోదన ఆంక్షలు విధించే పాత్రతో సంతృప్తి చెందుతుంది. అయితే నాగరికతా వికాస ప్రక్రియలో విషయాలు నేరుగా ఉంటాయి. ఇక్కడ అత్యంత ప్రధానమైన విషయం విడివిడి వ్యక్తుల మధ్య ఐక్యత సృష్టించడమనే లక్ష్యం. సుఖ లక్ష్యం ఇంకా ఉన్నమాట నిజమేకాని అది నేపథ్యంలోకి నెట్టివేయబడింది. వైయక్తిక సుఖంపట్ల దృష్టి సారించకపోతేనే ఒక మహత్తర మానవ

సమూహ సృష్టి అత్యంత విజయవంతమవుతుందని అనిపిస్తుంది. ఈ విధంగా వ్యక్తి వికాశ ప్రక్రియకు ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని, అవి మానవ నాగరికతా వికాస ప్రక్రియలో పునరుత్పన్నం కావని భావించవచ్చు. ఈ ప్రక్రియలలో మొదటిది సమూహంతో సంలీనాన్ని లక్ష్యంగా కలిగి ఉన్న మేరకు మాత్రమే రెండో ప్రక్రియతో అది ఏకీభవించడం జరుగుతుంది.

ఒక గ్రహం తన లక్షం మీద తాను తిరుగుతూనే ఎలా కేంద్రగోళం చుట్టూ పరిభ్రమిస్తుందో, అలాగే వ్యక్తి మానవాళి వికాసగతిలో పాల్గొంటూనే జీవితంలో తన మార్గాన్ని తాను అనుసరిస్తాడు. మన సాధారణ దృష్టికి అంతరిక్షంలో శక్తుల క్రీడ ఎప్పటికీ మారని వ్యవస్థలో స్థిరీకృతమైనట్లు కనిపిస్తుంది. సేంద్రియ జీవ క్షేత్రంలో అయితే శక్తులు ఒకదానితో ఒకటి ఎలా పోటీపడేది, ఆ పోటీ ప్రభావాలు ఎలా నిరంతరం మారేదీ కనీసం మనం చూడగలం. సరిగ్గా అలాగే, వైయక్తిక సుఖ ప్రచోదన, సమూహ సంలీన ప్రచోదన రెండూ కూడ ప్రతి వ్యక్తిలోను ఒకదానితో ఒకటి ఘర్షణ పడి తీరాల్సిందే, అలాగే వ్యక్తి వికాస ప్రక్రియ, సాంస్కృతిక వికాస ప్రక్రియ రెండూ ఒకదాని కొకటి ఎదురై నిలిచి పరస్పర అస్థిత్వాల్ని ప్రశ్నించుకు తీరతాయి. కాని వ్యక్తి, సమాజాలమధ్య ఉన్న ఈ పోరాటం ఆదిమ సహజాతాలైన జీవ, మృత్యు సహజాతాల మధ్య ఉన్న - బహుశా పరిష్కారాని కతీతమైన - వైరుధ్యంనుంచి ఉత్పన్నమైందికాదు. అది లిబీడో అంతర్గత పంపిణీకి సంబంధించిన సమస్య; అహం, దాని వస్తువుల మధ్య లిబీడో పంపకానికి సంబంధించిన పోటీతో ఇది పోల్చదగింది; వ్యక్తిలో అది అంతిమంగా సమన్వయపరచ బడుతుందని, అలానే ఈ రోజు నాగరికత వ్యక్తి జీవితాన్ని ఎంతగా అణచివేస్తున్నప్పటికీ, భావి నాగరికతలో అది సమన్వయపరచ బడుతుందని మనం ఆశించవచ్చు.

నాగరికతా వికాస ప్రక్రియ, వ్యక్తి వికాస ప్రక్రియల మధ్య సాదృశ్యాన్ని మరో ముఖ్యార్థంలో విస్తరించవచ్చు. సమాజం కూడ ఒక అధ్యహాన్ని సృష్టించుకొంటుందని, దాని ప్రభావానికి లోబడి సాంస్కృతిక వికాసం సాగుతుందని నొక్కిచెప్పవచ్చు. మానవ నాగరికతల గురించి తెలిసిన ఏ వ్యక్తికైనా ఈ సాదృశ్యాన్ని అన్ని కోణాల్లో మరింత పరిశీలనకు గురిచేయాలనే ప్రేరేపణ కలుగుతుంది. కొన్ని ముఖ్య విషయాలను మీ ముందుంచడానికి నేను పరిమితమవుతాను. ఒక నాగరికతా యుగ అధ్యహం మూలం, వ్యక్తి అధ్యహం మూలంలాగే ఉంటుంది. చారిత్రక మహానాయకులు వదలివెళ్లిన తను వ్యక్తిత్వాల ప్రభావశీలత మీద అది ఆధారపడి ఉంది. ఆ నాయకులు అపరిమితమైన

మనోశక్తి కలిగినవారు లేదా ఎవరిలో అయితే మానవ ప్రచోదనలలో ఏదో ఒకటి అత్యంత బలమైన, శుద్ధమైన - ఆ కారణంగా తరచు ఏకపక్షమైన - వ్యక్తీకరణ పొందుతుందో అలాంటివారు అయి ఉంటారు. అనేక సందర్భాలలో ఈ సాదృశ్యత మరింత విస్తరించ బడుతుంది. అట్టి నాయకులు వారి జీవితకాలంలో-ఎల్లవేళల కాకపోయినా తరచుగా - ఇతరులచే గేలిచేయబడ్డారు. అవమానించ బడ్డారు. పైగా క్రూరమైన రీతిలో చంపబడ్డారు కూడా. అదేవిధంగా హింసాత్మక మరణాన్ని పొందిన చాలాకాలం తర్వాత గాని ఆదిమ తండ్రి దివ్యత్వాన్ని పొందలేదు. ఈ విషాదకర సమ్మేళనానికి అత్యంత ప్రభావశీలమైన ఉదాహరణను ఏసుక్రీస్తులో చూడవచ్చు. అయితే, ఆ వ్యక్తి, ఆ పురాతన సంఘటనకు సంబంధించిన మరుగునపడిపోయిన స్మృతినుండి పురాణాల ద్వారా సృష్టించబడ్డ కాల్పనిక వ్యక్తి కాకపోతేనే ఇది సాధ్యం. సాంస్కృతిక, వైయక్తిక అధ్యహాల మధ్య మరో సదృశ విషయం ఉంది. అదేమంటే, మొదటిది రెండోదానివలెనే, ఖచ్చితమైన ఆదర్శాలను నిర్దేశిస్తుంది. ఈ ఆదర్శాల ఉల్లంఘన 'అంతరాత్మ భీతి'కి దారితీస్తుంది. ఇక్కడ మనకు సంబంధిత మానసిక ప్రక్రియలు, వైయక్తిక మానవునిలో కనిపించే మేరకంటే, సమూహం విషయంలో చాలా పరిచితమైనవిగా, చేతనానికి అందుబాటులో ఉండేవిగా కనిపించే అసాధారణ పరిస్థితి ఎదురవు తుంది. వ్యక్తిలో అయితే, ఉద్వేగభరిత స్థితి ఏర్పడినప్పుడు దూషణలు, నిందల రూపంలో విస్పష్టంగా వినిపించేది అధ్యహంలోని దౌర్జన్యత మాత్రమే. దాని వాస్తవ ఆకాంక్షలు తరచు నేపథ్యంలో అచేతనంగా ఉంటాయి. వాటిని చైతన్య స్థాయికి తీసుకువస్తే అవి అప్పుడు అమలులో ఉన్న సాంస్కృతిక అధ్యహపు నీతిసూత్రాలకు సరిపోలి ఉంటాయని మనం గ్రహిస్తాం. ఈ సందర్భంలో ఈ రెండు ప్రక్రియలు సమూహ సాంస్కృతిక వికాసం-ఎప్పుడూ పరస్పరం పెనవేసుకునే ఉంటాయి. ఈ కారణంగా అధ్యహం వ్యక్తీకరణలు, లక్షణాలలో కొన్ని, విడి వ్యక్తులలో దాని ప్రవర్తనకంటే సాంస్కృతిక సమూహంలో అది ప్రవర్తించే తీరులో మనం తేలికగా గుర్తించవచ్చు.

సాంస్కృతిక అధ్యహం దాని ఆదర్శాలను అభివృద్ధిచేసి, విధులను నిర్దేశించింది. ఈ తరువాతి వాటిలో మానవ పరస్పర సంబంధాలకు సంబంధించిన విధులు నీతిశాస్త్రంలో భాగం అవుతాయి. ప్రజలు అన్ని కాలాలలోను నీతిశాస్త్రానికి అత్యంతమైన విలువను ఇచ్చారు. అది ప్రత్యేకించి విశేష ప్రాధాన్యంగల ఫలితాలకు దారితీస్తుందని వారు ఆశించి ఈ విలువను ఆపాదించినట్లు అనిపిస్తుంది. నిజానికి ప్రతి నాగరికతలో అత్యంత బాధాకర అంశంగా తేలికగా గుర్తించగలిగిన విషయాన్ని అది ప్రశ్నిస్తుంది. అందువల్ల నీతిశాస్త్రాన్ని

ఒక వ్యాధి నివారణా ప్రయత్నంగా, అంటే అధ్యహం ఆజ్ఞలద్వారా ఇంతకుముందు ఏ ఇతర సాంస్కృతిక కార్యకలాపాల వల్ల సాధించబడనిదాన్ని సాధించే ప్రయత్నంగా పరిగణించాలి. మనకు ఇప్పటికే తెలిసినవిధంగా, నాగరికత ఎదుర్కొంటున్న అతిపెద్ద అవరోధాన్ని తొలగించడమన్నది మనముందున్న సమస్య. మానవనిర్మితిలోనే అంతర్గతంగా ఇమిడి ఉన్న మానవులు ఒకరిపట్ల ఒకరు దౌర్జన్య ప్రవృత్తికలిగి ఉండడమన్నది ఆ అవరోధం; ఈ అంశం కారణంగానే అధ్యహం జారీచేసిన సాంస్కృతిక ఆజ్ఞలలో అత్యంత ఇటీవలిది అయిన వ్యక్తి తన పొరుగువానిని తనవలె ప్రేమించాలన్న ఆజ్ఞపట్ల మనం ప్రత్యేకమైన ఆసక్తి కలిగి ఉన్నాం. నాడీ రుగ్మత గురించి, దాని నివారణ పద్ధతుల గురించిన పరిశోధన క్రమంలో వ్యక్తి అధ్యహానికి వ్యతిరేకంగా మనం రెండు విమర్శలను చేయడం జరిగింది. అధ్యహం దాని ఆజ్ఞలు, నిషేధాల తీవ్రతలో అహం సుఖాన్ని గురించి వ్యతిరేకతలను, అంటే ఇడ్ కుండే సహజాత శక్తి (ఇది మొదటిది), వాస్తవ బాహ్య ప్రపంచం నుంచి వచ్చే ఆటంకాలు (ఇది రెండవది) గురించి అంతగా పట్టించుకోదు. ఫలితంగా రోగ నివారణార్థం అధ్యహాన్ని మనం తరచుగా వ్యతిరేకించవలసి వస్తుంది. దాని ఆదర్శాలను తగ్గించే ప్రయత్నం కూడా మనం చూస్తాం. సరిగ్గా ఈ అభ్యంతరాలనే సాంస్కృతిక అధ్యహపు నైతికాదర్శాల మీద కూడా లేవదీయవచ్చు. అది కూడా మానవుల మనోనిర్మితికి సంబంధించిన వాస్తవాలను అంతగా పట్టించుకోదు. అది ఆజ్ఞలను జారీ చేస్తుందేకాని మనుషులకు వాటిని పాటించడం సాధ్యమా అనే విషయం అది పట్టించుకోదు. దీనికి భిన్నంగా, అహానికి మనోవైజ్ఞానికంగా అది చేయవలసిన పని చేయగల సామర్థ్యముందని, దానికి అచేతన (ఇడ్) మీద అపరిమితమైన పట్టు ఉందని అధ్యహం భావిస్తుంది. ఇది ఒక పొరపాటు అవగాహన సాధారణ మానసిక స్థితిగల వారిలో కూడ కొన్ని పరిమితులకు మించి అచేతనను నియంత్రించడం సాధ్యంకాదు. వ్యక్తి నుండి మరింత ఎక్కువ కృషి ఉండాలని పట్టుపడితే, అతడు తిరగబడడంగాని లేదా నాడీ రుగ్మతకు గురికావడంకాని లేదా అసంతోషానికి లోనుకావడం కాని జరుగుతుంది. ‘నీ పొరుగు వానిని నీవలె ప్రేమించు” అనే ఆజ్ఞ మానవ దౌర్జన్య ప్రవృత్తికి వ్యతిరేకంగా అత్యంత బలమైన రక్షణ కవచం. సాంస్కృతిక అధ్యహపు మనోవైజ్ఞానిక అవగాహనా రాహిత్యానికి మంచి ఉదాహరణ. ఈ ఆజ్ఞను నెరవేర్చడం అసంభవం. ప్రేమను అలా అత్యధిక స్థాయికి పెంచడం దాని విలువ తగ్గిస్తుందేకాని, సమస్య మాత్రం పరిష్కారం కాదు. నాగరికత ఈ విషయాలన్నింటిపై దృష్టి సారించదు. నీతి సూత్రాన్ని పాటించడం

ఎంత కష్టమైతే దాని ఆచరణ అంత యోగ్యమైన విషయం అని నాగరికత మనలను హెచ్చరిస్తుంది. నేటి ఈ నాగరిక ప్రపంచంలో అటువంటి నీతిసూత్రాన్ని ఆచరించే వ్యక్తి ఆచరించని వ్యక్తితో పోలిస్తే నష్టానికి గురవుతాడు. దౌర్జన్యతకు వ్యతిరేకంగా నిర్మించుకునే రక్షణ, అది కలిగించినంతటి అసంతోషాన్ని ఇదికూడ కలిగిస్తుంటే, నిజంగా దౌర్జన్యత నాగరికతకు ఎంతటి శక్తివంతమైన అవరోధం ! ఇక్కడ 'ప్రాకృతిక' నీతి శాస్త్రంగా పిలవబడేది, తాను ఇతరులకంటె మెరుగ్గా ఆలోచిస్తున్నాననే స్వానురాగ తృప్తి తప్ప అదనంగా ఇవ్వగలిగింది ఏమీ లేదు. ఈ సందర్భంలో మతాధార నీతి అనంతర జీవితం మంచిగా ఉంటుందనే వాగ్దానాలను ప్రవేశపెడుతుంది. కాని ఇక్కడ, ఈ భూమి మీద, సౌశీల్యానికి ప్రతిఫలం లభించకపోతే నీతిబోధ అంతా వృథా అవుతుందని నేను అనుకుంటు న్నాను. మానవులకు సంపదతో ఉండే సంబంధాలలో నిజమైన పరివర్తన తీసుకురావడం నైతికా దర్శాల కంటే ఈ దిశలో ఎక్కువ ఉపయోగకరమని నేనూ భావిస్తాను; సోషలిస్టులు ఈ సత్యాన్ని గుర్తించినప్పటికీ, మానవ స్వభావానికి సంబంధించి వారికి ఉన్న ఆదర్శవాద దురవగాహన ఈ గుర్తింపును అస్పష్టతకు గురిచేసి, ఆచరణలో ప్రయోజనరహితం చేసింది.

సాంస్కృతిక దృగ్విషయాలలో అధ్యహం పాత్రను అన్వేషించే ఆలోచనా సరళి మరిన్ని నూతన ఆవిష్కారాలను ఇస్తుందని నేను నమ్ముతున్నాను.నేను ఇక త్వరగా ముగిస్తాను. కాని నేను ఏ విధంగాను తప్పించుకోలేని ఒక ప్రశ్న ఉంది. నాగరికతా వికాస క్రమానికి వ్యక్తిత్వ వికాస క్రమంతో అంతటి విస్తృతమైన సాదృశ్యం ఉన్నపుడు, అదీ అదే పద్ధతులను ఉపయోగిస్తున్నపుడు, సాంస్కృతిక ప్రేరణల ప్రభావం క్రింద కొన్ని నాగరికతలు లేదా కొన్ని నాగరికతా యుగాలు, బహుశా మొత్తం మానవాళి, నాడీరుగ్మత పరిశీలన ఔషధ చికిత్సాపరమైన సిఫారసులకు దారితీయవచ్చు. అవి గొప్ప ఆచరణాత్మక ఆసక్తిని రేకెత్తించవచ్చు. సాంస్కృతిక సమూహానికి మనోవిశ్లేషణను అన్వయించే ఈ ప్రయత్నం అర్ధరహితమని కాని, నిష్ఫలం కాక తప్పదని కానీ నేను చెప్పను. మనం సాదృశ్యాలతో వ్యవహరిస్తున్నా మని, మనుషుల విషయంలోనే కాదు భావనల విషయంలో కూడా వాటిని అవి పుట్టిన, పరిణమించిన క్షేత్రాల నుండి పెరికివేయడం ప్రమాదకరమనే విషయాన్ని మనం మరువరాదు. ఈ విషయంలో మనం చాలా జాగరూకతతో మెలగాలి. అంతేకాదు, సామూహిక నాడీరుగ్మతల నిర్ధారణలో ఒక ప్రత్యేక సమస్య ఉంది. రోగిని తన పరిసరాలనుండి వేరుచేసి చూపే భిన్నత్వాన్ని వైయక్తిక నాడీ రుగ్మతలో ఆరంభ

బిందువుగా గ్రహిస్తాం. ఇందు నిమిత్తం పరిసరాలను 'సాధారణ' స్థితిలో ఉన్నట్లు పరిగణిస్తాం. దాని సభ్యులంతా ఒకే రుగ్మతతో బాధితులయిన సమూహం విషయంలో అయితే అటువంటి నేపథ్యం ఉండే అవకాశం లేదు. ఆ నేపథ్యాన్ని మరెక్కడైనా కనుగొనాలి. మన జ్ఞానాన్ని ఔషధ, చికిత్సా క్రమానికి అన్వయించే విషయానికొస్తే, సమూహం మీద అట్టి ఔషధ చికిత్సా పద్ధతిని అమలుచేసే అధికారం ఎవరికీ లేనప్పుడు, సామాజిక నాడీ రుగ్మతల గురించి అత్యంత సరైన విశ్లేసణ వలన ప్రయోజనం ఏమిటి ? ఇన్ని కష్టాలున్నప్పటికీ ఎవరో ఒకరు ఏదో ఒక రోజు సాంస్కృతిక సమూహాలకు సంబంధించి వ్యాధి విజ్ఞానశాస్త్రపరమైన కృషి ఆరంభిస్తారని మనం ఆశించవచ్చు.

విభిన్న కారణాల రీత్యా, మానవ నాగరికత విలువ గురించి ఒక అభిప్రాయం వెలిబుచ్చాలనే ఉద్దేశం నాకు లేదు. మన నాగరికత మనకున్నవాటిల్లోకెల్లా, మనం ఆర్జించినవాటిల్లోకెల్లా అత్యంత విలువైనదని, దాని మార్గం ఊహకందనంతటి పరిపూర్ణతా శిఖరాలకు తప్పనిసరిగా దారితీస్తుందని చెప్పే ఉత్సాహభరిత అపోహల నుండి నన్ను నేను కాపాడుకునే ప్రయత్నం చేశాను. సాంస్కృతిక కృషి లక్ష్యాలను, అది వినియోగించిన పద్ధతులను సమగ్రంగా పరిశీలించిన మీదట, ఈ ప్రయత్నం అంతా వృథా అని, దానినుండి లభించిన ఫలితం వ్యక్తికి భరింపశక్యంకాని పరిస్థితుల సృష్టిమాత్రమే అనే నిర్ధారణకు రావడం తప్పనిసరి అని ఒక విమర్శకుడు పేర్కొంటే, ఆగ్రహ రహితంగా ఆ విమర్శను కనీసం వినడం నేను చేయగలను. ఈ విషయాల గురించి నాకుతెలిసింది చాలా పరిమితం కావడం నేనునిష్పక్షపాతంగా ఉండడాన్ని తేలికగా సాధ్యంచేసింది.నాకొక విషయం మాత్రం ఖచ్చితంగా తెలుసు; అదేమిటంటే, మనిషి విలువలకు సంబంధించిచేసే నిర్ణయాలు సరాసరి అతడి సుఖ వాంఛల ననుసరించి ఉంటాయి. కాబట్టి, అవన్నీ అతడి భ్రమలను వాదనలతో బలపరచుకునే ప్రయత్నాలే. ఎవరైనా మానవ నాగరికతా క్రమపు ఆవశ్యక స్వభావాన్ని ఎత్తి చూపడంతో పాటు, లైంగిక జీవితానికి పరిమితులు విధించడం, ప్రకృతి వరణం (natural selection) స్థానే మానవతావాద ఆదర్శాన్ని స్థాపించడం లాంటి ధోరణులు అభివృద్ధికర ప్రవృత్తులేనని, వాటిని తప్పించుకోవడంకాని, దారి మళ్లించడంకాని చేయలేమని, కాబట్టి అవి ప్రాకృతిక అవసరాలన్న విధంగా వాటికి లొంగిపోవడమే ఉత్తమ మార్గమని మనకు చెబితే నేను ఈ విధంగా పేర్కొనడాన్ని పూర్తిగా అర్థం చేసుకోదగిందిగా పరిగణిస్తాను. దీనికి వ్యతిరేకంగా లేవదీయగల అభ్యంతరం కూడా నాకు తెలుసు. మానవ చరిత్రలో అనుల్లంఘనీయాలని భావించబడిన ఇలాంటి అనేక

ధోరణులు ప్రక్కకు నెట్టివేయబడి వాటి స్థానాన్ని వేరే ధోరణులు ఆక్రమించడం జరిగిందనేది ఈ అభ్యంతరం సారాంశం. నాతోటి మానవుల ముందు ఒక ప్రవక్తగా నిలబడే సాహసం నేను చేయలేను; ఏ రకమైన ఓదార్పును, సాంత్వనను నేను వారికి ఇవ్వలేకపోయాననే వారి ఆరోపణను తలదాలు స్తాను. ఎందుకంటే దుందుడుకు విప్లవకారుల నుండి అత్యంత సౌశీల్యుడైన దైవభీతి కలవారి వరకు, అందరూకూడా వారి అంతరాంతరాళాల్లో ఒకేవిధమైన భావోద్వేగంతో ఓదార్పును, సాంత్వనను కోరుకుంటున్నారు.

మానవులలోని దౌర్జన్య, ఆత్మ వినాశకర సహజాతం వారి సామూహిక జీవనాన్ని భంగపరచ డాన్ని నియంత్రించి, అదుపులో ఉంచడంలో సాంస్కృతిక వికాసం ఏ మేరకు విజయం సాధించ గలదనేది మానవజాతి ఎదుర్కోవలసిన బలీయమైన ప్రశ్నగా నాకు కనిపిస్తున్నది. ఈ సందర్భంలో సరిగ్గా కాలాన్ని ప్రత్యేక ఆసక్తితో గమనించవలసిన అవసరం ఉంది. మానవులు ప్రకృతి శక్తులపై ఎంత మేరకు నియంత్రణ సాధించారంటే, వాటిసాయంతో ఒకరినొకరు చివరి మానవునిదాకా వినాశనం చేసుకోవడంలో వారికి కష్టం ఏమిలేదు. వారికి ఈ విషయం తెలుసు. అలా తెలియడం నుంచే వారి ప్రస్తుత అశాంతి, అసుఖం, వ్యాకులతా చిత్తవృత్తులలో అధికభాగం వస్తున్నాయి. విశ్వ శక్తులు రెండింటి (జీవ, మృత్యు సహజాతాలు - అను)లో, అజరామరమైన జీవ సహజాతం తనతో సమమైన అమర్త్య ప్రత్యర్థి (మృత్యు సమజాతం - అను)తో పోరాటంలో తన వాదనను దృఢంగా ప్రకటిస్తుందని ఇపుడు మనం ఆశించవచ్చు. అయితే అది ఎంతటి విజయంతోనో, ఏ ఫలితంతోనో అనే విషయాన్ని గురించి ఎవరు భవిష్యద్దర్శనం చేయగలరు ?[1]

* * *

---

[1] *(ఈ చివరి వాక్యం 1931లో హిట్లర్ ప్రమాదం గురించిన గ్రహింపు అప్పుడప్పుడే ఏర్పడుతున్న సమయంలో కలపడం జరిగింది)*

అనుబంధం - I

మనోవిశ్లేషణలోని కొన్ని పారిభాషిక పదాలు

ఇడ్ (Id : It) : ఇది అవ్యవస్థీకృత మానసిక వ్యవస్థను సూచిస్తుంది. మనిషి మూర్తి మత్వంలోని అంధ భాగం. ఇడ్ చేరరానిది. అది సహజాతాల శక్తితో నిండి ఉంటుంది. ఇడ్ ఆదిమమైతే, అహం నాగరికం. ఇడ్ సుఖసూత్రం ప్రకారం నడుచుకొంటుంది. ఔద్వేగికం.

అహం (Ego) : బాహ్య ప్రపంచ ప్రభావంతో పరివర్తనం చెందిన ఇడ్‌లోని భాగం. ఇది హేతుబద్ధ ఆలోచనను, లోకజ్ఞానాన్ని ప్రతిబింబిస్తుంది.

అధ్యహం (Super Ego) : ఇది అహంలోని ఆత్మపరిశీలన, ఆత్మవిమర్శ చేసుకొనే భాగం. తలిదండ్రులు, సమాజ నీతి అంతరీకరణం చెందిన అహంలో భాగం.

అంతరాత్మ (Conscience) : వ్యక్తి నైతిక విలువల వ్యవస్థ. తనలోనే భాగంగా ఉండి, నైతిక విలువలను వినిపించినట్లు పొందే అనుభవం. దాదాపు అధ్యహంకు దగ్గరగా ఉంటుంది. కాని అదే ఇది కాదు.

అచేతన (Unconscious) : తనకు తెలియకనే తనలో జరిగే మానసిక ప్రక్రియ. ఇది చేతన కంటే భిన్నం. అచేతనంలో రెండు రకాల ఆలోచనలుంటాయి. ఒకటి తేలికగా చేతనమయ్యేవి, రెండోది దమన (అణచివేత) ప్రక్రియకు గురైనవి. దమన ప్రక్రియకు గురైనవి స్వప్నాల ద్వారా, స్వేచ్ఛా సంసర్గం ద్వారా బహిర్గతమవుతాయి.

చేతన (Conscious) : వ్యక్తి తన పరిసరానికి ఎరుకతో ప్రతిస్పందించుట. మనోవిశ్లేషణ సిద్ధాంతం ప్రకారం మానసిక ప్రక్రియ రెండు రకాలుగా జరుగుతుంది. ఒకటి చేతనంగా, రెండవది అచేతనంగా మొదటిదానిలోవి అన్నీ అవ్యవహితంగా ఇవ్వబడతాయి. చేతన ప్రక్రియ వాస్తవికతా సూత్రాన్ని, వ్యాకరణ సూత్రాలను, తర్కాన్ని అనుసరిస్తుంది. మనం మేల్కొని, ఎరుకతో చేసే ఆలోచన అంతా చేతనమే.

సహజాతం (Instinct) : అంతస్సిద్ధంగా జైవికంగా నిశ్చితమైన ఉత్సుకత. ఇది చర్యోన్ముఖమైంది. సహజాతానికి శారీరక మూలకముంది. దాని నుంచి శక్తి లభ్యమవుతుంది. దానికొక లక్ష్యం ఉంది. అదేమిటంటే సహజాతానికి విశిష్టమైన ప్రవర్తనను సహజాత తృప్తి దిశలో తీసుకుపోవడం. ఈ లక్ష్యం నెరవేరడానికి సహజాతానికి ఒక వస్తువు కూడ

ఉంటుంది. 'వస్తువు' దొరకకపోయినా, సహజాత లక్ష్యం నెరవేరకపోయినా సహజాత కుంఠనం కలుగుతుంది.

స్వానురాగం (Narcissism) : ఒక లైంగిక విపర్యయం, ఇందులో వ్యక్తి తన లైంగిక వస్తువుగా తన శరీరాన్నే కోరుకొంటాడు. ఈ అర్థంలో మొదట హేవలాక్ ఎలిస్ ఉపయోగించాడు. మనోవిశ్లేషణ దీనిని విస్తృతార్థంలో తనను తాను ప్రేమించుకొనుట అంది. ఇది రెండు విధాల (1) ప్రాథమిక స్వానురాగం (2) గౌణ స్వానురాగం. ప్రాథమిక స్వానురాగమంటే, బిడ్డ ఇతరులను ప్రేమించేముందు తనను తాను ప్రేమించుకొంటాడు. గౌణ స్వానురాగంలో వస్తువుతో తాదాత్మ్యం చెంది లేదా దానిని అంతరీకరించుకొని, ప్రేమించడం జరుగుతుంది. వస్తువు తాను ఒకటే అయ్యారు గనుక లేదా ఆ వస్తువు తనలోనే ఉంది గనుక ఆ వస్తువును ప్రేమించడమంటే తనను తాను ప్రేమించడమే అంటే అది స్వానురాగమే అవుతుంది.

ఇడిపస్ భావగ్రంథి (Oedipus Complex) : మూడు – ఐదు సంవత్సరాల వయస్సులో వుండే పిల్లవానిలో, అహం వికాస క్రమంలో లెబీడో ఇడిపల్ దశలో ఈ భావ గ్రంథి ఏర్పడుతుంది. ఇది భావాల, అనుభూతుల గ్రంథి. మగపిల్లవాడైతే తల్లిని, ఆడపిల్లైతే తండ్రిని పొందాలనే 'వాంఛ' చుట్టూ పేరుకొనే భావాలు, అనుభూతుల ముడి. ఇందులో భాగంగా మగపిల్లవాడు తండ్రిని, ఆడపిల్ల తల్లిని ద్వేషిస్తారు. ఇడిపస్ అనే గ్రీకు పురాణ నాయకుడు, తండ్రి అని తెలియకనే తండ్రిని సంహరించి, తల్లి అని తెలియకనే తల్లిని పెళ్ళాడి ముగ్గురు పిల్లలను కంటాడు. ఈ పురాణ నాయకుడు ఇడిపస్ పేరును ఫ్రాయిడ్ గ్రహించి ఈ భావగ్రంథికి పేరు పెట్టాడు.

ఉదాత్తీకరణం (Sublimation) : ఇది వికాస ప్రక్రియ. సహజాత శక్తులు అసహజాతరూప ప్రవర్తనలో అభివ్యక్తం కావడం. సమాజం అంగీకరించని సహజాత ప్రచోదనను సమాజం ఆమోదించే రూపంలో లేదా ఉన్నత రూపంలో అభివ్యక్తం చేయడం. ఉదాహరణకు బౌద్ధిక ఆసక్తి, దర్శన లాలస ఉదాత్తీకరణమే.

కామ సంబంధ (Erotic): లైంగిక, లెబీడో సంబంధ, సంతోష సంబంధ.

కుంఠనం (Frustration) : ఆటంకించబడిన, గందరగోళ, అసంతృప్త స్థితి. దీనిని వంచనతో తికమకపరచరాదు. సరిగ్గా చెప్పాలంటే లక్ష్యసాధనలో వైఫల్యం.

అపరాధం (Guilt) : మనో విశ్లేషణకు అపరాధంతో సంబంధం లేదు. నైతిక ఆజ్ఞను ఉల్లంఘించి నప్పుడు కలిగే అపరాధ భావనను మనో విశ్లేషణ అధ్యయనం చేస్తుంది.

అంక్ష (Taboo) : ఇదొక నిషేధం. ఒక వ్యక్తినో వస్తువునో వేరుగా ఉంచి అతని లేదా దాని యెడ కొన్ని చర్యలు నిషేధించబడతాయి. వీటి అతిక్రమణ ఒక సంస్కృతిలోని మొత్తం ఆలోచనా వ్యవస్థనే అతిక్రమించడంగా పరిగణించబడుతుంది.

జీవ సహజాతం (Eros, Life Instinct) : ఈరాస్ గ్రీకుల లైంగిక ప్రేమదేవత. ఈ పేరును ఫ్రాయిడ్ జీవశక్తిని. లైంగిక సహజాతాలను మూర్తీభవింపజేయడానికి ఉపయోగించాడు.

మృత్యు సహజాతం (Thanatos, Death Instinct) : గ్రీకు మృత్యుదేవత అయిన తానటాస్ (Thanatos) పేరును జీవ సహజాతం ఈరాస్ (Eros) కు వ్యతిరేకంగా ఫ్రాయిడ్ ఉపయోగించాడు. జీవులను మృత్యువు వైపుకు నడిపించేదే మృత్యు సహజాతం. లైంగిక సహజాతం, ప్రేమ సహజాతం జీవాన్ని వృద్ధిచేసే దిశగా తీసుకుపోతాయి. మృత్యు సహజాతాన్ని బలపరచడానికి దేహంలో ఏ ఆధారం కనిపించదు.

ప్రచోదన (Impulse) : నాడీ సూక్ష్మనాళాల వెంట ప్రవహించే విద్యుత్ తరంగం. మనోవిశ్లేషణలో, ఇడ్‌లోని ఒక బిందువు నుంచి అహానికి వెళ్ళే కాలవల గుండా ప్రవహించే అటువంటి తరంగాలే ప్రచోదనాలు.

లక్ష్య నిరోధం (Aim-Inhibition) : వ్యక్తికి వస్తువు మీద కామాసక్తి లేని సంబంధాన్ని లక్ష్య – నిరోధిత సంబంధం అంటారు. ఉదాహరణలు – స్నేహాలు, ప్లేటోనిక్ ప్రేమ (అమలిన ప్రేమ), కుటుంబ వాత్సల్యాలు. ఇందులో ఉన్న అంతరార్థం ఏమిటంటే నిరోధించబడకపోతే, స్నేహాలు సజాతి లైంగిక (homosexual) సంబంధాలుగా మారతాయి. అమలిన ప్రేమ మలినమవుతుంది. అగమ్యా గమనం (incest) చోటు చేసుకొంటుంది.

వ్యాకులత (Anxiety) : మామూలుగా ఈ పదాన్ని అహేతుక భీతికి అన్వయిస్తారు. అంటే మామూలుగా భయం కలిగించే వస్తువులను చూసి కాక, భయం కలిగించని వస్తువులను చూసి భీతి చెందడం.

సంతృప్తి (Satisfaction) : లక్ష్య సాధనను అనుసరించి వచ్చే ఉద్వేగం.

నాడీరుగ్మత (Neurosis) : మొదట్లో నరాలు పనిచేయడంలో విఫలమవడం వలన వచ్చే జబ్బు అనుకొనేవారు. అంటే నరాల నిర్మాణానికి సంబంధించి కాక వాటి ప్రకార్యానికి సంబంధించినది. ఫ్రాయిడ్ దీని అర్థాన్ని మార్చాడు. అది మూర్తిమత్వంలోని అపవ్యవస్థ

అన్నాడు. ఉదాహరణకు హిస్టీరియా నాడీ మండలానికి సంబంధించింది కాక మానసిక అపవ్యవస్థలకు సంబంధించినది. సహజాత (ప్రధానంగా లైంగిక సహజాత) సంతృప్తిని సామాజిక నీతి నిరోధించినప్పుడు ఏర్పడే అసంతోష, అసమతౌల్య స్థితికి ఉదాత్తీకరణ ద్వారా కాని, ఈ నిరోధాన్ని మానసిక సమతౌల్యం దెబ్బతినకుండా అంతరీకరణం కావించడం ద్వారా కాని సర్దుబాటు చేసుకోలేని వ్యక్తి ఈ వైరుధ్యాన్ని పరిష్కరించుకోలేక నాడీ రుగ్మతకు గురయ్యే అవకాశం ఉంది.

ఆవేశిత నాడీరుగ్మత (Obsessional Neurosis) : దీని లక్షణం ఆవేశిత ఆలోచనలు. ఇవి మామూలుగా వచ్చే ఆలోచనలకు భిన్నం. మామూలు ఆలోచనలను, అవి తన నుంచి వచ్చినట్లుగా వ్యక్తి భావిస్తాడు. కాని ఆవేశిత ఆలోచనలు తననుంచి కాక ఎక్కడ నుంచో, అయత్నంగా, తన ప్రమేయం లేకుండ, పునశ్చరణంగా, నెమరువేసుకొన్నట్లుగా వస్తాయి. ఆ ఆలోచనల విషయం అసంబద్ధంగా, ఒకేరకంగా, ఒత్తిడితో కూడినదిగా ఉంటుంది.

పరహింసాపూరిత కామం (Sadism) : ఇదొక లైంగిక విపర్యయం. ఇందులో లైంగిక వస్తువుకు బాధ కలిగించడం ద్వారా కామసుఖాన్ని పొందడం ఉంటుంది. క్రౌర్యంలోని సుఖం.

స్వహింసాపూరిత కామం (Masochism) : లైంగిక విపర్యయం. ఇందులో కర్త తాను లైంగిక వస్తువుచే బాధితంకావడంవల్ల, పీడితం కావడంవల్ల లైంగికానందాన్ని పొందుతాడు. తమను తాము అవమానపరచుకొనేవారు, తమను తాము నిందించుకొనేవారు, బాధలను తమపైకి రుద్దుకొనేవారు ఈ కోవకు చెందుతారు. మనోవిశ్లేషణ సిద్ధాంతం స్వహింసాపూరిత కామానికి నిష్క్రియాత్మకతతో, స్త్రీత్వంతో అంతర్గత సంబంధం ఉన్నట్లు చెప్పింది.

నైతిక పరహింసాపూరిత కామం (Moral Sadism) : ఈ పదాన్ని ఫ్రాయిడ్ వ్యక్తి తన పరహింసాపూరిత కామ ప్రేరిత అహానికి లొంగిపోవాలనే ఇచ్ఛా ప్రవృత్తికి ఉపయోగించాడు.

అంతరీకరణం (Internalisation) : బాహ్య ప్రపంచ వస్తువులు మానసిక యంత్రాంగంలో తిష్ఠ వేసుకోవడాన్ని ఇది సూచిస్తుంది.

అభిభవం (Affect) : అనుభూతులకు, ఉద్వేగాలకు ఉపయోగించే సామాన్య పదం.

తండ్రి (Father) : అంతరంగంలో ఉన్న తండ్రి ప్రతిమ. బాహ్యాధికారానికి ప్రతీక.

ఆదిమ తండ్రి (Primal Father) : బాహ్య వివాహాన్ని (exogamy), అగమ్యా గమనాన్ని (incest) వివరించడానికి ఈ పదాన్ని ఫ్రాయిడ్ డార్విన్ నుంచి గ్రహించాడు. ఆదిమ తండ్రి ఆడవాళ్లనందరిని తనకే అట్టి పెట్టుకొని, ఇతర సమర్థులైన మగవారిని సమూహం వెలుపలికి నెట్టాడు. పుత్రులంతా (సోదర బృందం) ఏకమై తండ్రిని సంహరించి ఆడవాళ్ళను పంచుకున్నారు. కాని తండ్రిని చంపామనే బాధ, అగమ్యా గమనం, అంటే పొందరానివారి పొందును పొందామనే (తల్లులను, అక్కచెల్లెళ్ళను పొందుట) పాపం వారిని వెంటాడాయి. వాటిని వారు తమ సంతానానికి అందించారు. ఇదే మూలపాపానికి, అపరాధానుభూతికి నాంది పలికింది.

తన్యత, ఉద్రిక్తత (Tension) : స్థిరత, సుఖసూత్రాలు ఫ్రాయిడ్ ప్రకారం లైంగిక తన్యతను, మొత్తం ప్రవర్తనను కదిలించే ప్రాథమికాంశాలు.

ద్వి సంవేగ స్థితి (Ambivalence) : రెండు విరుద్ధ ప్రచోదనలు, ఉద్వేగాలు ఒకదాని సరసన ఒకటి ఉండి ఒకే వ్యక్తి పైకి, వస్తువుపైకి ఏకకాలమందే సారించబడడం. మామూలుగ ఈ పదాన్ని రాగ - ద్వేషాలు కలిసి ఉండడాన్ని సూచించడానికి ఉపయోగిస్తారు.

ద్వి లైంగిక, ద్వి లైంగికత (Bisexual and Bisexuality) : ఈ పదాలను సందర్భానుసారంగా అప్పుడప్పుడు స్వజాతి, విజాతి లైంగికతలకు రెండింటికి పాల్పడేవారికి ఉపయోగిస్తారు. కాని మామూలుగా ఒకే వ్యక్తిలో ఉన్న ఆడ – మగ మానసిక లక్షణాలను, దృక్పథాలను సూచించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తారు. మనోవిశ్లేషణ సిద్ధాంతం మానవులు నిర్మాణాత్మకంగా, మనోవైజ్ఞానిక పరంగా ద్విలైంగికులే అంటుంది.

నిదానం, నిర్ధారణ (Diagnosis) : రోగిని చూసి, అతడు చెప్పినదానిని బట్టి, గుర్తులను, లక్షణాలను బట్టి రోగి జబ్బు స్వభావాన్ని నిర్ణయించే విధానం. అంటే రోగ నిర్ధారణ.

పరిసరం (Environment) : వ్యక్తికి వెలుపల ఉన్నదేదైనా, చుట్టూ ఆవరించి ఉన్నదేదైనా మనో విశ్లేషణ పరిసరంలోని మానవ పక్షాలనే పరిగణిస్తుంది. మనోవిశ్లేషణ సాహిత్యంలో బాహ్య ప్రపంచం, బాహ్య వాస్తవికతలు – రెండూ ఒకటే.

మనోవిశ్లేషణ (Psychoanalysis) : ఇదొక మనోవైజ్ఞానిక సిద్ధాంతం. మానసిక రుగ్మతలకు ఉపచారం చేసే విధానం. మనస్సులోని చేతన, అచేతన మూలకాల మధ్య పరస్పర చర్యను పరిశోధించి, అచేతనంలోని అణచివేయబడిన భయాలను, ఘర్షణలను చేతనంలోకితెచ్చి హేత్వీకరించడం ద్వారా మానసిక అపవ్యవస్థలను సరిదిద్దడం.

మతం (Religion) : ఫ్రాయిడ్ ఉద్దేశంలో మత భావనలన్నీ భ్రమలు మాత్రమే. మానవాళి యొక్క అత్యంత ప్రాచీనమైన, బలమైన, గాఢమైన వాంఛలే మత భావనలు, దేవునిలో విశ్వాసం మానవ నిస్సహాయతను గుర్తించడమే.

కర్త (Subject) : ఎవని అనుభవం, ప్రవర్తనలు పరిశీలింపబడుతున్నవో అతడు.

మూర్తిమత్వం (Personality) : ఒక వ్యక్తి శారీరక, మానసిక, ఔద్వేగిక, సామాజిక లక్షణాల మొత్తం సమాహారం. ఒక మనిషి విశిష్టతను తెలియజేసే పై లక్షణ సంపుటి.

మూలరూపం (Archetype) : ఈ పదాన్ని కారల్ గూస్టాఫ్ యూంగ్ ఉపయోగించాడు. ఉమ్మడి అచేతనంలోని విషయాలను సూచించడానికి ఉపయోగించాడు. అంతస్సిద్ధ పూర్వనిశ్చిత నమూనాలలో అనుభవాన్ని వ్యవస్థీకృతం చేసే అంతస్సిద్ధ ప్రవృత్తులు లేదా భావాలు.

లిబీడో (Libido) : ప్రాక్కల్పిత మానసిక శక్తి, ప్రక్రియలు, నిర్మితులు, వస్తు ప్రాతినిధ్యాలకు ఈ శక్తి అందుతుంది. దీని మూలం శరీరం లేదా ఇడ్. ఈ శరీరం లేదా ఇడ్ వివిధ విశిష్ట కామ ప్రకోప మండలాల – మౌఖిక, పాయు, జననాంగ లిబీడో – రూపంలో ఉంటుంది.

వంచన (Deprivation) : ఆవశ్యక వినిమయ వస్తువును చాలినంతగా పొందలేని అనుభవం. బిడ్డకు తల్లి ప్రేమను తగిన మోతాదులో అందించలేకపోవడం వంచనే అవుతుంది.

వస్తువు (Object) : ఒక చర్య లేదా వాంఛ ఎవరిపై సాధింపబడుతుందో అతడు లేక అది. సహజాత సంతృప్తికి కర్తకం కావలసినదేదో అది.

విశ్లేషితుడు (Analysand) : విశ్లేషింపబడుతున్న వ్యక్తి.

శక్తి (Energy) : మానసిక జీవితంలో శక్తి పనిచేస్తూ ఉంటుంది. ఇతర శక్తి రూపాలతో తావిళ్ళు వేసి దాని గురించి తెలుసుకొనే అవకాశం లేదు. ఫ్రాయిడ్ ప్రకారం రెండు రూపాలలో శక్తి ఉంది. స్వేచ్ఛగా చలించే ఇడ్ శక్తి. బంధితమైన అహం శక్తి. దీనికి, ప్రకృతి శాస్త్రాలలో ప్రస్తావించే శక్తికి సంబంధం లేదు.

శీలం (Character) : ఒక వ్యక్తిని అనన్యుడుగా చూపించడానికి అతనికి ఉన్న లక్షణాలను సూచించడం. అనేక శీల రూపాలలో (character types) దేనిలో ఒక దానిలోకి వర్గీకరించడానికి అవసరమైన లక్షణాలు.

అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి రచనలు

1.	మనసుగతినే మార్చిన ఫ్రాయిడ్	120.00
2.	నాగరికత దాని అపశ్రుతులు	90.00
3.	ఫ్రాయిడ్ మనో విశ్లేషణ	70.00
4.	ప్రపంచ ప్రసిద్ధ మతాలు	50.00
5.	కలలకు అర్థం చెప్పటం ఎలా ?	125.00
6.	మానవీయ బుద్ధ	125.00
7.	మేధావుల మెతకలు	55.00
8.	అస్తిత్వవాదం	100.00
9.	ఆచార్య నాగార్జునుడు	175.00
10.	బుద్ధుని ధర్మోపదేశం	150.00
11.	ప్రేమ సిద్ధాంతాలు	60.00
12.	చింతనాగ్ని కొడిగట్టిన వేల	150.00
13.	బుద్ధుని సంయుక్త సంభాషణలు - 1(1)	150.00
14.	బుద్ధుని సంయుక్త సంభాషణలు - 1(2)	150.00
15.	బుద్ధుని సంయుక్త సంభాషణలు - 2(1)	150.00
16.	బుద్ధుని సంయుక్త సంభాషణలు - 2(2)	150.00
17.	బుద్ధుని సంయుక్త సంభాషణలు - 3(1)	150.00
18.	బుద్ధుని సంయుక్త సంభాషణలు - 3(2)	150.00

నాగరికతా ప్రక్రియ తప్పనిసరిగా సహజ వాంఛల అణచివేతకు దారి తీస్తుందని, దీనికి సకారాత్మక పరిష్కారం సహజాత శక్తిని సృజనాత్మక, శాస్త్ర, సాంకేతిక, మానవీయ రంగాలలో కృషిలోకి మళ్ళించడం కాగా, ఇది సాధించలేని వ్యక్తులలో ఈ అణచివేత మానసిక రుగ్మతకు కారణమవుతుందని ఫ్రాయిడ్ ఈ పుస్తకంలో ప్రతిపాదించాడు. ఈ సమాజ జనిత అంక్షలు, నిషేధాలు ముఖ్యంగా లైంగికత విషయంలో అమలు చేయబడతాయని, ఇందుకు పునాది మనిషి ద్విపాద జీవిగా రూపొందిన క్రమంలోనే ఉందని ఫ్రాయిడ్ భావన. మానవునికుండే సహజాతాలలో దౌర్జన్యత చూపలేనప్పుడు అది మనిషి అంతరాత్మపై అజామాయిషీ చేయడం ద్వారా, వ్యక్తిని వ్యాకులతకు గురిచేస్తుంది. బాహ్యకప్రపంచ దిశగా ఇది మరల్చబడినప్పుడు, ఘర్షణలకు, యుద్ధాలకు దారితీస్తుంది. ఈ దౌర్జన్య సహజాతం మృత్యుసహజాతం పరిణమిస్తుందని ఫ్రాయిడ్ అబిప్రాయపడ్డాడు. మృత్యు సహజాతానికి, జీవసహజాతానికి మధ్య జరిగే పోరాట క్రమమే నాగరికత. దౌర్జన్య, మృత్యుసహజాతాల వాస్తవికతపై విమర్శలు వెలువడినప్పటికీ, మానవ స్వభావాన్ని, వ్యక్తికి - సమాజానికి మధ్య ఉండే సంబంధాన్ని, సామాజిక పరిణామ క్రమంలో ఏర్పడే ఘర్షణలు, వైరుధ్యాలను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగపడవచ్చు. నాగరికతల మధ్య ఘర్షణ పేరిట యుద్ధం - శాంతి మధ్య తేడాను గందరగోళ పరుస్తున్న భావజాలం చలామణి అవుతున్న వర్తమాన ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడానికి కూడా ఇటువంటి పుస్తకాలు అవసరం.

ఈ పుస్తకాన్ని అనువదించిన అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారు మనో విశ్లేషణ సిద్ధాంతాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేస్తూ 'స్వప్న సందేశం', 'మనసుమర్మం' అనే పుస్తకాలు రచించారు. వీరు రచించిన ఫ్రాయిడ్ జీవిత చరిత్రను తెలుగు అకాడమి వారు ప్రచురించారు.

పల్లవి పబ్లికేషన్స
డా॥ ఎ.ప్రేమ్‌చంద్ కాంప్లెక్స్, అశోక్‌నగర్, విజయవాడ -10

Price ₹ 90/-